UNIVERSAL
LIBRARY
OU_204625
UNIVERSAL
LIBRARY

ఓం

నమో భగవతే శ్రీ రమణాయ

# శ్రీ బ్రహ్మానందతీర్థ విజయము.

“ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత”

321
23B

గ్రంథకర్త:

పి. ఆదినారాయణ,

ఉపాధ్యాయుడు. కోవూరు, నెల్లూరుజిల్లా.

ఓం

నమో భగవతే శ్రీ రమణాయ

# శ్రీ బ్రహ్మానందతీర్థ విజయము.

“ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత”

గ్రంథకర్త:

పి. ఆదినారాయణ,

ఉపాధ్యాయుడు. కోవూరు, నెల్లూరుజిల్లా.

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి:

వెల ౧—౦—౧

జూలై ౧౯౩౪

ప్రభాతముద్రణాలయము.

నెల్లూరు



శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీ శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములవారు

సర్వాధారం సర్వం

సర్వగోప్యం సర్వాతీతం

సర్వవస్తుస్వరూపం

సర్వాణాఖ్యం నిర్గుణం తీర్థరూపం

బ్రహ్మానందం నమస్కరింద్రిం

ప్రపద్యే

సోదరులారా!

## విజ్ఞప్తి

ప్రాపంచిక వ్యామోహములోఁ బూర్తిగాఁ జిక్కుకొనియు వంశ పారంపర్యముగా లభించియుండు ఆధ్యాత్మిక చింతయే నన్నీ కాలోకగిన సమున శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములవారి జీవితము వ్రాయ పురికొల్పెను. అందులకు నేను సంస్కృతాంధ్ర భాషలలో ప్రజ్ఞ లేకయు సామాన్యులకుఁ గూడా వినినంతమాత్రముననే గ్రహించుటకు వీలగునట్లు వ్రాయుటయే సరమని స్ఫురించుటచే నియ్యాకొని సులభశైలిలో వ్రాయుటకుఁ గడంగితిని.

ఇది. పలుకష్టములకుఁ బాలై పూర్తిగా దేశాటన మొనర్చి ఆస్తికమతమును చిరస్థాయిగా నెలకొల్పుటలో విజయమొందిన శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములవారి జీవితము కాన నీపుస్తకమునకు 'శ్రీ బ్రహ్మానంద తీర్థ విజయము' అని నామం బిడితి.

ఈ చరిత్రయొక్క చిత్తుప్రతిని బంపగా దయతో సవరించి పంపిన భావపురి (బాపట్ల) వాస్తవ్యులును శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములవారి శిష్యులునగు శ్రీ వేమూరి నృసింహశాస్త్రి, ప్రత్తూరి శివరామయ్య గార్లకు నా కృతజ్ఞతా పూర్వకమైన యభివందనములు. మఱియు శ్రీ స్వాములవారి శిష్యకోటికిఁ జెందినవారేనేని క్రొత్తవిషయములఁ దెలియబఱచినచో ఆ జీవితాంశముల ద్వితీయముద్రణంలో చేర్చుకొందునని మనవిచేయుచున్నాను.

ఈ విజయములోని తప్పొప్పుల నప్పటికప్పుడే సవరించుచు గ్రంథరూప మొనర్చిన అవధూత శ్రీ సత్యానంద స్వాములవారికి నా మనఃపూర్వకమైన యభివందనములు. పలుశ్రమలకోర్చి జీవితాంశభాగముల సేకరించిన మిత్రుడు కె. వి. ముకుందరావు గారికి నా ధన్యవాదములు.

పిన్ననాడే నా భావికాలపు స్థితికిఁ జింతించి జ్ఞానోదయపోషణములఁ గలుగఁజేసి దివికేగిన నామాతయగు పొంగూరు వెంకమ్మగారిని యీ పుణ్యసమయమున స్మరించుచున్నాడను.

కోవూరు, నెల్లూరుజిల్లా
౧౦- జూన్- '38

పి. ఆదినారాయణ,
గ్రంథకర్త.

# విషయసూచిక


| ప్రకరణము | విషయము | పుట |
|---|---|---|
| ౧. | దేశము-అవతారము | ౨ |
| ౨. | వంశము-అవతారము | ౬ |
| ౩. | బాల్యము-మాతృబోధ | ౧౨ |
| ౪. | గణపతి సద్గుణములు | ౧౫ |
| ౫. | తీవ్రాధ్యాత్మిక మార్పు | ౨౧ |
| ౬. | గణపతిసిద్ధి | ౨౮ |
| ౭. | హిమాలయపర్యటనము | ౩౨ |
| ౮. | వాసుదేవానంద దర్శనము | ౪౨ |
| ౯. | శ్రీదత్తాత్రేయ సాక్షాత్కారము | ౫౪ |
| ౧౦. | శృంగేరీనివాసము-కష్టములు | ౬౨ |
| ౧౧. | సన్న్యాసము-నూతన నామధారణము | ౭౨ |
| ౧౨. | నిర్వికల్ప సమాధి | ౭౮ |
| ౧౩. | దేశయాత్ర | ౮౬ |
| ౧౪. | శ్రీనిత్యానందస్వామి | ౯౮ |
| ౧౫. | శ్రీశంకరజయంతి-శిష్యులతో తీర్థయాత్ర | ౧౨౧ |
| ౧౬. | భావపురీ ప్రవేశము- శంకరవిద్యాలయప్రతిష్ఠ | ౧౪౧ |
| ౧౭. | శిష్యులతో నెల్లూరుమండల పర్యటనము | ౧౫౫ |
| ౧౮. | బాపట్ల శివాలయములోని ప్రతిష్ఠలు | ౧౬౩ |
| ౧౯. | శ్రీబ్రహ్మానంద తీర్థస్వాములవారి జయములు | ౧౬౭ |
| ౨౦. | మహిమలు | ౧౮౯ |
| ౨౧. | మహాసమాధి | ౧౯౨ |
| ౨౨. | నిర్యాణానంతరము-శ్రీ శంకరవిద్యాలయము | ౨౧౯ |

శ్రీదత్త

# ఉపోద్ఘాతము.

శ్లో. యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా
తత్తదేవావగచ్ఛత్వం మమ తేజోఽంశసంభవం.

సర్వజ్ఞుఁడును, స్వాధీనమాయకుండునునగు పరమేశ్వరుండు స్వసృష్టి నిఖిల ప్రపంచమందు కాలక్రమముగ ధర్మము లోపించి, యధర్మము వృద్ధిపొందినపుడచ్చటచ్చట లీలావిభూతిచే నంశముతో సంభవించుటయు ధర్మస్థాపన చేయుటయు నధర్మమును తిరస్కరించుటయు జ్ఞానోపదేశముచేఁ బ్రపంచము నుద్ధరించుటయు కేవల గ్రంథములలో వినుటయేగాక ప్రత్యక్షముగాఁ జూచుచునే యున్నారము. అప్పుడట్టివారి దర్శన భాషణ బోధనాది భాగ్యమును బొందినవారలు కృతార్థతను బొందుచున్నారని వేఱుగఁ జెప్పనక్కఱలేదు.

సుమారు 200 సంవత్సరములకుఁ బూర్వము కావేరీతీరమునందు శ్రీ ప. ప. శ్రీసదాశివేంద్ర సరస్వతీ స్వాములవారుద్భవించి కొన్ని యోగమహిమలను జూపుచు, బ్రహ్మసూత్రయోగ సూత్రములను వృత్త్యాది గ్రంథముల రచించి

నెఱూరు గ్రామమున సమాధినిష్ఠులైరి. అచ్చట నుపవిష్టులైన వారికి చిత్తప్రశాంతి గలుగునను సంగతి సుప్రసిద్ధము. ఇట్లనేక మహాపురుషు లనేకచోట్ల కాలక్రమమున నవతరించి లోకోద్ధరణ చేయుట చరిత్రాంశమైయున్నది.

ఈవిధముగనే మహారాష్ట్రదేశజులగు శ్రీ. ప. ప. బ్రహ్మానందతీర్థస్వామివారు లోకమున ధర్మసంస్థాపనగావించి, జ్ఞానోపదేశముచే శిష్యుల ననుగ్రహించి శీఘ్రకాలములోనే యవిముక్తక్షేత్రమున విదేహకైవల్యమును బొందిరి.

అట్టిమహనీయుని సచ్చరిత్రము నీయాంధ్రలోకములో శ్రీస్వామివారిని దర్శించినవారికి జ్ఞాపకముండుటకు దర్శించని వారికి తెలియజేయుటకు నాంధ్రభాషలో వ్రాయబూనినవారు ధన్యులు. అప్రయత్న శ్లాఘనీయులు. శ్రీస్వామివారి చరిత్రము వారిసమకాలికులవల్లను, ఇతరత్రను నేను నానతీర్థ్యులు సంగ్రహించి శ్రీస్వామివారి పాదపూజ కుపయోగపడునటుల నుపచారశ్లోకములతో అష్టోత్తర శతనామములతో నొకపూజావిధాన గ్రంథమును రచియించి, ఈశ్లోకనామములయందు శ్రీస్వామివారిచరిత్రను సంగ్రహించితిని. ఈచరిత్రానుసారముగా నీగ్రంథము వ్రాయబడియున్నందున నీయుపోద్ఘాతము నన్ను వ్రాయమని కోరుటకు కారణమని తలంచెదను.

ఈచరిత్రయందు నవసరమైనచోట్ల నవరణాల సూచించి

తిమి. శ్రీస్వామివారి చరిత్రను ప్రకరణములుగా విభజించి భావప్రయుక్తముగా వ్రాసినందున గ్రంథకర్తలు అంధ్ర లోకమున కుపకారము చేసినవారైరి. మఱియు బాపట్లయందు శ్రీస్వామివారిచే ప్రతిష్ఠింపబడిన శ్రీశంకరవిద్యాలయ పురోభివృద్ధికిఁ దోడ్పడిన వారగుచున్నారు. ఈగ్రంథకర్త పి. అదినారాయణగారు మహాపురుషులగు శ్రీస్వామివారి చరిత్రను వ్రాసి తాము తరించుటయేగాక శ్రీస్వామివారి శిష్యులగు మాకు వారిచరిత్రను స్మరించుట కవకాశము గలిగించినందులను వారికి మే మత్యంత కృతజ్ఞులము.

ఇట్లు,

శ్రీ. ప. ప. శ్రీబ్రహ్మానంద తీర్థస్వామివారి శిష్యుడు,

వేమూరి నృసింహశాస్త్రి,

శతావధాని, బాపట్ల.

ఓం

శ్రీ రమణమహర్షయేనమః

# శ్రీ బ్రహ్మానంద తీర్థ విజయము.

శ్లో. శ్రీబ్రహ్మానంద తీర్థాంఘ్రిసరోజాభ్యాన్నమా మ్యహం
యద్రజఃకణ సంస్పర్శాన్నశ్యంతి కలుషాణి హి.

శ్రీమద్దత్తపదారవింద యుగసం
సేవాత్ము, నధ్యాత్మ వి
ద్యామాధుర్యరసావగాహకుని, బ్ర
హ్మానందతీర్థున్, గురున్,
భూమానందమయస్వరూపు, ఘను, సం
పూర్ణానుకంపానిధిన్
ప్రేమన్ డెందమునన్ స్మరింపుడు సుధీ
వేద్యప్రబోధాత్మునిన్.

# మొదటి ప్రకరణము.

## —: దేశము-అవతారము :—

ప్రపంచకోరికలను తుచ్ఛములని యెంచి, శమదమాది సద్గుణసంపన్నులై జితేంద్రియులై యొప్పు ఋషీశ్వరుల కీభరత ఖండము జన్మభూమి! ఇతరఖండములందు పునర్జన్మ నివృత్తిని గలిగించెడు సంసారోత్తారమంత్రమైన భగవన్మార్గము నూతనమైనప్పటికిని, భరతఖండంబునందు మాత్రము విజ్ఞానము భారతీయులకు నుగ్గుపాలతోనే పూరింపబడిన దని భారత చరిత్ర పరిణామమును జూచిన స్పష్టమగును. ఇతరఖండము లందలి గొప్పపండితులని పేరెన్నికగన్న వారికిగూడ లేని విజ్ఞానము భారతభూమియందలి విద్యావిహీనుడగు రైతునకు గలదని శ్రీ వివేకానందస్వామివారు పరదేశములందుచాటి యున్నారు.

ఇదియునుగాక, ఉపనిషత్తులు స్పష్టము "మాతృదేవో భవ"-తల్లియే దైవమనియు, తల్లినే పరదైవతముగా నెంచి పూజింపుమనియు భారతజనులకు ప్రబోధించుచున్నది. కనుక ప్రతి హైందవపునితల్లియు తనబిడ్డలను డోలికల యందుంచి: "బూనెక్కి హాయి" (ప్రపంచమే పాలుళక్కి అనగా, బూటకము,

హాయియనగా బ్రహ్మానంద సుఖము నొందుము) యని యూ పుచు నిద్దురబుచ్చుచున్నది.

బాహ్యదృష్టికికనబడు యీస్థూలశరీరము, తదంగములు కేవలము పాంచభౌతికమైన రక్తమాంసాస్థుల ప్రోగు అనియు, నీస్థూలశరీరము నశించినను అంతరాత్మ నశించదనియు, నీదేహి దేహములకు గల భేదము నపరోక్షానుభూతిచే గనుంగొని దేహాత్మభావమును, దానివలన గలుగు అభిమానమును వీడి, బ్రహ్మానందాంబుధి తరంగముల నోలలాడు పరమహంసల కియ్యది కన్నతల్లిగదా!

ఈదేశమునందే యసురగుణంబుల నడంచి, దైవవిభూతిని సంస్థాపించుటకై భగవంతు డనంతావతారముల నెత్తుచుండును. శ్రీభగద్గీతయందును భగవానుడు స్వయముగా—

శ్లో. యదా యదాహి ధర్మస్యగ్లాని ర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహం;
పరిత్రాణాయసాధూనాం వినాశాయ చ దుష్కృతాం,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే,

యని నుడివియున్నాడు. ఈప్రమాణానుసారమే భగవానుడు పూర్వము రామకృష్ణబుద్ధాద్యవతారముల ధరించియు, మధ్య యుగమున శంకర రామానుజ మధ్వ మున్నగు సన్మతస్థాపనాచార్యులును, యిప్పుడు శ్రీ వివేకానంద రామకృష్ణపరమహంస శ్రీ రమణమహర్షి మున్నగు మహనీయులుగ నిచ్చటనే యవ

తరించి, ధర్మము నుద్ధరించిరి, ఉద్ధరించుచున్నారు.

ప్రపంచశాంతికొఱకు సందేశములు పుంఖానుపుంఖములుగా భారతదేశమునుండియే విదేశములకు వెదజల్లబడినవి. విషయభోగముల దెగించి, యసిధారావ్రతమైన జ్ఞానయోగము నభ్యసించి, యమనస్కాది యోగముల సాధించి, పరబ్రహ్మముతో నైక్యమును జెందిన ఋషివర్యుల కిదియే గదా నిలయము!

ఇదియే జ్ఞానభూమియనియు, కర్మభూమియనియు, పూర్వపు మహర్షుల తపశ్శక్తిచే వ్యాపింపబడి, మహాభక్తవరుల పాదధూళిచే పునీతమై జగత్ప్రసిద్ధిగాంచినది.

శ్రీమద్భగవద్గీతయందు- శాస్త్రజన్యమైనది జ్ఞానమనియు, అజ్ఞానానుభవమే విజ్ఞానమనియు, లేక, ప్రజ్ఞానమనియు చెప్పబడియున్నది. అనుభవమునకు రాని శాస్త్రజ్ఞానమెంతగొప్పది యైనను నిష్ప్రయోజనమే! అయితే అవతారపురుషులకు మాత్రము శాస్త్రజ్ఞానము నాస్తిక చార్వాక కాపాలకాది దుర్మతముల ఖండించి లోకమునుద్దరించుటకును, అనుభవజ్ఞానము పునరావృత్తి రహిత శాశ్వతబ్రహ్మానందము పొందుటకును యుపయుక్తమగును. అట్టివారలలో ప్రథమగణ్యులు శ్రీమచ్ఛంకర దేశికులు! వారొక హస్తమున జ్ఞానముచే లోకోద్ధరణగావించియు; వేరొక హస్తమున విజ్ఞానము గలిగి నిరతిశయానందము ననుభవించిరి.

ప్రహ్లాద ధ్రువాదులు భక్తులు; శ్రీరామచంద్రుడు శ్రీకృష్ణుడు యవతారమూర్తులు; రామానుగ్రహమువలన గుహుడు శబరి ముక్తినిగాంచిరి. వేయేల? లోకములన్నియు పవిత్రను బొందినవని చెప్పనగును. శ్రీకృష్ణావతారావిర్భావమువలన స్త్రీలు శూద్రులు పశుపక్ష్యాదులు పుట్టలు చెట్లు గుట్టలు కొండలు సర్పములు రాక్షసులు- యివి యవి యననేల? సమస్తభూతములు కృతార్థత బొందినవి.

శ్రీమచ్ఛంకరులవలె జ్ఞానవిజ్ఞానములుగలిగిన వారలలో మన యీచరిత్రపురుషులగు శ్రీబ్రహ్మానంద తీర్థస్వాములవారవతారపురుషులు! వీరియద్భుతమహిమలు, అమానుష కృత్యములు, వైరాగ్యము, బోధనాపటిమ, త్యాగము, వాఙ్మాధుర్యము, తపశ్శక్తి, బ్రహ్మానందానుభవములు కుప్పించు ముఖవిలాసము, ప్రజాకర్షణశక్తి మున్నగు నంశములను మున్ముందు జదువుటవలన మనము వీరిని యవతార* శ్రేష్ఠుడని చెప్పకయే గనుగొనగలము. వీరుజ్ఞానముచే ముముక్షువులకు బృహదారణ్యక తైత్తిరీయాది యుపనిషద్భాష్యములను, శ్రీగీతా సూత్రభాష్యములను బోధించియు; విజ్ఞానముచే ద్వంద్వాతీతులై సర్వభూతదయ సమదృష్టిగలిగి బ్రహ్మనిష్ఠులై ప్రసిద్ధిగాంచిరి.

* అవతారమనగా, భగవంతుడు తన సంపూర్ణబలశక్తులతో ధర్మములు సంస్థాపించుటకై మానవుల చర్మచక్షువులకు గోచరమగునట్లు నొకమానవ శరీరమును ధరించి, లోకమున సంచరించుట.

# రెండవప్రకరణము.

## —: వంశము—జననము :—

"ధన్యా మాతా పితా, ధన్య గోత్రం, ధన్య కులోద్భవః
ధన్యా చ వసుధా దేవీ యత్ర స్యాద్గురు భక్తతా."

భరతఖండము ఘనీభవించిన యాధ్యాత్మికసారము. ఈ పుణ్యభూమియందలి మహారాష్ట్రము తుకారాం- నామదేవ్, ఏకనాథ్-సంవర్థ రామదాసు మున్నగు మహాభక్తవరులకు; శివాజీ మున్నగు రాజవీరులకు ప్రసిద్ధిజెందినది; వారి పాదధూళిచే నది పవిత్రమైనదని చెప్పనగును. ఇట్టి మహాపురుషుల భుజములపైననే హిందూమత మాధారపడ, నానాటికియభివృద్ధి జెందుచున్నది.

అట్టి సనాతనమైన హిందూమతము-హిందూరాజ్యము మహమ్మదీయుల బారింబడి క్షీణించు సమయంబున మహారాష్ట్రవీరుడైన శివాజీచక్రవర్తి వారిడో పోరి, దుర్గముల జయించి, రాజ్యమును హిందూమతమును జీర్ణోద్ధరణగావించిన చరిత్రాంశమెల్ల రెఱింగినదే! అట్టివీరులకుగన్న మహారాష్ట్రదేశమే శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారి వంశమునకు నివాసస్థానము.

ఆ దేశంబున పునహా నగర సమీపమున కొల్హాపూరు న కనతి దూరంబున బ్రాహ్మణాగ్రహారం బొండుగలదు. ఆ యగ్రహారము వేదాంత తత్త్వజ్ఞుల కాలవాలంబై యజన యాజనాధ్యయ నాధ్యాపక దాన పరిగ్రహ షట్కర్మ నిరతులగు భూసురశ్రేష్ఠులకు నివాసయోగ్యమై యొప్పారుచుండును.

అట్టి యాపల్లియ యందు నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానని రతుండగు విష్ణుభట్టను బ్రాహ్మణశ్రేష్ఠుడు గలడు; ఆతడు "అయం నిజః పరశ్చేతి వికల్పో లఘుచేతసాం, పునస్తు దారచిత్తానాం వసుధైవ కుటుంబినీ" యను నార్యోక్తి సార్థక పరచుచు, గృహస్థధర్మముల చక్కగ ననుష్ఠించుచు, జనకాదులవలె కర్మయోగియునై యుండెను. వీరి కుటుంబ మాదినుండియు నిరంతరైశ్వర్యములతో దులతూగుచుండెడిది. వీరు దైవభక్తి విశ్వాసములు గలిగి "అతిథి దేవో భవ, అభ్యాగత స్స్వయం విష్ణుః" యను ఉపనిషదర్థమెఱింగి, అతిథి యభ్యాగత పూజలం దానకర్తలై, బీదసాదల పాలిటి కల్పవృక్షమై యుండిరి.

వీరిది పౌరోహిత వృత్తి. వీరి పౌరోహిత్యము చాతుర్వర్ణాశ్రమములవారికి హితమును గలుగజేయుచుండెను. ఇతర పౌరోహితులవలె మంత్రలోపము జేయక, విష్ణుభట్టు సమస్తవిధ్యుక్తకర్మలను సక్రమముగా చేయించుటయందు నేర్పరి. గ్రామవాసు లేకార్యమును నిర్వహింపవలసియున్నను, విష్ణుభట్టు పురోహితుని సలహాను బొందుచుండిరి. దేశకాలపరిస్థితుల

గమనించి సమస్తప్రజలకు నిహపరసుఖముల నొనగూర్చువా రు పౌరోహితులుగాక మరెవ్వరు? దేవేంద్రుడు తమ పురోహితుడగు బృహస్పతితో సంప్రతించియు, యిక్ష్వాకువంశ రాజులు శ్రీరామజననమును వీక్షించి విద్యగరపి కృతార్థుడగుట కు వేచియుండి పౌరోహిత్యమును వహించుటకు సైతము పూనుకొనిన వసిష్ఠులవారితో నాలోచించియు తమకార్యము ల నిర్వహించుచుండిరిగదా!

విష్ణుభట్టు వంశీయులు ఋగ్వేద సాంప్రదాయమునకు జెందినవారు. విష్ణుభట్టు ఋగ్వేదమును పారాయణజేయునప్పు డానందాశ్రువులు జలజలరాలుచుండ, తన్మయులగు చుండెడి వారు. వీరిభార్య పతివ్రతలలో నుత్తమురాలైన అరుంధతీ తుల్యురాలు. విష్ణుభట్టు ధర్మకర్తృత్వమును సమస్తదేవతాస్వ రూపుండగు నారాయణునకు ప్రీతికరంబుగ జేయుచుండెను.

మహారాష్ట్రదేశమందు శ్రీదత్తాత్రేయ ప్రశంస మతి విఖ్యాతమైయున్నది. ప్రతిగృహమునందును శ్రీ దత్తవిగ్రహ మునకు షోడశోపచారపూజలే! ఇంటింట దత్తమాహాత్మ్యము నుగ్గడించు పురాణములే! కావుననే విష్ణుభట్టును సహజముగ శ్రీదత్తాత్రేయోపాసకుడు. వీరు ప్రతిదినమును శ్రీదత్తవిగ్రహ మునకు పూజలు సల్పుచు, దత్తనామ సంకీర్తనము జేయుచు భజన లొనర్చుచు, నృత్యము దొక్కుచు, గృహస్థులకు మార్గదర్శకులై యుండిరి.

ఎవ్వని మనస్సు పరిశుద్ధమగునో, ఎవ్వనియందు సమగ్రమైన శక్తివైభవ ప్రకాశ ధైర్య గాంభీర్యాదులుండునో, ఎవ్వాడు తన్మయుడై నామసంకీర్తనము జేయుచు చూచువారికి వినువారికిసైతము పారవశ్యము గలుగజేయుచుండునో, ఏభక్తుని దర్శనమాత్రముచే భవబంధములు విచ్ఛిన్నములగునో, ఎవ్వనియం దనంత భగవ దవతారకార్యము లాచరణీయములై ప్రేక్షక బృందమునకు నాతఁడు భగవంతునివలె గోచరించునో, ఎవ్వని భక్తికి భగవంతుఁడు సంతోషించునో అట్టివానిభక్తి యెంతని వర్ణింతము? ఎవ్వఁడు నోరార తన్నామస్మరణ సేయ మేన పులకలుబొడముచునో, ఎవ్వనికి భగవంతుని దివ్యమంగళ దర్శనమున నేత్రములనుండి ఆనంద బాష్పము లనివార్యముగా కడవలు కడవలుగా స్రవించునో యట్టివాడే భక్తుఁడు! వాడే ముక్తుఁడు! వాని కఖండబ్రహ్మసామ్రాజ్య మరచేతిదై యుండును. వానిదే సౌభాగ్యము!

అట్టి భాగవతాగ్రగణ్యుడైన విష్ణుభట్టు ౧౮౩౮ సంవత్సరమున దక్షిణదేశ తీర్థయాత్రల నొనర్పవలెనను సంకల్పము గలిగి, గృహమునుండి బయలుదేరి, పాదచారియై రామేశ్వరము చేరిరి. అచట వీరు సేతువునందుస్నానమాచరించి, శ్రీరామచంద్రమూర్తిచే ప్రతిష్ఠితంబైన శ్రీరామలింగస్వామిని దర్శించి సేవించిరి. రామేశ్వరమునుండి గృహోన్ముఖుడై శ్రీరంగము, అరుణాచలేశ్వరము, కాంచీ, శృంగేరీ మున్నగు పుణ్య

స్థలంబుల దర్శించుచు తనగృహము జేరెను.

సుమారు ౩౦ యేండ్లయిన తర్వాత, విష్ణుభట్టు ఉత్తరదేశ పుణ్యస్థలముల దర్శింప తలంచెను. ఆస్తికుడగు హైందవునకు తీర్థయాత్ర మతసాంప్రదాయాచారముగదా! అయితే, యేబది యేండ్లకు పూర్వపుయాత్ర కష్టతమముగా నుండెను; ఇప్పుడో ధూమశకటముల ప్రయాణములవలన సులభమైనది. పూర్వ మెంతదూరదేశ ప్రయాణమైనను పాదచారియై పోవలసినదే! అయితే పుణ్యస్థలములయందు భగవంతుడు వేయిమడుంగు లెక్కువగా ప్రత్యక్షవైభవములు గలిగియుండినను శాస్త్రము గలదు గాన, హైందవు డెన్నికష్టముల కోర్చియైనను భూప్రదక్షిణ మొనర్చును.

విష్ణుభట్టు పాదచారియై తీర్థయాత్ర లొనర్చుచు, బృందావనము అయోధ్య మున్నగు క్షేత్రములను సందర్శించుచు, విశాలాక్షీసమేతుడైన కాశీవిశ్వనాథస్వామి యాలయమునకు వచ్చిచేరి, విశ్వనాథఘట్టమునందు సకలపాపనోదకంబులగు గంగాంబువుల గ్రుంకి, శ్రీవిశ్వేశ్వరుదర్శనానంద మనుభవించుచు, పంచక్రోశయాత్రలజేయుచు మణికర్ణికాది తీర్థముల సేవించి, గయాక్షేత్రముంజేరి శాస్త్రోక్తకర్మలనాచరించి గదాధరుడను నామాంతరముగల విష్ణ్వాలయముం బ్రవేశించి, పితృముక్తికై పిండప్రదానమొనర్చి పితౄణము తీర్పగలిగినందు

లకు మోదమందెను. అంతట ప్రయాగాదిక్షేత్రముల మెట్టు చు గృహముం జేరెను. అచ్చటంగల బంధుమిత్రాదులకు సర్వపుణ్యక్షేత్రమహిమలను వివరించి చెప్పసాగిరి.

ఇట్లుండ అనతికాలంబునకే ౧౮౭౯ న తీర్థయాత్రా ఫలముస నొక మగశిశువుం గాంచిరి. ఆ శిశువును జూచి విష్ణుభట్టు భగవంతుడే తనకు పుత్రుడై జన్మించెనని మరలమ రల తలచుచు పరమానంద భరితుడయ్యెను. ఆగ్రామవాసు లందరును వచ్చిచూచి యాబిడ్డయొక్క సౌందర్యాతిశయంబు నకు ముఖవికాసమునకును అచ్చెరువొందుచు ప్రేమాతిశ యంబున నెత్తి ముద్దాడుచుండెడివారు.

జననీజనకు లీబిడ్డకు జాతకర్మలం జేయ సంకల్పించిరి. బిడ్డయొక్క నేత్రములు చిన్నవియై ముచ్చటగానుండుటంబట్టి జ్ఞాననేత్రుడనియు, తలపెద్దదిగా యున్నందున త్రికాలజ్ఞుడని యు నిర్ణయించి, గణపతి*యని పేరిడిరి.

---

* ఈశిశువుపేరు గణపతికాదని కొందఱి యభిప్రాయము. అయి తే బ్రహ్మశ్రీ వేమూరు నృసింహశాస్త్రిగారు రచియించి, బాపట్ల శంకర విద్యాలయ తృతీయవార్షిక నివేదికయందు ప్రచురించిన శ్రీబ్రహ్మానంద తీర్థస్వామివారి పాదుకాష్టోత్తరశత నామపూజయందు శ్రీస్వాములవారి పూర్వాశ్రమమును గూర్చి పండ్రెండవ నామమునందు "గణపత్యాహ్వ యాయనమః" అని యున్నందున గణపతియని నిర్ధారణజేసితిమి.

జ్యోతిశ్శాస్త్రపండితులు గణపతి భవిష్యత్తునుగూర్చి- వీ రద్వితీయ మేధావంతు లగుదురనియు, సంసారపాశముల దుంచివేయు మోక్షమునకు కారణమైన గ్రహావీక్షణము వీరికి మిక్కిలి యనుకూలముగా నున్నదనియు, ప్రపంచోద్ధరణ చణుండగు మహాపురుషుడగుననియు నుడివి, యీమోహాను నాశీర్వదించిరి. ఇదియే యీ బాలుని భవిష్యత్తున కంకురా ర్పణ యయ్యె ననదగును.

---

# మూడవ ప్రకరణము.

## బాల్యము—మాతృబోధ

"భక్తివశః పురుషః"

"నమాతుః పరదైవతం మాతృదేవోభవ"

గణపతి దోగాడునప్పుడు భారతమాత తన చిగురు టాకు చేతులతో నెత్తుకొని ఆలింగన మొసర్చి గంధము మేనినిండ పూసినదో యనునట్లు బాలుడు పరువెత్తబోయి పడినందున మట్టితో గూడి యుండెను. మరియు ప్రకృతి నా స్వాదించి లీనముచేసెననుటకు చిహ్నముగా నీబాలునికి మం టియం దభిరుచి యెక్కుడయ్యెను.

కాలచక్ర మతివేగముగ మరుచ్ఛక్రమువలె నొకసంవత్స రము తర్వాత మఱియొక సంవత్సరము తెలియకనే దొర్లిపోవు చుండును. ఇంతలో గణపతి కైదవయేడు వచ్చినది. వీరితలిదండ్రు లీబిడ్డ కక్షరాభ్యాసము చేయ సంకల్పించిరి. విద్యవలననే సత్ప్రవర్తన గలుగునుగదా! దీనింగూర్చియే భర్తృహరి యిట్లుచెప్పియున్నాడు:-

"విద్యానామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం,
విద్యా భోగకరీ, యశ స్సుఖకరీ, విద్యాగురూణాం గురుః.
విద్యా బంధుజనో విదేశగమనే, విద్యా పరాదేవతా,
విద్యా రాజసుపూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః"

గణపతి తమ తోడిబాలురతో పాఠశాలకేగి, యుపాధ్యాయులు తనకు జెప్పెడు పాఠముల నతిశ్రద్ధతో గ్రహించుచుండెను. తోడిబాలురకంటె నెక్కువ ప్రజ్ఞగలవాడై, తలిదండ్రులయందును యుపాధ్యాయుల యందును సమధిక గౌరవముగలవాడై యుండెను. ఆటలాడుసమయమున న్యాయ్యము తప్పకుండెను. ఈదుటయందు కుస్తీలు బట్టుటయందు మేటి గణపతియే!

వీధిభాగవతమునకు ఆబాలగోపాలము కూర్చుండుట కు చాపల నెత్తుకొని కుతూహలముతో పోవుచుందురు. అట్లు పోవువారలలో గణపతియే ప్రథముడు. భాగవతమాడు స్థలము నిర్ణయముకాగనే తాను మొదటపోయి కూర్చుండి, యానాట

క పాత్రల యభినయమును, వాక్చమత్కృతిని, సందర్భహాస్య కథల నతిశ్రద్ధతో విని, మరల తన తోడిబాలురతో కలిసి తాను చూచినట్లే, వినినట్లే, నాడుచు పాడుచు తోడిబాలుర నానందపరచుచుండును.

గణపతిబాలు డొకనాడు తనతల్లియొద్దకుజని: "అమ్మా, నాకేలనో భయముచే శరీరము కంపమొందుచున్నది. నా కీభయమెట్లు పోగల"దన, సద్గుణ మతల్లికయగు నాసతీమణి "నాయనా, భయము భగవంతు నెఱుంగనందున గలుగును. భయమనగా భగవంతు నెఱుంగనుండుటయే! కావున మన కులదైవమైన శ్రీదత్తాత్రేయుని పవిత్రనామమును సదా స్మరించుము, నిర్భయుడవగుము"అని బోధించెను. తల్లియుపదేశమును గ్రహించి, తనమాతృదేవినే ప్రథమగురువుగా నెంచి, నిరంతరము శ్రీదత్తాత్రేయనామమును స్మరించెదని ప్రతిన మొనర్చి, తనజీవితాంతరమువరకు మఱువక యనుష్ఠించెను.

గణపతి కేవైన సందేహములు గలిగిన వెంటనే, తన తల్లి నడుగువాడు; తల్లియు భగవద్భక్తి, జ్ఞానవైరాగ్యాది సద్గుణములగూర్చి బోధించుచు, నీబాలుని సంశయ నివృత్తి చేయుచుండెడిది. ప్రతిబాలునికి తల్లి ప్రథమపరిచయము; తల్లి వెనుక తండ్రి; తర్వాత బంధుమిత్రాదులు. బిడ్డ తనకు కావలసిన వస్తువులను తల్లినే యడుగును. గణపతికి కావలసిన భగవద్విగ్రహములను తల్లి చేకూర్చుచుండెడిది; ఆవిగ్రహములను

గానివచ్చి నిర్మలమైన స్థలమున చక్కగా నమర్చి వానియెదు ట నాసీనుడై పూజించుచుండెడివాడు.

మఱియు గణపతియొక్కతల్లి తనపుత్రరత్నమునకు అహింస, సత్యము, అస్తేయము మొదలగు సద్గుణముల నభ్య సింపజేయుచుండెను. ఇదిగాక యుదాహరణగా శిబి, హరిశ్చం ద్ర, నల మున్నగు త్యాగపురుషుల చరిత్రాంశముల జెప్పి, వారివలె ధీరుడవుకమ్మని యుత్సాహపరచుచుండెను. గణపతి యు వారివలెనే త్యాగశీలుడు కాగోరుచుండెను.

---

## నాల్గవ ప్రకరణము.

## —: గణపతి సద్గుణములు :—

"న తేన వృద్ధో భవతి యేనాఽస్యపలితం శిరం
యోవైయువాఽప్యధీ యానస్తం దేవా స్థవిరంవిదుః"

కాకి కలకాలమున్న నేమిలాభముదు నానోక్తి నను సరించి మూఢులెంతకాలము బ్రతికిన నేమిఫలము? శరీరము ముడుతలుపడి, తల నెఱసి, పండ్లూడి నంత మాత్రముననే నెవ్వరును గొప్పవారుకారు. బాలురైనను ప్రహ్లాద ధృవా దులు జ్ఞానవృద్ధులు. వీరి తండ్రులగు హిరణ్యకశిప ఉత్తానపాద

వయోవృద్ధులు. జ్ఞానవృద్ధత్వము మృత్యుముఖమునం బడని
వ్వాక, జన్మరాహిత్యమున కాధారమగును; వయోవృద్ధత్వము
జనన మరణ భయ క్లేశంబుల కాకరంబగు సంసృతి
బద్ధుని గావించును; మనఃప్రసన్నత గలిగి, దేహాభిమానము
వీడి, ద్వంద్వాతీతుడైనవాడు బాలుడైనను వృద్ధుడే! మనో
నిగ్రహము లేక శరీరాభిమాన పీడితుడగువాడు వెయ్యేండ్లు
బ్రతికినను పురిటింటిశిశువే!

గులాబిపుష్పము వికసింప మొదలిడగనే దాని సుగం
ధము ఘ్రాణేంద్రియముల కానంద మొసగుచు వెల్వడకుండు
నా? అటులనే గణపతి జీవితమునందును సుగుణసంపత్సుగంధము
వెల్వడుటకు ప్రారంభించెను. దానిమనము ముమ్ముందు పరికిం
చెదము.

మన మిదివరకే గణపతి పాఠశాలకేగి, తోడిబాలుర
కంటె మిన్నయైయుండెనని చదివియుంటిమి గదా! ఈ బాలుడు
పాఠశాలనుండి యింటికిరాగనే తల్లివద్దకు వచ్చును; తల్లియు
బిడ్డను చేరబిలచి తినుబండారముల నొసంగి, "నాయనా! బడి
లో నేమినేర్చుకొంటివి?" యని యడుగ, గణపతి పాఠశాల
లోని సంగతులన్నియు ఉపాధ్యాయులేమే విషయముల
బోధించినదియు పూసగ్రుచ్చినట్లు తల్లి కెఱుకపరచుచును.

తండ్రియైన విష్ణుభట్టును భారత భాగవత రామాయణాది

గణపతి భగవద్విగ్రహములను మంటితో తయారు చేయుచుండెను. ఇరుగుపొరుగు వారా విగ్రహముల జూచి, గణపతి శిల్పనైపుణి కానందపడుచుండిరి. కేవల వృత్తిచే శిల్పులైనవారుగూడ గణపతి వలె సర్వావయవ లక్షణ యుక్తమైన విగ్రహముల తయారుచేయజాలకుండిరి. గణపతి తయారుజేయు విగ్రహములయందు జీవకళ, ప్రకృతి సౌందర్యము లుట్టిపడుచుండెడివి. అందువలననే గణపతి సన్యసించినతర్వాత బాపట్లయందు వినాయకచతుర్థి మహోత్సవసమయమున విఘ్నేశ్వరునివిగ్రహమును, దత్తజయంతిసందర్భమున శ్రీదత్తాత్రేయ విగ్రహమును చూపఱుల కాశ్చర్యము గలుగునట్లు నిర్మించిరి.

గణపతిబాలు డేవిషయమును విన్నను తక్షణమే నమ్మువాడుకాడు; దానిని తన బుద్ధిచే బాగుగ పరిశీలించి నమ్మువాడు; కాని, కుతర్కప్రియుడుగాడు, తనకు తెలియని యంశముల పెద్దలను, తలిదండ్రుల నడిగి గ్రహించువాడు. ఈ బాలుని మాతాపితలు వీదిబడి చదువు పూర్తికాగానే, నాంగ్ల పాఠశాల కంపిరి. ఈబాలునియందు డాంబికాచారములు మచ్చునకైన కానరావు. ఆంగ్ల పాఠశాలయందు జరుగు పోటీపరీక్షలలో తానే ప్రథమస్థానమున నుత్తీర్ణుడై పారితోషికముల గైకొనుచుండెను. ఈబాలుడు భిక్షుకులు పాడు భగవ

కీర్తనల నతిశ్రద్ధతో విని, నిశ్చేష్టితుడై, కడపట వారికి నాహార పదార్థముల నిచ్చుచుండెను.

ఇప్పుడు మన గణపతికి పదియేండ్ల వయస్సుమాత్రమే! విష్ణుభట్టు ప్రతిదినము శ్రీదత్తాత్రేయారాధన లొనర్చుచుండ గణపతియు శుచియై తండ్రిప్రక్కననే కూర్చుండి, తండ్రిచేయు ప్రక్రియలనన్నిటిని జాగరూకతతో జూచుచుండును. తనతండ్రి ప్రదక్షిణ లాచరించిన తానును ప్రదక్షిణ లొనర్చును; నమస్కరించిన నమస్కరించును; కడపట భగవత్ప్రసాదమును తీర్థమును కన్నులకద్దుకొని గైకొనుచుండును.

ఒకనాడు గణపతి తండ్రికంటె ముందుగలేచి, కాల్యకృత్యముల దీర్చుకొని, పూజాగృహము ప్రవేశించి గంటవాయించెను; తండ్రి యాశబ్దమును విని, తటాలునవచ్చి: "నాయనా, దేవతావిగ్రహముల ముట్టకుము; ఉపనీతుడవు కానిదే దేవతార్చన చేయరా"దని నివారించెను. అంతట గణపతి నిరుత్సాహముతో తండ్రివంక జూచుచు నూరకుండెను. అట్లు కొంత తడవుండి, "నాయనా, నాకెప్పు డుపనయన మాచరించెదవు? నేనెన్నిదినము లిట్లు దేవతారాధన చేయకుండవలయును?"యని యతిదీనముగా నడిగెను. అప్పుడు విష్ణుభట్టు కొమారునివంక జూచి, "అతిత్వరలోనే యుపనయన మాచరించెద"నని మోదార్చెను.

జననీజనకులు తమ కుమారుడు బ్రాహ్మణత్వము బొం

దుటకై పెద్దలరావించి, యుపనయన సుముహూర్తము నిశ్చ యించిరి. బ్రాహ్మణవంశమందు బుట్టినను ఉపనయన సంస్కారము కానివాడు శూద్రునితో సమానుడని భావము. ఉపనయ నమనగా: 'నయన' శబ్దమునకు 'ఉప'యను ఉపసర్గయుండుటచే జ్ఞాననేత్రము నిచ్చు సంస్కారమని పెద్దల యభిమతము. ఉపన యనమైన తర్వాత బ్రాహ్మణబాలుడు బ్రహ్మచారియని పిలువ బడును. బ్రహ్మచారియనగా, సదా బ్రహ్మమునందు చరించు వాడని సూక్ష్మార్థము. ఉపనయనము కానిదే మంత్రాధికా రముగాని గాయత్ర్యనుష్ఠానపరత్వముగాని గలుగదు. బ్రహ్మ చర్యాశ్రమమున నడుగిడుట యన, కొన్ని పవిత్ర నియమము లకు బద్ధుడగుటయే! కనుకనే ప్రతిబ్రాహ్మణబాలుడును యజ్ఞో పవీతధారణ సంస్కారమునకై యెదురుచూచుచుండును. గణ పతియు నాశుభదినమెప్పుడు వచ్చునా యని యువ్విళ్ళూరు చుండెను. ఉపనయన ముహూర్తము సమీపించెను- ఆ బా లుని తలిదండ్రులకేగాక యాయూరివారికందరికి సంతోషముగ నుండెను. పచ్చతోరణములచే గృహము నలంకరించిరి; బంధుమిత్రాదులు విచ్చేసిరి; గాయత్రీ మంత్ర ముపదేశింప బడగనే గణపతి బ్రహ్మవర్చస్సు యినుమడించెను. పసుపువస్త్ర ములధరించి భిక్షాపాత్రను చేబూనిన గణపతి వామనునివలె నుండెను. ఈ బాలుని సహజసౌందర్యమునకు పసుపువస్త్రములు నూతన కాంతి నొసగినవి.

అంత, గణపతి తనస్నేహితుల గూర్చుకొని, భగవత్ప్రూజ కై పుష్పముల గొనితెచ్చుట, భోజన సమయములయందు వడ్డన; భోజనానంతరము విస్తళ్లనెత్తి స్థలమును పరిశుద్ధిజేయుట మున్నగు కార్యముల ఫలాపేక్షలేక అప్రమత్తుడై చేయుచుండెను. గణపతి యిట్టి సత్కార్యములను జేయుట బాల్యమునుండియే నేర్చుకొని, అదిమొదలు శరీరపతనపర్యంతము లోకమునకు హితకరములైన కార్యముల జేయుచు, జేయించుచు, నిష్కామకర్మాభ్యాసమును లోకమునకు బోధించెను. కుంటి గుడ్డివారి కన్నమిడి, వస్త్రహీనులకు తనపైనునున్న వస్త్రమునే యిచ్చి యింటికివచ్చువాడు. పరులకష్టములే తనకష్టములుగా నెంచి సేవజేయుట, ఫలాపేక్ష వదలి ఈశ్వరార్పణబుద్ధితో సత్కర్మలనొనర్చుట మనబాలుని పుట్టిననాటి గుణమని వేరుగ జెప్పనేల? తనయింటియందు గణపతిబ్రహ్మచారి తలిదండ్రులకు ముదంబుగలుగ శ్రీదత్తదేవునికి పూజలొనర్చుచుండెను. ఒక్కొక్కపరి శ్రీదత్తమూర్తి యెదుట స్థిరాసనాసీనుడై దీర్ఘస్తోత్రములొనర్చుచు, అప్రియత్నముగా లేచి నృత్యముజేయును. అప్పుడు చెక్కిళ్లవెంట నశ్రుధారలు ప్రవహించుచుండును. భగవంతునికొరకు కన్నీరు కార్చుటయనగా హృదయ మలినము కడిగివేయబడినట్లే! భగవత్సాక్షాత్కార మెవ్వరికి కలుగునని ప్రశ్నింప శ్రీరామకృష్ణపరమహంస ఇట్లు సెలవిచ్చిరి: "సాధా

రణముగా మానవులు దారా పుత్రమిత్రబంధు ధనముల నిమిత్తము కడవలకొలది కన్నీరుకార్చెదరుగాని, భగవంతుని నిమిత్త మొక కన్నీరుబొట్టైన కార్చువారు లేరుగదా!"

---

# ఐదవ ప్రకరణము.

## —: తీవ్రాధ్యాత్మికమార్పు :—

"అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాశ్శరీరిణః
అనాశినోఽ ప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత
జాతస్య హి ధృవోమృత్యుః ధృవం జన్మ మృతస్య చ
తస్మాద పరిహా ర్యేఽర్థేనత్వం శోచితుమర్హసి"

చిఱుతప్రాయమునుండియు నీబాలుని కేకాంతవాస ప్రీతి యెక్కువగా నుండెను. అప్పుడప్పుడు తనగ్రామసమీపముననున్న నదీతీరమునకు నొంటిగ వెళ్ళి, భగవధ్యాన నిమగ్నుడగుచుండెను. అట్టిసమయమున గణపతి చెక్కిళ్ళవెంట నశ్రుబిందువు లనివార్యముగా కారి, భూమి నంటుచుండెను. మరియొకప్పుడు శ్రీదత్తదేవాలయమున కేగి, త న్నితరు లెఱుగకుండ చీకటిమూలల గూర్చుండి శ్రీదత్తదేవుని గూర్చి జపమాచరించుచుండెడివాడు. శ్రీభగవద్గీతయందును

శ్రీకృష్ణపరమాత్మ "యజ్ఞానాం జపయజ్ఞోస్మి" యని నుడివి యున్నారు గదా!

కారణములేక కార్యముజరుగదు; గణపతి వైరాగ్యాంకుర మేర్పడుటకును, జ్ఞానవైరాగ్యనిష్ఠాదార్ఢ్యములు బలపడుటకును సమయమాసన్నమైనది. ఇట్లుండ నాయూరికి ప్లేగు వ్యాధిసోకెను. ప్లేగువ్యాధి అంటువ్యాధియైనందున నాయూరంతయు వ్యాపించి ప్రజలనందరిని మృత్యుముఖమున బడద్రోయుచుండెను. మన బ్రహ్మచారి తల్లిదండ్రులు వివాహమహోత్సవమునకై గ్రామాంతరము వెళ్ళియుండిరి. తన నికేతనమున బ్రహ్మచారియు నాతని సహోదరులును మాత్రమే యుండిరి. అకస్మాత్తుగా ప్లేగువ్యాధి బాధాపీడితులై తన సహోదరులు మరణించిరి.

అప్పు డాయూరివారి స్థితి "యెవరికివారే యమునాతీరే" యనునట్లుండెను. ఇంటింటను పీనుగల కుప్పలే! రోదన ధ్వనులే! ఆరోగ్యవంతులు తమకా వ్యాధి యాపాదించునేమో యనుభయముచే సాహాయ్యపడ సందేహించుచుండిరి. మృత్యువు అనిన దేహధారుల కెంత భయమో గదా! దేహపాతమైన వశించెదమని కొందరు, మనతోడిదే లోకమని కొందరు, భార్యాబిడ్డల పోషించువారెవరని మరికొందరు తలచి విలపించుచు మూలమూలల దాగుదురు; దాగినంతమాత్రమున తప్పించుకొనగలరా?

కాని, మనబ్రహ్మచారియు తనసోదరులయెడ ప్రేమ గలవాడు గాన కొంత దుఃఖమును పొందకపోలేదు, అయితే, భ్రాతృమరణవ్యాజమున గణపతి భవిష్యజ్జీవితమను సౌధమునకు శంఖుస్థాపన మొనర్చుకొనినాడు.

కొంతవడి దుఃఖించి ధైర్యము దెచ్చుకొని, శ్రీమచ్ఛంకర పాదులవలె తానే యాకళేబరముల శ్మశానవాటికకు చేర్చి, పూడ్చివేసి యిల్లుచేరెను.

గృహమును చేరగానే యింట మాతాపితలు లేకుండుటయు, తనసోదరులు మరణించుటయు, తా నొంటరియగుటయు, ఏకాంత మనుకొని యిట్లు చింతింప నారంభించెను:— "ఏమి! మరణావస్థ రాజాధిరాజునకును బీదవానికిని సమానము గనున్నదే! మృత్యువననేమి? శరీరమునకా? ఆత్మకా? యనితర్కించి, శరీరము లస్థిరములనియు ఆత్మ నాశరహితమైనదనియు సిద్ధాంతీకరించుకొనెను. ఈవిచారము చేయుకొలది ప్రపంచ విముఖత్వము, తీవ్రవైరాగ్యము కుదిరెను.

మరణభయము మరణతత్త్వ మెఱుంగని మూఢులకే గాని, తత్త్వజ్ఞుల కుండదుగదా! తత్త్వజ్ఞులు దేహదేహములకు భేదము నెఱింగినవారుగాన, నరుడు చినిగిపోయిన వస్త్రముల విడిచి నూతన వస్త్రములను ధరించు నట్లంతర్యామి శిథిలమైన శరీరముల వదలి, క్రొత్తశరీరములను ధరించునని గీతావాక్యము నెఱింగి ధైర్యమువహింతురు.

తన భ్రాతృదేహముల శ్మశానమున పూడ్చునప్పుడు బ్రహ్మచారి, పాంచభౌతిక శరీరములన్నియు కడకు నిట్టి దశను పొందవలసినవే యనియు, తుదకు తన శరీరముయొక్క స్థితి యు నిట్టిదే యగుననియు దెలిసికొనెను.

ఆంగ్లవిద్యయందును మన గణపతి నానాటి కయిష్టము జూపుచుండెను. బడిలో జరుగు నిత్యకార్యక్రమము నెడ వి ముఖుడు కాజొచ్చెను. కాని, పురాణేతిహాసగ్రంథముల జదు వుట కభిలషించుచుండెను. ప్రాపంచిక విద్యలయందయిష్టము జనించుట ప్రతిమహనీయుని జీవితమునందును మనము గనుచు న్నారము. ఐహికవిద్యలయందు నిరసనభావము గలిగినగాని ఆముష్మికవిద్య లభింపదు.

కనుక మనబ్రహ్మచారి తన గృహమందలి జీవితమునకు రోసి మనశ్శాంతికై ద్వాదశ వర్షప్రాయంబున తీవ్రవైరాగ్యచి త్తంబుతో యిల్లు వదలి, శ్రీదత్తక్షేత్రమని ప్రసిద్ధిజెందిన నరసోబావాడి (నృశింహవాడి) యను పట్టణమునకు బోవనిశ్చ యించెను. తన ప్రయాణము నాపుటకు తలిదండ్రు లింటలేరు గదా!. ఇదియే మంచితరుణమనుకొని, కాలినడకన పోవుచుండ మార్గమధ్యమున కృష్ణానదిని దాటుటకు పడవభృతి నిమి త్తము యిరువదిరూప్యముల వెలగల వెండిబిళ్లల మొలత్రా డును నాలుగురూపాయలకు కుదువయుంచి ప్రయాణము సా గించెను.

పదవ ఆవలిగట్టు చేరగనే గణపతి నరసోబావాశింజేరెను. అప్పటికి షుమారు ౬-౩౦ గంటలైయుండును. మనగణపతి కింతలో క్షుద్బాధ తీవ్రముకాగా, నొక గృహస్థునింట పిడికెడన్నము గ్రహించెను. ఇప్పటికిని యింట తల్లి మూడు పర్యాయములు భోజనమిడ గ్రహించు బాలుడేగదా! అది యేమిచిత్రమో గాని, యాదినమున నొకపిడికెడన్నముతోడనే సంతుష్టికలిగెను.

అంతట వీధి వీధి తిరిగి, బడలికజెంది యొక తిన్నెమీద కూలబడెను. రాత్రి సుమారు ౯-౩౦ గంటలగునప్పటికి పట్టణములోని ప్రజలందరు గుంపులుగూడి వీధులవెంబడి పోవుచుండిరి. వారినిజూచి మన బ్రహ్మచారి మీరెచ్చటికేగుచున్నారన వారు "బాలకా! శ్రీదత్తమందిరమున శ్రీదత్తదేవుని హరికథాకాలక్షేపము జరుగు" నని నుడివిరి. మనబ్రహ్మచారియు మేను గగుర్పాటుజెంది, తచ్ఛ్రవణకుతూహలుడై వారితోగూడి యచ్చోటికేగి, యాహరికథాకాలక్షేపకుని యంతికమునకూర్చుండి హరికథను తదేకధ్యానముతో వినుచు, ఆనంద మనుభవించుచు, మధ్య మధ్య యుబ్బుచుండెను.

ఈబాలుని భక్తిని, విచిత్రచేష్టలను యాభాగవతాగ్రగణ్యుడు గుర్తించుచుండెను. హరిదాసిట్లు తనమనంబున గణపతిని వర్ణింపసాగెను: "ఆహా! ఏమి యీబాలుని దివ్యతేజస్సు! కనులకాంతి! హృదయఫలకమెంత విశాలము! వీనియందు

హరిభక్తి పుంభావితమైనది. భక్తుని కుండవలసిన లక్షణము లీబాలునియందు మూర్తీభవించియున్నవి" అని వితర్కించుకొని యీబాలుడెవడో తెలియగోరి: "నాయనా! నీవెవ్వరవు? నీపేరేమి? నీతలిదండ్రులెవరు?" అని యడిగి, తగిన సమాధానము రాకుండుటంబట్టి యీకుఱ్ఱడు జననీజనకులకు తెలియకుండ వచ్చినాడని యూహించెను. అంత ఇచ్చటనే వీనిని రెండుమూడుదినములు నిలిపిన తలిదండ్రిలు వెదకుచు వచ్చి, పిలుచుకొనిపోవుదురని భావించి, "బిడ్డా! మాబసకు రమ్ము. అచ్చటనే యుండవచ్చును; ఇచ్చట వారమురోజులు హరికథా కాలక్షేపములు జరుగును. రేపు దత్తాత్రేయావతారరహస్యము జెప్పెద"నని రమ్మని చేయిపట్టుకొని బలవంతముగా బసకు పిలుచుకొనిపోయి యేమరిన పరారుచిత్తగించునేమో యని తనవెంటనే యుంచుకొనెను.

ఇంటియందు గణపతి తలిదండ్రిలు తమబిడ్డను గానక యు, ఇంతకుముందు కొందరు కుమారులుమరణించుటయు తలపోసి, గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు పట్టరాని దుఃఖము నొంది, సమీప గ్రామ నగర కాంతార ప్రదేశముల వెదకి వేసరి, యెట్టకేలకు విష్ణుభట్టు నృసింహవాడి వచ్చిచేరెను.

అచట నారాత్రి హరికథ జరుగునని వినినవాడు కాన, పగలంతయు బాలుని పోవిడిగానక విసికి, హరికథ జరుగుచో

టనైనా తమ బాలుడుండునేమో చూతమని యాచోటికి పోయిచేరెను.

అచ్చట విష్ణుభట్టు హరికథాశ్రవణతత్పరుండగు తన పుత్రునిగాంచి సంతసించెను. భాగవత కథాశ్రవణానంతరము హరిదాసు, యీవచ్చిన విష్ణుభట్టు యీ బాలుని తండ్రిగా నెఱింగి, "అయ్యా! ఈపిల్లవాడు నాలుగురోజులనుండియు నిచ్చటనే యున్నవాడు. కాన, జాగ్రత్తగా తీసుకొనిపొండ"ని బాలునప్ప గించెను.

తరువాత, విష్ణుభట్టు తనపుత్రుడు వెండిబిళ్లల మొలత్రాడును కుదువయుంచిన వృత్తాంతము నెఱింగి, కుదువయుంచుకొనిన వానిని తెలిసికొని, వానికి నాలుగురూపాయలనిచ్చి సగను గైకొని, బాలునితో నిల్లుచేరెను. తల్లియు తనబిడ్డను గాంచి, కౌగలించుకొని సంతోషించెను.

# ఆఱవ ప్రకరణము.

—: గణపతిభక్తి :—

"భక్తివశః పురుషః"

స్వగృహమునకు మరలివచ్చినప్పటినుండియు మనబ్రహ్మచారి దైవభక్తి వేయిమడుంగు లధికమయ్యెను. గణపతి యాంగ్లవిద్య నభ్యసించుచుండుట పాఠకు లెఱింగినవిషయమే! ఇప్పుడు చదువులన్నియు నుదరపోషణనిమిత్తములే యని తలంచి యాంగ్లపాఠశాలకేగుట మాని యాకాలమంతయు దైవధ్యానమందే గడపుచుండెను. శ్రీశంకరులును ప్రాపంచికవిద్యలన్నియు భుక్తికే యని నుడివియున్నారు:—

"వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్ర వ్యాఖ్యానకౌశలం
వైదుష్యం విదుషాం తద్వద్భుక్తయేనతు ముక్తయే."

తలిదండ్రులును తనపుత్రుని పాఠశాలకేగుమని నిర్బంధించిన మరల పారిపోవునేమోయని యూరకుండిరి.

ఇక గణపతి శ్రీదత్తకీర్తనలను గానముచేయుచు తన్మయుడగుచుండువాడు. ఈబాలునికి గానవిద్యయం దభిరుచి మెండు; వీరిగాత్రము మృదుమధురముగను, శ్రావ్యముగను నుండెను. అందువలన జనులు వినవలయునను కుతూహలముతో గణపతియొద్దకు వచ్చి పాటలుపాడుమని కూర్చుందురు.

గణపతియు తన సహచరులతో దత్తభక్తిపూర్ణుండై తిన్నని తనకంఠమెత్తి యాగంతుకుల మనంబులు ప్రసన్నంబులగు నట్లు పాడెడివాడు. నారదుడు త్యాగరాజాది మహాభక్తులు హరిగానముచేతనేగదా ముక్తిని బొందినది!

మన గణపతి శ్రీదత్తకీర్తనల బాడుచుండ, మిత్రుల లో నొకడు "గణపతీ, నీవు హరికథలు నేర్చుకొని చెప్పిన మేమును విని సంతసింతుము. నీకంఠము మిక్కిలి శ్రావ్యమై యున్న"దనెను. గణపతియు తనస్నేహితుని సలహాకు సంత సించి, యాయూరిలో ప్రసిద్ధిగాంచిన హరిదాసునొద్ద హరి కథల నేర్చుకొన ప్రారంభించెను. గణపతి కుశాగ్రబుద్ధిగలవాడు గాన నారుమాసములలో శ్రీదత్తహరికథలను చిత్రవిచిత్రము గా భగవద్భక్తి స్థిరముగ పాదుకొనునట్లు చెప్పు సామర్థ్యము గలిగినది. ఇతర హరిదాసులు భగవన్నామస్మరణకు బదులు స-రి-గ-మ-స్మరణజేయుచు, విలాసముగా కులుకుచు, భక్తి యొక్కింతయైనను లేక, పిట్టకథలతో హరికథాకాలము పూర్తి గావింతురు; మన బ్రహ్మచారియో హరినామసంకీర్తనకే ప్రాముఖ్యమునిచ్చి నృత్యము జేయుచుండును.

గణపతి సహజ సౌందర్యముగలవాడు; అతని అందమైన ముఖము, తేజోమయమై కాటుకవలె నల్లని కన్నులు, విశాలమైన లలాటము, వెడద వక్షస్థలము మహాపురుషుడని చెప్ప కయే తెలుపుచుండెను. అందుకు తోడు హరికథాసమయమున

భక్తులర్పించు పరిమళపుష్పధామములు ధరించినపుడు శ్రీకృష్ణ పరమాత్మ తలంపునకు వచ్చుచుండును.

అట్టిసమయమున గణపతి తరచుగా గంటలకొలది భక్తియుక్తుడై తన్మయుడై నేలం గూలుచుండెను. శ్రీ రామకృష్ణ పరమహంస బాల్యమున కమర్పకూరులో శివపాత్రధరించినపుడు తన్మయుడుకాలేదా? శ్రీరమణమహర్షియు బాల్యమున మధురసుందరేశ్వరుని దేవాలయమున అరువత్తుమూడు నయనారుల విగ్రహముల తిలకించుచు తన్మయుడయ్యెనుగదా! ఆహా! శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి, పరమహంస, మహర్షి మున్నగు మహనీయులకు ఎన్నియోజనములు ధారవోసినను యితరుల కసాధ్యమైన సమాధులు మంచినీళ్ళప్రాయములుగదా!

గణపతి దుర్జనసాంగత్యమునే యెఱుగడు. నారదభక్తి సూత్రములందును "సూ॥ దుస్సంగస్సర్వథైవ త్యాజ్యః" యని చెప్పబడియున్నది. అయినను సజ్జనసాంగత్యమునందభిరుచిగలవాడు. సజ్జనసాంగత్యమే సర్వ శ్రేయోమూలమనియు జీవన్ముక్తిప్రదమనియు శ్రీశంకర భగవత్పాదుల యుపదేశము—

"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వేజీవన్ముక్తిః.

సాధుసాంగత్యమును గూర్చి శ్రీరమణమహర్షియు యిటునుడివియున్నారు:—

ఆ. "సాధుసంగమమున సమయుబాహ్యాంతర
సంగము లటుపై నెఱుంగు నిశ్చ
లమగుతత్త్వమౌదురు మరి జీవన్ముక్తు
లందువలన సాధులాశ్రయింపు.

తే. సాధుసంగమముచేత హృత్ స్థలినిగలు-
స్పష్టమౌ విచారముచేత సాధ్యపడెడి
పరమమైనట్టి పదమును బడయజాల
రరయగ గురు శాస్త్రార్థ పుణ్యములనైన.

ఆ. సాధులైనవారి సహవాస మబ్బిన
నియమజాల మెల్లని యతలేదు
మందమారుతంబు మలయగ నేమిలా
భంబు? విసనకర్ర వలననెంచు."

మనబ్రహ్మచారి సాధుసాంగత్యమును విడువక, వారికి విధేయతతో సేవలు జేయుచు, రాత్రింబవళ్ళు సాధులుండుస్థలములయందే గడపుచు, వారిని "పుణ్యమననేమి? పాపమననేమి? భగవంతుడెట్టివాడు? భగవంతునెఱుంగుటెట్లు?" మొదలైన ప్రశ్నల నడిగి తెలిసికొనుచుండెడివాడు. వారి ధ్యానక్రమమును జూచి, వారివలెనే కూర్చుండి ధ్యానింపసాగెను. తనయూరి కరుదెంచిన పరివ్రాజకుల గాంచినప్పుడు వారివలెనే నేనెప్పుడు సన్న్యసింతునా యని యువ్విళ్లూరుచుండెను. అట్టిపర్యాలోచననే జిజ్ఞాసయందురు. ఈబాలుని కట్టి జిజ్ఞాసగలిగినప్పుడు, మనోవిశ్రాంతిలేమియు, దేహమున మంటలును గలుగుచుండెను.

మహాపురుషులే సాధనమున భగవంతుని పొందిరి? మనమును అట్లేల గొప్పదశకురాకూడద"ను జిజ్ఞాసయే వీరినింత గొప్పపద వికి దెచ్చినది. జిజ్ఞాసలేనిది బ్రహ్మాత్మైక్యజ్ఞానముగలుగదు. ఈవిష యమునే అనాసక్తియోగమున శ్రీగాంధీగారు "జిజ్ఞాసలేకుండ జ్ఞానములేదు. దుఃఖములేకుండ సుఖములేదు. ధర్మసంకట ము, హృదయమథనము సమస్త జిజ్ఞాసువుల కొక్కసారిగలుగు చునె యున్నద''ని నుడివియున్నారు. అట్టి జిజ్ఞాసగలిగినందు ననే శ్రీకృష్ణు డర్జునునకు గీతనుబోధించగా, గీతామృతమును గ్రోలియమృతత్వమును బొందెను. ఈవిషయమును జీవితములో నొక్కపరియైన శ్రీభగవద్గీతను పఠించిన వారికి స్పష్టమగును.

---

# ఏడవ ప్రకరణము

## —: హిమాలయ పర్యటనము :—

"నాయమాత్మా ప్రవచనేన లభ్యో
నమేధ యా నబహునాశ్రుతేన
యమేవైషవృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూస్వాం"

గణపతిదైవభక్తియు, వైరాగ్యమును దిన దినాభివృద్ధి యగుచున్నవి. ఇంటియందు గడపు జీవితమునుద్రోసి, మెట్టకైన

పోదలంచెను. నానాటికి బంధుమిత్రులసంగమును వదలి పూర్ణైకాంతమును గోరుచుండెను. ఊరిబయట దివారాత్రములు గడపసాగెను.

ఇట్లుండ, నొకదినమున తనయింటికొక సాధు వేతెంచెను. గణపతి యాసాధువును సత్కరించి, "సాధూజీ! ఏస్థలము నిర్జనమై తపంబునకు యోగ్యమగనుండును? ఎచట యోగులు తపం బాచరించుచుందురు?" యన, యాసాధుపుంగవుడు హిమాలయపర్వత శిఖరములందును, నదీతటంబులందును, పర్వత గుహలందును, సాధువులు తపమాచరించుచుందురని యు, వారిచరిత్రలను, హిమాలయ ప్రాంత పుణ్యభూముల సౌందర్యమును వర్ణించెను. అప్పటినుండియు, గణపతి తన మనంబున హిమాలయపర్వత గుహలలో తపమొనర్ప నిశ్చయించుకొని సమయమునకై వేచియుండెను.

సుమారు ౧౮౯౩ లో, అనగా, తన పదునాలుగవ యేట రెండవపర్యాయము యిల్లువిడచి, సర్వమునుపరిత్యజించి, శ్రీకృష్ణచైతన్యప్రభువవలె భగవద్గీతను తన సాలగ్రామము లతో గూడిన దేవతార్చనను తనవెంట తీసికొనిపోవుచు, గంగానదిని దాటుటకు రూకలు లేకయే పడవనెక్కెను. అంత పడవవాండ్రు నదీమధ్యమునకు పడవరాగానే యందరిని పడవ భృతియడుగుచు గణపతి బ్రహ్మచారిని గూడ నడిగిరి; మన

బ్రహ్మచారి తనవద్ద ధనములేదని చెప్ప, యామూటలో ద్రవ్యమున్నదని పడవనాయకుడు మూటను తాకబోయెను. అంత నీబాలుడు పవిత్రమైన భగవత్ప్రీతినిధియైన సాలగ్రామము నీదుష్టు లేల తాకి మైలపరచవలె? నని దానిని నదిలో పారవేసెను. అంతటవారే సమాధానపడి బ్రహ్మచారి నావలి గట్టుచేర్చిరి.

గణపతి కాలినడకన శరీరప్రయాసముల లక్ష్యపెట్టక ప్రయాణము సల్పెను. గ్రామములమీదుగ మునుపటివలె ప్రయాణముసాగించిన తన తలిదండ్రులు తన జాడ నెఱిగి, మరల యింటికి తీసికొనిపోయిన, తన యున్నతాశయములకు భంగము గలుగునని యెంచి, యీమారు యితరులకసాధ్యమైన ఘోరారణ్యదుర్గమ పర్వతమార్గములబట్టి పోనిశ్చయించెను. దారిని పోవుచు భక్తిపరవశుడై దారితప్పుటయు గలదు. ఒక్కొక్క విపినప్రదేశమున దారి లేకుండుటచే, ముండ్లతీగలను కంటక వృక్షములను చిన్నతిప్పలను దాటిపోవలసివచ్చును. అప్పుడు మనబ్రహ్మచారి యెట్లైనను హిమవత్పర్వతశిఖర దర్శనాపేక్షగలవాడగుట వలనను, తత్పర్వతగుహలందు తప మాచరింప నిశ్చయించినవాడగుటవలనను, శరీరభద్రతను లక్ష్యపెట్టక ముండ్లపొదల దూరుచు, కొండలనెక్కి దిగుచు, తన దేహమున రక్తము ప్రవాహములైనను, తన కాళ్లు చీలికలైనను జారి పడుచున్నను, కష్టములనన్నిటికి నోర్చి ప్రయాణమొనర్చెను.

ప్రవాహములడ్డుపడిన యీదుచు, కొండలనెక్కి దిగునప్పుడు జారిపడినను సత్యాన్వేషణోద్రేకమున నది యంతయు లక్ష్య పెట్టక, దినమునకు నలబై మైళ్ళచొప్పున పవిత్రహృదయముతో విసుగులేక భగవదాయత్త చిత్తుడై నడువసాగెను.

మార్గమధ్యమున గణపతి పవిత్ర తీర్థరాజముల గ్రుంకుచు, దేవతాదర్శనముల జేయుచు, సాధుబృందములతో ముచ్చటించుచు, ఘోరమృగముల కాకరములైన నిర్జనారణ్య ప్రదేశముల నిర్భయుడై దాటుచు, యెప్పుడు హిమాలయము జేరుదునా? యెప్పుడు పార్వతీదేవి తపస్సుచేసిన ప్రదేశమును, భగీరథుని దీక్షచే ఉజ్జీవితమైనపునీతభూమిని సందర్శింతునా యని పరుగు పరుగున పోనారంభించెను. తుదకెట్లో మహర్షుల తపశ్శక్తిచే దీపితరాగమైన-అమరాలయ పుణ్యభూముల జేరెను. అచ్చట తపమాచరించు యోగుల దర్శింప పర్వతారోహణాసక్తుడయ్యెను. ఆపర్వతరాజము నెక్కుచు, యచట ప్రవహించు సెలయేళ్ళ ధ్వనులు కర్ణానందము గలుగజేయు ఓంకారధ్వనియని భావించి, ఘోరారణ్య ప్రదేశముల సింహశార్దూలాది క్రూరమృగముల భయంకర గర్జనములకు భీతిల్లక నిర్భయుడై దుష్టమృగములయందును శ్రీ దత్తస్వరూపమునే గాంచుచు, తుదకు పర్వతసానుప్రదేశములందలి తపోధనులం గాంచి, వారి యాశీర్వాదముల పొందుచు "నగాయత్యాః

పరంమంత్ర” మ్మనునట్లు గాయత్రీమంత్రమును జపించుచు, శ్రీదత్తధ్యానముచేయుచు పర్యటన సల్పెను.

అట్లు సంచరించుచుండ, నొకపరి ఐదు ఎలుగుబంట్లు వచ్చి గణపతిని దారుణమైన చూపులతో జూచెను. గణపతియు నాయెలుగు బంట్లను గాంచి “ భగవత్స్వరూపా, నాదేహము నిదివరకే మీకర్పించి యున్నాడను. రండు, ఏలసందేహించెదరు? ఈశరీరమును భక్షించి యాకలి దీర్చుకొం”డన, అవి యెట్టిహానియు నొనర్పక మరలిపోయెను “అహింసా ప్రతిష్ఠాయాం తత్సనిధౌ వైరత్యాగః” యని పాతంజలి మహర్షి యోగశాస్త్రమందు నుడివియున్నారు. అహింసా వ్రతసిద్ధి గలిగిన మహాత్ముల సన్నిధియందు తపోవనములలో పరస్పర వైరముగల జంతువులు సైతము మైత్రితో నుండెనని పూర్వ గ్రంథములు వర్ణించుచున్నవి.

ఒకొక్కపరి మృగరాజు గర్జనలతో పర్వతగుహాలు ప్రతిధ్వనించునట్లు మనబ్రహ్మచారి ఓంకారము నుచ్చరించుచుండును. వేదములకు మూలము ఓంకారమేగదా! శ్రుతులయందును ఓంకార ప్రాశస్త్యము ఇట్లు వర్ణింపబడియున్నది:

“ఓంకార ప్రభవా వేదా, ఓంకార ప్రభవా స్స్వరా,
ఓంకార ప్రభవస్సర్వం, త్రైలోక్యం సచరాచరం,
ప్రణవోహి పరబ్రహ్మ, ప్రణవం పరమం పదం;
ప్రణవస్సర్వవేదాద్యం, సర్వవేదమయం విదుః,
సర్వేషాం చైవ మంత్రాణాం ప్రణవం ప్రాణముచ్యతే.”

ఇట్లు కొంతకాలము యెండవానలకోర్చుచు, తపోనిష్ఠ యొనర్చుసరికి, మనబ్రహ్మచారి నేత్రములు తేజోవంతములై గుహా ప్రదేశమందలి చీకట్లను పోగొట్టజాలినవిగా నుండెను. ౧౮౯౭ వ సంవత్సరాంతమున గణపతి బదరికాశ్రమము చేరెను. అచ్చటనున్న యోగులు గణపతి బ్రహ్మచారికి లంబికా యోగము బోధించిరి.

అంత గణపతి శుకులవలె తనబుద్ధిబలముచేతనే ఆత్మ నెఱింగినప్పటికిని, గురువులేనివిద్య సాంప్రదాయము కాదని బ్రహ్మనిష్ఠుడైన గురువు నన్వేషింప నెంచెను. ఇప్పుడు ఉదరపోషణనిమిత్తము వేషములధరించువా రెందరో కలరుగదా! శ్రీ శంకరులును వేషధారు లనేకులుగలరని యానాటికే హెచ్చరించియున్నారు:—

> "జటిలో ముండీ లుంఛితకేశః
> కాషాయాంబర బహుకృతవేషః
> పశ్యన్నపిచ నపశ్యతి మూఢో
> హ్యుదరనిమిత్తో బహుకృతవేషః"

అట్లుగాక, మన గణపతి బ్రహ్మనిష్ఠ, శాంతము, సమదృష్టి, నిస్సంకల్పము గల సద్గురువు నన్వేషింప సంచారమొనర్చెను.

కొందఱు బ్రహ్మనిష్ఠుల గాంచినప్పుడు హేళనచేయుచు: "ఏను పెద్దలైన నీలోకముతో నేమిసంబంధ?" మని నోటికివచ్చి

వల్లు వదరుచుందురు. "జ్ఞానీత్వాత్మైవమే మత" మను గీతా వాక్యము వీరి చెవుల దూరదుగాబోలు! మన పుణ్యవశమున విజ్ఞానమునకు మూలాధారమైన భరతఖండము మనకు మాతృభూమియైనది. భారతీయుడగుటయే యొక యదృష్టము! మనపూర్వులెట్టి విజ్ఞానవిశారదులైరో మనచరిత్ర లుద్ఘోషించుచున్నవి. హిందూమత ప్రాశస్త్యమును మనము గుర్తించుటలేదు. మన మజ్ఞానడోలికల హాయిగ నిద్రించుచున్నాము గాని, మన గతియేమియని మహనీయుల దర్శనమొనర్చి మేల్కొనుటలేదు. పైగా వారిని దూషించి యసూయతో జూచుట పాడియా? భగవంతు డేమని చెప్పియున్నాడు? "నన్ను నిందించినను నేను క్షమింతును గాని, నాభక్తుని దూషించినను, కష్టముల పాలుజేసినను నే నోర్వను." దీనికి అంబరీషోపాఖ్యానము తార్కాణము.

గణపతి గురువు నన్వేషించుచు, క్రమక్రమముగా సంచరించుచు నొకయడవి మార్గమున వచ్చుచుండ, మార్గమధ్యమున నొకనదీప్రవాహమున కడ్డముగా నీది, యావలి గట్టు జేరి ప్రయాణము సాగించుచుండ, సాయంకాలమై చీకట్లు కోదసి అంతయు గ్రమ్మెను. చీకటికి తోడు నాకసము నలుదిక్కుల కారుమబ్బులుగమ్మి వర్షము కురియ నారంభించెను. గణపతి ఆవర్షమునకు తడియుచు, అంధకారమగ్న దుర్గమ ప్రాంతమున దారి తెలియక శ్రీ దత్తదేవుని ధ్యానించుచు

పోవుచుండ దారికడ్డముగా నొక కర్రను చేబూనిన యొక పొడు గుపాటి మనిషి గోచరుడయ్యెను. వానిని జూచి, గణపతి ధైర్యమును గోల్పోలేదు; వా డంత గణపతిని సమీపమున నుండు దొంగలగూడెమున తమనాయకునివద్దకు గొనిబోయి, నిలువబెట్టెను.

అప్పుడు మనబ్రహ్మచారి ఆపరిస్థితిని గమనించి, తాను దొంగలగూడెమం దుంటినని గ్రహించెను. దొంగలనాయ కుడు గణపతి వేషమును నిదానించిచూచి, తమ పోవిడి బయ టబెట్టు రహస్యదూతగా తలంచి, కత్తిచేబూని చంప నుద్యు క్తుడయ్యెను. అంత దత్తభగవాను నెడపక స్మరించు గణప తిని యీయాపదవస్థనుండి తప్పింపగలవా రెవరుందురు? అరణ్య మధ్యము-దొంగలచేతిలో బడుట! గణపతి శ్రీదత్తదేవునే నమ్మి యుండెను. ఆతని కేమియు దోపలేదు. ఆపన్నత్రాణ పరాయణ బిరుదాంకితుడగు శ్రీదత్తభగవంతు డప్పుడు తన భక్తాగ్రగణ్యుని రక్షింపకుండునా?

గణపతిని చంపనుద్యుక్తుడైన దొంగలనాయకుని కత్తి తళతళ మెఱయుచు గణపతిమెడపైకి పోవునంతలో నొక దివ్య తేజస్సు మెఱసినట్లయి దొంగలనాయకుని కన్నులు మూతపడి నవి. చేతినుండి కత్తి జాఱి క్రిందపడినది.

కొంతవడికి దొంగలనాయకుడు లేచి, తా నిడివఱకు

జేసిన మహాపాతకములకు పరితపించి, గణపతి పాదములకు ఫాలముసోక మ్రొక్కి, యిక దోపిడీపనులు చేయనని ప్రతిజ్ఞ జేసి మహాభక్తుడయ్యెను. గణపతియు సద్గుణము లతనికి బోధించి, తనమార్గమునుబట్టెను.

ఇప్పుడు గణపతిబ్రహ్మచారి స్వరూపమును వర్ణించుట కెవ్వరి తరము? అట్టిదివ్యస్వరూపము జూచిన నెట్టిపాపులైనను పుణ్యాత్ములు కాకుందురా? గణపతియొక్క బాహ్యశరీరము ధూళిధూసరితమై చూచుట కసహ్యముగా నుండెను. దీర్ఘ కాలము పర్వతగుహలయందు తపమాచరించుటవలన వెండ్రుకలు జటలుకట్టినవి. నఖములు పెరిగి వంకరలు తిరిగియుండినవి. యౌవన ముదయించుటవలన మీసములు గడ్డమును గలిగినవి. గణపతి జటాధారియై పరమశివునివలె తోచెను. జడలు యోగులకువలె శిరమున పైకి ముడివేయబడినందున సమస్తేంద్రియములను బంధించి తాను వాటిని నడుపువానివలె నుండెను. శరీరమునిండ పూయబడిన విభూతి వైరాగ్యమును దెలుపుచుండెను, వీరినేత్రములు తనలక్ష్యమునుండి మరలక, యనిమేషస్థితిని దాల్చి, అంతర్దృష్టిగలవియై యుండెను.

ఇట్టి యోగియైన మన బ్రహ్మచారి సంచరించుచు, దైవవశమున తనగ్రామమునకు వచ్చెను. ఆగ్రామవాసులు

గాని, చిన్నతనమునుండి పెంచిపెద్దజేసిన కన్నతల్లిగాని గణపతిని గుర్తింప నేరరైరి.

గణపతియు బ్రహ్మచర్యవ్రతనియమమైన మధూకరమును గ్రహించుచు, తనయింటికి పోయి, మాతృవందన మాచరించెను. మాతృదేవి "నాకు వందనమెందుకు చేయుచున్నా?"వన, "స్త్రీలందరు నాకు తల్లులు గనుక వందన మాచరించితి" నని చెప్పెను.

అంత గణపతి తాను వారిపుత్రుడనని తెలుపకయే సద్గురుసేవాపరతంత్రుడై దేశదేశముల సంచరించుచుండ, మార్గమధ్యమున నొకడు "స్వామీ! మీరు నాకు భగవత్స్వరూపులవలె గన్పట్టుచున్నారు. నేనును సద్గురుప్రాప్తికై తిరుగుచున్నాను. నన్ను మీశిష్యునిగా నంగీకరించిన నాజన్మము కృతార్థతజెందు"నని బ్రతిమాలుచు, గణపతి వెంటబడి వచ్చుచుండెను. తుట్టతుదను వీరిరువురు మధుర కంసవధ ఘట్టమునకు వచ్చి చేరిరి. అచ్చట యమునలో స్నానముజేసి గణపతి కొంతకాలము తపస్సుజేసెను. ఈశిష్యుడు గణపతి చేతి యందున్న అందమైన కంచుచెంబుమీదనే కన్ను వేయుచుండి, సమయమెప్పుడు వచ్చునాయని కనిపెట్టియుండెను.

ఒకనా డాశిష్యుడు గణపతిని గాంచి, "స్వామీ! నాకు కడుపునొప్పి బాధ యధికముగానున్నది. లేవజాలకున్నా"నని

యతి దీనముగా బలికెను. సహృదయుడగు గణపతి కంచుచెంబు, గుడ్డలమూట యచటనే యుంచి, "నీకడుపునొప్పి నివారణయగుటకు నే నంగడివీధికేగి వామును తెచ్చెద"నని చెప్పి విపణిమార్గమును బట్టెను. గణపతి కొన్నియడుగులు దాటి పోవగనే యాదొంగశిష్యుడు గణపతి సామానులన్నియు నెత్తుకొని పారిపోయెను.

అంత, గణపతి సద్గురు నన్వేషించుచు మార్గవశమున గరుడేశ్వరునమునకు వచ్చి, శ్రీవాసుదేవానంద సరస్వతీస్వామిని దర్శించెను. ఈసంచారకాలములో గణపతి మధుకరభిక్షు తెచ్చుకొని నదీతీరమున నుంచుకొని, యాయన్నమును కడిగి రసములేకుండ జేసి యాపిప్పిని భుజించుచుండెడివాడు.

---

# ఎనిమిదవ ప్రకరణము.

## —: శ్రీవాసుదేవానంద దర్శనము. :—

శ్రు॥ తద్విజ్ఞానార్థం శాంతోదాంత స్సగురు మేవాభి గచ్ఛే
త్సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం॥

పవిత్ర నర్మదానదీ తీరమున గరుడేశ్వరమను నొక

గ్రామముగలదు. అచటనున్న వనమందొక పర్ణశాలలో శ్రీదత్తాత్రేయ అపరావతారమని పేరొందిన శ్రీశ్రీవాసుదేవానంద సరస్వతీస్వాములవారు నివసించుచుండిరి. ఆస్థలమంతయు నేకాంతముగను నిర్మలముగను పవిత్రముగను నున్నది. పుత్రేచ్ఛగలిగియు వ్యాధినివారణకొఱకును కామ్యార్థులైయు ననేకులు శ్రీస్వాములవారిని దర్శింతురు. కామ్యకర్మలన్నియు క్షణికములనియు దుఃఖప్రదములనియు నెంచి, జ్ఞానార్థులై శ్రీవారి నాశ్రయించువారును లేకపోలేదు. అట్టివారిలో శ్రేష్ఠుడు గణపతియే!

శాశ్వత బ్రహ్మానందమును గోరియే, గణపతి శ్రీసరస్వతీస్వాముల నాశ్రయించెను. శ్రీసరస్వతీస్వామివారి తపశ్శక్తియు వైరాగ్యమును అద్వైతా పరోక్షజ్ఞానమును విద్వత్తును గణపతి నాకర్షించినవి. శిష్యవిత్తము నపహరించుగురువులు పెక్కుమందిగలరుగాని, హృత్తాపమునుబోగొట్టు వారరుదు:

శ్లో. గురవో బహవస్సంతి శిష్యవిత్తాపహారకాః
తమేకం దుర్లభం మన్యే శిష్యహృత్తాపహారకం.

ఎట్టివారి కట్టి గురువు లభించును; మతివలెనే గతిగదా! అట్లుగాక, గణపతి మోక్షాధికారిగాన హృత్తాపమునుబోగొట్టు గురువు ప్రాప్తించెను.

గణపతి ప్రశాంతచిత్తుడై యోర్పుతో చిరకాలము గురువును సేవింప నారంభించెను. సామాన్యుల కంత యోర్పు

గలదా? పోయినతోడనే గురువు దాచియుండిన జ్ఞానము పారవేయలేదే యని ఆతురత; ఆత్రగానికి బుద్ధిమట్టుగదా! తాను విద్యాధికుడను గర్వ మిసుమంతైనను లేక ఓర్పుగలిగి గురువును సేవించక పరబ్రహ్మానందము లభ్యముగాదు. ధనమిచ్చి కొందమనిన అంగడిలో దొరకదే! కాన, గురువును సేవించియే శాశ్వతానందమును పొందవలె; గత్యంతరములేదు.

మన బ్రహ్మచారి చిరకాలము గురువునకు పరిచర్య జేసి, వారి యనుగ్రహము బడసెను. గణపతి యొనర్చు శుశ్రూషలకు శ్రీసర్వతీస్వాములవా రానందపడి, గణపతికి శ్రీదత్తమహామంత్రమును, యోగమును, తదనుష్ఠాన క్రమమును బోధించిరి. గురూపదేశమును బొంది, గణపతి రాత్రింబవళ్లు తీవ్రతమమైన పట్టుదలతో మంత్రమును జపించుచు, యోగము నభ్యసించుచుండెను.

సాత్వికాహారమును భుజించిన మంచితేపులును, తామసాహారమును భుజించిన చెడ్డతేపులు వచ్చునని శ్రీసత్యానందస్వాములవారు పలుమారు సెలవిచ్చుచుందురు; వాస్తవమేగదా! సచ్చరిత్రమును జదివిన సద్భావములును, దుష్టచరిత్రమును జదివిన దుష్టభావములును గలుగును.

శ్రీవాసుదేవానందస్వామి ప్రఖ్యాత చరిత్రులు; తపోధనులు; వీరిది సావంతవాడి సంస్థానమునకు కొలదిదూరమున

మాణగాం అను గ్రామము. సావంతవాడీ సంస్థానము దక్షిణ హిందూస్థానములో మహారాష్ట్ర దేశమున కొంకణప్రాంతమున బొంబాయి రాజధానికి సంబంధించినది. మాణగాం నందు గణేశభట్టు అను నొక సంపన్న బ్రాహ్మణ గృహస్థు నివసించుచుండెను. ఆయన కనుకూలవతియైన రమాబాయి యను భార్యగలదు; వీరు ఋక్శాఖీయులు, ఆత్రేయసగోత్రులు, వీరి వృత్తి పౌరోహితము.

ఇట్టి పుణ్య దంపతులకు భారతవర్ష తపఃఫలమో యన శాలివాహనశకము ౧౭౭౬, ఆనందవత్సర శ్రావణబహుళపంచమీ శుభదినమున నొకశిశువు జనించెను. ఆశిశువునకు జననీ జనకులు వాసుదేవశాస్త్రియని పేరిడిరి.

వాసుదేవశాస్త్రి దినదిన ప్రవర్ధమానుడై సర్వశాస్త్రకోవిదుడను కీర్తి పదునేనవయేటనే పొందెను. ఋగ్వేదఘనపాఠియనియు, షోడశకర్మలు చేయించుటయందు మిక్కిలి సూక్ష్మబుద్ధిగలవాడనియు మెప్పువడసెను.

వీరికి సమస్తకావ్యములు, ఋగ్వేదము నాసాంతముగా జెప్పిన యుపాధ్యాయులు 'విష్ణుభట్టు ఉకడివే' యనువారు. వాసుదేవశాస్త్రి ౧౨వ యేటనే గురుకులవాసముజేసి, మధుకర వృత్తిం బూని, సమస్తశాస్త్రములయందఖండ పండితుడై, యుపాధ్యాయుని ఆశీర్వాదంబుల బడసెను. పదునేనవ యేట

నుండియే సజ్జనసాంగత్యము గలిగి, సరసమృదువచనామృత ధారల నందఱ పరవశుల జేయునట్లు శ్రీదత్తపురాణ కాలక్షేపము జేయుచు, వేదవేదాంతోపన్యాసముల నతి గంభీరముగా నిచ్చుచుండెను. ఆహా! ఇంతటి చిఱుతప్రాయముననే (పదునేనవయేటనే) ఇట్టి జ్ఞానవిజ్ఞానముల ఖనియై యుండుట సామాన్యమా!

వాసుదేవశాస్త్రి తనయిష్టదైవమగు శ్రీదత్తాత్రేయ గురుచరిత్రమును భక్తిపూరిత స్వాంతుడై గానముజేయుచు, నిత్య మొకసంవత్సరము పారాయణసేయ, శ్రీదత్తదేవుడు స్వప్నంబున ప్రత్యక్షమై "బిడ్డా! నీవు కొలహాపూరు ప్రాంతమందలి నరసోబావాడిలో నివసించుచున్న శ్రీగోవిందస్వామి వద్ద శ్రీదత్తమహామంత్రము నుపదేశమొందు"మని యాజ్ఞాపించెను. తక్షణమే వాసుదేవపండితుడు కాలినడకను నరసోబావాడింజేరి శ్రీగోవిందస్వామిని దర్శించెను. శ్రీగోవిందస్వామియు శాస్త్రిగారిభక్తిని జూచి, యచిరకాలముననే శ్రీదత్తమంత్రమును యోగమును ఉపదేశించెను.

అంతట శాస్త్రిగారు తనగురువునకు సేవలొనర్చుచుండి వారియాజ్ఞనుగొని యిరువదవయేట గృహస్థాశ్రమమును స్వీకరించెను. శాస్త్రిగారి భార్యపేరు అన్నపూర్ణాభాయి. ఈమె భర్తయాజ్ఞను జవదాటని మహాపతివ్రత. ఈకనబడుప్రపంచము తమవల్లనే జరుగుచున్నదనియు, తామే కర్తలమనియు తలచు

సామాన్యులవలెగాక, యీపూజ్యదంపతులు అహంకార రహితులై కుమ్మరపుర్వువలె దేనినినంటక గృహస్థాశ్రమకార్యములను నెరవేర్చుచుండిరి.

అవధూత శ్రీసత్యానందస్వాములవారు శ్రీభగవాన్ రమణమహర్షులవారి శిష్యులు. ప్రస్తుతము వీరు నెల్లూరుజిల్లా కోవూరుతాలూకా, ఇనమడుగు గ్రామసమీపమునందు గ్రామవాస్తవ్యుడగు నల్లపరెడ్డి వేంకటరామిరెడ్డి అనునొక భక్తుడు యీశ్రమమును నిర్మింప, దానియందు నివసించుచున్నారు. చాలామంది వారి సన్నిధికి వచ్చుచు పోవుచుందురు. వారు, కర్మల నెట్లాచరింపవలయునను నంశమునుగూర్చి మాట్లాడుసందర్భమున- చాలబరువు మోయు రైలులో ప్రయాణముచేయువారు తమసామగ్రిని రైలుబండిలో తమ ప్రక్కనగాని, సామానులకు ప్రత్యేకముగా నమర్చబడిన బల్ల మీదగాని యుంచక తమతలపైన బెట్టుకొని బాధపడువారెంత వెర్రివారలో యట్లే సర్వబాధ్యతలను సర్వభారములను భగవంతునిపై వేయక తమతలపైన బెట్టుకొని (కర్తృత్వము వహించి) తామే మోయుచున్నామను వారును అంతవెర్రివారలని తమగురువులైన శ్రీభగవాన్ రమణమహర్షులవారు చెప్పినట్లు నాకు సెలవిచ్చిరి.

అంతట వాసుదేవ పండితుడు గురూపదేశానుసారముగా యోగానుష్ఠానము జేయునప్పుడు సందేహ పరంపరలచే

డోలాయమానసుడై దిగులువడియుండ, "నీగ్రామమునకు సమీపమున నున్న కరణముగారి దగ్గరకుపో" యను శబ్దము వినవచ్చెను. మొదట యది భ్రమయని తలచెనుగాని, మరల మరల యదేశబ్దము వినబడుటచే యొకనాడు బయలుదేరి, కరణము గారిల్లుజేరి, కరణముతో: "అయ్యా, నాసందేహముల దీర్పు"మని యడిగెను. అంత కరణము నివ్వెరపడి "నాకంటే నీవెంతయో గొప్ప వాడవు. నీసందేహనివృత్తి నేను జేయగలనా? వేదాంతవాసన యే మూలనున్నదో నాకు తెలియదు. నావద్ద శిసు లెఖ్ఖపుస్తకములున్నవికాని, వేదాంతగ్రంథ మొక్కటియైనలే"దనెను. అంతట విఫలమనోరథుడై పండితుడిల్లుజేరెను.

మరల యాకరణమువద్దకే యేగుమని దివ్యవాణి వినబడెను. పండితు డనేకపర్యాయములు తిరుగగా, నాకరణము విసికి "అయ్యా, మాపెద్దలు తాటాకుపై వ్రాసిన వేదాంత గ్రంథములు చెదలుబట్టి అటకపైన నున్నవ"ని యాకవిలెలను నెమ్మదిగా దించి, చెదలు విదల్చి, పండితునెదుట వైచెను. పండితుడు వాటిని జూచి యాశ్చర్యపడి, వాటిలోనున్న విషయముల గ్రహించి, తన సంశయ నివారణ మొనర్చుకొని, యాగ్రంథముల నుద్ధరించెను.

ఒకనాడు వాసుదేవశాస్త్రి సరసోబావాడినుండి తన స్వగ్రామమునకు వచ్చుచుండ, శ్రీదత్తాత్రేయ ప్రతిష్ఠ గా

వింప సంకల్పముదయించెను. తన సంకల్పసిద్ధికి శ్రీదత్తమూర్తి గినే నమ్మియుండెను. శాస్త్రిగారి సంకల్పము బలవత్తరము కాగా యచిరకాలములోనే యొక శిల్పి తాను స్వయముగా నిర్మించిన శ్రీదత్తవిగ్రహమును తీసికొనివచ్చి, పండితునక ర్పించి "స్వామీ! ఇదే దత్తవిగ్రహ"మని చెప్పి యూర కుండెను.

పండితు డంత, "నాయనా! నీదేయూరు? నీవెంతటి భక్తుడవు? నేనిక్కడుండుట నీకెట్లెఱిగితివి? అన; శిల్పి కొంతసేపు ధ్యానించి, కన్నులు దెఱచి, "స్వామీ! నేనొక శిల్పిని. 'కాగలుగాం'యను నూర నుండువాడను. నాకు రాత్రి స్వప్నంబున శ్రీదత్తదేవుడు ప్రత్యక్షమై "మీరు శ్రీదత్తప్రతిష్ఠ జేయుసంకల్పించితిరనియు, యీవిగ్రహమును మీకిమ్మనియు యాజ్ఞాపించి యంతర్హితుడాయె"నని చెప్పెను. అంతట పండితుడు శిల్పిని కొనియాడి, బహుమానముగా కొంత ధనము నిచ్చిపంపెను.

ఆవిగ్రహమును తన స్వగ్రామమున స్వభాను సంవత్సర వైశాఖ బ౧౧లు, శుభ లగ్నమున పెద్దలసమ్ముఖమున ప్రతిష్ఠించెను. ఆనాడు భజనలు వుత్సవములు సాధుసంతర్పణలతి వైభవముతో జరిగినవి. మంగళవాద్యములు మ్రోగినవి. ప్రతిష్ఠయైనతర్వాత శ్రీదత్తమూర్తి కోటిసూర్యప్రభాభాసమానమైన కాంతిపుంజములతో చూపఱుల కద్భుతజన

కుడుగా నుండి, తన్నార్తుడై పిలుచువారికి 'ఓ!'యని పలు కువాడుగానుండెను. అప్పటినుండియు శ్రీదత్తపూజను పండి తుడు స్వయముగా నతిభక్తిశ్రద్ధలతో వేళనతిక్రమించక నెఱ వేర్చుచుండెను.

పీరిది పౌరోహితవృత్తి యని యిదివఱకే జదివియుంటి మిగదా! శాస్త్రిగా రొకదినమున తనబంధువుల నిర్బంధము చే పౌరోహితకృత్యమును నిర్వర్తించుటకు గ్రామాంతరమున కు వెళ్ళవలసివచ్చెను. ఇచ్చట "దత్తపూజ నెట్లితరుల కప్పగిం తునా!"యని చింతించి, తుట్టతుదకొక బ్రాహ్మణునితో "రేపు శ్రీదత్తాత్రేయ పూజ నాచరింపు"మన, యాత డందులకు సమ్మతించెను. కాని, యానాడు వర్షాటంకముచే శ్రీదత్తమం దిరమునకు ఆతను కాలుసాగించినవాడు కాడు.

పండితుడు గ్రామాంతరమునకేగి, తనకార్యమును పూ ర్తిజేసి, భోజనమునకై విస్తరిముందు కూర్చుండగా "నన్ను పస్తుబెట్టి నీవు భుజింప నుంకించుచుంటివా!" యను శబ్దము విన వచ్చెను. అంత పండితుడు భుజింపకయే, తనగ్రామమునకువచ్చి శ్రీదత్తదేవునకా బ్రాహ్మణుడు పూజానైవేద్యాదుల సమ ర్పింపలేదనియు, తనకు వినబడిన వాణినిశ్చయమే యనియు గ్రహించి యాశ్చర్యముంజెంది, వెంటనే యానాటికి ప్రా యశ్చిత్తాదిక విధుల నొనర్చి, శ్రీదత్తస్వామిని క్షమాపణవేడి

పూజించెను. ఆ బ్రాహ్మణుని నొక పరుషవాక్యమైన పలుకక, తనపొరపాటని పండితుఁ డూరకుండెను.

శ్రీగురుదత్త సరస్వతీయ*మను గ్రంథమునందు "వాసుదేవానంద సరస్వతీయ"మను శీర్షిక క్రింద, శ్రీవాసుదేవశాస్త్రిగారి యద్భుతజ్ఞానబోధనాపటిమను, మహిమను గూర్చి యిట్లు వ్రాయబడియున్నది: "ఆర్తులయి తనను జేరినవారికి భవితవ్యం బెఱిగించి, పీడానివారణోపాయంబులం దెల్పుచుండెను. ఆధిబాధితులను మంత్రయంత్రసాధనంబుల వల్ల గడ తేర్చుచుండెను. వ్యాధిపీడితులను సుకరభైషజ్యపథంబులం ద్రొక్కించి గట్టెక్కించుచుండెను. కర్మాసక్తులచే వైశ్వదేవాది కర్మంబు లనుష్ఠింపఁ జేయుచుండెను. ఉపాసనాభిలాషులకు సుసిద్ధ మంత్రరాజంబుల నుపదేశించి, పునశ్చరణం బొనర్పించుచుండెను. యోగమార్గాపేక్షకుల సమాధినిష గలుగ షట్క్రియాసహిత ప్రాణాయామ పురస్సర ఖేచరీ లంబికాది సాధనంబులం గఱపుచుండెను. ముముక్షువులకు బ్రస్థానత్రియము భామతీ గౌడబ్రహ్మానందీయము మున్నగు సద్గ్రంథములందలి గూఢార్థంబెల్ల గరతలామలకంబు గావించుచుండెను*.

ఇట్లు గృహస్థాశ్రమమునందే లోకమునకు మార్గదర్శకుడై, సమస్త యోగములందును సిద్ధిపడసి జ్ఞానబోధకుడై యుండ, శాస్త్రిగారి కొకశిశువు జనించి, కొంతకాలము మని,

పరిణమించెను. శాస్త్రిగారు పుత్రమరణమున కొక్కింతయైనను చింతింపక, ప్రసన్నులై యుండిరి. అయితే, అన్నపూర్ణా భాయి పుత్రశోకమును భరింపలేక కృశించి యస్థిపంజరప్రాయురాలయ్యెను. ఆమెకు మనశ్శాంతిగలిగింప వైరాగ్యోపదేశంబుల జేయగోరి, తీర్థయాత్రల కామెను గొంపోయి, పవిత్రదేవతాదర్శనముల జేయించుచు, భక్తిజ్ఞానవైరాగ్యాదు లామెకు బోధించుచు, విజ్ఞానోదయము గలుగజేసి, "ఎందరికి నీవు తల్లివైతివో? ఎన్ని జన్మలు నీకు గలిగెనో? యోజించుకొమ్మ"ని బోధించుచు, భార్యాసహితులై పండరీపురమున పండరినాథుని దర్శించి, గోదావరీతీరమున నున్న గంగాఖేడునకు వచ్చిచేరిరి. అచ్చట భగవానుడు శాస్త్రిగారికి బంధవిముక్తి జేయ నెంచెనో యున్నట్లు అన్నపూర్ణాంబ పరలోకగతురాలయ్యెను. అందువలన పండితు డొక్కింతయైనను చింతింపక, యామెకు యంత్యక్రియ లాచరించెను.

అంతట శాస్త్రిగారు చరమాశ్రమ స్వీకార మొనర్ప దలంచి, యుజ్జయిని కేగి, యచట నారాయణానంద సరస్వతీస్వామికడ సన్న్యాసంబు స్వీకరించిరి. గురువుగారు వాసుదేవపండితునకు ప్రణవమహామంత్రము నుపదేశించి, శ్రీవాసుదేవానందసరస్వతీస్వామి యని నూతన నామమిడిరి.

వీరు సంస్కృతభాషయం దసమానపాండిత్యము గలవారు. శ్రీవాసుదేవ యతీంద్రుల గ్రంథరచనను గూర్చి శ్రీగురుసర

స్వతీయమను గ్రంథములో నిట్లు వ్రాయబడియున్నది: "దారకలో ద్విసహస్రీ గురుచరిత్రవ్యాఖ్యానమును, ఉజ్జయినిలో మహారాష్ట్రభాషా దత్త మాహాత్మ్యంబును, సంస్కృత దత్త పురాణమును; బ్రహ్మావర్తనమున పూర్ణశ్లోకమగు గంగానిలో మన యీమూలగ్రంథమగు గురుసంహితను, బిదప కావేరీ తీరస్థిత సంధ్యామంటపమున ఁదచ్చూర్ణికయు నిర్వరచించిరి. తత్కృతములింక కుమారీశిక్షా కృష్ణాలహర్యాదులగు మనోహర శ్లోకఘటితములును బ్రహ్మసూత్రవృత్త్యాది ప్రౌఢవ్యాఖ్యానములునుం గలవు. పేక్కేల? తత్కృతంబైన బహుదేవతా మంత్రగర్భిత దత్తాత్రేయాష్టోత్తరశతనామ స్తోత్రం బొక్కటియే తత్ప్రతిభావిశేషంబును సహస్రముఖంబుల దెల్ప జాలెడిని."

శ్రీవాసుదేవానందస్వామి భారతదేశములోని గంగా యమునా సింధు బ్రహ్మపుత్రా నర్మదా గోదావరీ కృష్ణా కావేరీ మొదలగుపుణ్యనదులకు జన్మస్థానము మొదలు సాగరసంగమము వరకు ప్రదక్షిణ మొనర్చిరి. ఈయాత్రలయందు దన్నిరాష్ట్రములఁ సంచరించుచు, తమ యోగమహిమవలన నార్తులను రక్షించుచుండిరి.

# త్రొమ్మిదవ ప్రకరణము.

## —: శ్రీ దత్తాత్రేయ సాక్షాత్కారము :—

(భగవదుపాసన)

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ
అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః
—గీత

శ్రీవాసుదేవ యతీంద్రుల యుపదేశము శ్రోత్ర పుటములకు సోకినవెంటనే భక్త్యావేశముతో గణపతిబ్రహ్మచారి. శ్రీదత్తాలయమునకు పర్విడి, పరిపూర్ణవిశ్వాసముతో నిశ్చలమైన నిష్కల్మషమైన భక్తిస్వాంతముతో శ్రీదత్తదేవుని ప్రార్థింపజొచ్చెను.

మహాత్ములచే ప్రతిష్ఠింపబడిన యేవిగ్రహమునందైనను చైతన్యశక్తి సంపూర్ణముగనుండును; పామరు లావిగ్రహమును జడమైనరాతిప్రతిమయనియు, శిల్పులచేతి సుత్తె దెబ్బలు తినినదనియు నెంచి, నిరసనభావము జూపుదురు. కాని మనబ్రహ్మచారి పరిపూర్ణవిశ్వాసముతో చైతన్యస్వరూపుడగు నాదత్తదేవుని మోక్షార్థియై సేవించెను. ఇచ్చట గణపతి యొక్క భగవద్భక్తి వర్ణనాతీతము! భగవదానంద నిమగ్నుడై బాహ్యస్మృతిలేశమేనియు లేక, దినములకొలది సమాధినిమ

గ్నుడై యుండుటంబట్టి ఆహారమునుగూడ గ్రైకొనుట మరచి యుండెను.

మరికొన్ని సమయములయందు గణపతి గొంతెత్తి బిగ్గరగా: "హేదత్తగురో! సంసారార్ణవమున మునుంగు నాకు చేయూతనొసగి, శాంతిని గలుగజేయుము; మృత్యుముఖమున బడుదునను భీతిని నివారింపజేయుము" అని కన్నులవెంట నశ్రుధారలు పార నేడ్చుచుండును. ఒక్కొక్కపరి నవ్వుచుం డును. శ్రీదత్తమూర్తి విరహబాధాపీడితుడై రామదాసు వలె "హేజగద్గురో! పూర్వము రాజాధిరాజులకు మోక్ష మిచ్చితివిగదా! ప్రహ్లాదాదులకు యోగమార్గము దెల్పి సం సారపాశముల ద్రెంచివైచితివిగదా! ఇప్పుడు నన్నుద్ధరింప కున్న నీచారిత్రమే యనృతమని తలచెద"నని నిష్ఠురోక్తు లాడు చుండును. ఇట్లు అన్నాహారములుమాని, కఠోరదీక్షతో శ్రీదత్తదేవుని సేవింప, శరీరారోగ్యముచెడి గణపతి శరీరము శుష్కించెను.

అయితే, బ్రహ్మచారి నానాటికి ప్రపంచవిముఖుడై మానమునందాక్రాంకితుడు కాజొచ్చెను. ఈత డింత కఠోరసాధ నల నొనర్చుచున్నను, భగవంతుడు ప్రత్యక్షము కానికతన, "ప్రభో! నీవు సర్వవ్యాపకుడవనియు, సర్వాంతర్యామివనియు సర్వభూతమయుండవనియు, నిన్ను భజించువారు సద్గతి పొందు

దురనియు, నీభక్తుల నీవే పరిపాలింతువనియు, 'నమే భక్తః ప్రణశ్యతి' 'నాభక్తు డెన్నటికి నశించడని' నీవొనర్చిన ప్రతిజ్ఞయందు దృఢనమ్మకముంచి, నిన్ను సేవించు నాకేల గోచరుండవు కాకయున్నావు? నీవు యోగులందును, నీ యేకాంత భక్తులందును యున్నాడవనియు, నీవు విగ్రహమునందు ప్రతిప్రాణకళలతో యొప్పుచున్నావనియు, నిశ్చయముగా నమ్మి, భజించు నాపై నీకేల దయరాదు? వాస్తవముగా నీవంతటను నిండియున్నావా? అట్లైన నాయెడల నేల నాలకింపవు? ” అని దీనాలాపములతో భక్తివిలాపమును బొందును.

హే దత్తగురో! జీవితమా? బుద్బుదప్రాయము; కాలమా? పరుగెత్తుచున్నది; ఆయుష్యమా? యతిస్వల్పము- ఓటికుండలోని నీటివలె కారిపోవుచున్నది. ఇట్టి స్వల్పకాలములో నీసన్నిధిభాగ్యము లభింపకయే యొక్కొక్క దినము గడచిపోవుచున్నదే! పోయిన దినములు మరల నెప్పటికి రావుగదా మహాపురుషా! ఇట్లు ఇన్ని దినములు వ్యర్థమై నీదర్శనభాగ్యము కలుగకపోయిన నాజన్మమెందులకు కాల్పనా? ” యని హృదయవేదనాభరముచే బిగ్గ పెట్టున విలపించును. గణపతి కన్ను లెడ తెంపులేక ప్రవహించు దుఃఖాశ్రువులచే వాచియుండెను.

కొంద రీజన్మలో భగవత్సాక్షాత్కారము కలుగకున్న మరొకజన్మ గలదుగదా యని సోమరులై పలికెదరు. ఈక్షణ

మంచే ధన్యుఁడుగావలెనని తీవ్రదీక్షతో సాధనసల్పననే యనే కజన్మలు పట్టుట యటుండ, ఈజన్మ కాకున్న మరొకజన్మయని నుడువు తమోభూయిష్ఠులగు వారెన్నిజన్మలెత్తినను పరమేశ్వరుని పొందలేరు. ఈవిషయమును గూర్చియే శ్రీరామకృష్ణ పరమహంస యిట్లు చెప్పియున్నారు:—

***' Why this attitude of an idler, that if realisation is not possible in this birth, it will come in the next-! There should not be such dullness in devotion The goal can never be reached unless one makes his mind strong and, firmly believes that he must realise in this very birth, nay, this very moment!"***

గణపతి యీజన్మమందే ధన్యుఁడు కాఁగోరి, పరితపించుచు కఠినదీక్షచే నహోరాత్రము లాహారనిద్రలు మాని సాధన సల్పెను. అందువలన నీతని వక్షస్థలము కందియుండెను; కంఠ్రొబారి యుండెను.

ఒకనాఁడు గణపతి యిఁక శ్రీదత్తవిరహ మెంతమాత్రమును సహింపఁజాలక "నాకీదినమున శ్రీదత్తాత్రేయదర్శనము కాదేని; యీశరీరముతో నేమి యుపయోగము! ఈశరీరమును విడచివేసెదనని తీర్మానించుకొని, శ్రీదత్తమూర్తి కెదురుగా కూర్చుండి, "భక్తవరదా! ఈభక్తుని కడసారి ప్రార్థన నంగీకరింపవా! నిన్ను కామ్యచిత్తులవలె నశ్వరపదార్థములగాని, ప్రాపంచికతుచ్ఛసౌఖ్యములగాని కోరితినా! నేను కోరునదంత

యు నీదివ్యదర్శనమే!" యని పిచ్చివానివలె నేలపై పొర్లుచు కంటివెంట నశ్రుధార లెడతెంపులేక ప్రవహించుచుండ, క్రమముగ స్మృహతప్పి క్రిందపడిపోయెను.

అంత నొకింత సేపటికి మరల లేచి, "దీనబంధూ! నీదర్శనము నాకీజన్మలో లేకపోయిన, నిన్నే స్మరించుచు నాశరీరమును పవిత్రనర్మదానది కర్పణము గావించెదను, నీ సన్నిధానమున నిన్ని నాళ్లుండియు నామనోరథ మీడేరలేదుగదా! ఇక యీ దేహమును విడిచియైన నిన్ను జేరెద"నని విగ్రహము వంక తిరిగి తిరిగి జూచుచు, వాయువేగమున పరువెత్తి తనదేహము తనకు తెలియకనే గభాలున నదిలో దుముకబోగా, నాతని కరం బెవరో గ్రహించినట్లుండి "వత్సా! తెంపుసేయకుము. "శరీరమాద్యం ఖలు ధర్మసాధన"మ్మను శబ్దము వినబడి, మెరుపుమెరసిన చందంబున నొక తేజము పొడసూపెను. అదియేగదా శ్రీదత్తసాక్షాత్కారము!

ఆమాటలు తనహృదయమున సందడింప, నా దివ్యతేజమును జూచిన కన్నులతో నీమాయాప్రపంచమును జూడజాలక కన్నులట్లే మూసికొని, ధ్యాన నిమగ్నుడై యుండి, భగవదాదేశము ననుసరించుట యుక్తంబని నిశ్చయించి కన్నులు దెఱచునప్పటికి సర్వపదార్థములు- రాళ్లు, గుట్టలు, చెట్లు మొదలగునవన్నియు శ్రీదత్తమూర్తిస్వరూపముగా కనపడ

జొచ్చెను. అప్పుడు 'సర్వం దత్తమయంజగత్'ని ధ్యానించెను. గణపతి శ్రీదత్తదర్శనము కాకపూర్వము దత్తవిగ్రహమునందే భగవంతుడు కలడని, ఖండోపాసన జేయుచుండెను; ఇప్పుడో! సర్వము చైతన్యమయమైన దత్తాత్రేయాఖండాకారము సర్వమయమైయుండుటం గాంచి, సర్వమయు డీశ్వరుడని యనుభవముచే గ్రహించి, శాంతినిబొందెను. నేత్రములు మూసినను, విప్పినను, శ్రీదత్తాకారమే! ప్రపంచవాసనలు గణపతి నాశ్రయించిన యిక ఫలములేదని తమంతటతామే వీడిపోయినవి.

లోకమున కొందరు "మనము గణపతివలె భగవంతుని గనుగొనగలమా!" యని నిరుత్సాహపడుచుందురు. గణపతి వలె తీవ్రవైరాగ్యము, ఘోరసాధన గలిగియున్న భగవదనుగ్రహము తప్పక గలుగును. ఇం దేమాత్రము సంకోచమునకు తావులేదు. త్యాగముగల వాని కాధ్యాత్మిక విషయమై సాధింపరాని దేముండును? అయితే, లోకమున సామాన్యముగా మానవుని మనస్సు తుచ్ఛభోగములపై పరుగిడుచుండును. ఆభోగములు జీవులకు దుఃఖమును గలిగించునేగాని, శాశ్వతసుఖము నివ్వజాలవు. అమరసుఖము నివ్వజాలినది భగవత్సాక్షాత్కారమే!

కావున, మానవతనువు ధరించిన ప్రతివాడును భోగాపన్నుడుగాక, తీవ్రమోక్షేచ్ఛ గలిగి, ప్రయత్నము సల్పుట

ముఖ్యకర్తవ్యము. దుఃఖతప్తులగు ఓమానవసోదరులారా! లెండు! "ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత!" యను కఠోపనిషత్ప్రబోధము వినుడు! భగవదనుగ్రహమును పొందుటకై సాధనలు బూనుడు! త్వరపడుడు! నిద్రించుటకిది సమయముగాదు. జీవితమా? చిగురుటాకుపై మంచుబిందువంటిది. దీనినే తామరాకుపై నీటిబిందువువలె చలించునని శంకరులు తెల్పియున్నారు:—

"నళినీదళ గత జల మతితరళం
తద్వజ్జీవిత మతిశయ చపలం.
విద్ధి వ్యాధ్యభిమాన గ్రస్తం
లోకం శోకహతం చ సమస్తం."

కాలమా? పరుగెత్తుచున్నది; ఆయుష్యమా? యతి స్వల్పము- భిన్నఘటమందలి జలమువలె యాయుష్కాలము కారిపోవుచున్నది; వార్ధక్యమా? బెబ్బులివలె మనపై దుముకుచున్నది; రోగములా? వైరులవలె శరీరమును భుజించుచున్నవి:—

"వ్యాఘ్రీవ తిష్ఠతి జరా పరితర్జయన్తీ,
రోగాశ్చ శత్రవఇవ ప్రహరన్తి దేహం,
ఆయుః పరిస్రవతి భిన్నఘటాదివామ్భో,
లోకస్త దప్య హితమాచరతీతి చిత్రమ్."

పరమేశ్వరుడు మనకు చాల సమీపమున నున్నను తుచ్ఛకోరికలు గోడవలె మనదృష్టి నవరోధించినందున, మన

మాయనను కనలేకున్నాము. గర్భద్వారమందలి శ్రీదత్త విగ్రహము నెందరు చూచుటలేదు? అట చిన్న రాతి విగ్రహము తప్ప వారేమియు చూడజాలరు. కోటలుదాటు శుష్కాడంబరవాక్యములతో విశ్వమంతయు నిండియున్నదిగాని, అనుష్ఠానము మాత్రము సున్న.

కొందరు మోక్షమును పొందగోరి దినమంతయు క్షుద్రకర్మల నొనర్చుటలో గడపి, యొకగంటయో, యరగంటయో మాలగూర్చుండి, జపమాలత్రిప్పుచు, యింకను భగవత్సాక్షాత్కారము గలుగలేదే? యని గొణుగుచుందురు. దినమునకు ౧౮ గంటలు భగవద్ధ్యానమునందు గడపినవాడు తరించునని శ్రీరామకృష్ణపరమహంస చెప్పియున్నారు. మనస్సు లక్ష్యమందుంచిననే గదా మనోలయమగును! విత్తనమును నాటి పండ్లు తినవలెనన్న ప్రయోజనమేమి? ఐహికవిషయములకే యోర్పు కావలసియున్న ఆముష్మిక సౌఖ్యమున కెంత తితిక్ష కావలెనో పాఠకులే యోచించెదరు గాక.

# పదియవ ప్రకరణము.

## —: శృంగేరీ నివాసము - కష్టములు :—

'బుద్ధి ప్రసాదాచ్చ శివప్రసాదా,
ద్గురుప్రసాదా త్పురుషస్య ముక్తిః'

శ్రీదత్తాత్రేయదర్శన మైనదాది శ్రీవాసుదేవానంద సరస్వతీస్వాములవారు గణపతిపై యెక్కువ వాత్సల్య ముంచు చుండిరి. గణపతియందు శ్రీదత్తదేవుడు మూర్తీభవించి యుండుటగాంచి, యత్యాశ్చర్య నిమగ్నమానసులగు చుండిరి. గణపతిబ్రహ్మచారి యొక్క సాధుత్వము, నమ్రత, కుశాగ్రబుద్ధి, శాంత శమ దమాదిసద్గుణములకు మెచ్చుకొని, శ్రీసరస్వతీస్వామి యొకదినమున గణపతితో ముచ్చటించుచు, "గణపతీ! నీభవిష్యత్తునుగూర్చి చెప్పెద"నని, యిట్లు చెప్పనారంభించిరి:- "నీవు కొలదికాలమున కొక విద్యాలయమును ప్రతిష్ఠింతువు. నీకు వాక్సిద్ధిగలుగ నీమాటయనిన ప్రజలందరు భగవద్వాక్యమువలె పాటించి, శిరసావహించి సంపూర్ణముగా నెరవేర్చెదరు." ఈవిషయమును గణపతి సన్యసించినతర్వాత బాపట్లలో శంకరవిద్యాలయ స్థాపనప్రశంసా సందర్భమున, ౧౯౧౭ ఆగష్టు ౧౧ వ తేదిన "మాగురువుగారిదివరకే శంకర విద్యాలయమును ప్రతిష్ఠింతువని సెలవిచ్చియున్నారు. ఆ

వాక్యము లిప్పుడు సఫలమైన"వని యుపన్యసించిరి.

ఇట్లుండ నొకనాడు శ్రీవాసుదేవానంద సరస్వతీస్వాములవారు గణపతిని దగ్గఱకు బిలచి, "జగద్గురువును సాక్షాచ్చివస్వరూపులును నైన శ్రీశృంగగిరి పీఠాధీశ్వరులగు శ్రీనృసింహ భారతీస్వాములవారి వద్ద కేగు"మని యాజ్ఞనిచ్చిరి. ఆ యాజ్ఞ నౌదలధరించి, గణపతి తన యిరువదిరెండవయేట బయలుదేరి కాలినడకన యెన్నియో కష్టములకోర్చి శృంగేరి చేరెను.

కొందరు చపలమనస్కులై గబుక్కున బ్రహ్మానందమును మ్రింగదలతురు. గౌరవముగా తమకున్నదానిలో తృణమో పణమో గురువునకిచ్చి బ్రహ్మానందమును తమ నోడిలో వేయమని మఱికొందరు కోరుదురు. స్థిరమైనభక్తియా? యుండదు! మఱికొందరు వేదాంతపుముక్కలరెండు నేర్చుకొని, పెద్దలతో తార్కికవాదములు సేయప్రారంభింపగా, వారు మౌనమును వహింతురు. తనకు ప్రత్యుత్తరము చెప్పలేకపోయిరని నలుగురితో గురుదూషణజేయుచు, వారియందు దోషారోపణ గావించి, విరోధము వహించి వేరొకని యాశ్రయింతురు. వీరినే గురుద్రోహులని శాస్త్రములు శపించుచున్నవి. గణపతియు వేరొకగురువు నాశ్రయించెను గదా? యని పాఠకులు సంకోచింపవచ్చును. అయితే గణ

పతి శ్రీ వాసుదేవానందప్రభువులాజ్ఞఁ గొని మ్లేచ్ఛలోకప్రభువు నాశ్రయించెను. ఇది శాస్త్రసమ్మతము; ప్రమాణమున్ను.

మన బ్రహ్మచారి మహారాష్ట్ర బ్రాహ్మణుడగాన; శృంగేరియందు జగద్గురు దర్శనముగాని, మఠమునందు ప్రవేశముగాని కలుగలేదు. తేనెతుట్టెను ముట్టియున్న తేనెటీగలవలె స్వార్థాభిలాషులగు బ్రాహ్మణులు శృంగేరీపీఠమును జుట్టియుండిరి. అసూయాగ్రస్తులగు నా బ్రాహ్మణులు గణపతిని అన్యరాష్ట్రీయుడనియు, అన్యవేషభాషలుగలవాడనియు నెంచి, మఠమున జగద్గురు దర్శనమునకు నవకాశము గలుగ నిచ్చినవారు కారైరి. మరియు మనబ్రహ్మచారి బ్రాహ్మణుడు కాడని నిందించి, శృంగేరిసత్ర సమీపమునకు చేరనివ్వకుండుటయేగాక, యది యేమి పగయోగాని, యాయగ్రహారములో గృహస్థులయిండ్ల గణపతికి మధుకరభిక్షసైతము దొరక నిచ్చిన వారుకారు. తుట్టతుదకు జగద్గురు దర్శన భాగ్యమైనను గలుగనీయరైరి.

అంత గణపతి శృంగేరిసమీపమున నున్న తుంగభద్రానదిని యీది, యావలితీరముననున్న యడవిం జేరెను. ఆయడవి క్రూరమృగభూయిష్ఠమై యుండెను. నిర్జనమైనదగుటచే నేకాంతమును గోరు గణపతి కది ధ్యానయోగ్యముగాఁ దోఁచెను; భైరవీదేవాలయ మొకటి యాయరణ్యమధ్యమున గలదు.

అచట మన గణపతి తపం బొనర్చెను. తీవ్రధ్యానమున నున్న
కుంకుమ సన్నిభప్రభతో లలాటమున చక్రాకార రేఖల దీర్చుచుం
డెను. దీనిని జూచిన శంకరమఠ బ్రాహ్మణులు మన బ్రహ్మచా
రిని క్షుద్రదేవతల గొలుచు మాంత్రికుఁడని యెంచి, బ్రాహ్మ
ణేతరుడని నిశ్చయించి, శృంగేరీమఠ ముఖమున రానియ్యకుండుట
లో కష్టముల సహించిరి.

అయితే మన బ్రహ్మచారి దృఢచిత్తుఁడుగాన, పట్టిన పట్టు
వదలని ధీశాలిగాన యిట్లాలోచించెను: "నా గురువులైన శ్రీ
వాసుదేవయతీంద్రుల యాజ్ఞ ననుసరించి నేనిటకు శ్రీ జగద్గురు
దర్శనార్థము వచ్చితిని, వారి సంకల్పబలము వలననే నే
నిక్కడ చేరితి. ఇప్పటికి నాకీ బ్రాహ్మణులు జగద్గురుదర్శనము
కానిచ్చినవారు కారు. అయినను మద్గురు శ్రీ వాసుదేవానంద
సరస్వతీస్వాములు త్రికాలజ్ఞులు; నాకిప్పటి జగద్గురుదర్శనప్రాప్తి
ము లేకున్న, నన్ను నా రెండుల కిటకు బొమ్మని యాజ్ఞ నిచ్చె
దరు? నాకీదినము కాకున్న, యెప్పటికైన నను శ్రీగురుదేవుని యను
గ్రహమువలన శ్రీజగద్గురు దర్శనము కాకపోదని తన గుర్వా
జ్ఞయందు పూర్ణవిశ్వాసముంచి, క్షుద్బాధ నివారణార్థమై యా
యడవిలో ప్రబలియున్న సీతాఫల జామ ఫలములు తిని, జగ
ద్గురుదర్శనమునకై వేచియుండెను.

గణపతి ప్రతిదినము శృంగేరిమఠము నెదుట నిలు

వంబడి శ్రీ రాజగద్గురు దర్శనమునకై శ్రీదత్తదేవుని ధ్యానించు చుండెను. శీతవాతాతపముల కోర్చుచు సమస్తకష్టము లను భవించుచున్నను తనధైర్యమును మాత్రము గోల్పోలేదు. గీత యందును 'అనన్యచింతజేయువారి యోగక్షేమముల నేను వహించెద'నని శ్రీకృష్ణభగవానులు చెప్పియుండలేదా?

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం"

ఈశ్లోకమే వాస్తవముగా గీతాహృదయమును, తత్త్వ సారమును నై యున్నది. ఈకీలకమును ననుసరించియే జ్ఞానులు, భక్తులు, యోగులు, కర్మవీరులు లోకమునందు భగవంతుని నమ్మి, ప్రాపంచికవిషయ చింతలు మాని, తమతమ జీవితముల గడపెదరు. ఈశ్లోకమే మనబ్రహ్మచారికిని యూతకర్య్యా.

ఈశ్లోకార్థమెఱింగిన మనబ్రహ్మచారి భగవంతుని నమ్మి తనకార్యములయందు స్థిరప్రజ్ఞగలవాడై యుండెను. లోకము బాహ్యావేషముల గమనించి మోసపోవునుగాని, భగవంతు డంతశ్శుద్ధినే గమనించి శోధించును. బాహ్యవాసనల విసర్జించి మనస్సు భగవదర్పితమైననేగాని భగవంతుడు కాపాడడు; అదియునుగాక, భక్తుని మన స్సేకరీతిగా తనయందు నిలుకడ జెందియున్నదో లేదో యని పరీక్షించుటకు తాను దలచు భక్తునికి దారాపత్యపుత్రాదులను, ధనకనకవస్తువాహనసమితిని హరించి, పలుబాధలబెట్టును. మఱియు అనేక సందేహము

లుదయింపజేయును; దీనికి ప్రహ్లాద ధృవచరిత్రములే సాక్షులు.

ఇట్లు మూడుమాసములు గడవగా, గణపతి యొకదిన మున, "శ్రీజగద్గురువులవారు రేపు కొండపై యేకాంతముగా విశ్రాంతిగైకొందురని" వినెను. ఆవాక్యములు గణపతి చెవు లబడగనే "హేదత్త గురో! రేపైనా నాకు శ్రీజగద్గురు దర్శ నమగునట్లనుగ్రహింపవా? ఎన్నిదినములు నేనిష్టముల కోర్చుట?" యని ప్రార్థించి, యలసి భైరవీదేవాలయమున పరుండియుండ, నాటిరాత్రి స్వప్నంబున శ్రీదత్తదేవుడు ప్ర త్యక్షమై, "రేపు తప్పక నీకు శ్రీజగద్గురు దర్శనమగు"నని యభయమిచ్చి యదృశ్యుడయ్యెను.

గణపతి యప్పుడే మేల్కాంచి, యెప్పుడెప్పుడు ప్రా తఃకాలమగునో? ఎప్పుడు జగద్గురువులవారి దర్శనము నాకగు నో? యని తహతహపడుచు, తెల్లవారగనే శ్రీజద్గురువులు కొండపైకి వచ్చియున్నారని విని, శృంగేరికొండవద్దకు పరు వెత్తెను గాని, యచట కాపలాయున్న పహరా జవానులు మనబ్రహ్మచారిని కొండ నెక్కనీయక యడ్డగించిరి. అయితే గణపతి పట్టుదలను విడువక, భక్తకబీ రెట్లు రామానందుని దర్శించెనో, యట్లే కొండ వెనుకభాగము జేరి, కొండనెక్క బ్రయత్నించెను గాని, దారియా? లేదు; కొండచుట్టును యడ వి ప్రబలియుండెను. గణపతి ముండ్లపొదలలో దూరుచు దేహమున రక్తధారలు స్రవించుచున్నను బాధలను లక్ష్యపెట్ట

క, మనుష్యమాత్రుని కంటికగుపడక, ముండ్లతీగలను రాతిబం డలను యాధారముగా జేసుకొని, కొండపైభాగమునకు పొట్ట తో చాలప్రయాసచే నెగబ్రాకి ప్రబలప్రయత్నమొనర్చి, తుదకెట్లో కొండనెక్కి జగద్గురు విశ్రాంతిగైకొను స్థానముక కరిగి, దూరమునుండియే "స్వామీ!" యని బిగ్గఱగా సంబో ధింపగా, శ్రీజగద్గురువులవారు మనబ్రహ్మచారి వంక తిరిగి చూచిరి.

అంతట మనబ్రహ్మచారి శ్రీజగద్గురువులవారికి సాష్టాంగ నమస్కృతులొనర్చి నిలువంబడియుండ శ్రీజగద్గురువులు బ్రహ్మచారిదేహమంతయు రక్తముగారు గాయములు తగిలి యుండుటం గాంచి "ఎవ్వడవు నీవు? ఎందులకిక్కడకి వచ్చితివి? నీశరీరమునం దంతయు గాయములై రక్తము స్రవించుట కేమి కారణము?" అని ప్రశ్నింప, గణపతి శ్రీజగద్గురు దర్శనభాగ్యము తనకు లభించినందులకు సంతోషస్వాంతుడై, "స్వామీ! తమ దర్శనమునకై మాగురువులైన శ్రీవాసుదేవానంద సరస్వతీస్వా ముల నానతి శిరసావహించి గరుడేశ్వరమునుండి యిటకువచ్చితి" నని చెప్పెను. అంత శ్రీజగద్గురువులవారు మనబ్రహ్మచారిని పరామర్శించి ప్రతిదినమును తమసన్నిధికి వచ్చుచుండుమని యాజ్ఞాపించిరి. శ్రీవారియాజ్ఞానుసారము దర్శనమునకై పోవు గణ పతి నడ్డగించుట కెవ్వరికి శక్తిగలదు?

కొన్నిదినములైన తరువాత, గణపతి మూడుమాసము

ల క్రిందట తమదర్శనమునకై వచ్చెననియు, తమమఠమునందు నౌకరిజేయు బ్రాహ్మణులు తమ దర్శనము కాకుండ జేసినది గాక, మధుకరముగూడ దొరకనియ్యకుండ జేసి, పలుబాధల పెట్టిరనియు శ్రీజగద్గురువుల వారెఱింగి, యాబ్రాహ్మణులను తమయాస్థానమునుండి తఱిమెదనని మందలించి శిక్షించెను. అంత శ్రీజగద్గురువులు బ్రహ్మచారియొక్క నిష్ఠ ప్రజ్ఞల గమనించి, పరిపూర్ణ వాత్సల్యముంచి తమతో నిరాటంకముగా మాట్లాడుటకును, తమ మఠమునందే భోజనమునకును వసతుల గావించిరి.

శ్రీవాసుదేవానందస్వామివారి చరిత్ర మహారాష్ట్ర భాషలో వారి శిష్యులలో నొకరు వ్రాయుచు, మనగణపతిని గూర్చి ప్రస్తావించినప్పుడు బ్రహ్మచారిని బాధపెట్టిన శృంగేరి మఠ బ్రాహ్మణులను గురించి యాగ్రంథకర్త యతికఠినముగా వ్రాసి యున్నారని బాపట్ల శ్రీశంకరవిద్యాలయ ద్వితీయ వార్షికనివేదికము తెలుపుచున్నది.

శ్రీజగద్గురువులువారు మనబ్రహ్మచారిని మిక్కిలి ప్రేమతో జూడనారంభించిరి. ఆచార్యానుగ్రహమును బొందిన మనబ్రహ్మచారికి సాధింపరానిదేమున్నది? అతడఖండజ్ఞాన విజ్ఞానసంపన్నుడగుట కేమి కొఱతగలదు? దినదినాభివృద్ధిగ నతనికి ముఖమునందు వర్చస్సు, శరీరమంతటను దివ్యతేజస్సు వ్యాపించెను. నివురుగప్పిననిప్పువలె మనబ్రహ్మచారి శ్రీ

జగద్గురువులవారిశ్రీకరమునకు దాపుననే కూర్చుండి, వారి వచనా మృతమును తనివితీర గ్రోలుచుండిన కతంబున నాతనిపై కప్పి యుండిన మాయావరణవిక్షేపములు తొలంచి, యఖండ తేజో విరాజితమూర్తియై యొప్పారెను.

శ్రీజగద్గురువుల వారు మనబ్రహ్మచారిపై నింత ప్రేమ యుంచుటవలన మఠమునందలి కొట్టకూటి పండితమ్మన్యులు మన బ్రహ్మచారియం దసూయాగ్రస్తులై వేద వేదాంగములను, తర్క వ్యాకరణ మీమాంసాది శాస్త్రములు తెలియని యీతనికింత చనవు నిచ్చుట పాడిగాదనియు, తమ కవమానకరమనియు తమచూపులచేతను తమకృత్యములచేతను ప్రకటించుచుండిరి. శ్రీజగద్గురువుల వారి కిది తెలిసినందున నొకదినమున పండితుల గర్వమడంప, వారినందరిం గాంచి "యెవ్వడఖండాత్మ స్వరూపమునుగాంచునో వాడే సర్వశాస్త్రములను చదివినవానికంటె శ్రేష్ఠుడు. మీర లీబ్రహ్మచారివిషయమై చూపు దురభిమాన ముచితముగాదు. చూడుడు! యీదినమున నీరామశబ్దమురాని బ్రహ్మచారియే మీసమ్ముఖమున భాష్యములజదివి యర్థమును వివరించు"నని చెప్పి, సమీపమున గూర్చుండియుండిన బ్రహ్మచారి చేతికి భాష్యము నిచ్చి, "యర్థమును వివరింపు"మని జగద్గురువు లాజ్ఞాపించిరి.

పండితులందరు "ఇదియేమి? సంస్కృతజ్ఞానముబొత్తుగా లేని యీబ్రహ్మచారి యెక్కడ? కొమ్ములుతిరిగిన పండితుకు

గూడ సవగాహనముగాని భాష్యమును బోధించు టెక్కడ? సక్క-యెక్కడ నాగలోమెక్కడ?" అని తమలో తాము గొణు గుకొనుచు, క్రోధోద్రిక్తమానసులైరి. ఇంతలో శ్రీజగద్గురు వులు గణపతిశిరముపై తమ దివ్యహస్తమునుంచి భాష్యముల బోధింపుమని యాజ్ఞనివ్వగానే మనబ్రహ్మచారి పీఠమున నాసీనులై యున్న జగద్గురువులవారికి నమస్కృతులాచరించెను. అంతట పీఠమునుండియు శ్రీజగద్గురువులనుండియు రెండు దివ్యకాంతిపుంజములు బయలువెడలి మధ్య నేకమై మన బ్రహ్మచారి హృదయకుహరమున బ్రవేశించెను. అంత గణ పతి యఖండతేజశ్శక్తి గలవాడై శబ్దఝరివ్యాఖ్యాన కౌశలముగలిగి, పండితులకందరికి నాశ్చర్యము గలుగునట్లు భాష్యముల బోధించెను. అట్టిసమయమున నాభాష్యశ్రవణ మునకు వచ్చినవారందరు చిత్తరువులవలె నిశ్చేష్టులైయుండిరి. అదిమొదలుకొని నాపండితులందరు మనబ్రహ్మచారియం దసమానభక్తిశ్రద్ధలతో ప్రవర్తింపసాగిరి.

---


# పదునొకండవ ప్రకరణము.

—సన్న్యాసము—నూతననామధారణము.—

"బ్రహ్మచారీ దేవప్రవ్రజేత్" "పరిక్తః ప్రవ్రజేత్"
సంసారమేవ నిస్సారం దృష్ట్వా సారదిదృక్షయా,
ప్రవ్రజంత్యకృతోద్వాహాః పరం వైరాగ్యమాశ్రితాః.

చిరకాలము మనబ్రహ్మచారి శ్రీజగద్గురువులసన్నిధినే యుండి, తానధికుడనను తలంపు నలుసంతయైనలేక, జగద్గురువులవారి యనుమతి శిరసావహించి కొలువొనర్చుచుండెను. అంత శ్రీజగద్గురువు లొకానొకసమయమున నేకాంతముగా మన బ్రహ్మచారిని చేరబిలచి, "నీవు సంస్కృతమును నేర్చుకొనవలయు"నని హెచ్చరించిరి. మనబ్రహ్మచారి "చిత్తం" మనెను. అంతట, జగద్గురువులు విద్య సాంప్రదాయముగా నుండవలెనను తలంపుతో శబ్దమంజరి తెప్పించి, "రామః రామౌ రామాః" యని సంస్కృతవిద్యాప్రారంభము గావించిరి.

మనబ్రహ్మచారి కుశాగ్రబుద్ధిగలవాడగుటచే రఘువంశము కుమారసంభవము మొదలైన కావ్యముల పఠింపఁజేయకయే, శ్రీనృసింహభారతీస్వాములవారు శ్రీజగద్గురు ఆదిశంకరాచార్య విరచితమగు వివేకచూడామణిని జదివించిరి. మనబ్రహ్మ



శ్రీ మజ్జగద్గురు ప. ప. శ్రీ నృసింహ భారతీస్వాములవారు

శ్రీ శృంగేరి పీఠాధీశ్వరులు

చారియో శతకోటిజన్మములకైన యితరులకు సాధ్యముగాని పాండిత్యగరిమను అనతికాలముననే పొందగలిగెను.

సన్న్యాసాశ్రమము స్వీకరించుటకు శాస్త్రములయందు కొన్ని నిబంధనలు గలవు; అవేవన:—

"యదాతు విదితం తత్త్వం పరం బ్రహ్మసనాతనం,
తదైకదండం సంగృహ్య సోపవీతాం శిఖాంత్యజేత్!
పరంబ్రహ్మ పరిజ్ఞాయ ప్రవ్రజేద్బ్రహ్మణోత్తమః"

అనగా, ఎప్పుడు సనాతనమైన పరబ్రహ్మతత్త్వము తెలియబడునో అప్పుడు పరివ్రాజకుడై శిఖాయజ్ఞోపవీతములను త్యజింపవలెను. పరబ్రహ్మ నెఱింగి, బ్రాహ్మణోత్తముడు సన్న్యాసమును స్వీకరింపవలెను.

అట్టి నియమములన్నియు మన బ్రహ్మచారియందు సంపూర్ణముగా వాసముచేసియున్నవిగాన, జగద్గురువులు "వత్సా! నీవు యత్యాశ్రమమును స్వీకరింపు"మనియాజ్ఞాపించిరి. గణపతి యంత తన మనోరథమిప్పటికి సఫలమైనందున సంతసించెను. శ్రీశంకరమఠమునందు ఆయాసమయములందు జగద్గురువులుగా నున్నవారు తమ తదనంతరము పీఠాధిపతులగు వారికే తాము స్వయముగా సన్న్యాసము నిచ్చుట అచటి సంప్రదాయము.

అయితే, గణపతియొక్క యుద్దేశములు వేరుగా నుం

మటంబట్టి, శ్రీజగద్గురువులవారు తమమఠముసందుగల మహా రాష్ట్రసన్న్యాసియైన ఆనందానందతీర్థస్వాములవారి వలన సన్న్యాస మిప్పించిరి. ఆసమయమున, మంగళవాద్యములతో గణపతి శిఖాయజ్ఞోపవీతముల త్యజించెను. బ్రాహ్మణులకు సంతర్పణాలు, బీదలకు అన్నదానములు విరివిగా జరిగినవి. వేద ఘోష సుస్వరముగా శ్రవణానందము గలిగించునట్లు పారాయణ జేయబడెను.

మరియు గణపతి సన్న్యసించునమయమున విచిత్ర రహస్యసంఘటన మొకటి విదితమయ్యెను. తుంగభద్రానదీతీరమున శ్రీజగద్గురువుల సన్నిధానములో ఆనందానందతీర్థస్వామి వారు గణపతికి సన్న్యాసమిచ్చు సమయమున, సభోభాగమందలి చండభానుడు మేఘములచే కప్పబడియుండుటను శ్రీజగద్గురువులవారు గాంచి, యచ్చటనుండువారితో: "మన బ్రహ్మచారి సన్న్యసించి, సూర్యమండలమును భేదించుకొనిపోవునను శంకతో సూర్యుడు చలించి, తనమండలమును దాటుటకధ్యాత్మశక్తియుతుడగు గణపతియందసూయపడి, చూడనోర్వక మబ్బును తెరను తాను కనబడకుండుటకై కప్పుకొన్నాడో యనునట్లున్న"దని మందహాస వదనారవిందులై వినువారి కత్యంతానంద ముప్పొంగ, మనబ్రహ్మచారి సన్న్యాసము దృఢమగున ట్లాశీర్వదించి, ఈస్మృతివాక్యమును బలికిరి:—

> "ద్వావిమౌ పురుషౌ లోకే సూర్యమండలభేదినౌ
> పరివ్రాడ్యోగయుక్తశ్చ రణే చాభిముఖో హతః
> పరివ్రాజస్తం ద్విజం దృష్ట్వా స్థానాచ్చలతి భాస్కరః
> ఏష మే మండలం భిత్వా బ్రహ్మలోకం గమిష్యతి."

వాస్తవమే గదా! సన్న్యసించి, జ్ఞాన తేజమును గన్న మహనీయులు సూర్యధృవాది మండలములను పదునాలుగులోకముల కతీతులై బ్రహ్మాండమే తామగుదురుగదా!

మన గణపతి బ్రహ్మచారికి సన్న్యాసమిచ్చిన ఆనందానందతీర్థస్వాములును* జగద్గురువులును మన బ్రహ్మచారి బ్రహ్మానందసూచకమైన ముఖవర్చస్సును తిలకించి, బ్రహ్మానంద

* మాకు కొంతమంది మనగణపతి బ్రహ్మచారికి శ్రీ జగద్గురువులే స్వయముగా సన్న్యసమిచ్చిరని తెల్పిరిగాని, తెనాలితాలూకా బాపట్ల గ్రామకాపురస్థులును శ్రీ బ్రహ్మానందతీర్థస్వాముల ముఖ్యశిష్యులును, శతావధానియునైన వేమూరు నృసింహశాస్త్రిగారు అవధూత శ్రీ సత్యానంద స్వాములతో ఆనందానందతీర్థస్వాములే మనగణపతికి సన్న్యసమిచ్చిరిగాని, జగద్గురువులు కాదని నుడివిరి. శాస్త్రిగారు భక్తిపూర్వకముగా రచియించి బాపట్ల శ్రీశంకరవిద్యాలయ తృతీయవార్షిక నివేదికలో ప్రచురించిన శ్రీమత్పరమహంస పరివ్రాజక శ్రీబ్రహ్మానందతీర్థస్వామి పాదుకాపూజా ప్రారంభ సంకల్పమునందు "శ్రీమదానందానందతీర్థ కరకమలసంజాత" యనియు, అష్టోత్తరశతనామపూజ ౫౦ వ నామములో "ఆనందానందతీర్థాప్తతురాశ్రమయుతాయ నమః" యనియు యున్నది. మనము కొంచెము పరిశీలించిన గురు వేసంప్రదాయమునకు జెందునో శిష్యునకా సంప్రదాయనామమే రావలసియుండునుగదా! సన్న్యాసులలో తీర్థ-భారతీ-సరస్వతీ

తీర్థస్వామియని సన్న్యాససూచకమైన నూతననామ మిడిరి. ఇకమనము మనబ్రహ్మచారిని శ్రీబ్రహ్మానందతీర్థస్వామియని వ్యవహరించెదము.

శ్రీబ్రహ్మానందతీర్థస్వామి శ్రీజగద్గురువులకు వందనము జేయుచుండగా, శ్రీజగద్గురువులవారు "నీకు దేహాభిమానము సమూలముగా నశించినదో లేదో పరీక్షింపనెంచితిని గాన, ఈనిండుసభలో మానాభిమానములకు లోనుగాక, దిగంబరివై నమస్కరింపు" మన, బ్రహ్మానందతీర్థస్వామి యేమాత్రము సంకోచింపక తక్షణమే జగద్గురునాజ్ఞప్రకారము దిగంబరియై సవినయభక్తివిశ్వాసములు తేటతెల్లమగునట్లు సాష్టాంగ నమస్కృతు లొనర్చిరి. జగద్గురువు లది గాంచి, యత్యాశ్చర్యము నొంది, తీర్థస్వామితో "నీవు సర్వకాలములందు దిగంబరివై యుండ సమర్థుడవే. ఐనను లోకోద్ధరణాసిమిత్తము మహాత్కార్యముల నర్చుటకు శాటీని ధరింపు" మన, జగద్గురు నాజ్ఞ శిరసావహించి శాటీని ధరించిరి.

క్రొత్తగా సన్న్యాసస్వీకార మొనర్చినవారు గురుసన్నిధానమున భాష్యముల పఠింపవలయునను నియమము గలదుగాన,

---

గిరి మున్నగు సంప్రదాయము లెన్నియో గలవు. జగద్గురు నృసింహభారతీస్వాములే మన బ్రహ్మానందతీర్థస్వామికి స్వయముగా సన్న్యాసాశ్రమ మిచ్చిన యెడల తీర్థులను బిరుదములేక, భారతీ యను బిరుదము (యోగపట్టా) వచ్చియుండెడిది గదా!

శ్రీ బ్రహ్మానంద తీర్థస్వామియు ఈ ప్రాయమున్న ప్రాచీనమగు గురు శిష్యసంప్రదాయము ననుసరించి బ్రహ్మవిద్యాక్రమమును శాస్త్రమర్యాద నతిక్రమించక ప్రస్థానత్రయమును జదివి శాంతి జేసిరి. శ్రీ జగద్గురువులవారే స్వయముగా బ్రహ్మానంద తీర్థులకు భాష్యపరిపాఠమును బోధించుచుండిరి. సన్న్యసించినను బ్రహ్మానందతీర్థులు జగద్గురువులకు శిష్యాచారక్రమమును దప్పక నిర్వర్తించుచుండిరి. వీరికి గురుశుశ్రూషయే ముఖ్యము.

ఇట్లుండ జగద్గురువులవారొకదినమున బ్రహ్మానందతీర్థులతో- శ్రీమజ్జగద్గురు ఆది శంకరాచార్య పవిత్రజన్మస్థానమైన 'కాలటి' యగ్రహారములో నివసించుచున్న శ్రీ రామానంద సరస్వతీస్వామి వద్ద ప్రస్థానత్రయ చింతన జేయుమని యాజ్ఞనిచ్చిరి. అట్లు బ్రహ్మానందతీర్థులు సౌమ్యనామసంవత్సర మాఘమాసమునుండి, సాధారణనామ సంవత్సర భాద్రపద మాసమువఱకు కాలటియందే యుండి భాష్యచింతన మొనర్చిరి. అచటనే తర్క-శాస్త్రవిద్యార్థులు పఠించుచుండ శ్రవణమాత్రమున నే శ్రీతీర్థస్వామి న్యాయశాస్త్ర సంప్రదాయమును వేదాంతమునకనుకూలముగుటవలన గ్రహించిరి. మరల శృంగేరి శ్రీజగద్గురు యంతికమును జేరిరి. బ్రహ్మానందతీర్థస్వామి జగద్గురువులవారిపద్ద లేనికాలము క్షణమొక యుగముగా గడపెను. దీనింబట్టి జగద్గురువుల యెడల బ్రహ్మానందతీర్థులకుగల భక్తిశ్రద్ధలపారములని తెలియుచున్నది.

# పంద్రెండవపరిచ్ఛేదము.

## —: నిర్వికల్ప సమాధి :—

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థమనోగతాన్,
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే.

సన్న్యాస స్వీకారమైన మరుసటిదినము, శ్రీ జగద్గురువులవారు బ్రహ్మానందతీర్థస్వామికి వేదాంత తత్త్వముయొక్క అంత్యమైన సమాధిని గూర్చియు, అఖండాద్వైతమతమును గూర్చియు, మరికొన్ని తత్త్వరహస్యములను నేకాంతమున నుపదేశించిరి.

అట్టి నిర్వికల్ప సమాధియందే విజ్ఞానులు ద్వంద్వాతీతులై మానసిక దృశ్యమాన ప్రపంచమును పూర్తిగా విరమించి, యూహాపోహాల కందరాని శాశ్వత సచ్చిదానందము ననుభవించెదరు. నిరతిశయ నిర్వికల్పసమాధి చైతన్యసంద్రమునందు త్రిపుటి (జ్ఞాతృ జ్ఞానజ్ఞేయములు) నశించి యేకమైపోవును; దీనిని పొందినవానికి జరామరణ శబ్దములు హాస్యాస్పదములుగదా!

అతడు "గడచిన దాని నే దలప, కాగలదానికినై మనంబునన్ సుడివడి యోచనల్ సలుప, చూతును ప్రాప్త

ములకా వినిస్పృహా” యను నిర్ధారణ గలిగియుండును. అదియే నిస్సంశయస్థితి; అచట నామరూపకాల నిర్దేశములుగాని వాటి వికారములుగాని యుండవు.

ఇట్టి నిర్వికల్పస్థితిని పొందుటకు అహంకార మమకారములు లేక నిరంతరము ప్రశాంతుడై, సాధన సల్పిన యంత దృష్టిగలుగును. మనఃకల్పితమైన యీదృశ్యమాన చరాచర ప్రపంచ మదృశ్యమగును. అప్పుడు మనస్సునకు రూపనామము లందు పట్టువీడి యదియు లీనమగును; అప్పుడు ఏకమైన చైతన్య సత్తుమాత్రమే మిగులును. అట్టిస్థితి నెవరు వర్ణింపగలరు? బ్రహ్మానందము ననుభవించువారికే యభివర్ణింప సాధ్యము గాదు. “యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ” అని శ్రుతిపలుకుచున్నది.

అట్టి నిర్వికల్పసమాధియం దుండువారు మహాపురుషు డనబడును. వాడు “కర్మణ్యా కర్మయః పశ్యేత్” యని భగవదుక్తి రీత్యా కర్మయం దకర్మము జూచుచుండును. వాడ నేకులమధ్య యుండి సత్కర్మ లొనర్చుచున్నను. కర్మజాలము వాని నేమియు చేయజాలదు; బురదలో నుండినను క్రిమ్మరపురువునకు బురద అంటదుగదా! దీనినే శ్రీరమణమహర్షులవారు సహజనిష్ఠ, లేక సహజసమాధి యనియు నుడివెదరు. వీరికి జన్మకర్మలున్నవని పామరులు తలచెదరుగాని, వారికి లేవు.

బ్రహ్మానందము కలుగువరకు వ్యక్తిత్వముండి తాను మానవుడనుకొనును. ఇప్పుడో శాశ్వతపరబ్రహ్మమే తానని దృఢాపరోక్ష జ్ఞానము గలిగియుండును; అట్టి ముక్తపురుషులు లోకసంగ్రహార్థము సంచరించెదరు. వారి సకృత్ దర్శనమాత్రముచేత, వారిచరిత్రములు చదువుటచేత, వారి స్పర్శమాత్రముచేతనే లోక ముద్ధరింపబడును. ఇంక వారి యుపదేశము పొందినవారి స్థితి చెప్పవలయునా?

మఱియొకనాడు అద్వైతసిద్ధియం దఖండప్రజ్ఞగల శ్రీజగద్గురువులవారగు నృసింహ భారతీస్వాములవారును తమశిష్యులైన బ్రహ్మానందతీర్థులును యుషఃకాలమున ధ్యానమందిరము జొచ్చిరి. అంతట జగద్గురువులవారు ధ్యానమునకు ప్రారంభింపబోవుచు, తీర్థస్వామికి - సంకల్పమే మాయ యనియు అదియే దేశకాలకర్మ బద్ధమైనదనియు, నామరూపములుగల దృశ్యమానమైన యీప్రపంచమును కల్పించినదనియు, బోధించిరి. అయితే వాస్తవదృష్టిలో యీదృశ్యము (జగత్తు) బ్రహ్మమే. అదియే సత్యము - శాశ్వతమైనది, సచ్చిదానంద స్వరూపమైనదనియు బోధించిరి.

అదిమొదలు బ్రహ్మానందతీర్థులును నిర్వికల్పసమాధికితగు యభ్యాసముల నలవఱచుకొనుచుండిరి, ఇచ్చట జగద్గురువులకును, వారిశిష్యునకును జరిగిన చిన్నసంఘటన పొందుపరచెద

ము. దీనివలన మన బ్రహ్మానంద తీర్థస్వామికి నిర్వికల్ప స
మాధియందలి ప్రజ్ఞ వేటతెల్లమగును.

వీరిరువు రొకదినమున విశ్రాంతిఁగోరి, శృంగేరిమఠ
మునుండి బయలుదేరి, రెండు మూడు క్రోసుల దూరములోనున్న
ఘోరారణ్యము ప్రవేశించిరి. అచ్చట మిక్కిలి భయంకర
ములగు క్రూరమృగారావములు చెలంగుచుండెను కాని, యవి
నిరంతర ప్రశాంతస్వభావులును బ్రహ్మనిష్ఠాగరిష్ఠులును
నగువీరి నెంతమాత్రము భయపెట్ట జాలియుండలేదు.

వీరు పరస్పర సంభాషణచే యాయాప్రదేశముల ప్రకృ
తిరామణీయకమును గాంచుచు, నొక్కప్రదేశమునున్న శిలా
తలముపై నాసీనులైరి. అది యేమిచిత్రమో కాని, వీరిరువురు
ను తామిదివర కనుభవించని నతిశయానందమునొంది, "ఇ
చట ఋషీశ్వరు లెందరో తపంబొనర్చి యుండుటంబట్టి యీస్థల
మున కింత తపశ్శక్తియు, పవిత్రతయు గలిగినదని నిశ్చయించు
కొనిరి.

అంత తీర్థస్వామి జగద్గురువులతో ఈస్థలము నిర్జన
మై ప్రశాంతమై యున్నదనియు, సమాధి నభ్యసించువారికి
యోగ్యమైనదనియు, తానును ఇచ్చట నేయుండి, సమాధిసాధ
నల నలవరచుకొందుననియు, చెప్పెను. అందులకు శ్రీజగ
ద్గురువులు "మనసు వాసనారహితమైన పట్టణమందున్నను

యరణ్యమందున్నను నొకటియే గదా” యని నుడివిరి. అంత తీర్థస్వామి యాయ్యానందమునే తనివిదీర గ్రోలవలయునను పట్టుదలగలవాడుగాన, “తపస్సిద్ధిని పొందినమీరు పట్టణమునందున్నను యరణ్యమునందున్నను సహజస్థితిలో నుండగలరుగాని, సాధనజేయు మాబోంట్లకు యేకాంతస్థల మవసరము గదా!” యనిచెప్పి యూరకుండెను.

శ్రీజగద్గురువులు తమ శిష్యుని దృఢనిశ్చయమునకు భంగము కలిగించక, “నిర్వికల్పసమాధిజనితానంద మనుభవింతువుగాక!” యని శిష్యుని యాశీర్వదించి, తాము శృంగేరికి పోవపయనమై, కొంత దవ్వరిగి, తన శిష్యుడేమిచేయుచున్నాడో తెలియగోరి తిరిగి తీర్థస్వామిని తాను విడచివచ్చిన శిలాతలమువద్దకేగి, అలలులేని మహాసంద్రమువలె గంభీరముగా నాసీనులై నిర్వికల్పానంద మనుభవించు తమశిష్యునిగాంచి, అత్యాశ్చర్యముపొంది “సిద్ధివడయుగాక!” యని దీవించి సమాధిభంగముచేయ నుంకించక మరలి తమమఠము జేరిరి.

అంత మరునటి దినమున శ్రీజగద్గురువులు తమశిష్యుడేయవస్థనుం దున్నాడో చూడగోరి, యరణ్యమునకేగి, అట్లేనిర్వికల్పసమాధినిష్ఠుడై యున్న తీర్థస్వామికి ఉచ్ఛ్వాసనిశ్వాసములునిలిచియుండుటను దేహస్మృతి లేకుండుటను గాంచి, నిర్ఘాంతపడి “నిన్ననే గదా నే నద్వితీయ బ్రహ్మైక్యభావమును

బోధించితిని. ఇంతలోనే యిట్టి యనుభవజ్ఞానమును పొందు టయా!'' యని తలచిరి, ఇంతలో శరీరమంతయు గీచుకొని రక్తము స్రవించుచుండుట జూచి, నివ్వెఱపడి, యటునిటు పరిశీలింపగా, అడవిపంది పెంట గనబడెను. అంతట శ్రీజగద్గురువులు తమశిష్యుని శరీర మొక మొద్దని తలచి, యేదుపంది తన కండూతి నివారణమునకై రుద్దుకొన్నదని గ్రహించిరి.

తీర్థస్వామికి మరల బాహ్యస్మృతి గలిగించుటకు జగద్గురువులు చాల ప్రయత్నించిరి. తీవ్రమైన సంకల్పముతో తమ శిష్యునికి, బాహ్యస్మృతి గలుగునట్లు జేయుమని మహేశ్వరుని గూర్చి ధ్యానమొనర్చిరి. అంత తీర్థస్వామి మెల్లగా కనులు తెరచి చూచెను. అప్పుడు జగద్గురువు లానందాశ్రుపూరిత నయనులై యుండిరి. తీర్థస్వామి లేచి, జగద్గురువులవారికి సాష్టాంగనమస్కారములాచరించి, బద్ధాంజలియై నిలిచియుండెను. జగద్గురువులవారు తమశిష్యుని ప్రేమమై బద్ధాలింగన మొనర్చి, మరలమరల యాశీర్వదించిరి. ఆహా! తీర్థస్వామికి ముండ్లపంది నిమురుకొన్నను దేహస్మృతి గలుగలేదుగదా! ఏమి యీ యనిర్వచనీయానుభవము!

శ్రీబ్రహ్మానందతీర్థస్వామివారు యోగాభ్యాసమునందసమానమైన ప్రావీణ్యము గలవారను విషయ మీదిగువనుదహరించు నంశమువలన స్పష్టముకాగలదు. యోగాభ్యాసపరులు పలువురు తమ విద్యనుజూపి- శ్రీశృంగేరి జగద్గురువు

నొద్ద సన్న్యాసమును పొందుటకు వచ్చువారు. అట్టి యోగీశ్వరులను పరీక్షించుటకు జగద్గురువులు తీర్థస్వామిని నియోగించుచుండిరి. జగద్గురువులగు శ్రీనృసింహభారతీస్వాములు పర్యటనమునకు బయలుదేరునపుడు, తీర్థస్వామియు వెళ్లుచుండువారు. ఈప్రకారము వీ రుభయులు పాపనాశనము*లో నుండినపుడాప్రాంతమున శిరస్తదారుగానున్న కృష్ణస్వామయ్యర్ గారు శ్రీజగద్గురువుల దర్శించి "తమసన్నిధిలో యోగాభ్యాసపరు లుండిరా?" యని యడిగిరి. అందులకు శ్రీజగద్గురువులు బ్రహ్మానందతీర్థస్వామిని జూపిరి. ఈవిషయమును కొంతకాలమునకు కృష్ణస్వామయ్యరుగారు బాపట్లలో సబ్ జడ్జిగా యుండినపుడు తెలిపిరి.

శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములవారు బ్రాహ్మణుల నిర్బంధమువలన శ్రీజగద్గురుదర్శనము కాకపూర్వము తుంగభద్రానది యవతలియొడ్డున నున్న భైరవాలయమందు తపం బొనర్చిరని మనము శ్రీ తీర్థస్వామి పూర్వాశ్రమచరిత్రయందు జదివియున్నారముగదా? జగద్గురువులదర్శనమును, వారి యనుగ్రహమును బొంది, నిర్వికల్పసమాధి పర్యంతము సాధించినప్పటికిని, శ్రీతీర్థస్వామివారు జనసమ్మర్దము నొల్లని పూర్ణై

*తిరుపతియొద్దనున్న పాపనాశనముగాదు. ఇది తిరునల్వేలికి కొంత దూరమున గలదు.

కాంతమును గోరువారుగాక, యెప్పుడును యాభైరవాలయమునందే సమాధినిష్ఠులై కాలముగడుపుచుండిరి. అందువలన తీర్థస్వామివారి సమకాలికులు వీరిని ‘భైరవస్వామి’యని మైత్రిచే బిలుచుచుండెడివారు. వీరి యోగాభ్యాసము శృంగగిరికివచ్చిన పిమ్మట ప్రారంభమైనది గాదనియు, బాల్యమున బ్రహ్మచర్యాశ్రమమునందు ఉత్తర హిందూస్థానమున హిమాలయ పర్వతగుహాలలో నొనర్పబడిన తపంబుచే సంపాదింపబడినదనియు పూర్వచరిత్రమువలన తెలియుచున్నదిగదా!

# పదమూడవ ప్రకరణము.

## —: దేశయాత్ర :—

నిర్వికల్పమైన యానందము నొందినప్పటికిన్ని, తీర్థస్వామి గురుసేవా శుశ్రూషలు మానలేదు. ఇట్లుండ జగద్గురువులు తీర్థస్వామి మున్నగు శిష్యులతో తమ యవతారము చాలించెదనని చెప్పి, తమ శ్వాసను మెల్లగా యుపరమించి, శాంత్యానంద సమృద్ధమగు పరబ్రహ్మైక్యమును జెందిరి.

శ్రీ జగద్గురువులు మహాసమాధినొందగా తీర్థస్వామి వారి దుఃఖమునకు మేరలేకపోయెనని వేరుగ తెలుప నక్కర లేదు. ఇకమీదట జగద్గురువులవారి వాగమృతమును గ్రోలు భాగ్య మంతరించెగదా యని పలుమారు తలచి తలచి దుఃఖించెను. ఉపాధియున్నగదా గురువు శిష్యునకు బోధింప ననువగును? శ్రీ జగద్గురువులవారి యనుగ్రహమువలననే తీర్థస్వామికి సంస్కృతభాషయం దపార పాండిత్యము, శ్రీ శంకర భాష్యాది వేదాంతగ్రంథముల బోధించు సామర్థ్యము, కొందరిని వీక్షణమాత్రముచేతను, మరికొందరిని స్పర్శమాత్రముచేతను సమాధినిష్ఠులనుగా జేయు దృఢతమ శక్తి లబ్ధమైనది. అందువలననే జగద్గురువులయెడల తీర్థస్వామికి భక్తిశ్రద్ధ లపా

రములు. కావుననే శ్రీజగద్గురువుల పటము జూచినమాత్రము ననే తీర్థస్వామి ఆనందబాష్పములు గార్చుచు "త్వమేవ మాతా చ పితా త్వమేవ-ధన్యోస్మి ధన్యోస్మి" యని గద్గద కంఠులై యుప్పొంగుచుండెడివారు.

శ్రీజగద్గురువులవారు సిద్ధిపొందిన పిదప శంకరపీఠము నధిష్ఠించిన శ్రీ చంద్రశేఖర భారతీ స్వాములవారు తమ మిత్రులైన తీర్థస్వామిని కాలటియందున్న తమ మఠమునం దుండ గోరిరి. కాని, తీర్థస్వామివారి యాశయములు వేరుగా నున్నందున చంద్రశేఖర భారతీస్వామి తమ మిత్రుని దేశ యాత్రకు వెట్టకేలకు సమ్మతించిరి. వారి గాఢతమ స్నేహ మును గూర్చి యొక యంశ మిట వ్రాయఁగును. అయితే యీచరిత్రాంశము తీర్థస్వామివారి మహాసమాధి యనంతరము జరిగినది గాన, కడపటఁబొందుపరచెదము...(పుటజూడుడు).

శ్రీజగద్గురువులు సిద్ధిపొందుట జగత్తునకు శోచనీయ విషయమైనను, యొక విధముగా దేశమునకు భాగ్యోదయమని మున్ముందు పాఠకులు గ్రహించగలరు. జగద్గురువులు సిద్ధి నొందిన వెంటనే, దేశము నుద్ధరించుచు, శిష్యకోట్లకు నిశ్శ్రే యసాభ్యుదయము నొసంగుటకు జ్ఞాన నిష్ఠులును పరమయో గులునునైన శ్రీబ్రహ్మానంద తీర్థస్వామివారు దేశయాత్రకై బయలు దేరి, పవిత్ర తీర్థముల గ్రుంకుచు, పుణ్యక్షేత్రముల

దర్శించుచు, మార్గవశమున తిరుపతికివచ్చి చేరెరి. ఆనాటిరాత్రి పండిత లక్ష్మణాచార్యుల హరికథ జరుగునని తీర్థస్వామి విని, తానును బాల్యమున హరికథలుచెప్పినవారుగాన, యిప్పటికి హరికథలయం దభిరుచిగలదు గాన, హరికథజరుగు స్థలమునకు పోగా, లక్ష్మణాచార్యులు స్వామిని గౌరవించి యుచితాసనమునిచ్చిరి అంతట లక్ష్మణాచార్యులకును స్వామికిని కొన్ని నిమిషములు సంభాషణ జరిగినపిమ్మట హరికథ జరుపబడెను. తీర్థస్వామి కథను సాంతముగా విని, ప్రస్థానమును వెలిబుచ్చిరి. లక్ష్మణాచార్యులకు దర్శనమాత్రముననే తీర్థస్వామి యందు పూజ్యభావ మేర్పడెను.

అంత మరునటిదినమున స్వామివారిని దర్శించి, లక్ష్మణాచార్యు లిట్లుప్రశ్నించిరి:—"స్వామీ, త్రిపుటి యననేమి?"

స్వామి:—త్రిపుటియన జ్ఞాతృజ్ఞానజ్ఞేయములు.

ఆచార్యులు:—వాటి లక్షణము లెవ్వి?

స్వామి.—ఎంతవరకు వ్యావహారిక జ్ఞానముండునో యంతవరకు త్రిపుటియుండును. క్రమముగా మనస్సును బహిర్ముఖవృత్తినుండి యంతర్ముఖ మొనర్చిన (సమాధియందు) త్రిపుటి యేకమై ఆత్మయందు లీనమగును.

అంతట లక్ష్మణాచార్యులు తీర్థస్వామివారి వచనామృతము తనివిదీర గ్రోలి, "స్వామీ! నే నీప్రశ్న నొకటిచో యా

డిగితినిగాని, తమవలె విశదముగా నెవరును జెప్పలేదని స్వామి వారిని పలువిధముల స్తుతించెను.

౧౯౧౧ న శ్రీతీర్థస్వామి తిరుపతినుండి నెల్లూరువిచ్చే సిరి. అచ్చట వీరికి శ్రీనిత్యానంద స్వాములవారితో మేళ నము సంభవించెను. సత్సాంగత్య మబ్బినందులకు శ్రీ తీర్థ స్వామి సంతోషించెను. దర్శనమాత్రముననే శ్రీనిత్యానంద స్వామి జీవన్ముక్తులనియు, త్యాగశీలురనియు, వేదాంతవేత్త లనియు, అపరోక్షజ్ఞానసిద్ధులనియు తీర్థస్వామి గ్రహించెను. నిత్యానందస్వామి, తీర్థస్వామియొక్క బ్రహ్మవర్చస్సును, అంత ర్ముఖత్వమును, ముఖమునందంకురించు చిరునగవును తిలకించి, యిట్లు చెప్పిరి: “మేము దేశపర్యటనముజేసి సాధువుల నెందరి నో చూచి సంభాషించియుంటిమి గాని, బ్రహ్మానంద తీర్థస్వామి వంటివారిని మేము చూచియుండలేదు.”

వీరిరువురును నెల్లూరునందు ఉత్తరభాగమున రెండుమైళ్ళదూరమునయున్న పవిత్రపినాకినీ తటంబున విశాలమైన మామిడితోటయందుండిరి. ఇద్దరును సమానమైన బ్రహ్మవిద్యాసంపన్నులు. వీరిద్దరిలో కొంతభేదమున్నను, పెక్కంశములలో సమానులని చెప్పనగును. ఇద్దరును బ్రాహ్మణులు- బ్రహ్మచర్యాశ్రమమునుండియే సన్న్యసించినవారు- చిఱుతప్రాయమున నే వైరాగ్యాయత్తచిత్తులై గృహమును పరిత్యజించి, దేశసం

చారమొనర్చిరి- ఇరువురు ఏకసంతగ్రాహులు. నెల్లూరు పట్ట ణమునకు వీరిరువురు సూర్యచంద్రు లనదగుదురు. వీరిద్దరి సాన్ని ధ్యమున నెల్లూరువాస్తవ్యులు విజ్ఞానానందమును కొంతచవి జూచిరి.

చిరకాలమునుండి కఠినబ్రహ్మచర్యవ్రతానుష్ఠానపరులై యనవరత జ్ఞాననిష్ఠులై యుండుటచేత జనించిన జ్ఞానసుధాప్రవా హ మొక్క దిక్కునుండియు, సకలదేశ పర్యటనము చేతను వాసుదేవ నృసింహభారతీత్యాది యోగిపుంగవ ప్రోక్త వచ నామృతాస్వాదనాసక్తత చేత నుద్భూతములగు సమ్మతధారలు మరియొక దిక్కునుండియు ప్రవహించుచు, యమునా భాగీరథు లభంగి ఏకమగుచు, తత్ప్రవాహమున కృతస్నాతులగు పవి జల కానందప్రాప్తి గలుగజేయు శక్తి గలిగి యీనిత్యానంద బ్రహ్మానందసాంగత్యము వెలయుచుండెడిది.

చూతవనమునందు శ్రీనిత్యానందస్వామివారు దారు మయకుటీర యందును, శ్రీబ్రహ్మానందతీర్థస్వామి వారొక పర్ణశాలయందును నుండిరి. అచట వీరి ప్రాతఃకాలానుష్ఠానము ముగియునప్పటికి నెల్లూరు మండల వాస్తవ్యులు వీరిదర్శన మపేక్షించియు, వీరి వాగమృతధారల గ్రోలునపేక్షతోడను వచ్చెడివారు.

బ్రహ్మానంద తీర్థస్వాముల వాగ్ధోరణి, సంస్కృత వా క్పాటవము, అర్థగాంభీర్యము శ్రోతలమొక్క మనస్సులను

మార్పు జెందించుచుండెను. శ్రీ తీర్థస్వామివారు ప్రతిదినము ౭ గంటల మొదలు ౯ గంటలవరకు బృహదారణ్యకోపనిషత్తు, శంకరభాష్యములు, వివేకచూడామణి మున్నగు వేదాంతగ్రంథములను విశదముగా పామరులకు సైతము చిత్తశుద్ధిగలుగునట్లును పుణ్యపాప విచక్షణగలుగునట్లును గంభీరముగా నుపన్యసించుచుబోధించుచుండిరి. నెల్లూరు దగ్గరనున్న పల్లెల వారును వీరిని దర్శింపవచ్చెడివారు. నెల్లూరు మండల వాస్తవ్యులు పూర్వజన్మములందే యోగమభ్యసించిరో ఆయోగమునందు సిద్ధిపడియుటకవకాశము గలిగించుటకై శ్రీభగవానులే యీ యవతారమూర్తులై బోధించుచున్నట్లుండెను. కొందరభ్యాసకులు తమసందేహములనడిగి తీర్చుకొనుచుండిరి. మఱికొందరు వీరి వాగ్ధాటికి నివ్వెఱగందుచుండిరి. ఇంకకొందఱు వీరి నిష్కామ కఠినాచరణమునకు ముగ్ధులగుచుండిరి. వేయేల? వీరి శుద్ధసాత్త్వికనైజము ప్రజల పూతాత్ముల నొనర్చిన దనుటలో నతిశయోక్తి యేమియులేదు.

వీరియందు సింహపురి ప్రజలకు భక్తిశ్రద్ధ లపారముగా గలిగినవి. ప్రతిదినము వీరిని భిక్షలకై తమయిండ్లకు తీసికొనిపోయి, పాదపూజ లొనర్చుచుండిరి. వీరివెంట బ్రాహ్మణు లెల్లప్పుడును వేదపారాయణ జేయుచుండిరి. వీరికి పాదపూజలకు భక్తులు కానుకగా సమర్పించుధనము వేదపారాయణజేయు

బ్రాహ్మణులకు జెందుచుండెను. కొంతకాలమునకు, వీరిపాద పూజలకు లోకులర్పించు ధనమును నిధిగా జేసి, వేద సంస్కృతవిద్యాశాల నొకదానిని స్థాపించిన బాగుండునని నెల్లూరి జనులు తలచి, యొకసంఘముగా నేర్పడి "శ్రీపరమహంస నిత్యానందస్వామి వేదసంస్కృత పాఠశాల" యనుపేర నొక విద్యాలయమును స్థాపించిరి. ధన మిచ్చి వేదపారాయణజేయు బ్రాహ్మణుల కంటెను, నిధిగా నేర్పడినంతమున బ్రాహ్మణబృందము వేదపారాయణజేయుటకు పూనిరి. ఇదియే గదా స్వామివా రియందుగల ధర్మము!

ఒకొక్కప్పుడు వీరిరువురను పుష్పమాలాలంకృతుల గావించి కొందరు పల్లకీలయందును, మఱికొందఱు పూలరథములయందును కూర్చుండజేసి, యుత్సవముల జరుపుచుండిరి. సింహపురివాసుల భాగ్యదేవత వీరి యర్చావిధానమున నోలలాడుచున్నదో యనునట్లుండెను. వీరిరువురి వైభవమును గాంచిన జనులపుణ్యము నేమని చెప్పతరము! ఈజీవితము కొలదికాలముక్రిందటనే జరిగినదిగాన, వీరివైభవమును గాంచిన ప్రతిలిప్పటికిని స్మరించుచు యానందించకపోరని మాయభిప్రాయము.

అనంతరము, శ్రీనిత్యానంద, బ్రహ్మానందస్వాములు నెల్లూరు సమీపమునయున్న ఇనమడుగు గ్రామకాపురస్థుడును, భగవద్భక్తుడు నైన కోడూరు పోలిరెడ్డి యాహ్వానమంగీకరించి, ఇనమడుగునకు విచ్చేసిరి. పోలిరెడ్డి శ్రీస్వాముల నిద్ద

కని భక్తితో పూజించియు, మహోత్సవములజరిపియు కృతార్థత జెందిరి. అప్పుడు వేదపారాయణ మంగళవాద్యము లతివైభవముతో జరిగించిరి. అచట శ్రీస్వాములు వేదాంతకాలక్షేప మొనర్చుచుండ, పలువురు వినవచ్చుచుండిరి. కొందఱు ఉపదేశముల నొంది శిష్యులైరి.

అయితే రాత్రికాలమం దెవ్వరు స్వాములను పూర్ణై కాంతమును గోరువారుగాన, ఇసమడుగు సత్రమందు శ్రీబ్రహ్మానందతీర్థులును, బండిమీదయూరి బయట శ్రీనిత్యానందులును శయనించుచుండిరి. సత్రములో బ్రహ్మానందతీర్థస్వామి యుండ, పొంగూరు వెంకటసుబ్బారెడ్డి యనుబాలుడు శ్రీస్వామిని సేవించుచుండెను. ఒకనాడీబాలుని ముఖము దీనత్వమునొందియుండ శ్రీతీర్థస్వామి "నీముఖమేల దీనభావము నొందియున్న?" దన, "స్వామీ! మాతల్లి పొంగూరు వెంకమ్మకు తేలుకుట్టినది, బాధ యధికముగా నున్నది. కాలు వాచియున్న"దని నుడువ; తీర్థస్వామి తత్క్షణమే వారియింటికిపోయి, కమండలోదకమును ప్రోక్షించి, అత్తియాకు మంత్రించి యిచ్చిరి. అది యేమి చిత్రమోగాని, యామె బాధయు వాపును క్షణములో నంతరించెను, వెంకమ్మగారంత స్వాములవారి మహిమను కొనియాడుచు వారి నడిగి, తనసందేహముల నివారించుకొనెను.

శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారు నెల్లూరునందుండ, అన్నారెడ్డిపాళెమునుండి చేరెడ్డి రామిరెడ్డియనువారు తీర్థస్వామి సన్నిధిం జేరి, రామతారకమంత్ర ముపదేశింపుమని ప్రార్థింప, యందులకు శ్రీస్వామి రెడ్డిగారి వైరాగ్యమును పరీక్షించి, తారకోపదేశముజేసి, ౫౦౦౦ పర్యాయములు జపించుచు ప్రాణాయామము నభ్యసింపుమని యాజ్ఞాపించిరి. రామిరెడ్డిగారేకార్యమునందు నిమగ్నులై యున్నను, రామతారకమంత్రమును భక్తితో జపించుచు సాత్వికాహారమునే గొనుచు, సాధన సల్పిరి. వైరాగ్య మినుమడింప, యెవరికిని జెప్పకయే కాశికిపోయి, యేయరణ్యమునందో తప మాచరింప, ప్రయాణము సాగించుచు బాపట్లయందు దిగి, తమగురువైన శ్రీబ్రహ్మానందతీర్థస్వాముల దర్శించి, తనయభిప్రాయము తెల్పగనే శ్రీస్వామి "మీతల్లియాజ్ఞ గైకొంటివా?" యనిరి. లేదని రెడ్డిరుగాసత్యము బలికిరి. శ్రీస్వామివారంత "తిరిగి మీగ్రామమునందే యూరిబయట తోటలో నేకాంతముగా మంత్రమును జపించుచు యోగ మభ్యసింపుము. నేను వచ్చి పరీక్షింతు" నని స్వగృహమునకు బంపిరి.

గురువునాజ్ఞ ననుసరించి స్వగ్రామమునందే యొకచిన్న యాశ్రమమును నిర్మించుకొని యోగముతోడి తారకమంత్రమును తీవ్రముగా జపింప సమాధి కుదిరెను. ఆసమాధిలో నిరంతరము రామరూపము గోచరించుచుండెను. రెడ్డిగారిపుడు

రామయోగియని పిలువబడుచున్నారు. బ్రహ్మనిష్ఠులై యొప్పు చు, వీరు అరుణాచలమున (తిరువణ్ణామలై) శ్రీరమణాశ్రమమున కొంతకాలమును, అన్నారెడ్డిపాళెము ఆశ్రమములో కొంతకాల మును నివసించుచున్నారు.

అరుణాచల ఆశ్రమ యాత్రికులలో అగ్రగణ్యులు, బహుగ్రంథ రచయితలు, విఖ్యాతసత్యాన్వేషులగు పాల్ బ్రంటన్ అను ఆంగ్లేయుడు రామయోగిని గూర్చి తమగ్రంథములలో విశేషముగ నుగ్గడించి, వారి జ్ఞానఖనులైన నేత్రకాంతిని, క్రూరవ్యాఘ్రములను బుజ్జగించు యోగశక్తిని హృద్యముగ అభివర్ణించియున్నారు. శ్రీరామయోగిగారిపై శ్రీరమణ మహర్షి వారికి అభిమానము మెండు.

శ్రీరామయోగిగారు ౧౯౩౬ మార్చి ౧౦వ తేది ఇనమడుగు గ్రామసమీపమున నుండు శ్రీసత్యానందాశ్రమము నకు విచ్చేసిరి. అపుడు శ్రీసత్యానందావధూత యోగిగారి తో "శ్రీరమణచరిత్రయందు మీరొక బ్రాహ్మణగురువు నొద్ద యుపదేశమైనట్లున్నది. ఆబ్రాహ్మణ గురువెవ్వరో యాచరిత్రమున విశదముగా లేదని యడిగిరి. యోగిగా రంత "ఆబ్రాహ్మణగురువే శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి"లని నుడివిరి. శ్రీఅవధూతలవారు "బ్రాహ్మణగురువని యట గూఢముగానేల యుండవలెను? శ్రీబ్రహ్మానందతీర్థస్వామియని

విపులముగా వ్రాయబడియుండిన భాగములని చింతతో పలికిరి. యోగిగారును యీయభిప్రాయమునే వెల్లడించిరి.

శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి, నిత్యానందస్వామియు, నెల్లూరునుండ, కూడూరునకు సుమారు ౧౮ మైళ్ళదూరము నున్న వాకాటికి, తద్గ్రామవాసులైన అల్లూరు ఆదిలక్ష్మమ్మ, వేమూరు చిదంబరశాస్త్రి మున్నగు భక్తుల మహోత్సాహముపై నెన్నియో సార్లు వెళ్ళియుండిరి. వాకాటి గ్రామ వాసులా బాలగోపాలము స్వాములిరువురిని దర్శించియు, పూజించియు, వారి వాగమృతమునుగ్రోలియు యానందించిరి. రాత్రిసమయమున శ్రీనిత్యానందస్వామి రామమందిరమందును, శ్రీబ్రహ్మానందతీర్థస్వామి వాకాటికి దూరముననున్న నాగేశ్వరదేవాలయమున ప్రజలు వారికై యేర్పరచిన పర్ణకుటియందును శయనించుచుండిరి. పగలు శ్రీస్వాములిరువురును రామమందిరమందు ముముక్షువుల సందేహముల దీర్చుచు, తమ దివ్యదర్శనము చేత ప్రజల పునీతుల జేయుచు నుండిరి. శ్రీస్వాముల సన్నిధానమున వేమూరు చిదంబరశాస్త్రి గారు పురాణకాలక్షేప మొనర్చుచుండిరి.

వేమూరు చిదంబరశాస్త్రిగారి జ్యేష్ఠపుత్రుడు సత్యనారాయణ అప్పుడు దోగాడు బాలుడుగా నుండెను. ఈబాలుని స్వాములిరువురును మిక్కిలి ప్రేమతో నెత్తి ముద్దాడుచు,

తమదివ్యహస్తములతో తడవుచు నాశీర్వదించుచుండిరి. ఒక దినమున శ్రీనిత్యానందస్వాములవారి కొకరో యొక పుచ్చకాయనిచ్చిరి. శ్రీవారు సమీపమున దోగాడుచున్న సత్యనారాయణతో "దీనిని మాయిల్లుచేర్చగలవా?" యన, నా బాలు డందరికి నాశ్చర్యము గలుగునట్లు పుచ్చకాయను దొర్లించుకొనుచు, తమగృహముజేరెను. అప్పుడు శ్రీనిత్యానందస్వామి "ఈ బాలుడు చాలాయుక్తిగలవాడు. మంచిదశకు వచ్చు" నని యాశీర్వదించిరి. ఈ బాలుడు విద్యార్థిదశయందు శ్రీమన్నిత్యానందస్వామివారిచే నెల్లూరునందు స్థాపించబడిన వేదసంస్కృతపాఠశాలయందు సంస్కృతవిద్య నభ్యసించెను. అప్పుడు పాఠశాలలో చెట్లనువేసి పెంచుట, నీరు కట్టుట మున్నగు తోటపనుల స్నేహితుల జేర్చుకొని ఈ బాలుడు చేయుచుండెడువాడు. శ్రీవారి యాశీర్వాద ప్రభావమువలనను, వారి యనుగ్రహబలము వలనను యీ బాలుడు చిన్నవయస్సుననే. (౨౧-వ యేటనే) సన్న్యసించి అవధూత శ్రీసత్యానందస్వామివారని పిలువబడుచున్నారు. వీరి నిష్ఠాస్థైర్యములవర్ణింపనలవిగాదు. వీరు దినములో చాలకాలము ధ్యాననిష్ఠయందే గడపుచు యేకాంతముతో గూడిన మౌనవ్రతముగలవారై ప్రతిదినము సాయంకాలము ౮ గంటలనుండి కొన్నిగంటలు మాట్లాడుచున్నారు. అప్పుడప్పుడు భగవద్గీతాది సద్గ్రంథపఠన మొనర్చుచుందురు. వీరు కామినీ కాంచన దూరులుగానున్నారు. వీరికిసాధుసాంగత్యమన్న అత్యంతప్రీతి.

---

# పదునాల్గవ ప్రకరణము.

## —: శ్రీనిత్యానందస్వామి :—

"విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం"

ఇట్టి శ్రీ బ్రహ్మానందతీర్థస్వాములవారి మిత్రులును, బ్రహ్మనిష్ఠులని ప్రసిద్ధిజెందినవారునైన శ్రీమన్నిత్యానంద స్వాములవారి జీవితమును కొన్నిపంక్తులలో వ్రాయుట యుక్తము.

శ్రీమన్నిత్యానందస్వామి గౌడబ్రాహ్మణులు- శుక్లయాజుషులు-సారస్వత తెగవారు. వీరివంశీయులు చాతుర్వర్ణములవారికి వసిష్ఠులుగా నుండిరి. వీరు హిమాలయపర్వతసమీపమున డేరాదూన్ (సహేత్) దేశములో సీస్మనదీతీరమున శాలికోట (శాల్వపల్లి) వాస్తవ్యులు. సుబోధినిపత్రికయందు (౧—౨—౧౯౨౯) "బ్రహ్మభూత నిత్యానందస్వామి" యను శీర్షికయందు "ఈస్వామివారు పూర్వాశ్రమమున ఉత్తరహిందూస్థానమున హిమవత్సానువులనుండు కపూర్థళ (Kapurthala State) రాజ వాస్తవ్యులు." అని వ్రాయబడయున్నది.

శాలికోటయందు గాలూరాం అను సంపన్నబ్రాహ్మణగృహస్థు వసించుచుండెను. ఆయనభార్య పేరు దయాంబ.



శ్రీ ప. ప. శ్రీమన్నిత్యానంద సరస్వతీ స్వాములవారు

ఈపుణ్యదంపతులకు ౧౮౬౮ న (రక్తాక్షి సం- శ్రావణశుద్ధ పంచమి- గరుడపంచమి) శుభదినమున నొకశిశువు జనించెను. జననీజనకు లీశిశువునకు పూర్ణారాము డని నామకరణము జేసిరి. బాల్యమునుండియు పరిపూర్ణమైన బ్రహ్మమునందు రమించు వారుగాన, వీరి కీనామము సార్థక నామధేయమయ్యెను. పూర్ణా రాముని రెండవయేటనే తండ్రి స్వర్గస్థుడయ్యెను.

శాలికోట దేవాలయమునం దొకపండితుడు పురాణ కాలక్షేప మొనర్చుచుండ, పూర్ణారాము డచ్చటికేగి, శ్రవ ణము జేయుచుండెను. అందుచే ననతికాలమున జిజ్ఞాసగలిగి తమయింటికి భిక్షకువచ్చు సన్న్యాసులనడగి తన సందేహముల నివర్తించుకొని, వారికి గోక్షీరము ద్రాగనిచ్చుచుండెను. తల్లి జూచిన కోపించునేమో యని రహస్యముగా పాలను సాధువుల కిచ్చుచుండెడివాడు. మఱియు తల్లి తనకు మధురపదార్థము లెవ్వియైన తినుమని పెట్టిన, వాటిని దాచియుంచి సాధుబృంద మున కిచ్చుచుండెను.

బాల్యమునుండియు దైవభక్తి, వైరాగ్యము గలిగి యుండెను గాని, విద్యయందు మాత్రము శ్రద్ధజూపకుండెను. అందువలన పూర్ణారామునికి పదిసంవత్సరముల వయస్సున ధనార్జననిమిత్తము దయారాంబ యొకటెంకాయల అంగడిలో నౌకరి కుదిర్చెను. ఆదుకాణములో కూర్చుండి వచ్చెడివారి

కందరికీ టెంకాయల నుచితముగా పంచి యిచ్చుచుండుటజూచి యాయజమాని "అయ్యా! టెంకాయల నమ్ముమని నిన్ను నియమింపగా నీవు టెంకాయల నుచితముగ పంచిన నష్టము రాదా?" యని గద్దించెను. అందులకు పూర్ణారాముడు శాంతముతో "ఇది వేసవికాలము, ఎండలు మండుచున్నవి; టెంకాయనీళ్లను త్రాగనిచ్చిన వారి దెబ్బ తగ్గు" నని చిఱునవ్వుతో బదులుచెప్పెను. అందులకాయజమాని పూర్ణారాముని నౌకరినుండి తొలగించెను. కాన నీతడొకరోజుమాత్రమే టెంకాయల వ్యాపారము జేయగలిగెను.

ఇట్లుండ, నొకనాడు పూర్ణారాముడు తన మాతృదేవితో "సమీపగ్రామమునకు యుద్యోగాన్వేషణ నిమిత్తమేగుదు"నన, దయాంబ సంతసించి యనుజ్ఞనిచ్చినది. అయితే పూర్ణారాముడు తాను మనుజశరీరము పొందినందులకు జేయవలసిన కర్తవ్యము నిదివరకే నిర్ణయించుకొన్నవాడైనందున, బ్రహ్మజ్ఞానసంపన్నుడగుటకు తగిన యుద్యోగము (ప్రయత్నము) జేయుటకై గూఢముగా యుద్యోగమని యడిగెను. తల్లి యుద్యోగమని పుత్రుడు జెప్పినపలుకులు విని, ప్రాపంచికవిషయసుఖముల ననుభవించుట కనువగు ద్రవ్యార్జన నిమిత్తమైన యుద్యోగమని యామె దలంచెను కాని, పూర్ణారాముని మనంబును గుర్తించలేక పోయెను.

ఇట్లు తల్లియాజ్ఞ గైకొని, యొకనాటి రాత్రి, తాను ధరించిన సువర్ణభూషణములను త్వరగానూడదీసి మూటగట్టి తమ తల్లిపడక ప్రక్కననుంచి "జననీ! ఇప్పుడు నిన్ను నిద్ర లేపిన నాకార్యమునకు భంగమువాటిల్లు"నని తల్లికి నమస్కరించి, పూర్ణారాముడు పండ్రెండవయేట-౧౮౭౬లో గృహమును వదలి తీవ్రవైరాగ్యముతో గురువుకొరకై వెదుక పయనమయ్యెను.

ఇంతవరకెన్నడును పూర్ణారాముడు ప్రయాణప్రయాసముల కోర్చినవాడుగాడు, తల్లియు నీతని నతిగారాబముతో పెంచినది. గుర్వన్వేషణతత్పరుండగు పూర్ణారాముడు వాటిని లక్ష్యపెట్టక పుణ్యక్షేత్రముల దర్శించుచు, సాధువులతో సంభాషించుచు, హిమాలయము జేరెను. అచ్చట సర్వదా ఆత్మానుసంధానమొనర్చుచు బ్రహ్మకపాలము- గంగోత్రి- జమ్నోత్రిమొదలగు పుణ్యస్థలముల దర్శించుచు వసిష్ఠాశ్రమము జేరెను.

హిమాలయ పర్వతగుహలలో యేడుసంవత్సరము లన్నాహారములుమాని, తుంగగడ్డలు మాత్రమే యాహారముగా గైకొనుచు దీర్ఘ తపంబాచరించెను. ఏడుసంవత్సరంబులు తుంగగడ్డలపైననే యాధారపడి తపం బాచరించినందున పూర్ణారాముని కడుపులో నొక బిళ్ల కట్టినది. ఆబిళ్లవలన దేహపతన పర్యంత మపరిమితమైన బాధ ననుభవించిరి.

తదనంతరము ఘోరారణ్యప్రదేశములకేఁగి, యచట తపం బొనర్చునప్పుడు బూడిదను నీటిలో వేసి యవి తేఁరినతర్వాత యానీటిని దాహవిచ్ఛున్నివారణ మొనర్చుకొనుట యొక సాధువు జూచి "శరీరముండిన గదా సమస్తధర్మముల ననుష్ఠించుట కనువగును! తనగమ్యస్థానమగు మోక్షమును జేరుటకుముందే శరీరము పోయిన మరల మాతృగర్భమున బడి యమయాతన ననుభవింపవలయును గదా! కాన, నాతోరమ్మని" పూర్ణా రాముని కాశీక్షేత్రమునకు గొనివచ్చి మధుకరమును గ్రహింపుట కలవఱచెను.

అంతట పూర్ణారాముడు గంగానదీతీరమున బ్రహ్మ నిష్ఠాగరిష్ఠులైన కృష్ణానంద సరస్వతీ యతీంద్రుల దర్శించి, చాల కాలము శుశ్రూషలొనర్చిరి. కృష్ణానందస్వామి పూర్ణారాముని వైరాగ్య నిష్ఠాదార్ఢ్యముల పరీక్షించి 'ప్రణవమంత్ర' ముప దేశించి, సన్న్యాసాశ్రమమిచ్చి 'నిత్యానంద సరస్వతీస్వామి' యని యోగపట్టానిచ్చిరి. అంత నిత్యానందస్వామి తనగురువు నొద్దనే కొంతకాలముండి, చాతుర్మాస్యదీక్ష గడపుటకై కాశి కివచ్చి జేరి, శ్రీ విశ్వేశ్వరునిసన్నిధియందే ఆత్మనిష్ఠులైయుండిరి.

మనదృష్టికొంచెము శాల్వపల్లివైపు మరల్చి, దయాంబ పరిస్థితి జూచెదము గాక! దయాంబ నిద్రనుండిలేచి, తన ముద్దు లపట్టిని గానక యనేకభంగుల దుఃఖించి, తన పెద్దకుమారు

డైన పూరీరాముని పూర్ణారాముని వెదుకబంపెను. పూరీరాం తమ్ముని వెదకి వెదకి కనబడనందున వేసారెను.

ఇట్లుండ దయాంబ బంధువొకడు ౧౮౮౭ లో నామెను జూడవచ్చి పూర్ణారాముడు సన్న్యసించి వారణాశియందున్నా డనిచెప్పెను. అంతట పూరీరాం కాశింజేరి, తన తమ్ముని గాంచి, దుఃఖించి కౌగలింపబోయెను గాని. నిత్యానందస్వామి తన ఆశ్రమధర్మము కాపాడుకొనుటకై తన అన్నను తాక నివ్వలేదు.

నిత్యానందస్వామి తన తల్లి దురవస్థను సహోదరుని వలన విని, యంగీకారసూచకముగా వారిని వెంబడించిరి. తమ యూరి చేరువకు రాగానే, శ్రీ స్వామివారు సహోదరునితో "నేను యూరిలోకి రాను. గ్రామ బహిఃప్రదేశమున నీమామిడి తోటయందుందు"ననిరి. పూరీరాం తమ గృహమునకు రమ్మని యెంత బ్రతిమాలినను శ్రీ స్వామివారు సమ్మతించ లేదు.

తన పుత్రునిరాక వాయువేగమున దయాంబకు తెలి యగనే, ఆమె దుఃఖభరము నాపుకొనలేక రోదనముజేయుచు మామిడితోపునకు వచ్చి, పుత్రవాత్సల్యముచే కౌగలింపబో యెను గాని, శ్రీవారు "తల్లీ! నాకీ సమస్తప్రపంచము ప్రేమమ యముగా కన్పించుచున్నది. నీయందుప్రత్యేకించి నాకు ప్రేమ

లేదని' జెప్పి, తన ధర్మమునుపాలింప స్పృశింపనీయడాయెను. శ్రీవారంత తన మాతృదేవికి సాష్టాంగనమస్కృతు లాచరించిరి. ఆమె తన పుత్రునితో "నాయనా! ఉన్నచోటున సుఖజీవనమును వదలి, నీవు దేశదిమ్మరివై, పొట్టచేతనుంచుకొనియేల దిరిగెదవు? ఈ ముతక కాషాయాంబరముల నీసుకుమారమైన దేహమెట్లోర్చినది? ఇచటనేయుండి తపస్సు చేసుకొనరాదా!"యనెను.

అందులకు శ్రీవారు "సన్న్యసించిన నాకీబంధములేల? జననీ! నీకుమాత్రమీయశాశ్వతమైన ప్రాపంచిక వస్తువులయందు భ్రాంతియేల? నీవుగూడ నాతోరమ్ము మధుకరభిక్ష తెచ్చి సంరక్షించెదను. ఈప్రాపంచికవిషయ భోగములు, ధనము మొదలగునవి నీతో పరలోకమునకు వచ్చునా? జీవుని చిత్తము మోహమను వలలో జిక్కి, సంసారమునకు కారణమగును. అది నారాయణునియందు స్థిరమై, యితరచింతలు మాని, యాపవిత్రనామమును సదా యను సంధానమొనర్చిన మోక్ష కారణమగును. తల్లీ! మనంబు కామక్రోధాద్యహంకారముల నుండి నిర్మలమొనర్చి, జ్ఞానవైరాగ్యభక్తి యుక్తురాలవై నిరంతరధ్యానముచే స్వయంజ్యోతిస్వరూపుడైన ఆత్మ నెఱుంగుము. అప్పుడు జన్మరాహిత్యము గలుగునని" బోధించెను, దీనిని జూచినవారికి భాగవతములో కపిలాచార్యుడు

దేవహూతికిబోధించిన భక్తిజ్ఞానవైరాగ్యములు స్మరణకు రాకమానవు.

తనపుత్రుడు బోధించిన జ్ఞానమునువిని, తలయూపి "నాయనా, ఇచ్చటనున్న మనబంధువులు, నేనును కోరునదే మన, నీవుమావద్దనుండుటయే. వంశములో నీవుసన్న్యసించితివి కాన వంశము పావనమైనది. ౭౦ తరముల పితరులు తరించిరి. జ్ఞానము నార్జించుటకై నీవు సర్వసంగపరిత్యాగివైతివన మాకందరికి సంతోషమే. మేము నీవైరాగ్యయుక్తమైన యాధ్యాత్మిక జీవితమున కన్గొనరాము, నేనీ మామిడితోట యందు నీకొక యాశ్రమము కట్టించెదను. తపంబొనర్చుటకు నిర్జనప్రదేశము నేగవా నీవాశించునది! అప్పుడప్పుడు నేను వచ్చి చూచి పోవుచుండునని" చెప్పెను. అందులకు బంధుప్రీతివివర్జితులైన శ్రీవారు సమ్మతించలేదు.

అంతట దయాంబ "నాయనా! ఇచ్చట మనదాయాదులు మనకువిరోధులుగదా! అచటికి భిక్షకేగకుము. నేను నీకాహారము తెచ్చిపెట్టెద"నన, శ్రీవారు "సన్న్యాసినగు నాకెవరు విరోధులు? నాకందఱుసమానులే" యని తల్లియొక్క భేదభావమును నశింపజేయుటకై దాయాదుల యిండ్లకడనే భిక్షతెచ్చుకొని, మామిడితోటలో భుజించెను. ఆహా! ఏమి వీరి సమత్వము!

ఇట్లు మాతృదేవికి బోధగావించి, పిమ్మట మరల హిమా

లయముంజేరి గుహాలలో గిరులలో ఘోరతపమొనర్చి, తపఃఫలమగు ఆత్మసాక్షాత్కారమును పొంది, తదనంతరము శ్రీవారు దేశసంచారమునకై బయలుదేరిరి. ఇదియే గదా సద్గురువు యొక్క లక్షణము. శ్రీ రామకృష్ణపరమహంస లిట్లు సెలవిచ్చియున్నారు:— "గుమ్మడితీగ కెట్లు ఫలము పుట్టి తర్వాత పుష్పముద్భవించునో యట్లె మానవునకు ఆత్మసాక్షాత్కారమను ఫలముగలిగి, తర్వాత ప్రపంచపర్యటన, ఉద్ధరణ యను పుష్ప మంకురించవలెను. భగవత్సాక్షాత్కారముగలుగక ముందే ప్రపంచమందడుగిడిన మానవుడు సంసృతిబద్ధుడై చెడిపోవును.

శ్రీ నిత్యానందస్వామివారట్లె పరిపూర్ణమైన ఆత్మనెఱింగి, లోకోద్ధరణకై రామేశ్వరముపోదలచి కాలినడకన దినమునకు ముప్పదిమైళ్లు శాంతమనస్కులై నడచుచు పుణ్య క్షేత్రముల దర్శించుచు మార్గవశమున ౧౮౯౫ లో (మన్మథ నామ సంవత్సరము) నెల్లూరు పట్టణముజేరిరి.

సింహపురికి ఉత్తరమున పవిత్రపినాకినీనదీతీరమున శ్రీ రంగనాథస్వామివారి గొప్ప దేవాలయముగలదు. ఆ దేవాలయగోపురము మిన్నంటుచు, శిల్పవిద్యాకౌశల్యమును ప్రకటించుచు, నాస్తికులను ఆస్తికులజేయుటయందపరిమితశక్తి గలిగి వెలయుచున్నది. ప్రతిసంవత్సరము ఫాల్గుణమాసమున శ్రీ రంగనాథస్వామికి మహావైభవములతో నుత్సవములు జరు

గుచున్నవి. శ్రీ గర్భగుడియందు ప్రవేశించియున్న శ్రీ రంగనాథుల వర్ణింప నేరికితరము? పెన్నానదియొక్క చల్లని పిల్లవాయువుల కానందంబునొందుచు శ్రీ, భూ, నీలాసమాయుక్తుడై నారదాదిమునీంద్ర పరివృత్తుడై పద్మసూనుసహితుడై, సువర్ణపుష్పభూషణాద్యలంకృతుడై, బ్రహ్మానంద నిమగ్నుడై, మెత్తని శేషపాన్పున పవ్వళించి తల్పగిరి శిఖరభూషణమై, తన సన్నిధానముచే నెల్లూరుపట్టణమును పవిత్రమొనర్చుచున్న శ్రీ రంగనాథస్వామివారి దివ్యదర్శనానందము అనుభవైకవేద్యమేగాని వ్రాయుట కలవిగాదు. నెల్లూరికి నైఋతిదిక్కున మూలస్థానేశ్వరుని గొప్ప శివాలయమున్నది. ఆదేవాలయమున పరమేశ్వరుడు పార్వతీసమేతుడై, నందికేశ్వర విఘ్నేశ్వరాది ప్రమథగణసంస్తుత్యుడై, సకల పవిత్ర పుష్ప మధుఫల సమ్మిళితోద్యాన విహారయుక్తుడై, భక్తిప్రదాతయై, ప్రత్యక్షదైవమై, మహాదేవుడై, తన పాదరజముచే యీపురాతన సింహపురిని పునీతమొనర్చుచు తన దివ్యమహిమను లోకమునకు చాటుచున్నాడు.

ఇక సింహపురి ప్రజలో కొందఱు అన్యదేశ వ్యాపార సంపాదిత ధనముచే గొప్ప భవనములందు నివసించుచు, సత్కార్యములొనర్చుటయందు నిమగ్నులై, వీధి వీధికి భజన మందిరముల స్థాపించి, సదా దైవభజనలొనర్చుచు ఆనంద పడుచుందురు. మఱికొందరు మతసంఘ సేవాధురంధరులై నిష్కామసేవ లొనర్చుచుందురు. ఇంకను నెల్లూరుపట్టణము

నంను సంస్కృతాంగ్లేయ కళాశాలలుగలవు. ముఖ్యముగా వర్ణింపవలసినది స్వర్గీయ రేబాల లక్ష్మీనరసారెడ్డిగారు నిర్మించి పురజనులకొసంగిన పురసౌధము. అది సుందరతర ఆనందమయ ఉద్యానవన ప్రావృత వివిధ దేశనాయక చిత్రపటములతో శోభిల్లుచున్నది, మొన్న మొన్న నే వీధివీధికి విద్యుద్దీపములు అలంకారప్రాయములుగా నున్నవి.

నెల్లూరుమూలపేట కోనేరువద్ద శ్రీ నిత్యానందస్వాములు కొంతకాలముండిరి. శ్రీవారి నప్పుడు సేవించినవారిలో మంగు రామానుజరావు, సూరి శివయ్య, కుప్పచ్చి లక్ష్మయ్య మున్నగువారు ముఖ్యులు.

శ్రీవారేకాంతమును గ్రామబహిఃప్రదేశమును కోరువారుగాన నెల్లూరు నవాబుపేట సమీపమున మైపాటిరస్తాకు ఉత్తరమున పినాకినీనదీతీరమున వేమూరివారి చూతవనమునందుండిరి. అచట నొకచిన్నగది నిర్మింపబడియున్నది. ప్రతిదినమును రాత్రిసమయమున నెంతపొద్దుపోయినను, ఆకసమంతయు కారుమబ్బులుకమ్మి కుంభవర్షము కురిసియు మెట్టి గాంధాంధకార నిశీధమైనను, శ్రీవారు తోపులోనున్న యాశ్రమమునకు పోవలసినదే. శ్రీవారు తోపునందు పెట్టెబండివంటి దారుమయ కుటీరమున నిద్రించుచుండిరనియు, రాత్రులందేయామమున నిద్రింతురోగాని, సాధారణముగా జాగ్రదవస్థ

యందే ఆత్మానుభవతత్పరులై యుందురనియు, వీరు భిక్షులకు బోవు స్థళములందు ఉపనిషత్పారాయణము, వేదపారాయణము, పురాణేతిహాసశ్రవణములు జరిగించుచుండెడివారనియు సుబోధిని పత్రిక తెల్పుచున్నది.

శ్రీవారి సాన్నిధ్యమున కేగు ప్రతివారికిని వారిముఖమునందు ప్రకాశించు దివ్యబ్రహ్మవర్చస్సును జూచినకొలది జూడవలయుననియే తలంపు జనించునుగాని, వేదాంతవిషయమై ప్రశ్నలవేయవలయుననిగాని, వారిబోధ వినవలయుననిగాని కోరిక యెవరికినిగలుగదు. వారి దర్శనముచేతను, మౌనబోధచేతను, ఆనందము గలుగుచుండ, ప్రశ్నలేల? బోధలేల? అట్లని మనోపారిశుద్ధ్యముగలిగిన మోక్షాధికారికి బోధించకపోరు. వారితో రహస్యముగా వేదాంతతత్వమును తను మృదుమధుర వచనములచే అమృతతుల్యమొసగుదురు. వినోదార్థమడుగువారికి "సర్వం బ్రహ్మమయ"మని మాత్రము బదులుజెప్పుదురు. దీనినిగూర్చియే సుబోధినిపత్రికలో యిట్లు వ్రాయబడియున్నది. "శ్రీ స్వాములవారు శుష్కాడంబర వేదాంత ప్రలాపముల కవకాశమిచ్చువారుకారు. శ్రీవారు తఱచు భిక్షలకేగు ముఖ్యశిష్యుల గృహములకు నృసింహలోకము, కైలాసము, సత్యలోకము, బ్రహ్మలోకము మున్నగు స్మారకనామముల బెట్టుచుండిరి".

శ్రీవారు పరమవైరాగ్యసంపన్నులుగాన, వీరి దివ్యపాదములను పూజించుసమయమున వర్పించు సువర్ణమును చేతనైన నంటువారుకారు. వీరు భిక్షులకడను పాదపూజలకడను యెట్టినిర్బంధములను ఆడంబరములను జూపువారుకారు. వీరి సన్నిధి శిష్యులకపరిమితానంద నిలయమైయుండెను. ఇట్లు శిష్యులర్పించిన ద్రవ్యము పదివేలకుమించగా నెల్లూరు ట్రోన్ హాసుపేట పెద్దవీధిలో ముందుండిన శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ధర్మక్రానేటియెదుట "శ్రీపరమహంస నిత్యానందస్వామి వేదసంస్కృత పాఠశాల"యను పేర నొక విద్యాశాలను స్థాపించిరి. ఈపాఠశాలయందు వేదము, స్మార్తము, శాస్త్రము, కావ్యములు బోధింపబడుచున్నవి. వీటిని బోధించుటకై వేత్తారు యుపాధ్యాయులుగలరు. కొంతమంది విద్యార్థులకు భోజనవసతియు గలదు.

శ్రీవారొకపర్యాయము వేమూరుచిదంబరశాస్త్రి మున్నగుపండితులతో వెంకటగిరి కేగిరి. శ్రీవారొకతోటయందుండ, వేంకటగిరికుమారరాజాగారు- సర్వజ్ఞకుమారయాచేంద్రులు- దర్శించి పూజించిరి. రాజాగారితో ప్రస్తావనవశమున చిదంబరశాస్త్రిగారు "శ్రీస్వాములవారు నెల్లూరునందొక వేదసంస్కృతపాఠశాలను స్థాపించి నిర్విఘ్నముగ సాగించుచున్నారు, దానికి ప్రజాపోషణతో బాటు రాజపోషణయుండిన బాగుండునన"తత్క్షణమే రాజాగారు ప్రతినెలకును ౨౫ రూపా

యల నిచ్చునట్లు శాసనముజేసి, వేదము జెప్పు ఉపాధ్యాయునకు జీతముగా ఖర్చుపెట్టుమని చెప్పిరి. అధనమిప్పటికి పాఠశాలకు జెందుచున్నది.

శ్రీవారిపాదములను కొందరు అష్టోత్తరశతనామములతో పూజించుచుండిరి, వీరిని కవులననేల? గాయకులననేల? ధనికులననేల? దరిద్రులననేల? సర్వభూతములు యథాశక్తి పూజించి కృతార్థతజెందినవే. వీరిపై "నిత్యానందభజనకీర్తన"లను పొత్తము ప్రచురింపబడియున్నది. కాళహస్తి సంస్కృత పాఠశాల పండితులు శ్రీవారిపైక్రింది శ్లోకములచే కీర్తించి కృతార్థులైరి.

### శ్రీ నిత్యానంద పరమ గురుధ్యానము.

నిరీక్షణకళామాత్ర భస్మితాశేష కల్మషం,
నిత్యానందయమిశ్రేష్ఠం నౌమిజ్ఞాన సుధాముచం. ౧.
త్యక్తాశేషహృషీకవృత్తిరపియో లోకప్రవృత్త్యైముదా,
భిక్షాద్యాగమఘుష్టవృత్తికలనా సమ్యక్ప్రసీతాశ్రితః
సోఽయంజ్ఞాననిధిః గుణాళిజలధిః పూర్ణానుకంపానిధిః,
నిత్యానందయమీశ్వరో, విజయతాం శ్రీదివ్యతేజోనిధిః. ౨.
యం దృష్ట్వా విబుధావళి స్సులభతే హ్యానందమవ్యాహతం,
యద్భక్త్యా కవయోభవంతి, నితరాం ప్రజ్ఞావిహీనాఅపి,
తం విద్యాప్రవిలుప్త మోహనివహం వందే సదాసద్గురుం,
నిత్యానందయతీశ్వరం సుమనసా శ్రీచిత్సుఖావాప్తయే. ౩.

పదం సౌజన్యస్య శ్రుతివిహితయోగ స్యజనిభూ
స్సదాధ్యాత్మస్యాప్తేఃఖనిరు రుదయాలాస్య భవనం
సమీచీనః పంథా నియమపది ప్రాజ్యాశ్రితవిధేః,
సదా నిత్యానంద ప్రథితయతివర్యో నతుముదా ౪.

మఱియు శ్రీవారిని శ్లోకములచే స్తోత్రము జేసినవారిలో వేమూరు చిదంబరశాస్త్రిగా రొకరు. వీరు క్రింది శ్లోకపంచకమును రచించి, శ్రీవారిసన్నిధిని జదివి యర్పించిరి.

## పంచరత్నములు.

సత్యజ్ఞాన సుఖస్వరూప మమలం ప్రత్యంచ మఘ్యాపహం,
సత్తామాత్ర మనామయం సువిలసత్పాపాటవీ పావకం,
నిత్యం సత్పథదర్శనం సుమనసా మానంద సంధాయకం
నిత్యానంద గురుం భజే హమనిశం ప్రత్యక్ష శంభుం పరం. ౧.
సర్వారంభవిరామకార్యసముదృక్సర్వోత్తమం సత్తమం,
సర్వాభాసమభాసమాద్యమజరం సర్వాతిగం సర్వగం,
నిర్వాణాధిప మాత్మరూప మభితస్సర్వం సహానాయకం,
నిత్యానందగురుం భజే హమనిశం ప్రత్యక్ష శంభుం పరం. ౨.
విశ్వస్తుత్యగుణాశ్రియం సురమునిశ్రేణీనుతం శ్రీకరం
విశ్వాన్తర్బహిరాతతం హి సతతం విశ్వాసగమ్యం పరం
విశ్వేశాది సమస్తవస్తుసుమనః పంకేజ హంసాయితం,
నిత్యానందగురుం భజే హమనిశం ప్రత్యక్ష శంభుం పరం. ౩.

శ్రీమచ్ఛంకరదేశికాది విబుధ శ్లోక్యం సదాధారకం,
భూమానంద ఘనం చిదాత్మక మజం పూర్ణాద్వితీయం విభుం
భూరాదిప్రచయాశ్రయం పరగురుం ప్రత్యక్స్వరూపామలం,
నిత్యానంద గురుం భజే హ మనిశం ప్రత్యక్ష శంభుం పరం. ౪

శ్రీమత్సింహపురీ నివాసజన దృక్పంకేజమిత్రం శివం,
గంగాతుల్య పినాకినీ శుభతటీ మాకందవారాశ్రయం,
చిద్వ్యోమాఖ్య మనోవిహారకుశలం చిద్వ్యోమధామాశ్రయం,
నిత్యానందగురుం భజే హ మనిశం ప్రత్యక్షశంభుం పరం. ౫

శ్రీవారికి జననదేశమగు పంజాబునందు చాలమంది శిష్యులుగలరు. వీరు నెల్లూరికివిచ్చేసిన తర్వాత వీరిజ్ఞాననిష్ఠ కఠినతమ వైరాగ్యమున కచ్చెరువంది కొందరు శిష్యులైరి. ఈవిషయమై సుబోధినిపత్రిక యిట్లు తెల్పుచున్నది: "ఈ పెద్ద నెల్లూరికంటెను జన్మదేశమున వీరికి శిష్యకోటి యెక్కువగ నుండినది. వీరిశిష్యులనేకులు పంజాబుప్రాంతములో సుబేదార్ మేజర్లు సర్దార్ బహద్దర్ రిసాల్దార్లుగా నున్నారు. అట్లు వారపుడపుడు తమసైనికోద్యోగములలో విరామమునుబొంది, వీరిసేవ నపేక్షించి వీరిని స్వదేశమున కాహ్వానించుచుండిరి. సాధారణముగా ప్రతిసంవత్సరమును కొన్నిమాసములు కాశ్మీర పాంచాల హిమవత్ప్రాంతములలో శిష్యకోటినానందింపజేయుచు వారికి తత్త్వోపాయముల నుపదేశించుచుండుదురు".

శ్రీవారి కనవరతము "శంభో త్రినయన చంద్రచూడ శివ" యను కీర్తనను తమశిష్యులచే పాడించుకొని, యానందించుటయం దభిరుచిమెండు. పాఠకులు భక్తితో యాపాటను పాడుకొనుటకై యిట పొందుపరచుచున్నాము.

శంభో త్రినయన చంద్రచూడ శివశంకర గిరిజాకాంత,
అంభోజాసన ముఖ్య దేవతా నందిత చరణోపాంత,
కాలకాల కరుణామయ మూర్తే కలికలుషాపహకీర్తే,
నీలరుచి గళానంద నీరదనిర్మల చిన్మయమూర్తే,
తాపత్రయహర పాపవినాశన పురుషోత్తమ త్రిపురారే,
చాపభూత కనకాచల దోర్బల ఖండిత నిఖిల సురారే,
భక్తిం తవపద పంకజ యుగళే భక్తజనావన దేహి,
ముక్తిసరణి మనిశం మదనాంతకమృత్యోర్మాంపరి పాహి.

శ్రీవారొకపరి శ్రీశైలారణ్యమార్గమున బోవుచుండ నొక బెబ్బులి గర్జించుచు శ్రీవారివైపు కూ్రరమైనచూపుల తో జూచెను. పులిని గాంచి, శ్రీవారు కూర్చుండి "నారాయణస్వరూపా! రమ్ము! నన్ను భక్షించి నీయాకలి దీర్చుకొమ్ము" నిరి. అంత నాపులి సంతోషమును వెలిబుచ్చుచు తోకనాడించుచు నమస్కారమొనర్చునట్లు ముందరికాళ్లను రెంటిని నేలకు వంచి, శ్రీవారికేమియు హానియొనర్పక మరలిపోయెను. ఆహా! తపోమహిమగలవారి సన్నిధిచే కూ్రరమృగములు సైతము సాత్వికగుణమును వహించునుగదా!

అంత శ్రీవారాయడవిలో సంచరించుచు, డస్సి యొక దేవాలయమున విశ్రాంతి గైకొనుచుండిరి. ఇట్లుండ నొక బాలుడు వీరిసన్నిధికివచ్చి "స్వామీ! తమకాహారము తెచ్చెద"నన, శ్రీవా రుదాసీనులై యుండిరి. అదియే పూర్ణానుగ్రహమని భావించి, బాలు డింటికేగి తలిదండ్రులను ఆహారము కోరగా వారా బాలుని దూషించి 'సాధుసంతర్పణకు వలయు వస్తుసామగ్రి ప్రతిదినమును యెచ్చటనుండి వచ్చు?'నని గద్దించిరి. తుదకు బాలుని బలవంతముచే విసుగుకొనుచు విధిలేక ఆహారమును మూటగట్టి యిచ్చిరి. బాలుడు త్వరితగమనమున శ్రీవారియొద్దకు వచ్చి ఆహారమునుస్వీకరింపుడని ప్రార్థింప, శ్రీవారామాహారములోకొంత భుజించబోగా వాంతియయ్యెను. సర్వజ్ఞులుగాన సందర్భమును గ్రహించి, శ్రీవారు "నాయనా! నీవు భక్తుడవైనను నీతలిదండ్రు లీయాహారమును హృదయపూర్వకముగా నొసంగినవారు కారుగదా"? యనిరి. అందులకా బాలుడు పరితపించుచుండ, శ్రీవారు "ఇందున నీదోషమేమున్న?" దని యోదార్చిరి. అంత నా బాలుడు యింటికి పోవుచు "ప్రీతితో బెట్టినది పిడికెడే చాలుగదా" యని తలంచుచు చింతించెను.

అణిమాద్యష్టైశ్వర్యసిద్ధులు ముక్తి కంతరాయములని సూరులువాటిని యుపేక్షించియుందురన, శ్రీనిత్యానందస్వామి

వారా కోటిలో జేరినవారైనందున శ్రీవారిశిష్యులు జెప్పిన జరిగినయంశములను కొన్నిటిని యిట బొందుపరచుచున్నాము.

శ్రీవారొక సమయమున పినాకినీనది నురుగులుగ్రక్కుచు పూర్ణముగ ప్రవహించుచుండ, నా నదీవేగంబునకు తటంబుల గడ్డలు విరిగిపడుచుండ, శ్రీవారు అర్ధరాత్రంబున నదీ మధ్యంబున ఆసనమువైచుకొని కూర్చుండి కదలక ప్రణవనినాదము ధ్వనింపజేయుచుండిరి.

శ్రీవారు మామిడితోటలో నొక దారుమయ పేటిక యందు పరుండ, నామహాత్ముని శిరముపై నొక నాగేంద్రుడు తన పడగనువిప్పి నాట్యమాడుచుండెను. ఆనాగేంద్రుని ఫణాగ్రమందలి రత్నకాంతులచే నిరులు పటాపంచలగుచుండెను. ఎవ్వరైన మనుష్యమాత్రుడు తోటలో నడుగిడగనే యాసర్పమంతర్ధానమగుచుండెను.

శ్రీవారు రాత్రిసమయంబున మామిడితోటకు పోవుచుందురని వ్రాసియుంటిమిగదా! భిక్షు కాహ్వానించువారును మరికొందరును కలసి రాత్రులందు శ్రీవారికి యుత్సవములు జరిపి మామిడితోటలో జేర్చి, తిరిగి పట్టణమునకు వచ్చుచుండిరి. అట్లొకనాడు పురప్రముఖులు యుత్సవముతో శ్రీవారిని తోటయందువిడిచి నమస్కరించి తోటవీడిపోవునపు డేలకో నొక సాలెవాడుమాత్ర మాతోటలోనే యొక ప్రదేశ

మున పరుండెను. స్వామియు దారుమ పేటికయందు నిద్రించిరి. అర్ధరాత్రమగునప్పటికి సాలెవానికి శ్రవణానందముగ వీణానాదము దేవఋషి సంభాషణము వినవచ్చెను, ఈ సంభాషణ యెక్కడిదా? యని సాలెవాడు ప్రక్కకు పొర్లగనే దారుమయ పేటిక తేజోమయమై కన్నుల చెదర్చెను. దేవఋషులు సంభాషణ చాలించి యంతర్ధానమైరి. వాడు బాగుగా మెలకువగలిగి పరీక్షింప దలచునప్పటికి శ్రీవారు తోటలో మానవస్పర్శ గలదని యెఱింగి, వాని సమీపమున కన్పించి "నీవెందుల కిక్కడనుంటివి? పొమ్ము"ని యాజ్ఞనిచ్చిరి. వాడంత లేచిపోయెను. అహా! మానవస్పర్శ దేవతలకు తగదుగదా?

ఇట్లుండ శ్రీవారి దేహము వృద్ధత్వమునొంది శరీరస్వత్వము క్రమముగా క్షీణింపజొచ్చెను. నేత్రపాటవము సంచారశక్తి తగ్గినందున శ్రీవారు తోటకుపోజాలకుండిరి. అందువలన శ్రీవారు రాత్రికాలమునుగూడ పాఠశాలయందే గడపుచుండిరి. దారుమయ పేటిక పాఠశాలకు తెప్పించిరి. అనారోగ్యస్థితి యెక్కువై, దేహబాధ యెక్కువగనుండెను. అయితే శ్రీవారు అపరిమితమైన బాధ ననుభవించుచున్నను, ఆత్మానంద స్థితిలోనేయుండిరి.

ఇట్లుండ వేంకటగిరి కుమారరాజాగారియాహ్వానముపై శ్రీవారు వెంకటగిరికేగిరి. రాజగారు సంస్థానవైద్యులచే చికిత్స

చేయుంచరిగాని, వ్యాధి బలవత్తరమగుచుండెను. శ్రీవారు తమ శిష్యులతో "అమావాస్యదినమున దేహత్యాగముగను నిశ్చయించితిని" మని జెప్పిరి. అప్పుడు శ్రీవారు, హరిహరానంద తీర్థస్వామి నీశావాస్యోపనిషత్తును పూర్తిచేయునంతలో ముమ్మారు ఓంకారమును బిగ్గరగా నుచ్చరించుచు యువనామసంవత్సర పుష్య బ౧౫లు శుక్రవారము పూర్వాహ్ణమున సుమారు ౯-౧౦ నిమిషములకు దేహమునువిడిచి పరమశాంత సచ్చిదానంద స్వరూపులైరి.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మవ్యాహరన్మామనుస్మరన్
యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్.

శ్రీవారు మహాసమాధి జెందిరను వార్త దవానలము వలె వ్యాపించి, శ్రీవారి శిష్యులను వెంకటగిరినివాసులను సంతాప సముద్రమునముంచినది. దేశదేశములనుండి శిష్యులేతెంచిరి. అంతట శ్రీవారిదేహమును పుష్పమాలా లంకృతమొనర్చి వివిధవాద్యములతో నూరంతయు యుత్సవముల జరిపిరి. వేలకువేలు జనులు వచ్చి, శ్రీవారి దివ్యమంగళవిగ్రహమును జూచి స్తోత్రనమస్కారము లొనర్చిరి. ఆజన సమూహమును జూచిన శ్రీవారియందు ప్రజల కెంత భక్తియో విశదమయ్యెను. శ్రీవారిశరీరము నంతే సమాధిగత మొనర్చిరి. శ్రీవారిబృందావనము (సమాధి) వేంకటగిరిలో కైవల్యనదీపూర్వ తీరమున వెలిసియున్నది. పెక్కుమంది సమాధిని దర్శించియు సేవించియు యాధ్యాత్మికలాభమును పొందుచున్నారు.

# శ్రీమన్నిత్యానంద యతీశ్వర స్తవము

"శ్లో. శ్రీమద్బ్రహ్మవిదగ్రణిం గుణమణిం తత్త్వార్థచింతామణిం
చిన్ముద్రాంచిత హస్తపద్మయుగళం చిన్మార్గసంచారిణం
భావాతీత మహాప్రభావసహితం బ్రహ్మాత్మసిద్ధింగతం
నిత్యానందయతీశ్వరం హృదిభజే నిస్సీమసత్సౌహృదమ్॥

శ్లో॥ నిత్యానందసుధాబ్ధిపూర్ణశశినం తత్త్వామృతాస్వాదినం
నిత్యానంద సుధాపరిపూరిత నిజస్వాంతాంబురుట్తల్లజమ్
నిత్యానంద జలప్రవర్షణఘనం నిత్యప్రమోదప్రదమ్
నిత్యానందయతిం భజామి సతతం నిర్వాణసౌఖ్యప్రదమ్।

శా॥ శ్రీనారాయణ నామసంస్మరణ భ
స్మీభూత తాపత్రయా
నానా వేదపురాణశాస్త్రనిపుణా
నవ్యస్మితాస్యాబ్జ! బ్ర
హ్మానందాబ్ధిసుధాకరా! పరమహం
సాధ్యానుసంచార! ని
త్యానందాఖ్యయతీంద్ర! చెందితివె!
నిత్యానంద బ్రహ్మంబొగిన్॥ 3

సీ. శ్రీహిమవత్ప్రాంత సీస్మానదీతటో
ద్భాసితంబగు శాల్వాపల్లె వాసు

తా గాలురాం దయాంబా గర్భదుగ్ధాబ్ధి
చంద్రులై, యోగనిష్ఠంద్రులగుచు
బ్రహ్మణ్యమూర్తి పూర్ణారాంసమాఖ్యచే
రాజిల్లి జ్ఞానవిభ్రాజులగుచు
నవని కృష్ణానంద యతివర్యశిష్యులై
సన్న్యస్తసర్వులై శాంతులగుచు
జగతి సిత్యానందస్వామినా మహితాఖ్య
భాసిల్లి బ్రహ్మవిద్వర్యులగుచు
తమ పాదధూళిచేతను సింహపురసీమ
సుపవిత్రముగఁ జేసి, విపులకీర్తి
వేంకటగిరి మహావిఖ్యాత సంస్థాన
రాజకోటి స్వశిష్యరాజకోటి

గీ॥ సుస్థిరింపగ తమభూమి సిద్ధిబొంద
నెంచి యేతెంచి, తమ దేహముంచి, సిద్ధి
గాంచి తీరలు బ్రహ్మైక్యముఖ్యులగుచు
భవ్యయోగాబ్ధిచంద్ర! కృపాయతీంద్ర! ౮

శా॥ శ్రుత్యంతాంబుధిచంద్ర! శాంతసుగుణ
శ్రీభూషితోపేంద్ర! స్వా
ర్థత్యాగాసురచంద్ర! భక్తిపరమా
ర్థజ్ఞానబోధేంద్ర! స

ద్భుతార్త్యంధతమోదినేంద్ర! కలుషా
ప్రచ్ఛేదదేవేంద్ర! శ్రీ
నిత్యానందయతీంద్ర! మమ్ము విడి తే
నిర్యాణమున్ జెంది తే. ౫

సీ॥ స్వామి! నిత్యానంద! సర్వసద్గుణకంద!
వందితాశేష సద్భక్తబృంద!
మాననీయచరిత్ర! మహిత సంస్తుతిపాత్ర!
మానసాంతర గతామ్నాయసూత్ర!
సాధుసజ్జనసంగ! షడ్రిపుస్మయభంగ!
ఆత్మయోగపరిపూతాంతరంగ!
మందహాసవికాస, మంజువాక్యవిలాస!
మహిత భావిత పరబ్రహ్మభాస!

వినుత సుగుణాలవాల సద్వినుతశీల
నీదు మహిమంబుఁ బొగడంగ మాదువశమె
సంగతాగమసార సర్వేంగితజ్ఞ
సత్త్వగుణధామ! యతిజనసార్వభౌమ. ౬

సీ. స్థాపించినాడవు సంస్కృతవేద వి
ద్యాలయంబొండు హార్యక్షపురిని
నిల్పినాడవు హరినిలయమందిరమందు
శ్రీరామకృష్ణులప్రీతితోడ

గాంచినాడవు యశఃకౌముదీసంపద
నాచంద్రతారార్క మవనియందు
నంచితంబుగ నధిష్ఠించినాడవు బ్రహ్మ
రథమవనీసురుల్ రహిని బట్ట
గీ॥ హరిహరానంద తీర్థాఖ్య యతివరేణ్యు
లుపనిషద్వాక్యచయమెల్ల నొగి పఠింప
ప్రణవనిస్వనయుక్తి బ్రహ్మత్వసిద్ధి
గాంచినాఁడవు నిన్నెన్నఁగా వశంబె! ౭

శా॥ పౌరుల్ మీచనుమార్గమున్ దఱిసి స
ద్భక్తిన్ నతుల్ సల్పఁగా
ధారాళంబుగఁ జోవనీక మిము త్వ
త్పాదాబ్జముల్ పట్టుచున్
నాకీరత్నములెల్ల మ్రొక్కిడంగన్
"నారాయణా" యంచు సు
స్మేరాస్యాబ్జముతో నొసంగెదు శుభా
శీర్వాదముల్ స్వామిజీ.
క॥ శ్రీమన్నిత్యానంద
స్వామిన్ యువవర్ష పౌష్య బహుళశవహూయాం
శ్రీమద్బ్రహ్మణి పరమే
సమ్యక్ లీనోసి! మోక్షసమాశ్రిట్ వాసీ. ౮

# పదునైదవ ప్రకరణము.

## —: శ్రీశంకరజయంతి—శిష్యులతో తీర్థయాత్ర :—

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత,
కుర్యాద్విద్వాంస్తథా సక్తశ్చికీర్షు ర్లోకసంగ్రహమ్.

—గీత

నెల్లూరుపట్టణమందు శ్రీ బ్రహ్మానందతీర్థస్వామియుండ, వాకాటిగ్రామ నివాసినియగు అల్లూరు ఆదిలక్షమ్మ, శ్రీవారిని తమయూరికి రమ్మని యాహ్వానించినది. శ్రీతీర్థస్వాములును సమ్మతించి వాకాడు గ్రామమున కేగిరి.


ఆదిలక్షమ్మ బాల్యమునుండియు ప్రాపంచిక తుచ్ఛభోగముల నిరసించి, నైష్ఠిక బ్రహ్మచారిణిగా నుండిన యోగిని. ఈమె సంస్కృతభాష నభ్యసించి, అధ్యాత్మికగ్రంథముల పఠించుచు, సాధుసాంగత్యము సంపాదించుకొనుచు సత్కాలక్షేపము జేయుచున్నది. స్వగ్రామమగు వాకాటియందు చాలధనమును వ్యయపరచి, రామమందిరమును ప్రతిష్ఠించి, పూజలు పురాణశ్రవణము యథావిధిగా జరిపించుచున్నది. ఇందువలన నీమెయొక్క పారమార్థిక తత్త్వము వెల్లడియగుచున్నది.

శ్రీతీర్థస్వామివారు ఆదిలక్షమ్మ యాహ్వానముపై యనే

కపర్యాయములు నాకాటిగ్రామమునకు వెళ్ళియుండినను, అప్పుడప్పు డచటజరిగిన జీవితాంశములను గ్రంథసౌకర్యము నకై యీప్రకరణమునందే పొందుపరచుచున్నాము.

శ్రీతీర్థస్వామివారు నాకాటిగ్రామమున నున్నంతవరకు సువర్ణముఖి నదీతీరముననున్న నాగేశ్వర దేవాల యావరణము లో నొకపర్ణకుటీరములో నివసించుచుండిరి. రాత్రిసమయమున నచ్చటనే శయనించుచుండిరి. అయితే పగటిపూట అప్పు డప్పుడు రామమందిరమునకును, ఆగ్రామ నివాసియగు వేమూరు చిదంబరశాస్త్రిగారి గృహమునకును వచ్చుచుండిరి. శాస్త్రిగారు శ్రీ స్వాములవారిని సదా సేవించుచుండెడివారు.

శ్రీస్వామికి భిక్షచేయుట కనేకమంది ధనాఢ్యులు కనిపెట్టు కొనియుండినను, అప్పుడప్పుడు నిరహంకారసూచనగ భిక్షాట నము చేయుచుండిరి. శ్రీ స్వామి చిదంబరశాస్త్రియింటికి భిక్షకు పోవుచుండువారు. అప్పుడు శాస్త్రిగారి జ్యేష్ఠపుత్రుడగు సత్య నారాయణయను పసిబాలుడు దోగాడుచు శ్రీవారిని స్పృశింప బోగా వారు కమండలుజలమును శిరముపై ప్రోక్షించుచుండిరి అప్పుడీబాలు డటునిటు కదలక భూమికంటుకొని పోయినట్లుం డును. భిక్షనుగైకొనిన తర్వాత శ్రీ స్వామివారు పోవునప్పుడు మరల జలమును జల్లగా యీబాలుడు దోగాడుట కారంభిం చును. ఇదిగాక శ్రీ స్వామివారు చిదంబరశాస్త్రియింటికి వచ్చి



నప్పుడెల్ల నీబాలుని శిరమును తమ దివ్యహస్తములతో నిము రుచు నేమో మంత్రము జపించుచు, కమండలుజలము జల్లువారు. ఒకొక్కప్పుడు శ్రీ స్వామివారీ బాలుని నుదుటి ముద్దాడుచుం డిరి. తాము స్వయముగా తినుబండారముల నీబాలునకు పెట్టు చుండిరి. శ్రీస్వామివారు చిదంబరశాస్త్రితో "ఈబాలుడు బాల్యముననే సన్న్యసించి బ్రహ్మనిష్ఠుడగు"నని సెలవిచ్చిరి. అందులకు శాస్త్రిగారు "తమ యాశీర్వాద ప్రభావముచే యట్లుగాక మరియొకవిధముగానగునా"? యనిరి. ఎన్నియో పర్యాయములు శ్రీ స్వామివారీబాలునిశిరమున్న "తమహస్త స్పర్శనములనుంచి యాశీర్వదించుచుండిరి. మహాత్ముల హస్త స్పర్శ, ఆశీర్వాద మెప్పుడైనను వృథయగునా? కనుకనే హస్త నిక్షయనియు నందురు. శ్రీ స్వామివారు నుడివినట్లు సత్యనా రాయణ చిరుతప్రాయముననే నెల్లూరి పట్టణ వాస్తవ్యులైనప్పటి మున సన్న్యసించి వైరాగ్యనిష్ఠతో నెలకొనియున్నారు. వీరి స్వాదు అవధూత శ్రీ సత్యానందస్వామియని వ్యవహరింపబడు చున్నారు. వీరికి నెల్లూరుజిల్లా, కోవూరుతాలూకా, ఇసుకపల్లి గ్రామము సమీపమున శ్రీ సత్యానందాశ్రమమను నొక యాశ్రమ ము గలదు. ప్రస్తుత మచట నివసించుచున్నారు. తపశ్శక్తి గల్గిన మహానుభావులు హస్తదీక్ష నిచ్చిన శిష్యులనంతములగుదు రట్టి కెట్టియో తెలియదు. మహాత్ముల దర్శనమువలన సంభాషణ, సంభాషణవలన ఉపదేశము, ఉపదేశమువలన

హస్తదీక్ష (దివ్యస్పర్శ) క్రమముగా శ్రేష్ఠముఖ గదా!

చిదంబరశాస్త్రి గారొక యర్ధరాత్రిమున శ్రీస్వామి వారేమిచేయుచున్నారో జూడనుత్సహించి నాగేశ్వర దేవాలయమునకేగి, కుటీరమున శ్రీస్వామిని గానక, అచ్చటచ్చట వెదుకగా శ్రీస్వామిసువర్ణముఖీతీరమున నిర్జనమగుస్థలమున నేకాంతముగా పిల్లతెమ్మెరలు వీచుచుండ, పద్మాసనస్థితులై సమాధినిష్ఠులై యుండుటగాంచి, శాస్త్రిగారు పరమానంద భరితులైరి.

శాస్త్రిగారొకనాడు శ్రీస్వామివారి నేకాంతమున దర్శించి "స్వామీ! మనుష్యత్వమును సార్థకపరచుకొను నుపాయంబెద్ది?" యని ప్రశ్నించెను.

స్వామి:— శాస్త్రీ! మనుష్యత్వము సార్థకపరచుకొనుటకు ముముక్షువు కావలెను. ముముక్షువై ఈశ్వరార్పణబుద్ధితో భగవత్కార్యముల నొనర్పవలెను గాన, నీవు ప్రతిసంవత్సరమును దేహాభిమానము నశించునట్లు భిక్షమెత్తి శ్రీదత్తాత్రేయజయంతి జరుపు" మని యాజ్ఞాపించి సువర్ణముఖీతీరముననే శాస్త్రిగారికి శ్రీదత్తమహామంత్రము నుపదేశించిరి. మంత్రముపదేశింప బడగనే శాస్త్రిగారి యానందమునకు మేర లేకపోయెను. ఇప్పటికిని శాస్త్రిగారు మంత్రమును జపించుచు, ప్రతిసంవత్సరమును శ్రీస్వామివారి యాజ్ఞను జవదాటక శ్రీదత్తజయంతిని జరుపుచున్నారు.

శ్రీస్వామివారంత ఆదిలక్ష్మమ్మతో "రామమందిరమందు శ్రీశంకరజయంతి(ఆదిశంకరాచార్యుల జన్మదినోత్సవము) జరుపు నట్లాజ్ఞాపించిరి. ఆగమశాస్త్రరీత్యా జయంతిసందర్భమున మహాన్యాసరుద్రాభిషేకము, పూజలు, సూత్రభాష్యాది పారాయణము, శంకరవిజయపారాయణ పురాణములు జరుగునట్లు నిర్ణయించిరి. ఆ ప్రథమసంవత్సరము శ్రీస్వామివారే యితరులకు దుస్సాధ్యమైన సూత్రభాష్యపారాయణము, శంకరవిజయపురాణము జరిపి, అందరికి అత్యాశ్చర్యమును గలిగించిరి. శ్రీవారు లేని సమయమున సూత్రభాష్యపారాయణమునకు శంకరవిజయ పురాణమునకును యిద్దరు విద్వాంసులు కావలసివచ్చినది. ఇప్పటికిని శంకరజయంతి, ఉత్సవములతో మహావైభవముగా జరుగుచున్నది. సుమారు ౧౫-౨౦ వరకు శ్రీశంకరాచార్యచిత్రపటముతోనే జయంతిజరుపబడుచుండెను. ఇటీవల ఆదిలక్ష్మమ్మగారు పంచలోహములతో శ్రీశంకరవిగ్రహమును చేయించి, యుత్సవముల జరిగించుచున్నారు. దీనివలన నీమెకు శ్రీస్వామివారి యెడలను శ్రీ శంకరులయెడలను గల దృఢతరభక్తి విశదమగుచున్నది.

శ్రీరామమందిరమున చిదంబరశాస్త్రిగారు ప్రతిదినము వేదాంతపంచదశియను గ్రంథమును శ్రీస్వామివారిసన్నిధిలో పఠించుచుండిరి. ఒకదిన మాగ్రంథ మగుపడలేదు. వెదుక నారంభించిరికాని, యెచటను కాన్పించలేదు. తుట్టతుదకీసమాచారము

శ్రీతీర్థస్వామికి తెలిసి, "శాస్త్రీ! నీ వెందులకా గ్రంథము కొరకింతగా వెదకెదవు? రేపు రామమందిరావరణములోనే దొరుకు"నని జెప్పిరి. శాస్త్రిగారు స్థిమితముగానుండ మరుసటిదినమున నటునిటుతిరుగుచుండగా నామందిర ప్రాకారగోడ గూటిలో గ్రంథము కాన్పించెను. శాస్త్రిగా రాశ్చర్యపడి "స్వామీ! తమకు భవిష్యద్వృత్తాంత మెరుంగు దివ్యదృష్టియు గలదే!" యన, శ్రీస్వామివారు, "కార్తవీర్యార్జున ఉపాసనసిద్ధివలన పోయినవస్తు వెక్కడనుండునది తెలియు"నని జెప్పిరి. దీనివలన శ్రీస్వామికి కార్తవీర్యార్జునఉపాసన సిద్ధియైనదని తెలియుచున్నది.

ఇట్లుండ నొకనాడు శ్రీస్వామివారు తమప్రథమ గురువులైన శ్రీవాసుదేవయతీంద్రులదర్శింప పయనమైరి. అప్పుడు చిదంబరశాస్త్రి, ఆదిలక్ష్మమ్మ మరికొందఱుభక్తులు శ్రీస్వామివారియెడబాటును సహింపలేక, "స్వామీ! మీప్రయాణమున కాటంకము గలిగించునంతటి యోగ్యత మాకు లేదు. మేము భద్రాచలయాత్రయొనర్ప కుతూహలపడుచున్నాము. తాము మావెంటవచ్చి భద్రాచలక్షేత్రరహస్యముల దెల్పి, ధన్యుల జేయు" మని ప్రార్థింప, "మీరొకమాసములో యాత్రపూర్తిగావించు నెడల మీవెంటవత్తు" మని శ్రీస్వామి యనిరి. అందులకు వాకాటి గ్రామవాసులు శ్రీస్వామివారి పూర్ణానుగ్రహమునకు లోలోన సంతసించి "తమయాజ్ఞ చొప్పున నడచెద" మనిరి.

అట్లే యొకశుభదినమున శ్రీ స్వామియు, శిష్యులును భజనలొనర్చుచు బయలుదేరి గూడూరుజేరి, రాజమహేంద్రవరమునకు టిక్కెట్లనుకొని "అంతా రామమయం ఈ జగమంతా రామమయం" అనిపాడుచు రైలెక్కిరి. కొందఱు "బ్రహ్మానంద తీర్థస్వామికిజై" యనువారును, మరికొందఱు "భద్రాచల రఘు రామునికిజై" యనువారునునై పయనించుచుండిరి. బండి గోదావరిస్టేషన్ జేరగా అచట యాత్రికులందఱు దిగి, యొకసత్రమున బస జేసిరి.

ఉషఃకాలమున నందఱును గోదావరిలో స్నానమాచరించి, శ్రీస్వామివారితో "మేము కోటిరామలింగస్వామి దేవాలయమునుదర్శించి వచ్చెద" మన, శ్రీస్వామి వారందులకు "మేమీశంకరమఠమున నుండెదము. మీరు వెళ్లి రెండురోజులలో తిరిగి యిచటికి రండ"ని యాజ్ఞనిచ్చిరి.

అంత యాత్రికబృందము కోటిరామలింగస్వామి యాలయమున కేగి, భగవంతునికి అర్చనాదికము లొనర్చి సేవించిరి. అచట చిదంబరశాస్త్రిగారి దేహ మస్వస్థతగా నుండినందున శ్రీవారితో చెప్పినట్లు రెండురోజులలో యాత్రికులు శంకర మఠమునకు రాజాలకపోయిరి.

శ్రీస్వామివారు శంకరమఠమునందుండ పట్టణవాసులందఱును దర్శనమునకు వచ్చుచుండిరి. పండితులు కొందఱు శ్రీస్వా

మిని దర్శించి సంభాషించి, శ్రీవారు సామాన్యులుకారనియు, అఖండపాండిత్యము, అనుభవము గలవారనియు వేయివిధముల స్తుతించిరి.

రాజమహేంద్రవరమున గల జనులకే గాక, పరిసరగ్రామములకు శ్రీవారి యుదంతము తెలిసినందున, కౌశికానదీతీరస్థ వ్యాఘ్రేశ్వరగ్రామపండితులు శ్రీవారినిదర్శించి, తమగ్రామమునకు దయచేసి భాష్యప్రవచనముజేయ శ్రీస్వామిని ప్రార్థించిరి. శ్రీస్వామివారు యాత్రికుల కిచ్చిన రెండుదినముల కాలము దాటినందున మూడవదినము ప్రాతఃకాలముననే వ్యాఘ్రేశ్వర పండితుల కొకమాసము భాష్యముల బోధింప వాగ్దానమొనర్చి, యాగ్రామమున కేగిరి.

యాత్రికబృందము నాల్గవదినము రాజమహేంద్రవరమునకు వచ్చి శంకరమఠమున శ్రీస్వామి లేనందున పరితపించి, విచారించగా శ్రీవారు వ్యాఘ్రేశ్వరమున నున్నారని తెలియవచ్చెను. పెన్నిధిగన్న పేదచందంబున యాత్రికు లచటికి కేగి శ్రీస్వామిని దర్శించి యానందించిరి. శ్రీవారచట నొక నెలదినములుండునట్లు వాగ్దత్తమొనర్చితని విని, తమతో భద్రాచలయాత్రకు రండని యాత్రికులు శ్రీస్వామిని ప్రార్థించిరి. శ్రీవారందులకు "మీరు మేమిచ్చిన గడువు మీరుటం బట్టి వారికి మాటనిచ్చితిమి. మేమేమి చేయగలము? మనిరి. దీని నెఱింగి వ్యాఘ్రేశ్వరపండితులు" శ్రీవారుయాత్రికులతో బయలుదేరుదు రేమోయను భయ

ముచే వ్యాఖ్యానములు శ్రీవారి స్మృతికి వచ్చుచు బ్రతిమాలసాగిరి. ఇదియొక చిత్రమైన సంఘర్షణ. ఈసందిగ్ధస్థితిని గుర్తించి శ్రీవారు పండితులతో "ఇప్పుడు మాకు యాత్రికులతో భద్రాచల యాత్రకు వ్యవధి నిచ్చిన మేము మరల వచ్చి ౪౫ రోజులుండి భాష్యముల పూర్తిగా బోధింతు"మనిరి. అందుల కాపండితులు ౧౫ దినములకాల మెక్కువగా లభించినందులకు సంతోషించి "చిత్త" మనిరి.

అంతట శ్రీ వారు యాత్రికులతో బయలుదేరి పాపికొండలలో నున్న యోగరాముని దర్శించిరి. శ్రీవారప్పుడు యాత్రికుల సందఱిని దూరముగా బంపి, చిదంబరశాస్త్రిని మాత్రము తన వెంటనుంచుకొనిరి. ఉపదేశమునకు ఏకాంత మత్యంతావశ్యకముగదా! ఇట గురువు శిష్యుడు తప్ప నెవరును లేరు. శ్రీవారంత చిదంబరశాస్త్రితో "యోగరాముని సన్నిధిని యోగము నుపదేశింతు మని, చూడాల యనుయోగిని సిద్ధరూపముతో భర్తయగు శిఖిధ్వజమహారాజునకు బోధించిన క్రమమును అంతరార్థముతో సహాబోధించిరి. మఱియు కొన్ని యోగరహస్యములను గూడ వివరించిరి. దీనిసారాంశము:—యోగమన వైరాగ్య పరిపాకమేయనియు, సర్వవ్యాపకమై యఖండమై నిరంజనమైన ఆత్మయే తానసెడి దృఢతమ యనుభవమే యోగమనిచెప్పిరి. ఈ యోగము సంపూర్ణముగా యిచ్చటగల యోగరాముని విగ్రహామునందు మూర్తీభవించియున్నదని కొన్ని లక్షణములను

శ్రీస్వామివారు శాస్త్రిగారికి జూపిరి. తానమగకమున్నే శ్రీవారఖండతత్త్వమును బోధగావించినందులకు శాస్త్రిగారుపూర్ణానుగ్రహమని లోలోనసంతసించి తన్మయుడై యీక్రిందిశ్లోకముల నాశుధారగా జదివి శ్రీస్వామివారి కర్పించిరి.

## శ్రీ మత్పరమహంస బ్రహ్మానంద తీర్థస్తోత్ర

—:పంచరత్నాని:—

శ్లో. సత్యం జ్ఞానమనంతం యత్ తత్స్వరూప విదుత్తమం
శ్రీ బ్రహ్మానంద తీర్థంహి ధ్యాయే హృది పరంగురుం.

శ్లో. ఇదమగ్రే సదేవాసీ దిత్యాదిశ్రుతిపారగం,
శ్రీ బ్రహ్మానందతీర్థంహి ధ్యాయే హృది పరంగురుం.

శ్లో. ఏకమేవా ద్వితీయ స ద్ధితివేదాంత ధారకం,
శ్రీ బ్రహ్మానందతీర్థం హిధ్యాయే హృదిపరంగురుం.

శ్లో. సర్వంచఖలు బ్రహ్మేదమితి వేదాగ్రబోధకం,
శ్రీ బ్రహ్మానందతీర్థంహింద్యాయే హృది పరంగురుం.

శ్లో. తదాస్థిమిత గంభీరమిత్యాగమ సమాహితం,
శ్రీ బ్రహ్మానందతీర్థంహి ధ్యాయే హృది పరంగురుం.

శ్లో. ఇత్యేవం పంచరత్నాని చిదాకాశస్తుతానిహి
ప్రాతఃపఠనమాత్రేణ జ్ఞానసిద్ధః పరంవ్రజేత్.

శ్రీస్వామివారు పిమ్మట భద్రాచలమునకు పోదలచి

యాత్రికులతో. గోదావరిలో పడవప్రయాణము జేయుచు పయనించుచుండునప్పుడు శ్రీస్వామివారు, పడవకొనన వారికై అమర్చబడిన బల్లపై కూర్చుండియుండిరి. వీరిప్రక్కనని చిదంబరశాస్త్రిగారు తమ జ్యేష్ఠపుత్రునితో గూర్చుండియుండెను. ఆబిడ్డ పేరు సత్యనారాయణ. ఆబిడ్డ కప్పటికి మూడేండ్ల ప్రాయముండెను. శ్రీస్వామివారా బాలుని తమహస్తపల్లవములతో నెత్తుకొని విలాసముగా బాలుని రెక్కలుపట్టుకొని పడవపోవుచుండగా గోదావరీజలములో విడిచెడివారు. ఆ బాలుండాతోయములలో తపతపకొట్టుకొనుచుండగా నదిజూచి శ్రీస్వామివారు సంతోషించుచుండిరి. శ్రీస్వామివారి హస్తస్పర్శప్రభావముచేత ఈబాలుడు అవధూత శ్రీసత్యానందస్వామియయ్యెను.

పడవలో ప్రయాణము జేయుకాలమున యాత్రికులు ఒక్కనిమిషమైనను వ్యర్థపుచ్చక భగవన్నామసంకీర్తన జేయుచుండిరి. గోదావరి నీటిమీది చల్లనిగాలి కానందపడువారును గోదావరిని విధ్యుక్తప్రకారము పూజించువారును టెంకాయలు కొట్టువారునునై సచ్చరిత్రల వినుచు బ్రహ్మానంద తీర్థస్వామి సాంగత్యమున బ్రహ్మానందమనుభవించుచు ప్రయాణముసల్పుచుండ సాయంకాలమయ్యెను. అది శ్రీస్వామివారి యనుష్ఠాన కాలము. శ్రీవారెప్పుడును అనుష్ఠానకాలమును అతిక్రమించని స్థిరప్రజ్ఞగల మహనీయులు గాన పడవను నిలిపింపచేసిరి. అంత శ్రీతీర్థస్వాములు త్వరగా నడచుచు కనుమూసి కను తెరుచు

నంతలో యాత్రికబృందమునకు మరుగైపోయిరి. ఇట్లు దూరముగా నేగి శ్రీస్వామివారొకచోట పద్మాసనస్థితులై యోగానందమనుభవించుచుండిరి. కొంచెము చీకటిపడెను. కొంతసేపటికి యొక పెద్దధ్వని యాత్రికులకును పడవవాండ్రకును వినవచ్చెను. ఆధ్వని యెలుగుబంట్ల ఘీంకారమని యెంచి కట్టెలను బల్లెములను తీసికొని, శ్రీస్వామివారి నా యెలుగుబంట్లేమి బాధించునోయని, శ్రీవారివైపునకు పరువెత్తిరి. కాని యెలుగుబంట్లు కనబడలేదు. మరల నదే ధ్వని వినబడగా, వారందఱు శ్రీస్వామివారి యోగధ్వనియని తెలిసికొని మరల పడవవద్దకు వచ్చిరి. ఇంతలో శ్రీస్వామివారు నవ్వుచు యాత్రికుల గలిసికొనిరి

శ్రీస్వామివారు యాత్రికబృందముతో భద్రాచలము జేరిరి. శ్రీరామదేవాలయ గోపురమును సందర్శించి కరతాళ ధ్వనులతో భజనలొనర్చి యానందించిరి. భద్రాచలరాముని వీరు యథాశక్తి పూజించియు యచటి నిత్యవైభవమును కన్నులారగాంచి తమజన్మము ధన్యమయ్యెనని భావించిరి. అంతట యాత్రికబృందము సీతపర్ణశాలగాంచి యాకథలను యాక్షేత్రపురాణములను శ్రీస్వామివారు జెప్పుచుండ యానందించుచుండిరి.

శ్రీ స్వామివారు యాత్రికబృందమును వదలి తమ ప్రథమ గురువులైన శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వాముల

దర్శింప సంకల్పించి, యాత్రికులతో నిట్లుపన్యసించిరి. "పాపికొండలయం దుండు శ్రీరాముడు యోగరాముడు! యోగము సమస్తభోగములకు, సుఖదుఃఖముల కతీతమై యుండునది. యోగమునందు రమించువాడుగాన యోగరాము డయ్యెను. భద్రాచలమునందు శ్రీరామచంద్రుడు సమస్తభోగముల ననుభవించుచుండుటంబట్టి భోగరాముడయ్యెను. మాయను స్వాధీనమందుంచుకొని యాడించు శ్రీరాముని తత్త్వమును బ్రహ్మాదు లెఱుంగజాలరు. పంచవటియందుండు రాముడు సీతను వెదకుచు దుఃఖించుచుండుటంబట్టి శోకరాముడయ్యెను. ఈపై మూడు దశలను పొందినది యొక్క శ్రీరామచంద్రమూర్తియే."

అంతట శ్రీ స్వామివారు యాత్రికులను వీడి, త్వరితగమనమున తమ గురువులైన శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామివారిసన్నిధిన చాతుర్మాస్య దీక్షగడుప గరుడేశ్వరము (గరుడాచలము)ను చేరిరి. ప్రస్తుతము వారణాసి నివాసియు పంచగంగేశ్వరమఠాధీశ్వరులైన శ్రీ బ్రహ్మానంద సరస్వతీస్వామియు గరుడేశ్వరమున కప్పుడే వచ్చిరి. వీరు భారతదేశమంతయు సంచరించి, పెక్కుచోట్ల శ్రీ శంకరమఠములను, శ్రీ దత్తాత్రేయ దేవాలయములను నిర్మించిరి.

శ్రీ వాసుదేవానంద సరస్వతీయతీంద్రుల దేహమునకు వార్ధక్యదశ ప్రాప్తించినందున శరీరదార్ఢ్యము తగ్గి వ్యాధి

యంకురించెను. శ్రీబ్రహ్మానందతీర్థస్వామి శ్రీబ్రహ్మానంద సరస్వతీస్వామి మున్నగుశిష్యులు వాసుదేవసద్గురువులకు శుశ్రూషలు జేయుచు, తమయావచ్ఛక్తి నుపయోగించి, వైద్యులచే మందుల నిప్పించిరిగాని నిరర్థకమయ్యెను. శ్రీవాసుదేవానందస్వాములు ౧౯౧౪జులై ౮-వ తేది (ఆనందనామ సం॥ ఆషాఢ బ ౧ సౌమ్య వాసరమున) మహాసమాధిం జెందిరి. శిష్యులు కొంతవడి దుఃఖించి శ్రీస్వాములవారి దేహమును సమాధిగతమొనర్చిరి. శ్రీబ్రహ్మానంద సరస్వతీస్వామివారు వాసుదేవానందస్వాముల సమాధిపై గరుడేశ్వరములో శివాలయమును ప్రతిష్ఠించిరి.

ఓం

శాంతిః శాంతిః శాంతిః.

అంతట శ్రీబ్రహ్మానందతీర్థస్వామి దేశదేశముల సంచరించుచు మరల నెల్లూరుపట్టణమునకు వచ్చిచేరిరి. శ్రీస్వామివారిరాక వారిశిష్యులకు తెలియగనే వేమూరు చిదంబర శాస్త్రిగారును, ఆదిలక్ష్మమ్మగారును నెల్లూరువచ్చి శ్రీస్వామివారిని దర్శించి "స్వామీ! భద్రాచలయాత్ర జేయించి పుణ్యముగట్టుకొంటిరి, దక్షిణదేశ పుణ్యస్థలముల జూడ కుతూహలముగల్గినదన శ్రీస్వామివారందులకు సమ్మతించి యటనుండియే బయలుదేరి కాళహస్తి, తిరుపతి, తిరుత్తని, మధుర, రామేశ్వరము, సేతు మున్నగు స్థలముల దర్శించుచు తిరునల్వేలి జేరిరి.

తిరునల్వేలియందు శ్రీ స్వామివారి శిష్యులును భక్తాగ్రగణ్యులు నునైన శేషగిరిరావుగారను బ్రాహ్మణోత్తములు జిల్లా మునిసి ఫ్గా నుండిరి. వీరు స్వామివారి రాక నెఱింగి దర్శించి, శ్రీవారిని యాత్రికబృందమును తమయింటికి గొనిపోయిరి. పట్ట ణములోని పౌరప్రముఖులు వచ్చి శ్రీ స్వామివారి మృధుమధుర వచనముల శ్రవణానందముగ విని కృతార్థులైరి. శ్రీవారి వచ నామృతమును గ్రోలిన యాజనులభాగ్య మేమని వర్ణింప నగును?

శేషగిరిరావుగారు శ్రీస్వామివారి కేకాంతముననుండ దర్శించి: "స్వామీ! భగవంతుడు కలడా?" యనిప్రశ్నించెను.

అందులకు శ్రీస్వామివారు:— కలడు! సందేహ మక్క ఱలేదు. పాలలో నెయ్యి వెన్నయున్నదో యట్లే భగవంతు డీ జగమున గలడు. వెన్నను బడయవలయునన్న పాలనుకాచి సమయము గుర్తెఱింగి చేమిరివేసి, యొకచోటనే యుంచిన పెరుగగును. ఆపెరుగును మథించిన వెన్న కాన్పించును. ఆవె న్నను తర్వాత మజ్జిగలోనుంచినను తేలియే యుండును. అట్లే వైరాగ్యముకలిగిఅధికారియైనవెంటనే గురూపదేశమును బొంది కదలక యొకచోటనే నిశ్చలముగ గూర్చుండి భగవద్విచారము చేయుచుండినయెడల సుజ్ఞానము గలుగును. తర్వాత జగత్తునం దున్నను, జగద్భ్రాంతికి లోనుగాక కుమ్మరపుర్వువలె లోకమున చరించును.

శేష:—స్వామీ! ఈజన్మలోనే భగవంతుని చూడగలనా?

స్వామి:—"నే నీజన్మలోనే లేక యీక్షణమందే భగవంతుని జూడవలయునని" దృఢవిశ్వాసముగలిగి ప్రయత్నించిన తప్పక కాంచగలవు. విశ్వాసమే భగవత్సాక్షాత్కారమునకు పునాది.

శేష:—నేను ప్రతిదినము భగవధ్యానము చేయుచున్నాను. తచ్చిహ్నములెవ్వియు కాన్పించుటలేదే!

స్వామి:—హృదయ పారిశుద్ధ్యమువలయును. మురికినీటియందు చంద్రబింబము కాన్పించునా? మరియు నీవు నీపుత్రుని యెట్లు ప్రేమించుచున్నావో, యట్లే భగవంతుని ప్రేమించవలయును, నిశ్చయముగా చెప్పుము? నీ పుత్రునియందున్న ప్రేమ నీకు భగవంతునిపై గలదా?

శేష:—లేదు స్వామీ! ఇక మీరు చెప్పినట్లు చేయుదును.

స్వామి:—ఇంద్రియములు జయించుము. జితేంద్రియుడవు కానిది భగవంతుని కనుగొనలేవు. కట్టలేక చెరువులో నీరు నిలుచునా? సాత్వికభక్తితో ప్రాపంచిక వస్తువుల నపేక్షింపక మోక్షేచ్ఛగలిగి భగవంతుని నారాధింపుము.

శేషగిరిరావుగారు శ్రీవారి బోధ కానందించి, యుపదేశములనొంది శిష్యులై శ్రీస్వామివారి ఫోటోతీయించి,

గురుపూజ నత్యంత భక్తితో జేయుచుండిరి.

శ్రీస్వామివారు శేషగిరిరావుగారియింటిలో శ్రీఆది శంకరాచార్యులచే రచింపబడిన సౌందర్య లహరియను శక్తి స్తోత్రముగల గ్రంథమును జూచి, శ్రీచక్రోద్ధారణ స్థిత శ్లోకమును గాంచి యితరులకు దుస్తరమైన శ్రీచక్రోద్ధారణ గావించిరి. శ్రీస్వామివారు సర్వజ్ఞులనుటకిదియే తార్కాణము.

శ్రీతీర్థస్వామివారు చిదంబరశాస్త్రిగారితోడను, ఆదిలక్షమ్మ తక్కుంగల యాత్రికబృందముతోడను శేషగిరిరావుగారిని వీడ్కొని, కుత్తాళమునకు వచ్చి చేరిరి. అచట నొక శివాలయము గలదు. ఆశివాలయములో ఆదిశంకరభగవత్పాదులచే ప్రతిష్ఠితంబైన శ్రీచక్రమున్నది. యాత్రికులా దేవాలయమును ప్రవేశించి, భవానీసహితుడగు యాది దేవునకు అర్చనలొనర్చి, యచటికి సమీపముననున్న మౌన స్వామి మఠమునకు పోయిరి. అచట శ్రీమౌనస్వామిచే స్థాపించబడిన సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయమున్నది. ఆదేవాలయమున మూలవిరాట్టునకు దినమునకు మూడలంకారములు జేయుచుందురు.

శ్రీస్వామివారు యాత్రికులతో మఠమునం దడుగిడగనే మౌనస్వామి మనతీర్థస్వాముల బ్రహ్మవర్చస్సునకు, విద్వత్తున కచ్చెరువంది, పదిదినములు తమ మఠమునం దుండమని

బ్రతిమాలిరిగాని, తనతో వచ్చిన యాత్రికులస్థితిని గమంగొన్న తీర్థస్వామి సమ్మతింపలేదు.

శ్రీమానసస్వామి వారంత "సాధుసాంగత్యము పెన్నిధి సాటిది. అది యబ్బినయప్పుడే జుట్టుకొనవలె. మిగిలిపోయిన ఫలములేదు; వెనుక చింతించువాడు వెఱ్ఱివాడని" తనలోతలచి శ్రీతీర్థస్వామిసాంగత్యమును విడువనొల్లక, తానే శ్రీస్వామి వారివెంట పయనమైరి.

ఈయాత్రలో వరిచోటను ఆదిలక్ష్మమ్మ మఱియితర స్త్రీలును బస వేరుగ నొకచోట జేయుచుండిరి. చిదంబరశాస్త్రి శ్రీస్వామివారును మరొకచోట బసచేయుచుండిరి. చూచితిరా? శ్రీస్వామివా రెంత కామినీవిముఖత్వముగల వైరాగ్యనియ మము గలవారో?

అచటనుంచి తిరునల్వేలి సమీపముననుండు పాపనాశన మను పవిత్ర తీర్థమును దర్శింప యాత్రికులు స్వామియు బయలుదేరిరి, దారియూ లేదు. కొండలలో పోవలెను. అది నిర్జనమై మానవమాత్రుల కసాధ్యమైన కొండయడవిగుండా శ్రీస్వామివారు దారితీయగా యాత్రికులు నడచి పాపనాశన మును జేరి, యందు స్నాన మాచరించిరి. అంతట వీరందఱు పాపనాశనమునకు రెండుమైళ్ళదూరముననున్న కల్యాణతీర్థ మున స్నానమొనర్చి, యచటనే మూడుదినములుండి యటు

తర్వాత బయలుదేరి యంచకు యిరువదిమైళ్ళదూరమున నున్న బాణతీర్థము జేరిరి. కళ్యాణ తీర్థమునుండి బాణతీర్థము నకు పోవుదారి చాలకంటక భూయిష్ఠమై మిట్టపల్లములు గలిగి క్రూరమృగసంకీర్ణమై యుండెను. అయితే శ్రీ స్వామివారింతకు పూర్వ మొకపరి శ్రీశృంగేరి జగద్గురువుతో బాణతీర్థమునకు వచ్చియుండిరిగాన యీయాత్రిక బృందము నచటికి సులభముగా తోడ్కొనిచనిరి. బాణతీర్థమునకు శివ రాత్రికి నాలుగైదు దినములముందు జనులు బాట నేర్పరచెదరు. ఇదివరకు శృంగేరీజగద్గురువులు తీర్థస్వామితో బాణతీర్థమునకు వెళ్ళియుండినప్పు డక్కడి జమీందారు వెదుళ్ళతో నొక పందిలి సమర్చి శ్రీజగద్గురువులకు [illegible] కల్పించిన ప్రదేశ మిదియని శ్రీస్వామిచిదంబరశాస్త్రిగారికి జూపించిరి.

అంతట శ్రీస్వాముల వారిరువురును యాత్రికబృందము, అనంతశయనము జేరిరి. ఇచ్చట మౌనస్వామి తీర్థస్వామివద్ద సెలవుగైకొని, కుర్తాళమున కేగిరి.

పిమ్మట శ్రీస్వామివారు యాత్రికులు అనంతశయనే శ్వరుని దర్శించి, కన్యాకుమారి జేరిరి. ఇచట ఆదిలక్ష్మమ్మ గారు స్వామివారికి గొప్పభిక్ష జేసినది. భోజనపదార్థము లన్నియు తయారైన తర్వాత తీర్థస్వామి "నేనీదినమునుండి యు భిక్షను గ్రహింప"ననిరి. ఆదిలక్ష్మమ్మ శ్రీస్వామివారు

భుజింపకున్న, "నాకేల యీయాహార"మని అన్నమును విసర్జించి యిప్పటికిని ఫలాహారమును తీసుకొనుచున్నది.

కన్యాకుమారియందొకనాడు స్వామివారును చిదంబరశాస్త్రియు సముద్రస్నానము జేసి, వచ్చుచు శ్రీకన్యాకుమారి దేవాలయమునకేగిరి. అప్పుడే కన్యాకుమారి విగ్రహమునకలంకారములు చేయబడి కోటిసూర్యకాంతులలో ప్రకాశించుచుండెను. గాయకులు పాడుచుండిరి. జనులు సభకూడియుండిరి. అప్పుడు శ్రీకన్యాకుమారీజగన్మాతసన్నిధిని శ్రీస్వామివారు చిదంబరశాస్త్రిగారికి సౌభాగ్య పంచదశాక్షరి మంత్రమును ఉపదేశించిరి. శాస్త్రిగారి యదృష్ట మేమనవచ్చును?

అచటనుండి శ్రీస్వామివారు యాత్రికులు బయలుదేరి నెల్లూరుపట్టణమునకువచ్చి, శ్రీమన్నిత్యానందస్వామిని దర్శించిరి. శ్రీస్వామివారు నెల్లూరునందే యుండిరి. యాత్రికులు తమతమగ్రామముల జేరిరి.




వీరపల్లి అయ్యవార్లు.



శ్రీ బ్రహ్మానందస్వామి.



ప్రాతూరి
శివరామయ్యగారు.
(శంకరవిద్యాలయ
కార్యదర్శి )



శ్రీ దత్తాత్రేయమందిరము—శ్రీ శంకర విద్యాలయము.

# పదునారవ ప్రకరణము.

—; భావపురీప్రవేశము. - శంకరవిద్యాలయప్రతిష్ఠ:—

శ్లో. ఏషు సర్వేషు భూతేషు గూఢాత్మా న ప్రకాశతే
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః.

నెల్లూరునకు ఉత్తరమున సుమారు మూడుమైళ్ల దూరమున పడుగుపాడను నొకగ్రామముగలదు. అందొక బ్రాహ్మణకుటుంబము నివసించుచుండెను. వారు నిరతాన్నప్రదాతలు-సుశీలురు-సత్కులోద్భవులు. వారికుటుంబమునకు జెందినవారు వేములపాటి జానకిరామయ్య యనువారు. వీరు నైష్ఠిక బ్రహ్మచారులు, సాధుసాంగత్యతత్పరులు వేదాంతశ్రవణమననములయందు కాలముగడుపువారు. వీరి పుణ్యవిశేషమున శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారి పరిచయ మబ్బెను.

శ్రీస్వామివా రింతకుపూర్వము గోదావరిజిల్లాలో కోనసీమప్రాంతమున భాష్యప్రవచనము చేసియుండిరి. అప్పుడు జానకిరామయ్యయు శ్రీవారితోగూడ నుండియుండిరి. తిరిగి యాదేశమును జూడ వీరుభయులును ప్రయాణముసాగించుచు మార్గవశమున బాపట్ల (భావపురి)సమీపమునకు వచ్చిరి. అప్పుడు పొద్దుగ్రుంకుసమయమగుటచే శ్రీస్వామివా రచటనే యారాత్రి గడుపనిశ్చయించిరి.

అందుల కీనైష్ఠికబ్రహ్మచారి సమ్మతింపక, స్వామీ! బాపట్ల గ్రామము సంపూర్ణముగా పాశ్చాత్యనాగరి కావ్యామోహము నకు లోబడి బ్రహ్మసమాజ దివ్యజ్ఞానసమాజ మతస్థులతో గూడి యున్నది; మీబోటి యతీశ్వరులను జూచి హేళనజేయువారే గాని, సత్కరించు గృహస్థులు లేరుకాన, తమకు వసతియోగ్యము కాదు; చీకటిపడినను ముందుగ్రామమునకు వెళ్లి బసచేయుద మని శ్రీవారితో విన్నవించిరి. శ్రీస్వామివా రాశ్చర్యనిమగ్నులై జానకిరామయ్యతో "మనము భిక్షులకొరకు దేశాటనము చేయుటలేదు. లోకసంగ్రహార్థము పర్యటనచేయుచున్నారము. మానాభిమానములవలన మన ముత్కర్షాపకర్షల జెందరాదు. బాపట్ల మీరు నుడివినదుఃస్థితిలోనున్న మన మట్టిచోటికే వెళ్లుట ముఖ్యకర్తవ్యము. కానమనము కోనసీమప్రయాణము ప్రస్తుతము మానుకొని బాపట్లయం దుండియే తీరవలయు"ననిరి.

దీనికి నైష్ఠికబ్రహ్మచారి తగినసమాధాన మియ్యలేక శ్రీవారితో బాపట్లప్రవేశించెను. యతులు గృహములలో నుండుట యాచారము కానందున, యతి నివాసయోగ్యమగు మఠములు లేనందున శ్రీస్వామివా రారాత్రి శివాలయములో దక్షిణదిశయందున్న యరుగులమీద గడపిరి. నాడు ౧౯౧౬ మార్చి ౨౮ తేది.

మఱునటిదినము తేజోవంతులు-లే(బ్రా)యుష్యు యతీశ్వరులు-పండితవర్యులు-గీర్వాణభాషయందు 'సరళధారతో నుప

న్యసింపగల వారొకరు విచ్చేసిరని తెలిసి యాబాలగోపాలము శ్రీవారిని దర్శింపవచ్చిరి. శ్రీవారి మృదుసంభాషణ, ఆశ్రితుల నాకర్షించుసామర్థ్యము, బ్రహ్మానందమును ప్రకటించు ముఖ వర్చస్సు, అద్భుత వైరాగ్యము, అతిసహనము మొదలగు సుగుణములే ప్రజల నాకర్షించినవి.

ఉపదేశములకొరకు, భిక్షలకొరకు, పాదపూజలకొరకు శిష్యుల పీడించు యతులవంటివారు వీరు కాదనియు పాండిత్య ముగలిగియు సంస్కృతమున మాట్లాడలేని పండితులవలెగాక సరళభారతో సంస్కృత భాషయందు వాజ్మాధుర్యమునొలికించు చు సంభాషించుటయేగాక నుపన్యసింపగల మహనీయులనియు, యౌవ్వనమున సన్యసించిన త్యాగపురుషులనియు వీరిని స్తుతింప సాగిరి. ఇవ్విధమున రెండుమూడుదినములు గడచినపిమ్మట గ్రామములోని పండితులును ఉద్యోగస్థులును శ్రీవారిని పరివేష్టించిరి.

బాపట్లయందొక పురాతనమైన శివాలయముగలదు. అది చాలవరకు శిథిలమైయుండెను. దేవాలయములోనికి అర్చకులు పోవుమార్గముతప్ప ఆవరణమంతయు సూకరపురీషముతో ఏనుగు పల్లేరుగాయలతో నిండియుండెను. ఈ విషయమును గూర్చియే శ్రీ శంకరవిద్యాలయ ద్వాదశ వార్షిక విశేషనివేదికము (8-9-29) యిట్లు తెల్పుచున్నది:— "శ్రీవారి యాగ

మనమునకుబూర్వము, ప్రస్తుతము శివక్షేత్ర మనిపించుకొన దగిన శివాలయములలోపల గబ్బిలములచేతను, వెలుపల సూకరములచేతను సేవింపబడుచు, దుర్గంధముతో నిండియుండి ఈ పురవాసుల మతాభిమాన శూన్యతకును, శ్రద్ధాభక్త్యలాభావమునకు సూచనగ నుండియుండెను. ప్రక్కన యీ దత్తమందిరమున్న స్థలము రక్కసపొదలతో నిండియుండి రాత్రికాలమున దొంగలకిరువై బహిర్దేశముగ వాడబడు మహా నిమ్న ప్రదేశమై యున్నది".

బాపట్లపౌరులిట్టి నిమ్నప్రదేశమును నెఱుకలవాండ్రచే బాగుచేయించి వెంటనే దుర్గంధనివారణ చేయించిరి. జనసమ్మర్దమువలన పందుల గత్తర తప్పిపోయినది. వాహనశాలయందలి వాహనములనన్నిటిని యొకతట్టునకు జేర్చి, మూషకముల జారద్రోలి శ్రీ స్వామివారికి వసతిని కలుగజేసిరి.

హైస్కూలు పండితులగు కంభంపాటి సీతారామశాస్త్రిగారు, మంత్రవాది వెంకటశాస్త్రిగారు, యితర పండితులగు మల్లాది హనుమచ్ఛాస్త్రిగారు, తాలూకా శిరస్తాదారగు లక్కరాజు గోపాలరావుగారు, వేములపాటి జానకిరామయ్యగారు, కర్లపాలెము సూర్యనారాయణశాస్త్రిగారు, ప్లీడర్లగు పాతూరి శివరామయ్యగారు, నోరి వెంకటేశ్వర్లుగారు, కైవారం నరసింహముగారు మొదలగు పౌరప్రముఖుల ప్రార్థ

వల నంగీకరించి, శ్రీ స్వామివారు ప్రస్థానత్రయము ప్రవచనముచేయుటకై కొంతకాలముండుట కంగీకరించిరి.

సూత్రభాష్యము చదువుటకు బైనుదహరించిన పండితులును, యుద్యోగస్థులేగాక దూరదేశమునుండికూడ పండితులు వచ్చిచేరిరి. తహసీలుదారు బి. వెంకటామయ్యగారు, డిస్ట్రిక్టు మున్సిఫ్ జయంతి శ్రీరామమూర్తిపంతులుగారు, ట్రెయినింగు స్కూలు మాస్టరు వెంకటప్పాశర్మగారు, ప్లీడరు కోన వెంకటావుగారు మొదలగు నుద్యోగస్థులు, కోర్టు గుమస్తాలు, తాలూకా గుమాస్తాలు, శ్రీ స్వామివారి శిష్యవర్గములోజేరి భాష్యశ్రవణమునకు వచ్చుచుండిరి.

వీరికోరికమీాద ఉదయము 6 గంటలమొదలు 8 గంటలవరకు కోర్టుపనులకు ఇబ్బందిలేకుండ గీతాభాష్య ప్రవచనము చేయుటకు శ్రీ స్వామివా రంగీకరించిరి. శ్రీవారు భాష్యార్థమును విపులముగా వెల్లడించుచుండిరి. మహాత్ముల పాదస్పర్శ సోకినంతమాత్రమున నెట్టివారును పవిత్రాత్ములగుదురనుట కిదియే దృష్టాంతము. ఇంచుకంత పరుసవేదిసోకిన యినుము బంగారమగునుగదా!

శ్రీ స్వాములు బాపట్లయందు నెరవేర్చిన కార్యక్రమమును జూచిన ప్రతివారికిని ఆశ్చర్యము కలుగకతప్పదు. ఈ విషయమునుగూర్చి శ్రీ శంకరవిద్యాలయ ప్రథమ వార్షిక నివేదికయం

దిట్లు వ్రాయబడియున్నది. "శ్రీ స్వాములవారు ఉదయము 6 గంటల మొదలు 11 గంటల వరకు శాంకరభాష్యములును, సాయంత్రము 2 గంటల మొదలు 5 గంటలవరకు పురాణము లేక ప్రకరణ గ్రంథములును, రాత్రి 8 గంటల మొదలు 10 గంటలవరకు శాంకరభాష్యములుగాని యితర వేదాంత గ్రంథములుగాని నగటున వారమున కొకపర్యాయము రాత్రి 11 గంటల మొదలుకొని 3 గంటలవరకు హరికథలు మరియు ఉదయము 6 గంటలకుపూర్వము మధ్యాహ్నము 10 గంట లకుపిమ్మట యేకాంతమున ఉపదేశమునకు వచ్చువారితో ప్రసంగము, సాయంత్రము 5 గంటలకుపిదప సూరివెలుపల యిసుకదిన్నెలమీద కొందరికి తర్కసంగ్రహబోధయును పాండి త్యవిశేషముచూపి మెప్పుపొందుటకువచ్చిన పండితులతో గోష్ఠియు వారమునకొకపర్యాయము సభలతో, రోజుకు దాదాపు 19 గంటల కార్యక్రమము సంతోషముతో యితరు లకు శ్రద్ధకలిగేలాగున విసుగులేక ఒకటేరీతిగా షుమారు 2 సంవత్సరములు జరుపుట అద్భుతము. ఊర్ధ్వరేతస్కులు బ్రహ్మనిష్ఠులగు స్వామివారివంటి మహాపురుషులకుతప్ప యిత రులకు దుస్సాధ్యము- ఇట్టి మహాపురుషు లొక్కొక్క సంస్థా పనయని చెప్పవచ్చును. అందువలననే పూర్వము మన ఋష్యాశ్రమములు యిప్పటి ఆడంబరము లేకపోయినను ఆధు నిక విశ్వవిద్యాలయములకంటె మించియుండెను".

మరియు మధ్యమధ్యవచ్చు శ్రీ కృష్ణజయంతి, శ్రీరామ నవమి, శ్రీశంకరాచార్యజయంతి, దేవీనవరాత్రములు, గణపతి నవరాత్రములు అత్యంతవైభవములతోను, యితరులకు భక్తి గలుగునట్లు శ్రీస్వామివారు నెరవేర్చుచుండిరి. ఈ జయంతులలో శ్రీవారు దేవతావిగ్రహములను జీవకళ యుట్టిపడునట్లు నిర్మాణముచేసెడివారు. ఇక అలంకారములు, చిత్రపటశోభలు అసమానమై యున్నవి.

ఈవిధమున కార్యక్రమము నెరవేర్చుచు, సూత్రభాష్య గీతాభాష్యమును కొన్నిమాసములలోముగించి, ఉపనిషద్భాష్యములను ప్రారంభించి. శ్రీ స్వామి సలసం. పుష్య శుద్ధ ౩ లనాటికి ఐతరేయోపనిషద్భాష్యమును ముగించి, శ్రీ దత్తాత్రేయ జయంతి జరుప సంకల్పించిరి. శ్రీ దత్తాత్రేయ జననమునుగూర్చి దత్తపురాణమునందు:—

"మార్గేమార్గప్రదోమార్గ శీర్షేభూచ్ఛ్రితమార్గితః
సౌమ్యస్సౌమ్యదినేపూర్ణః పౌర్ణమాస్యాం నిశాముఖే."

అనగా- ముముక్షువులకు జ్ఞానమార్గమునిచ్చెడు శ్రీదత్త జగద్గురువు మార్గశిరమాసమునందున్ను, వేదములచే నెఱుగదగిన పరమాత్మ మృగశీర్షానక్షత్రమందును, శాంతస్వరూపులైన అవనూత బుధవారమునందును, పరిపూర్ణుడైన మహాయోగి పౌర్ణమాస్యయందు ప్రదోషకాలమునం దావిర్భవించిరి. అనగా జగద్గురువును, పరమాత్మయు, శాంతస్వరూపుడును,

అవధూతయు, పరిపూర్ణుడును, మహాయోగియునైన శ్రీదత్తా త్రేయమహర్షి మార్గశిరశుద్ధపౌర్ణమి మృగశీర్షానక్షత్రమున నవతరించిరి.

శ్రీదత్తజయంత్యుత్సవమువకుగాను శివాలయావరణమంతయు పందిళ్ళు వేయబడినవి. జయంతిలో శ్రీదత్తదేవునికి పూజ, చతుర్వేదాధ్యయనము, పురాణశాస్త్రపారాయణములు, ఉపన్యాసములు, పురాణశ్రవణము, హరికథలు, భజనలు- అత్యద్భుతముగా జరిగినవి. వేలకొలది బ్రాహ్మణులకు సమారాధనలు, బీదలకు అన్నదానములు విరివిగా జరిగినవి.

భాష్యములు ముగించిన పిమ్మట శ్రీదత్తజయంతికి నిర్మింపబడిన విశాలమగు పందిలిక్రింది నొక మహాపౌరసభ జరుపబడెను. ఆసభలో శ్రీస్వామివారు "శంకర విద్యాలయమను పేరనొక వేదసంస్కృతపాఠశాలయును, సంస్కృత పుస్తక భాండాగారమును స్థాపించవలయుననియు, అందుకువలయుమందిరముల నిర్మించవలసినదనియును, ప్రత్యేకస్థావర మేర్పడువరకు శివాలయములోనే శంకరవిద్యాలయమను పేరట పూర్వమువలెనే విద్యాప్రచారముజరుపవలసినదిగాను, అందుకుగాను తమశిష్యులగు మల్లాదిహనుమచ్ఛాస్త్రిగారు శంకరవిద్యాలయోపాధ్యాయులుగ నుండవలసినదనియు, అప్పుడు భక్తులు సమర్పించిన పుస్తకములు మరుకొన్నిపుస్తకములు కలిపి పుస్తక

భాండాగారమున కంకురముగా నుండవలసినదనియ్సి, విద్యాలయములో జరుగవలసిన కార్యక్రమమును, కాలనిర్ణయపట్టికను తరగతులకు వలయుపఠనగ్రంథముల నేర్పరచుచు, తీర్మానములను, తమయుద్దేశ్యములను ప్రకటించుచుగంభీరోపన్యాసమునిచ్చిరి.

తర్వాత పురవాసులు లౌకికాధికారులను సత్కరించుటకు వసతిగృహములుగలవుగాని, యతీంద్రులనుగౌరవించుటకు మఠములులేవని, చింతించి, బాపట్లయందును పరిసరగ్రామములయందును చందాలువసూలుచేసి యొకమఠమును నిర్మించి శ్రీ స్వామివారికర్పించిరి. శ్రీ వారాసౌధమును తమమఠముగా నంగీకరింపక శ్రీ దత్తమందిరమని నామమిడి శ్రీ శంకర విద్యాలయప్రచారస్థానముగ నుండునట్లు తీర్మానించి, ౧౯౧౭ ఆగస్టు ౧౧ వ తేదిన (పింగళసం. శ్రావణ బ ౯ శనివారము) రాత్రి రోహిణినక్షత్రమున ౯-౪౦ నిమిషములకు ప్రతిష్ఠించిరి.

మహాపురుషుల సంకల్పములు కార్యరూపముగా నెట్లు పరిణమించునదియు యీక్రింద నుదహరించు నంశములవలన తేటతెల్లమగును. మందిరములు సౌధములు పరిపాలనాసంఘములు చట్టములతో మాత్రమే సంస్థాపనలు సంపూర్ణములు కానేరవు. ఇవి సంస్థాపనలయొక్క బాహ్యాంగములుగాని, సంస్థాపనలు గావు. ఈసౌధము మందిరములు శ్రీశంకర విద్యాలయమను పేరుబెట్టుటకు కారణమాత్రములే గాని,

నిజమయిన శంకరవిద్యాలయము శ్రీస్వామివారు బాపట్లపురము వేంచేసిన దినమే స్థాపింపబడినది.

దీనినిగూర్చియే శ్రీశంకరవిద్యాలయ ప్రథమవార్షిక నివేదికయందిట్లు వ్రాయబడియున్నది: "శ్రీపరమహంసపరివ్రాజక శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారియొక్క బాపట్లలోని చరితమందు యీశంకరవిద్యాలయచరిత్రము అంతర్భాగము గనుక యీనివేదికము శ్రీస్వామివారిచరిత్రమని చెప్పదగును. శ్రీస్వామివారు మార్గవశాత్తు బాపట్లపురమునకు రాక్షస సంవత్సర ఫాల్గుణబ౧౧లు వేంచేసిన సుదినము. వారిని సందర్శించుటకు వచ్చినవారల ప్రార్థన లాదరించి సూత్రభాష్యము గీతాభాష్యమును బోధించుట కంగీకరించి శ్రీస్వామివారు యిక్కడ నిలచినది మనఅదృష్టము. సంకల్పసిద్ధులగు శ్రీస్వామివారు బాపట్లగ్రామమందు శంకరవిద్యాలయమును స్థాపింప నుద్దేశించుట మనదేశభాగ్యము."

శ్రీస్వామివారి యాజ్ఞానుసారము శ్రీశంకరవిద్యాలయము ప్రతిష్ఠింపబడినది. శ్రీస్వామివారిశంకరవిద్యాలయము నొకవిశ్వవిద్యాలయముగా నొనర్పసంకల్పించిరి. అందులకై, దేశదేశములకు పర్యటనజేసి, సంస్కృతవిద్యయొక్క ప్రాశస్త్యముగూర్చి యుపన్యసించి, సంస్కృతభాష నుద్ధరింప సమకట్టిరి.

సంస్కృతభాష సంస్కరింపబడిన భాష; సంస్కృత శబ్దమునకు వ్యుత్పత్త్యర్థము బాగుగా సంస్కరింపబడినది అని. దీనినే దేవనాగరభాషయనియు వ్యవహరించెదరు. మనభారత దేశమునందు పూర్వము సంస్కృతభాషయే దేశభాషగా నుండెను. గ్రంథములన్నియు సంస్కృతభాషయందే వ్రాయబడియుండుట నుకందరికి విదితమే. రామాయణ భారత భాగవతములు, వేద వేదాంగములు, అష్టాదశపురాణములు, తర్క వ్యాకరణములు, ఛందస్సు, కావ్యములు, నాటకములు, అలంకారములు సర్వమును గీర్వాణభాషయందే గలవు. శ్రీఆదిశంకరాచార్యులు రచించిన భాష్యములు, స్వరచితములు, పరరచితములు, మొదలగు గ్రంథములను బండ్లకు వేయవచ్చును. అవి యన్నియు సంస్కృతభాషయందే వ్రాయబడియున్నవి.

మానసిక యాధ్యాత్మికధర్మములు నెఱింగి చక్కగా నిర్వర్తింపవలయునన్నచో, ప్రతిపౌరుడును సంస్కృతభాష నభ్యసింపవలసినదే. సంస్కృతభాషను బోధించు యుపాధ్యాయులును, తద్భాషాజ్ఞానము నలవరచుకొను విద్యార్థులును వాత్సల్య భయభక్తులుగలిగి దైవభక్తిగలవారై యుండిరి. కాలవశమున నిట్టిసంస్కృత భాషను స్మరించువారైనను లేని దురవస్థ భారతీయులకు పట్టినది. ఆధునికులు పాశ్చాత్యవాక్యములను, ఆచారములను అలవరచుకొనుటవలన నధోగతిపాలైరి.

శ్రీబ్రహ్మానందతీర్థస్వాములును సంస్కృతభాషను దేశమందంతటను వ్యాపింపజేయుటకు వేదసంస్కృతపాఠశాలల నచ్చటచ్చట స్థాపింపబూనిరి.

# పదునేడవ ప్రకరణము.

—: శిష్యులతో నెల్లూరుమండల పర్యటనము. :—

శాన్తా మహాన్తో నివసంతి సన్తో
వసన్తవల్లోకహితం చ రన్తః,
తీర్ణాస్స్వయం భీమమహార్ణవం జనా
నహేతునాఽన్యానపి తారయన్తః.

శ్రీ స్వాములు నెల్లూరిలో నివసించుచుండినపుడు, శ్రీ నిత్యానందస్వామిశిష్యులందరును శ్రీ బ్రహ్మానందతీర్థస్వామిని సమానముగా గౌరవించి పూజించుచుండిరి. వీరిలో ప్రముఖులు అల్లూరుఆదిలక్ష్మమ్మగారు. శ్రీ బ్రహ్మానందతీర్థస్వామి వారు బాపట్లకువచ్చినది మొదలు, ఈమెయు నితర శిష్యులును, బాపట్ల నొకయాత్రాస్థలముగ నేర్పచుకొని, తఱచుగ శ్రీ స్వామివారిదర్శనమునకై వాకాటినుంచి వచ్చుచుండువారు. శ్రీ స్వామివారి భిక్షలు ముందుగనే అనగా కొన్నివారములకు పూర్వమే శిష్యులప్రార్థనాపూర్వకముగ నిర్ణయించుకొనియున్నందున, ఆమె శ్రీవారిభిక్షలకై వేచియుండవలసివచ్చును. అట్లుండియు నామె భక్తితో శ్రీవారికి భిక్షలజేయుచుండెను.

వాకాటికాపురస్థులగు ఆదిలక్ష్మమ్మయు, నామె చెల్లెలు రామలక్ష్మమ్మయు, వేమూరు చిదంబరశాస్త్రియు, నెల్లూరి కా

పురస్త్రీలగు చీమకుర్తి కోటమ్మయు, మిాంజూరికాపురస్థు డగు పోచారెడ్డి రామరాఘవరెడ్డియు, వేనాడుకాపురస్థుడగు అబ్బాయిరెడ్డియు, యింకను తదితరభక్తులును శ్రీ దత్తజయంతికి బాపట్లకువచ్చి, భాష్యములు ముగించుచువరకు నుండి శిష్యసహితముగా శ్రీ స్వామివారిని నెల్లూరుమండలమున కాహ్వానించిరి.

శ్రీ స్వామి భాష్యప్రవచనమువలనను, శ్రీదత్తజయంతీ మహోత్సవమువలనను విశ్రాంతి గోరుచుండినందున శిష్యులతోసహా నెల్లూరికివెళ్ళుట కంగీకరించిరి. నలసం॥ పుష్యశు ౨ లు నాడే నెల్లూరువెళ్లుటకు తీర్మానించిరి.

కంభంపాటి సీతారామశాస్త్రిగారు, వేమూరు నృసింహశాస్త్రిగారు, మల్లాది హనుమచ్ఛాస్త్రిగారు, ప్లీడరు పాత్తూరి వేంకటశివరామయ్యగారు కైవారపు నారాయణరావు గారు, కంభంపాటి సింగయ్యగారు మొదలగు ౨౫ మంది శిష్యులు శ్రీ స్వామివారితోగూడ ప్రయాణమైరి. ప్లీడరైన కోనవెంకటాద్రిగారినిగూడ ప్రయాణము కమ్మని శ్రీ స్వామివారు కోరిరిగాని, కార్యాంతరమువలన రాజాలకపోయిరి.

శ్రీస్వామి తమశిష్యులతో బాపట్లనుండి జానకిరామయ్య ఆశ్రమస్థానమగు బింగినపల్లి యనుగ్రామమునకు టంగుటూరుమిాదుగా వెళ్లి, తర్వాత నెల్లూరుచేరిరి. నెల్లూరిలో

శ్రీ స్వామివారు శిష్యులతో శ్రీ బ్రహ్మానందసరస్వతీస్వామి వారిచే బ్రతిష్ఠింపబడిన శ్రీ దత్తాత్రేయ మఠమందు బసచేసిరి.

నెల్లూరికి వెలుపల పవిత్రపినాకినీనదీతీరమున నొక పెద్ద మామిడితోటలో శ్రీ నిత్యానందస్వామివారు నివసించుండిరి. అచటికి శ్రీ బ్రహ్మానందతీర్థస్వామివారు శ్రీ నిత్యానందస్వాములవారి దర్శనమునకు వెళ్లి సంభాషించిరి. ఈస్వాములవారలకు పరస్పరము యత్యంతప్రేమయును, గౌరవమునుగలదు. శ్రీ నిత్యానందస్వామివా రనుభవజ్ఞులైన వృద్ధులనియు, బ్రహ్మానందభరితులనియు శ్రీ తీర్థులవారు సంతోషించుచుండిరి. శ్రీ తీర్థస్వామివా రతిబాల్యమున వైరాగ్యమునుబొంది, గీర్వాణభాషయందును, ఆధ్యాత్మిక విద్యయందును పాండిత్యమును సంపాదించిన బ్రహ్మనిష్ఠులని శ్రీ నిత్యానందస్వామివా రానందపడుచుండిరి. శ్రీ నిత్యానందస్వామివారు శ్రీదత్తజయంతికి బాపట్లకు వచ్చినపుడు శ్రీతీర్థస్వాములవా రానందభరితులై, వారియెడల నత్యంతగౌరవమును జూపిరి. వీరుభయు లేకదేశమునందు భిక్ష చేసిరి. బాపట్లపురవాసు లీబ్రహ్మవేత్తల నానందింపజేయుటకు వీణ ఫిడేలు మొదలైనదివ్యవాద్యములతో గానవిద్యను బ్రదర్శించిరి.

నెల్లూరిలో నృసింహాలోకమను నొకవనమందు శ్రీనిత్యానంద స్వామివారు నిత్యము పురాణకాలక్షేపము జరిపించు

చుండిరి. అచటికి శ్రీ తీర్థస్వామియు వెళ్లిరి. నెల్లూరిలోని పెద్ద పండితులగు పంచాగ్నుల దక్షిణామూర్తిశాస్త్రి, పిశిపాటి శేషాద్రిశాస్త్రి మొదలగువారు శ్రీస్వామివారియెడల వందనపూర్వకముగా నత్యంతభక్తిని జూపిరి.

అంత శ్రీ తీర్థస్వామివారు శిష్యులతో మఱుసటిదినమే గూడూరునకు ప్రయాణమై, యచ్చటినుంచి వాకాడునకు వెళ్లిరి. అచ్చట వేమూరు చిదంబరశాస్త్రిగారియిల్లు వసతిగృహముగా నేర్పఱచుకొనిరి. అచట శ్రీస్వామివారు రెండురోజులు తమదివ్యబోధనామృతముచేత శిష్యుల నానదింపజేసిరి. అందరును కోటగ్రామమునకు వచ్చి అటనుండి బయలుదేరునపుడు శ్రీస్వామివారి ప్రియశిష్యుడైన వేమూరు చిదంబరశాస్త్రిగారు తనభార్యతోడను తనజ్యేష్ఠపుత్రుడైన సత్యనారాయణ యను బాలునితోడను శ్రీస్వామిని విడువలేక ప్రయాణమయ్యెను.

అచట భక్తుల నందఱికి శ్రీస్వామివారు నుచితోపదేశముల జేసిరి. అచటినుంచి గూడూరుమీదుగా శ్రీస్వామివారు బాపట్లశిష్యులతోను వాకాటిశిష్యులతోను నాయుడుపేటవెళ్లి యక్కడనుంచి బండ్లమీద మీంజూరుచేరిరి. అచ్చట రామరాఘవరెడ్డిగారు అలంకారయుక్తముగా పందిళ్ళువేయించి శ్రీస్వామివారికి శిష్యులకు వసతిని కల్పించిరి. శ్రీవారచటభక్తి జ్ఞానవైరాగ్యములగూర్చి గంభీరోపన్యాసములనిచ్చిరి. శ్రీవార

చటనుండగా వేనాడుకాపురస్థుడు అబ్బాయిరెడ్డి వేనాడుగ్రామమున కాహ్వానించినందున అందరును శ్రీ స్వామివారితో అచ్చటికి బయనమైరి.

రామరాఘవరెడ్డి పది రెండెద్దులబండ్లను, ఒకపెట్టెబండిని సిద్ధపరచెను. ఆపెట్టెబండియందు శ్రీ స్వామివారు, శివరామయ్య కూర్చుండిరి. మిగతబండ్లలో తక్కినశిష్యులందరు కూర్చుండి వేనాడుగ్రామమునకు ప్రయాణమైరి. వేనాడుగ్రామము మద్రాసువద్దనున్న చిల్కసముద్రముయొక్క నొకపాయలో లంకగనుండు నొకగ్రామము. మీంజూరినుంచి ౧౦ మైళ్లదూరమున నొకచిన్నయడవిగుండ ప్రయాణముచేసి, యాచిలకసముద్రపు పాయను పడవలమీద దాటి ఆగ్రామమునకు చేరవలసియున్నది.

బండ్లు యడవిగుండ పోవుచుండ, మార్గమధ్యమున దూరముగ సంగీతధ్వనులు తాళయుక్తముగ వినబడసాగెను. ఎటుజూచినను చూపుమేరలో మనుష్యు లగపడలేదు. శ్రీ స్వామివారి నాహ్వానించుటకు వనదేవతలు గానముచేయుచున్నారా యనునట్లుండెను. ఇంతలో బాపట్లనుంచి యొక బ్రాహ్మణుడు పరుగెత్తుకొనివచ్చి, శ్రీస్వామివారితో నీదుఃఖవార్తను చెప్పెను- గడచినరాత్రి బాపట్లలో కోనవెంకట్రావుగారిని నిద్రించుచుండగా రివాల్వరుతో కిటికీగుండా వారిని కాల్చి

నారనియు, తుపాకిగుండు మొగమున ప్రవేశించి, నెత్తురువర దలై యాసుపత్రియం దున్నారనియు చెప్పెను.

ఈవార్త విననగనే శ్రీస్వామివారు సమాధినిమగ్నులై కొన్నినిమిషముల కూర్చుండి- పిమ్మట కనులు దెఱచి, "ప్రాణా పాయముండద"ని సెలవిచ్చిరి. తక్కిన శిష్యులందఱు దుఃఖా క్రాంతులైరి. బలవద్విరోధులు వెంకటరావుగారిని హత్య చేయదలచి యిట్లు చేసిరి. శ్రీస్వామివారి దివ్యమహిమవల నను, వారియుత్సవముల సందడివలనను వెంకటరావు యిల్లు చేరలేక, శ్రీవారు బాపట్ల విడిచినపిమ్మట నొకరాత్రివేళ నీ ఘోరకృత్యము చేసిరి. శ్రీవారి కోరికప్రకారము వెంకటరావు గారు ప్రయాణమైనయెడల నీవిపత్తురానిదే. శివాలయమున దక్షిణమున నానుకొని కోనవెంకటరావుగారి గృహముగలదు. వీరు తమయింటిని జయంతిసమయములలో జయంతివసతులకు నుపయోగకరముగా జేసియుండిరి.

పిమ్మట స్వామిబండ్లు కొంచెముసేపు నిలచి తిరిగి సాగి నవి. గానధ్వనులు వినబడుచునేయుండెను కొంతదూరమేగు సరికి ప్రక్కదారిన రామభజనచేయుచు మృదంగ తాళముల తో కొందరు శ్రీవారి బండ్లను కలసికొని పడవరేవువరకువచ్చి, శ్రీవారి యాశీర్వాదంబులబొంది తిరిగి తమయూరికి మఱలిరి. పరిచయములేనిస్థలములయందును శ్రీస్వామివారి యాత్మశక్తి ప్రజల నాకర్షించుచు మహాపురుషలక్షణములను ప్రకటించెను.

రేవువద్ద స్వామియు శిష్యులును పడవ నెక్కిరి. శ్రీవారి పాదములు బురదమైనందున, రామచంద్రుని పాదములను గుహుడు కడిగిన రామాయణకథ స్మరణకువచ్చునట్లు, దివ్య చరణారవిందముల భక్తులు కడిగిరి. శ్రీస్వామి శిష్యులతో పగలు 10 గంటలకు వేనాడు చేరిరి. విశాలమైన శివ విష్ణ్వాలయ మండపములో స్వామివారు బసచేసిరి. పేట అబ్బయ్య రెడ్డిగారు తమ మూడంతస్థుల సౌధమునకు శ్రీస్వామివారిని శిష్యులతో తీసికొనిపోయి సభక్తితో పాదపూజలొనర్చిరి. శ్రీస్వామివారి శిష్యుడైన చిదంబరశాస్త్రి సకుటుంబముగా శ్రీస్వామివారితో ప్రయాణమయ్యెనని వ్రాసియుంటిమిగదా! అచ్చట శాస్త్రిగారి జ్యేష్ఠపుత్రుడైన సత్యనారాయణయను మూడేండ్ల బాలుడు నెత్తురు విరేచనములచే యధికమైన బాధ ననుభవించుచుండగా, శాస్త్రి తమ బాలుని శ్రీస్వామి సన్నిధి కింగొనిపోయి, "స్వామి! ఈ బాలుడు మీబిడ్డడు గాని, మా పుత్రుడుగాడు, నెత్తురుబంక పడుటవలన మిక్కిలి బాధపడు చున్నా"డని విన్నవించెను. శ్రీస్వామి యంత తదేకదృష్టితో నీబాలునిజూడ అది యేమి మహిమయోగాని తక్షణమే బాధ యంతరించి సత్యనారాయణ యారోగ్యవంతుడయ్యెను. ఇప్పు డీబాలుడే బ్రహ్మనిష్ఠుడై అవధూత శ్రీసత్యానందస్వామి యయ్యెను.

అంతట శ్రీస్వామివా రచ్చట నొకదినము నివసించి,

అచ్చటి భక్తులందఱికి ఆత్మబోధ కలుగునటుల నుపదేశముల జేసి, యచ్చటనుండి తడ స్టేషనుకు జేరి, తిరిగి శిష్యసహిత ముగా బాపట్లకు వచ్చిరి. ఈప్రయాణమంతయు పదిహేను రోజులు పట్టినది.

శ్రీస్వామి బాపట్లకు వచ్చినవెంటనే, ఆసుపత్రిలో నున్న వెంకటరావుగారినిజూచి, యోదార్చి, ప్రక్కనగూర్చుం డి, లేవలేనిస్థితిలోనున్న వెంకటరావుగారిచెవులో శ్రీదత్తమం త్రము నుపదేశించి, మానసికముగా యథాశక్తి జపించమని యాజ్ఞనిచ్చిరి. వెంకటరావుగారిముఖములోని తుపాకిగుండు దెబ్బలు శ్రీస్వామివారి సమాధిధ్యానమహిమచే నయమై, వారు తిరిగి క్రీడరుపనిచేయుచున్నసంగతి బాపట్ల పురవాసుల కందఱికి విదితమే.

# పదునెనిమిదవ ప్రకరణము.

## —: బాపట్ల శివాలయములోని ప్రతిష్ఠలు: —

"ఉత్సీదేయురిమేలోకా నకుర్యాం కర్మచేదహం
సంకరస్య చకర్తాస్యాము పహన్యామిమాః ప్రజాః"

పూర్వము మన దేవాలయములు శివకేశవుల కభేదమును ప్రకటించుచుండెడివి. అనగా నొకయాలయావరణములోనే శివకేశవాలయములు, ఉపదేవాలయములున్నటుల కనబడుచున్నది. కొంతకాలములకు వీరవైష్ణవముప్పొంగి ఆలయములలోని శివవిగ్రహములను బెరికివేసి విష్ణ్వాలయములుగా మార్చినట్లు చరిత్రాంశములు తెలియజేయుచున్నవి. తిరుపతి క్షేత్రములో కపిలతీర్థమును ఆళ్వారుతీర్థముగామార్చి ప్రక్కన ఆలయములోని లింగములను బెరికి యాళ్వారులను బ్రతిష్ఠించినటుల నిదర్శనములుగలవు. ఇటులనే శ్రీరంగములోను, యితరచోట్లను వీరవైష్ణవముయొక్క ప్రతాపము లగపడుచున్నవి.

బాపట్లలోగూడ శ్రీభావనారాయణస్వామి యాలయమందు శ్రీసోమేశ్వరస్వామి లింగముగూడ బ్రతిష్ఠింపబడియుండెను. ఈలింగమునూడదీసి ప్రక్కనున్న సర్కారుఖాళీస్థలమందు పానువట్టముతోసహా పడవేసి, యాస్థానమున బీబీనాంచారీ విగ్రహమును వీరవైష్ణవులు ప్రతిష్ఠించిరి.

కొంతకాలమునకు రాజా కాండ్రేగుల జోగిజగన్నాథ రావు బహద్దరువారు యిచ్చటకు తహసీలుదారుగ వచ్చినప్పుడు, నిరాడంబముగానున్న యీ శివలింగమునుజూచి, యిచ్చట నొకగర్భాలయముతోగూడిన యొకచిన్న దేవాలయును నిర్మాణము జేసి, శివలింగమును పానువట్టముతోగూడ ప్రతిష్ఠించిరి. ప్రక్కనే పార్వతీయమ్మవారి విగ్రహమునుగూడ ప్రతిష్ఠించిరి.

బావట్లపౌరులలో నగ్రగణ్యులైన బ్రహ్మాండం బాపయ్యగారికి సంతతిలేనందున, సోమేశ్వరస్వామిని సేవించుచుండిరి. ఇట్లుండ వారికి యిప్పుడు లక్ష్మీనారాయణరావుగారని పిలువ బడు నొకపుత్రుడుగలిగెను. అందుకు సంతసించి యీశివాల యమున కిరుప్రక్కల రెండునూతనగర్భాలయముల కట్టించి, యీమూడింటికి ముందొక పెద్దముఖమండపమును నిర్మించి, యుత్తరపువైపున రథవాహనశాలల కట్టించి యందమైనయొక రథమును కొన్నివాహనములను చేయించి, సోమేశ్వరస్వామికి కల్యాణోత్సవములు జేయుటకు ప్రారంభించిరి. ఈనూతన గర్భాలయములలో శివలింగమును, పార్వతీ యమ్మవారిని ప్రతిష్ఠించవలెనని సంకల్పించిరి కాని, యిట్లుండ వీరు కాలగతి నొందిరి. వీరిపత్నియగు రామాబాయమ్మగారు సమర్థురాలును ప్రాజ్ఞురాలును నైనందున వారియస్టేటును వృద్ధిపరచి, వారి ధర్మములను స్థిరముగా జేయవలయునను దృఢబుద్ధితోనుండిరి. కాని, మహాపురుషుల సాన్నిధ్యమందుగాని, యీశివప్రతిష్ఠలు

లోపము లేకుండ చేయుటకు వీలులేదని యామె సమయమునకు వేచియుండెను.

శ్రీస్వామివారు నెల్లూరు మండల పర్యటనము నుండి బాపట్లకు వచ్చినపిమ్మట మహాశివరాత్రికి నేపాల దేశమునకు వెళ్లదలచి, వెంటనే కాశీకి ప్రయాణమైపోయిరి. మహాపురుషులైన శ్రీస్వామివారిసన్నిధిలో నీశివప్రతిష్ఠలు జరుప రామాబాయమ్మగారి సంకల్పము; అందువలన శ్రీదత్తజయంతికి శివాలయములో వేయబడిన పెద్దపందిళ్లను విప్పకుండ నిలిపి, శ్రీస్వాములవారిని తిరిగి బాపట్లకు దయచేయవలసినదని ప్రార్థించుచు తంతివార్తనంపెను.

రామాబాయమ్మగారు పంపిన తంతివార్తను జూచుకొని శ్రీస్వామివారు నేపాల దేశప్రయాణము మానుకొని, బాపట్లకు తిరిగివచ్చిరి. వారు వచ్చుసరికి, రామాబాయమ్మగారు వాహనశాలమీాద పుస్తకభాండాగారసౌధమును తయారొనర్చిరి. ఈవాహనశాలకు నుత్తరముననున్న నిమ్నప్రదేశమును స్వాధీనపరచుకొని, చెట్లను కొట్టివేయించి, యతుల కుపయోగార్థము దత్తమందిరమును నిర్మించుటకు శివరామయ్యగారు పూనుకొనిరి. ఈ రెండుప్రయత్నములను జూచి శ్రీస్వామివారు సంతసించిరి.

శ్రీస్వామి శివాలయ ప్రతిష్ఠలను చేయుటకు వలయు

కార్యక్రమమును రామాబాయమ్మగారికి తెలిపిరి. ఆగమ శాస్త్రజ్ఞులను పిలిపించిరి. ముహూర్తములను నిశ్చయించిరి. ముహూర్తము వారము దినములకు సమీపించునంతలో యాగమవేత్తలు శివలింగము శాస్త్రీయముగాని తమోలింగమనియు, ప్రతిష్ఠించిన కీడుమూడుననియు చెప్పిరి. అంతట ప్రతిష్ఠ నాపివేయుట కాలోచనలు జరిగెను.

శ్రీస్వామివారీసందిగ్ధమును జూచి కాశికివెళ్లి నూతన లింగమును తెచ్చెదనని సెలవిచ్చిరి. అందులకు రామాబాయమ్మగారు సంతసించి వలయుధనమిచ్చిరి. శ్రీస్వామివారెచ్చట నాగకుండ కాశికివెళ్లి, యుచితమైన శివలింగమును తీసికొని వెంటనే బాపట్లకువచ్చిరి. శ్రీస్వామివారి యాజమాన్యమున యాలగ్నమునకే క్రమమైన యంత్రములతో ప్రతిష్ఠలు జరిగినవి. ఉత్తరవైపు గర్భాలయమునందు శ్రీస్వామి కాశినుండి తెచ్చిన నూతన లింగమును అభినవ సోమేశ్వరుడను పేరుతో ప్రతిష్ఠించిరి. కీర్తిశేషులైన బాపయ్యగారు పూర్వము తెప్పించిన యమ్మవారి విగ్రహమును బాలాత్రిపురసుందరీ అమ్మవారను పేరుతో అభినవ సోమేశ్వరుని పూజించుచున్నట్లు బాపయ్యగారి కుమారుడు లక్ష్మీనారాయణగారి చేతులతో బ్రతిష్ఠింపబడినది. దక్షిణవైపుననున్న గర్భాలయమందు గణపతివిగ్రహము ప్రతిష్ఠింపబడినది. ఈయాలయమునకు ధ్వజస్తంభము చిరకాలము క్రిందనే పడిపోయినందున దివ్యమైన

ధ్వజస్తంభము స్థాపింపబడినది. ఈప్రతిష్ఠలన్నియు సలసంవత్సర ఫాల్గుణశుద్ధ నవమికి జరుపబడెను.

రామాబాయమ్మగారు శ్రీస్వామిసంకల్పించిన పుస్తక భాండాగారము నిమిత్తము నిర్మించిన సౌధమందు ౧౯౧౭ జూన్ ౮ వ తేదీన సంస్కృతపుస్తక భాండాగారమును స్థాపించిరి. రు 900 లు ఖరీదుచేయు 850 వేదాంతగ్రంథముల దెప్పించి యీభాండాగారమునం దుంచిరి. శ్రీస్వామివారు తర్వాత నూతనగ్రంథముల దెప్పించి పుస్తక భాండాగారమును వృద్ధిపరచిరి. ఈసమయమున శ్రీస్వామివారి చిత్తరువు నొకయద్దమందు బిగించి, శిష్యులు స్థాపించిరి. శ్రీస్వామివా రాచిత్తరువును జూచి స్థాపింపవలసిన పటము తనది కాదనియు, తమగురువులగు శ్రీనృసింహ భారతీస్వామివారియొక్క చిత్రపటము నుంచుట కర్తవ్యమనియు సెలవిచ్చిరి. శ్రీనృసింహ భారతీస్వామివారి చిత్తరువును సంపాదించి యద్దమునందుబిగించి మందిరమం దుంచువరకు శ్రీస్వామివారికి స్వస్థత చిక్కలేదు. చూచితిరా! శ్రీస్వామివారికి తమగురువులయెడ నెంతభక్తియో!

శ్రీతీర్థస్వామియొక్క ప్రేమ నొకసంస్థయందు గాని, యొక వ్యక్తియందుగాని నిలచియుండక, విశ్వప్రేమమై నలు దిక్కుల వ్యాపించినది. బాపట్లకు సమీపములోనున్న వెదుళ్ల పల్లిగ్రామములోని శివాలయము అమ్మవారియాలయము

శిథిలములై యుండెను. శ్రీస్వామివారా గ్రామమునకు వెళ్లినప్పుడు శివాలయముయొక్క దుఃస్థితికి చింతించి చుట్టుప్రక్కల గ్రామములలో చందాలువసూలుచేయించి యీ రెండు దేవాలయములను జీర్ణోద్ధరణగావించి మరల ప్రతిష్ఠలుజరిపిరి.

# పందొమ్మిదవ ప్రకరణము.

-: శ్రీబ్రహ్మానందతీర్థ స్వాములవారి యాశయములు :-

ఆత్మవిభూతి.

" సక్తాః కర్మణ్య విద్వాంసో యథా కుర్వంతి భారత
కుర్యాద్విద్వాం స్తథా సక్తశ్చి కీర్షుర్లోక సంగ్రహం.

ఇంద్రియముల జయించి, చిత్తమును నాశనముచేసి, యాత్మనిష్ఠగలిగిన బ్రహ్మవేత్తలు లోకమందు బలువిధములుగా జరింతురు. కొందఱు నివృత్తి మార్గమునుబొంది బాలోన్మత్తపిశాచములవలె ప్రపంచ బాహ్యులై సదా యంతర్ముఖులై, స్వాత్మనిష్ఠులై పూర్వపుణ్యావశమున వారి యనుగ్రహపాత్రులగు జీవుల నుద్ధరించుచు, గుప్తజీవనమును గడపుదురు. మఱికొందఱు బాహ్యప్రపంచమందు బ్రహ్మచైతన్య విలాసమును గాంచుచు, సర్వజీవులయందు నాత్మప్రకాశములు జూచుచు, లోకసంగ్రహము నభిలషించి కర్మయం దకర్మతత్త్వమును తిలకించుచు, నిర్లిప్తులై జీవితమును గడుపుదుస. శ్రీబ్రహ్మానందతీర్థస్వామివా రీరెండవ పక్షమునకు జెరుదిం వారు.

శ్రీ స్వామివారిని కొందఱు సమ్మద్ధిలో " నీకలికాల

మందు సన్న్యాసమును స్మృతులు నిషేధించినటుల మేము విని యున్నాము, నిషిద్ధ సన్న్యాస స్వీకారము తామేల జేసితిరి?" అని యడుగగా, శ్రీవారు "కుటీచక బహూదక హంస సన్న్యాసములు నిషేధింపబడినవిగాని, కేవల పరమహంస సన్న్యాసము నిషేధింపబడలేదు. అట్టి సన్న్యాసమును నిషేధించుటకు వీలులేదు. వాంతివచ్చినవారిని వమనము జేయ గూడదని నిషేధించుటకు యెటుల నిష్ప్రయోజనమో, తీవ్ర వైరాగ్యము గలవారిని సన్న్యసించగూడదని నిషేధించుటయు అంత నిష్ప్రయోజన"మని సమాధాన మిచ్చుచు, తమసన్న్యా సము స్మృతికి విరోధముకాదని సెలవిచ్చిరి.

తమసన్నిధికి జేరు శిష్యుల నందఱిని వారివారి యధి కారానుసారము నుద్ధరించుచు, తగిన సాధనము లభ్యసింప జేయుచు, నుత్తమభూమికలకు దారిజూపెడివారు. స్వామివారి యుపదేశములకంటె వారి యాచరణ వేయిమడుంగులు శిష్యుల హృదయముల నాధ్యాత్మిక మార్గమునకు ప్రవేశపెట్టుచుండెను. మైత్రి కరుణ ముదిత యుపేక్షయను భావములను, ఆత్మౌ పమ్యాను సమదృష్టి యోగమును శ్రీస్వామివారు ఉచ్ఛ్వాస నిశ్వాసములవలె నప్రయత్నముగ జరుగించుచుండునట్లు వారి యాచరణలవలన స్పష్టమగుచుండెడివి.

శ్రీస్వామి, తమరి నాశ్రయించు శిష్యుల లోపములను

జూపుటయే ప్రధానముగా నుంచుకొనక, వారి యంతఃకరణ స్థితిగతులను గనుకొని, తగిన సంస్కారణలను జేయుచు, వారి హృదయములను మార్చుచుండెడివారు. అంతఃకరణమును మార్పగల్గుటయే యాత్మశక్తి. ఇట్టిశక్తి శ్రీస్వామివారియందు గలదు.

శ్రీస్వామివారిని పరివేష్టించియున్న శిష్యులలో నన్ని రకముల వారుండిరి; అందువలన నొకరు "వీరందఱికి వేదాంత శ్రవణమున కధికారముగలదా?" యని యడిగిరి. శ్రీస్వామి వారందులకు "శ్రేయస్సు నపేక్షించి నావద్ద జేరుటయే నాకు ప్రధానము; వారినెట్లు సంస్కరింపవలయునో యాపద్ధతులు నాకు తెలియును. వారిని బెదరగొట్టుట నాపనిగాద"ని సెల విచ్చిరి. కొలిమిలోని యినుము నెప్పుడు సాగగొట్టవలెనో కమ్మరవానికి తెలిసినట్లు. హృదయసంస్కారము చేయుటకును హృదయ పరిపాకములను గనిపెట్టుటకును శ్రీస్వామివారు సమర్థులు.

బాపట్ల హైస్కూలు విద్యార్థులను శంకరవిద్యాలయ మునకు రప్పించి సంధ్యావందనమునగూర్చి బోధించిరి. శంకర విద్యాలయ పండితులచే సస్వరముగా సంధ్యావందనము చెప్పిం చిరి. ఆదివారము విద్యార్థులకు సెలవుదినముగాన యానాడు శ్రీస్వామివారు స్వయముగా సంధ్యావందనమునకు అర్థమును

జెప్పువారు. సంధ్యావందనమునకు కావలసినంత ప్రాణాయామమును గూడ శ్రీస్వామివారు విద్యార్థులకు నేర్పిరి.

శ్రీస్వామి తమశిష్యుల నేవిధముగా సంస్కరించినది తెలుపుటకు కొన్ని దృష్టాంతముల నుదహరించుట యుచితము. శ్రీస్వామివారి నాశ్రయించినవారు బహుసంఖ్యాకులు- అందరినిగూర్చి వ్రాయుట సాధ్యముకాదు గాన, ముఖ్యులగు కొందరినిగురించి వ్రాయకతప్పదు.

—: మల్లాది హనుమచ్ఛాస్త్రిగారు :—

వీరు బాపట్ల గ్రామకాపురస్థులు, తర్కశాస్త్రపండితులు. పురాణవిద్య నభ్యసించినవారు. వీరు బ్రహ్మసమాజికులుగా నుండిరి. ఉపన్యాసముల నిచ్చుటయందు సంపూర్ణ కుశలత గలవారు.

వీరు శ్రీస్వామివారివద్ద భాష్యములు జదువుటకు వచ్చిరి. మొదట సనాతనమతమును దూషించువారైనను, ప్రస్థానత్రయమును శ్రీస్వామివారివద్ద పఠించుటవలన శ్రీస్వామివారి యెడల శ్రద్ధాభక్తులు శాస్త్రిగారికి గలిగినవి. శ్రీస్వామివారిని అతిశయముగా ప్రేమించుటకు ప్రారంభించిరి. కాని, శ్రీస్వామివారియెడల తమకున్న యభిప్రాయమును కపటము లేకుండ చెప్పుచుండెడివారు.

శాస్త్రిగారికి సన్న్యాసమన్న తిరస్కారభావము. ఒక ప్పుడు శ్రీస్వామివారితో 'స్వామీ! మీరెంతమంచివారు! మీరు సన్న్యసించకుండిన యెడల, నింతకంటె మంచివారుగ నుందు రని తలచెద'నని శాస్త్రిగారనిరి. గృహస్థుగానుండి కష్టనిష్ఠు రముల ననుభవించుచు మోక్షమును సాధించుటయు త్తమమని శాస్త్రిగారి యభిప్రాయము. ఈపలుకులు విని, స్వామివారు నవ్వుచుండువారు కాని, శాస్త్రిగారిహృదయము మార్పుజెం దుచున్నదనియు, యెక్కువ స్వతంత్రముతీసుకొని సంస్కరిం చుట కిదియే సమయమనియు శ్రీస్వామివారు కనుగొను చుండిరి.

ఒకరోజున బెంగాలునుంచి బ్రహ్మసమాజికులు కొంత మంది బాపట్లపురమునకు వచ్చి, పురమందిరమందు సభజరిపిరి. ఆసభకు శాస్త్రిగారిని బ్రహ్మసమాజమువా రాహ్వానించగ, యాసభకు వెళ్ళిరి. మఱునాఁడు శాస్త్రిగారు స్వామివారి యొద్దకు భాష్యపాఠమునకు వచ్చినపుడు, "సభయం దేమిజరి గిన" దని శ్రీస్వామివా రడిగిరి. శాస్త్రిగారు హిందూశాస్త్ర వ్యతిరేకవిషయములను బ్రహ్మసమాజికు లుపన్యసించిరనియు, తాను మౌనము దాల్చితిననియుచెప్పిరి. అంత స్వామివారు రుద్రాకృతివహించి "నీవు సూత్రభాష్యమును జదువుకొనిన ప్రయోజనమేమి? సభయందు వా రుపన్యసించు విషయములను నీవు ఖండించక వచ్చుటకు కారణమేమి? నీనోటియందు వెం

ట్రుకలు మొలచి యస్థాపరచినవా?" యని కఠినముగా కోప పడిరి. అందుకు శాస్త్రిగారు మౌనముగానుండిరి.

పిమ్మట కొన్నిదినములకు నిచ్చటి బ్రహ్మసమాజికులలో నాయకుడగు బొప్పూడివెంకటప్పయ్యగారు శ్రీస్వామివారియొద్ద సూత్రభాష్యములు జదువుటకువచ్చి తఱచుగా కుంటిప్రశ్న లడుగుటకు ప్రారంభించిరి. శ్రీస్వామివారు శాంతముగా సమాధానము చెప్పుచుండిరి. అంతట వెంకటప్పయ్యగారు రంధ్రాన్వేషణబుద్ధిమాని శ్రీస్వామివారియెడల వినయవిధేయ తలుగలిగి యుండిరి.

మల్లాది హనుమచ్ఛాస్త్రిగారు ప్రస్థానత్రయమును పూర్తిజేసి తక్కినశిష్యులతో భాష్యములను చింతనజేయుచు శ్రీస్వామివారి యాజ్ఞ ప్రకారము ఆత్మపురాణము, యోగ వాసిష్ఠము మొదలగు గ్రంథములు పురాణముజెప్పుచు, వేదాంతోపన్యాసముల తఱచుగ నిచ్చుచు, శ్రీస్వామివారి మెప్పునుబొంది యనుగ్రహమును సంపాదించుకొని, శ్రీస్వా ములవారి ముఖ్యశిష్యులైరి.

వీరినిగూర్చి శ్రీశంకరవిద్యాలయ ద్వాదశవార్షిక నివేదిక నిట్లు తెలుపుచున్నది: "బ్ర. హ్మ. శ్రీ. మల్లాది హనుమచ్ఛాస్త్రి గారు, జీవితమును శ్రీశంకరవిద్యాలయజీవితమునం దైక్యము జేసి విద్యాలయ స్వరూపులుగా నిలువబడిరి." కేవల జీవన

మాత్రమునకు తగిన సన్మానమునుబొంది, యితర యపేక్షలేక శ్రీశంకర విద్యాలయమునకు తమజీవితమును ధారబోయు కర్మయోగులైన పండితులను తయారుజేసి, యీవిద్యాలయము నెలకొల్పవలెనని శ్రీస్వామివారి యుద్దేశము. ఈ యుద్దేశము ననుసరించియు శ్రీవారిబోధ విశ్వసించియు తర్కపండితులైన మల్లాది హనుమచ్ఛాస్త్రిగారు శ్రీశంకరవిద్యాలయమున యుపాధ్యాయులుగా జేరిరి.

శ్రీశంకరవిద్యాలయమునందు శ్రీస్వామివారు సిద్ధిపొందిన పిదపకూడ నుపాధ్యాయులుగా నుండి, భాష్యప్రవచనము పురాణ కాలక్షేపము జేయుచు శంకరవిద్యాలయ కార్యక్రమమును నడపుచుండిరి. శ్రీశంకరవిద్యాలయసంఘమునకు కొంతకాలము నధ్యక్షులుగా నుండిరి.

వైరాగ్యము పరిపక్వముకాగా కొంతకాలమునకు శాస్త్రిగారు సన్న్యసించి, సచ్చిదానందేంద్ర సర్వతీస్వాముల వారని యోగపట్టాను పొందిరి. శ్రీస్వామివారు సదేహులైయుండగా, వారివలన యుపదేశమును బొంది సన్న్యాసమును స్వీకరింపలేనందులకును, శ్రీస్వామివారి మహిమలను సంపూర్ణముగా తెలిసికొనుట కప్పుడు కంతఃకరణశుద్ధి లేనందులకు శాస్త్రిగారిప్పటికిని పరితపించుచున్నారు. శ్రీస్వామివారి జయంతి ప్రతి సంవత్సరమును శాస్త్రిగారు జరుపుచున్నారు.

## వేమూరు నృసింహశాస్త్రిగారు

వీరు పూర్వము నెల్లూరుజిల్లా కాపురస్థులు. శ్రీబ్రహ్మానందతీర్థస్వామివారు శ్రీనిత్యానందస్వామి యాశ్రమములో నుండగా దర్శించి, తమ గీర్వాణభాషాపాండిత్యమును ప్రకటించియుండిరి. తాము రచించిన గ్రంథముల కొన్నిటిని వినిపించిరి. శాస్త్రిగారికి గీర్వాణభాషయం దద్భుత పాండిత్యము గలదు. శతావధానము లనేకములజేసి ద్రవ్యమార్జించి గుంటూరు జిల్లాలోని పులివర్తిగ్రామమందు వసతి నేర్పఱచుకొని నివసించిరి.

వీరు భాష్యత్రయ పూర్ణశాంతి జేయుటకు కాళహస్తికి బోదలచి, తమ సామానులన్నియు రైలుమీద బంపి, తగు పుస్తకములు సామానులును దగ్గఱనుంచుకొని, మార్గమధ్యమున బాపట్లలోదిగి శ్రీ తీర్థస్వామివారు భాష్యప్రవచము జేయుసమయమునకు వచ్చిరి. అప్పుడు పాఠమును జరుపుచున్న కంభంపాటి సీతారామశాస్త్రిగారు దూరదేశము పోవలసిన యవసరము లేదనియు తమతోపాటు భాష్యత్రయమును శ్రీ స్వామివారివద్ద పఠించవచ్చుననియు సలహానిచ్చిరి. అందులకు నృసింహశాస్త్రిగారు సమ్మతించి, బాపట్లలో నిలచి శ్రీ స్వామి వారియొద్ద భాష్యత్రయమును పఠించి శ్రీవారి కత్యంత ప్రియ శిష్యులైరి.

శాస్త్రిగారొకప్పుడు శ్రీ స్వామివారితో "స్వామీ! మృత్యువననేమి? యనిప్రశ్నించిరి.

స్వామి:—సాధారణముగా దేహపతనమును మృత్యువందురు; అట్లుగాదు, ఆత్మనెఱుంగక (తన్నుతాను మరచి) ప్రమాదముచే అజ్ఞాన సముద్రపుటలలచే ఇటునటు కొట్టబడుటయే మృత్యువు. "ప్రమాదో వై మృత్యుః" తన్నుతా నెఱింగి తనస్థితినుండి జారకుండుటయే మృత్యుంజయము.

శాస్త్రి:—సిద్ధులనందగోరుట మంచిదికాదా?

స్వామి:—అదియు ప్రమాదరూప మృత్యువే! దూరదర్శన దూరశ్రవణాది సిద్ధులను యెప్పుడైన చింతించితివా? పతనముతప్పదు. ఆత్మానుభూతికి సిద్ధులన్నియు విఘ్నములు. రుచిజూపి జననమరణ సంసారచక్రమున బడవేయును జాగ్రత!

శాస్త్రిగా రంత నీ యమూల్యయుపదేశముల విని, విస్మయులై, శ్రీవారియెడల నత్యంతభక్తిగలవారై యుండిరి.

భాష్యములను ముగించిన తర్వాత శాస్త్రిగా రీదిగువ పంచరత్నములను రచించి, శ్రీస్వామివారి కర్పించిరి.

శ్లో. భాష్యేష్వర్థం ప్రముగ్ధంగమయితు మఖిలాన్బోధయంతం
చతుర్థం

శ్రుత్యర్థ జ్ఞాపనార్థం భువిధృతవపుషం సర్వవిద్యా
సమర్థం
అత్యర్థం నామసార్థం జననమపి నిజం సాధయంతం
కృతార్థం
శ్రీబ్రహ్మానందతీర్థం గురువర మనఘం భావయే
బోధనార్థం. ౧

శ్లో. ఆనందో బ్రహ్మతోఽన్యఃపరమితి నఖలూద్ప్రథనే
తీర్థరూపో
యత్తచ్ఛబ్దత్రయం తద్వహతి యతివరో నామ్ని యో
బ్రహ్మనిష్ఠం
శాంతం దాంతం మహాంతం శ్రుతిపరసపరం
భూరివైరాగ్యభాగ్యం
శ్రీబ్రహ్మానందతీర్థం గురువర మనఘం భావయే
బోధనార్థం. ౨

శ్లో. యోఽ "హంబ్రహ్మాస్మి" వాక్యాత్ సుకరణగణ
ప్రీతిలోమ్యర్థితాత్మా
బ్రహ్మైక్యం హృద్యఖండం స్థిరమనుసరతి ప్రాప్త
పూర్ణావబోధః

తద్బ్రహ్మాభ్యాసబుద్ధిం యదమలముఖసందర్శనః
కుర్వతేఽజ్ఞాః
శ్రీబ్రహ్మానందతీర్థం గురువర మనఘం భావయే
బోధనార్థం. ౩

శ్లో. ఏతద్బ్రహ్మాఖిలం ఖల్వితి నిగమవచః పాఠ
మన్వర్థయన్యోఽ
ధిషా నేదృష్టిమాప్యాజగదిమఖిలం బ్రహ్మరూపేణ
పశ్యన్
మత్యోన్మత్తాజవిజ్ఞ ప్రభృతిషు సమమానంద
మావిష్కరోతి
శ్రీబ్రహ్మానందతీర్థం గురువరమనఘం భావయే
బోధనార్థం. ౪

శ్లో. మర్త్యానందాద్యమాహుర్దశ శతగుణితం
ధర్మిణోఽభిన్నమాహుః
ధర్మం వాంఛంతి సర్వేఽఖిలు సుఖమధికం తత్సుఖేచ్ఛా
మనుష్యాః
బ్రహ్మానందం శ్రయంతే యతివరమితి యస్తర్క్యతే
పండితేంద్రైః
శ్రీబ్రహ్మానందతీర్థం గురువర మనఘం భావయే
బోధనార్థం. ౫

శ్రీ తీర్థస్వామివారి పాదుకాపూజా సమయమున పూజావిధానము తెలియక యన్యనామములతో బూజచేయుచున్నందున, శాస్త్రిగారు సమకాలికులవలనను, యితరత్రను శ్రీ స్వామివారిచరిత్రను సంగ్రహించి, ఆచరిత్రాంశములను అష్టోత్తరశత (౧౦౮) నామావళిగా సమకూర్చి శ్రీ స్వామివారి పూజావిధానమను పేరుతో నొకగ్రంథమును రచించిరి. ఈ గ్రంథమును తృతీయవార్షికనివేదిక యందు ప్రచురింపబడినది. శ్రీ స్వామివారి పూజలందు ఈ పూజావిధానము అవలంబింపబడుచున్నది.

ఒకపర్యాయము శంకరవిద్యాలయమందు శ్రీ స్వామివారిసన్నిధిలో శాస్త్రిగారు సభను తృప్తిపరచునట్లు అవధానము చేసిరి. వేనాటిపడవప్రయాణమందు శాస్త్రిగారు గీర్వాణభాషయందు నాశుధారాకవిత్వ సామర్థ్యమును శ్రీ స్వామివారి యెదుట ప్రకటించిరి

శ్రీ స్వామివారి యనుగ్రహమువలన శ్రీ వారిచే ప్రతిష్ఠింపబడిన శంకరవిద్యాలయము నెడల సత్యంతాభిమానమును వహించి, పురాణముజెప్పియు, విద్యాలయములో గొన్నివత్సరము లుపాధ్యాయులుగా నుండియు, ప్రస్తుతము శ్రీ శంకరవిద్యాలయసభ్యులుగా నున్నారు. వీరిప్పుడు బాపట్లలో గృహము నునిర్మించుకొని బాపట్లగ్రామవాసులైరి

## —:వేములపాటి జానకిరామయ్యగారు:—

వీరినిగూర్చి లోగడ కొంతవ్రాయబడినది. వీరి శ్రద్ధాభక్తులకు నివృత్తిమార్గమునకు శ్రీస్వామివారు మిక్కిలి సంతసించెడివారు. వీరు శ్రీస్వామివారియొద్ద భాష్యత్రయమును జదువుటయేగాక, ధౌతిమొదలగు హఠయోగకర్మములను, హఠయోగాసనములను, ప్రాణాయామ రహస్యముల నేర్చుకొనియుండిరి. వీరికి సన్న్యాసాశ్రమ మివ్వవలెనని శ్రీస్వామివారికి సంకల్పముగలదుకాని, జానకిరామయ్యగారు వారిదేహపరిస్థితులబట్టి బ్రహ్మచర్యాశ్రమమునందే కాలముగడుప దలచిరి.

## —:కుంభంపాటి సీతారామశాస్త్రిగారు:—

బాపట్లనివాసులు. హైస్కూలులో సంస్కృతపండితులు. శ్రీస్వామివారివద్ద భాష్యత్రయమును జదివినవారు. జ్యోతిశ్శాస్త్రజ్ఞులు. యోగాభ్యాసపరులు. వీరు శ్రీస్వామివారితో "స్వామీ! మానవులేల యజ్ఞానపంకమున బడి దుఃఖము ననుభవింపవలె?" నని ప్రశ్నించిరి.

స్వామి:—సర్వదుఃఖములకు సమస్తకష్టములకు అహంకారమే మూలకారణము. అహము నశించిన నిరంతరసౌఖ్యము గలుగును. అదియే యాత్మసాక్షాత్కారము.

శాస్త్రి:—బద్ధులు, ముముక్షువులు, ముక్తులు అనగా నెవ్వరు?

స్వామి:—బద్ధులనగా యజ్ఞానులు. వీరు ద్రవ్యము, యశస్సును గోరిసంసృతిబద్ధులైరి. దైవస్మరణనే జేవింజొరనీయని వారు. ముముక్షువులనగా, సంసారసముద్రమునుండి తప్పించుకొన భగవంతునే నావగానమ్మి మోక్షేచ్ఛ గల్గియుండువారు. ముక్తులనగా తుచ్ఛవిషయవాంఛలవైపు తమదృష్టి నేమాత్రము మరల్చనివారు.

శాస్త్రిగారు శ్రీ స్వామియుపదేశానుసారము తమజీవితమును గడపుచు, శ్రీ స్వామియెడల నత్యంతభక్తి జూపుచుండిరి. వీరు శ్రీ శంకరవిద్యాలయసంఘమునకు ప్రథమాధ్యక్షులుగానుండిరి.

—:అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు:—

వీరును బ్రహ్మానంద తీర్థస్వాములవారి ముఖ్యశిష్యులు. వీరి సంస్కృతపాండిత్య మపారము. దేశదేశముల సంచారమొనర్చి, శతావధానముచేసి మెప్పువడసిరి. శ్రీ స్వామివారు భాష్యముల బోధించుచుండ, శాస్త్రిగారు పఠించిరి.

వీరు శ్రీ స్వామివారికి ఫాలముసోక మ్రొక్కి "స్వామీ! మనస్సు భగవంతునియం దెట్లు లగ్నమగు?" నని ప్రశ్నించిరి.

స్వామి:—దినములో ముప్పాతిక భాగము భగవంతుని నామ ముచ్చరింపుము. పద్య గద్య గీతాభావార్థములతో దేవుని కీర్తింపుము. ఎల్లప్పుడు సాధుసాంగత్యములో కాలము గడుపుము. భక్తబృందముతో వేదాविज్ఞానవిశారదులగు పరివ్రాజకులతో పర్యటన సల్పుము. సంసృతిసంబంధములగు బాధలు, ఆలోచనలు పరివేష్టించియుండ, చిత్తము భగవంతునియం దాసక్తమగుట దుర్లభము. ఉదయము సాయంకాలము నియమముగా నేకాంతస్థలమున కేగి, దేవునిగూర్చి ధ్యానింపుము.

శ్రీ వారిబోధను విని, శాస్త్రిగా రాశ్చర్యనిమగ్నులై, యాజన్మాంతము నీయమూల్య యుపదేశానుసారమే తనజీవితముగడపిరి.

వీరు తెనాలి సంస్కృతకాలేజీలో నుపాధ్యాయులుగ నుండిరి. శ్రీస్వాములవారి బోధ హృదయమున సందడింప, కాలేజీయుపాధ్యాయపదవిని త్యజించి, శ్రీస్వాములవారు స్థాపించిన శ్రీశంకరవిద్యాలయమునందు నుపాధ్యాయులుగ జేరి వేతనమునుగైకొనకయే నిష్కామబుద్ధితో సేవజేసిరి.

వీరు కవిత్వరచనయం దగ్రగణ్యులు. శ్రీ స్వాములవారిపై కొన్నిపద్యములు రచియించియున్నారు. వాటిని "మహాప


మాధి'' యను ప్రకరణమున వ్రాసెదము.

శాస్త్రిగారు ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికలో ౧౯౨౭ వ సం. ఏప్రెల్ నెల ౩ వ తేది, ప్రభవసం. చైత్రశుద్ధ ౧ లు ఆదివారము "సిద్ధపురుషులు-శ్రీ బ్రహ్మానందతీర్థస్వామి" యనువ్యాసమును వ్రాయుచు "శ్రీ బ్రహ్మానందతీర్థులు" అను మహనీయులు గుంటూరుజిల్లాకు దయచేసియుండిరి. వారు బాపట్లలో కొంతసంవత్సరములకాలము నివాసముచేసిరి. ఒకపని చేయుమనిగాని, ఒకపనిచేయవలదనిగాని యొకరికి జెప్పెడి యలవాటు వారికి లేదు. సమీపమునకు వచ్చినవారితో ప్రియముగ మాట్లాడుచుండుట వారికి స్వభావము.

ఇట్టి వారచటకు నివసించుటంజేసి యాపట్టణమున చాల మార్పులుగలిగినది. నాస్తికులు ఆస్తికులైరి, ఘోరాత్ములు శాంతులైరి, దుష్టులు శిష్టులైరి. ఇట్లు చాలమందిజనులలో ఉత్తమస్థితి యేర్పడుటయు గొందరు భగవదారాధనరతులగు వారును, కొందరు సద్గ్రంథపఠనాదరము వహించు వారును, గొందఱు గర్మఠులగువారునునై యాదినములలో నక్కడికీర్తి చూపరులకు వింత గొల్పె" నని వ్రాసియున్నారు.

—:ప్రాతూరి వెంకటశివరామయ్యగారు:—

వీరు బాపట్లకోర్టు ప్లీడరు. వీ రింగ్లీషువిద్యార్థిగా నున్న



శిష్యబృందమునకు భాష్యపరిపాఠమును బోధించుట.



శ్రీ బ్రహ్మసంఘ [illegible]

ప్పుడు హిందూమతబాలభక్త సమాజమునకు కార్యదర్శిగా నుండిరి. ఉద్యోగిగనుండినప్పటికిని మతవిషయములలో యుత్సాహము గాని, నిరసనభావముగాని, లేక జాతీయస్వదేశ యుద్యమముల లోను రాజకీయసభలలోను పాల్గొనుచు కొంతకాలమునకు దివ్యజ్ఞానసమాజమునందు సభ్యులై, దివ్యజ్ఞాన సభలలో గూడ ప్రవేశము గలిగించుకొను చుండిరి.

అనిబిసెంటమ్మగారు దివ్యజ్ఞాన సమాజములో జేరిన నొక బ్రాహ్మణునికొమరితను అరండేలుదొరగారికిచ్చి వివాహము చేసిన సందర్భములో నాకార్యనిరసనసూచకముగా దివ్యజ్ఞాన సమాజమునుండి సభ్యతను వదలుకొనిన వారలలో శివరామయ్య గారొకరు.

శ్రీస్వామివారు బాపట్లకు దయచేసినప్పుడు శ్రీవారి శుశ్రూషలు జేయుచు, వారియొక్కనుపనిషద్భాష్యమును గీతాభాష్యమును పఠించి, శ్రీస్వామివారివలన యుపదేశముల బొందియున్నారు. శ్రీస్వామివారివద్ద హఠయోగాసనాదిక్రియలను, ప్రాణాయామాభ్యాసమును కొంతవఱకు నేర్చుకొనిరి. శ్రీస్వామివారు శంకరవిద్యాలయమును ప్రతిష్ఠించినతర్వాత శంకరవిద్యాలయకార్యదర్శిగానుండి, ౧౯౧౯ నుంచి నేటివరకు శ్రీస్వామివారి సంకల్పముల నెఱవేర్చుటయందు పాటుపడుచున్నారు.

శ్రీస్వామి కాశికి వెళ్లకపూర్వము శివరామయ్యగారితో తాముసందర్శించిన దేశమంతయు యాత్రచేయించెదమని వాగ్దానముచేసియుండిరి. శ్రీస్వామివారి మహిమవలననే ౧౯౩౦ లో సంపూర్ణయాత్రచేయుటకు సందర్భపడిన విషయమును 'నాయాత్ర' యనుగ్రంథములో వివరించియున్నారు. వీ రిపుడు ప్లీడరుఉద్యోగమును మానుకొని యున్నారు.

## —:రామాబాయమ్మగారు:—

ఈమెను గూర్చి లోగడ "బాపట్లశివాలయము లోని ప్రతిష్ఠలను" ప్రకరణమునందు కొంత వ్రాయబడినది. శ్రీస్వామివారిశిష్యురాలై యుపదేశములబొంది కృతార్థతను జెందినది మొదలీమె జీవితములో నూతనయధ్యాయము ప్రారంభించినటులయ్యెను. ఈమెగారు గురుభక్తి విడువక శ్రీస్వామివారుస్థాపించిన శంకరవిద్యాలయమం దభిమానము గలిగి చాలద్రవ్యము నిచ్చియున్నారు.

## —:వీరపల్లి అయ్యవార్లుగారు:—

బాపట్లతాలూకా పూండ్ల కాపురస్థులు. కమ్మవారు. గ్రామ మునసబు. ధనాఢ్యులు. వీరు తమయూరికి శ్రీస్వామి వారినాహ్వానించి శ్రీవారిసన్నిధిలో శివాలయాదిదేవాలయ

ముల ప్రతిష్ఠలుసలిపిరి. గ్రామపొలిమేరలో నొకతటాకము ప్రజలకు పశువులకు నుపయోగపడులాగున త్రవ్వించిరి.

శ్రీస్వామివారియెడల వీరికి గురుభక్తిమెండు. శ్రీవారి వలన యుపదేశములబొంది, యెల్లప్పుడు పరమేశ్వరసేవలో కాలముగడుపుచున్నారు. శ్రీస్వామియెడల గురుభక్తిసూచనగా శ్రీశంకరవిద్యాలయమునకు వీరు చేసినమహోపకారములను "నిర్యాణానంతరము శంకరవిద్యాలయము" అను ప్రకరణములో వ్రాసెదము.

## —: చెరువు సీతారామయ్యగారు:—

వీరు మరిప్రూడి వాస్తవ్యులు. శ్రీస్వామివారివలన శ్రీదత్తోపదేశమునుబొంది, ప్రతిసంవత్సరమును శ్రీదత్తజయంతి నత్యంతవైభవముతో నిప్పటికిని జరుపుచున్నారు. ఆసమయమున వీరుచేయు నన్నప్రదానము, పండితసంభావనలు శ్లాఘనీయములు. వీరు గుంటూరుమండలములో పర్యటనచేసి యనేకమహోపకారముల జేసియున్నారు.

శంకరమతమునకు జెందని యితరమతస్థులుగూడ శ్రీస్వామివారిశిష్యులై యున్నారు. అప్పుడు బాపట్ల సబురిజిష్ట్రారుగానున్న ఎ. గోవిందరావుగారు, ఉడుపిలో డిస్ట్రిక్టుమునసబుగాను కడపలో జల్లాజడ్జిగానుండిన అనంతగిరిరావు పంతులుగారును శ్రీస్వామివారిశిష్యులు. వీరుభయులు మధ్వమతస్థులు. వీరు నేటివరకు శ్రీశంకరవిద్యాలయమునకు ధన

సహాయముచేయుచున్నారు. నెల్లూరుజిల్లాలో కొంతమంది వైష్ణవులుగూడ శ్రీస్వామివారి శిష్యులైరి.

శ్రీ స్వామి జ్ఞాననిష్ఠులును, నిష్కామకర్మయోగులే గాక భక్తాగ్రేసరులును నయియున్నారు. కృతులు, తరంగములు, అష్టపదులు, తులసీదాసుకీర్తనలు మహారాష్ట్రమెట్టున నతిశ్రావ్యముగా బాడగలరు. శ్రీస్వామివారు బాల్యమున హరికథాకాలక్షేపము జేసి శ్రోతలనానందింపజేసి భక్తిప్రవాహముననోలలాడింపజేసిరని చదివియున్నాముగదా! తరంగకాలక్షేపసమయమున శ్రీవారానందభాష్పములతో తన్మయులై నిశ్చలమూర్తిగా కూర్చుండెడరు. కనుక శ్రీవారుపండితులనే గాక గానప్రియులగు భక్తులనుగూడ నాకర్షించిరి. ఈవిధమున నాకర్షించినవారలలో మేళ్ల చెఱువుకోటయ్యగారును మరిప్రూడి కాపురస్థుడు కంభంపాటి సింగయ్యగారును నైయున్నారు. కోటయ్యగారు భక్తిరహిత గానవిద్యయందును, ఫిడేలువాద్యమందును పండితులు. సంగీతపాండిత్యమున్నను భక్తిలేనిది శ్రేయోమార్గావలంబుడగుట కవకాశములేదని కోటయ్యగారికి భక్తిరసముగా బాడుట శ్రీవారునేర్పిరి. సింగయ్యగారు భక్తియుక్తులై కీర్తనలను పాడగలరు. సంగీతశాస్త్రములోను పరిచయముగలదు. శ్రీస్వామివారు సింగయ్యగారికి శ్రీదత్తాత్రేయ హరికథలజెప్పుట నేర్పి జీవనోపాధిని గల్పించిరి.

# ఇరువదవ ప్రకరణము.

—:మహిమలు:—

అణిమాద్యష్టసిద్ధులు తపఃఫలమున కంతరాయములని మహాత్ములు వాటిని లక్ష్యపెట్టరు. పూర్ణసిద్ధిని గోరునాతడు సిద్ధులవంక తిరిగిచూచిన యధఃపతనమే!

బ్రహ్మానందతీర్థస్వామివంటి మహనీయులచరిత్రములే మహిమలు. ఆధునిక నవనాగరికులు సిద్ధులను మనోభ్రమలని తలచెదరు, కాని యివియట్లు గాదు. మహిమలను కనుబఱచి కీర్తిని వ్యాపించజేయవలయునని గాని, వాటివల్ల ధనార్జన చేయవలెనని గాని, యుద్దేశ్యము శ్రీతీర్థస్వాములకు లేదు. అయితే మహాత్ములకు ఆత్మసాక్షాత్కారముతోడనే కొన్ని మహిమలు సిద్ధించునుకాని, వారువాటిని ప్రదర్శింపరు. అప్రయత్నముగా కొన్ని మహిమలు వారినుండి వెలువడి, లోకమునకు ఉపకార మొనర్చును. గ్రుడ్డివాడు చంద్రోదయ శోభను గాంచనివిధమున మూర్ఖుడు మహాత్ములమహిమల గాంచజాలడు. అది సజ్జనులకే లభ్యము.

నెల్లూరు బాపట్లమున్నగు పట్టణములలో నున్న వైరాగ్యసంపన్నులు సత్యవ్రతపరాయణులును శ్రీ స్వామివారి శిష్యులును నగువారు చెప్పిన జీవితాంశములందు గల మహిమలనే స్వీకరించితిమి. శ్రీ స్వాముల జీవితమునందు మహిమ లసంఖ్యాకములు. అయితే ముఖ్యమైనవి మాత్రము:—

హిమాలయారణ్యభూముల శ్రీ తీర్థస్వాములవారు సంచరించుచుండ, శ్రీ వారిని గాంచి, యెలుగుబంట్లు తమ క్రూరస్వభావమును వీడి శుద్ధసాత్వికవైఖరిని నవలంబించెను గదా!

హిమాలయపర్వతములయందు తపంబాచరించి, గురువు నన్వేషించుచు శ్రీ తీర్థస్వామి అడవిమార్గమున సంచరించుచుండ నొకదొంగలగూడెమునకు గొనిపోబడి, దొంగలనాయకుని యెదుట నిలుపబెట్టబడెను. అప్పుడు శ్రీ వారిని యాచోర నాయకుడు గూఢచారియని భావించి, చంపనుద్యుక్తుడైనప్పుడు దత్తదేవుడు ప్రత్యక్షమై శ్రీవారిని రక్షింప, దొంగలనాయకునకు జ్ఞానోదయముగలిగి మహాభక్తుడయ్యెనుగదా!

౧౯౧౪ లో శ్రీ స్వామి నాకాపుగ్రామమందుండ, నొకనాడు కొంతమంది యొకబాలికను శ్రీ వారిసన్నిధికి గొని వచ్చి, యిట్లుప్రార్థించిరి. "స్వామీ! యీ బాలికను కొన్ని యేండ్లనుండి దయ్యముపట్టి బాధించుచున్నది. ఎంతమందియో మం

త్రవేత్తలకు చూపించితిమిగాని, బాధ తొలగదయ్యె. మందుల కెంతయో ధనము వెచ్చించితిమిగాని నిష్ప్రయోజనమయ్యె"నని విన్నవించిరి. శ్రీ స్వామివారి ప్రార్థనల నంగీకరించి, జనబాహుళ్యము వలన తన బ్రహ్మనిష్ఠకు భంగము వాటిల్లకుండుటకై యెవరికి తెలియనీయవద్దని వారివద్ద ప్రతిజ్ఞగైకొని రహస్యముగా భూతోచ్చాటనమంత్రము నుచ్చరించి, విభూతి నివ్వ తక్షణమే భూతము మటుమాయ మయ్యెను.

ఒకసారి శ్రీస్వామి వేనాడునందుండ, సత్యనారాయణ యను బాలునికి నెత్తురువిరేచనములుగలిగి బాధయధికము కాగా వేమూరు చిదంబరశాస్త్రి శ్రీస్వాములవారి సన్నిధికి తమబాలునిగొని పోయి "స్వామి యీబిడ్డడు మీబిడ్డడుగాని మాబిడ్డగాడని చెప్పి" జరిగినవిషయమును నివేదించెను. అంతట నాయతీంద్రుల వీక్షణమాత్రముననే విరేచనముతగ్గి యారోగ్యవంతుడాయెను. ఇప్పుడీబాలుడే సన్యసించి అవధూత శ్రీసత్యానందస్వామి యయ్యెను. వీరి తలిదండ్రులు బ్రహ్మానందతీర్థస్వామి కమండలు జల ప్రోక్షణ ప్రభావమువలనను, వీక్షణముచేతను దివ్యస్పర్శచేతను సన్న్యసించి, యింతగొప్పదశకు వచ్చెనని సంతసించుచున్నారు. శ్రీ సత్యానందస్వామికి సుకృతవశాత్తు శ్రీరమణమహర్షి గురువుగా లభించెను. వారియనుగ్రహబలమువలన శ్రీసత్యానందావధూత సర్వభూతసమత్వము శాంతము శమము దమము తితిక్ష కలిగిబ్రహ్మానంద రసాబ్ధిమునుంగుచు పరమ

వైరాగ్యనిధియై యొప్పుచున్నారు. వీరు ఇనమడుగు స్వాశ్రమమున నివసించుచున్నారు.

ఒకపరి శ్రీ స్వామి గూడూరుసమీపమున వాకాడుగ్రామమున నుండ, యాపరిసరముననున్న చందోడు గ్రామనివాసియు, ధనికుడును నగు రెడ్డి శ్రీ స్వామిని ప్రార్థించి, తమయూరునకు తీసికొనిపోయెను. ఆదినమున శ్రీ స్వామికి భిక్ష; బ్రాహ్మణులకుసంతర్పణ, బీదలకు అన్నదానము చేయ సమకట్టి, తగిన యేర్పాట్లు గావించెను. వంట సిద్ధమైనది, చుట్టుప్రక్కలనుండి బ్రాహ్మణులు బీదలు వచ్చియుండిరి. వీరు భుజించబోవుతఱి, కంతిరీగల బారొకటి కదలింపబడియందరిని కుట్టనారంభించెను. అందరును విస్తళ్లనువిడిచి పరువెత్తసాగిరి. శ్రీ స్వామియన్నచో తమయాసనమునుండి చలింపలేదు. అంత కంతిరీగలు స్వామి చుట్టును జుమ్మనిమూగినవిగాని శ్రీవారిని బాధింపలేదు. శ్రీస్వామి తమ కమండలోదకమును జల్లి మీమీస్థానములకు వెళ్ళుడని యాజ్ఞనివ్వగనే తమతమ స్థానములజేరినవి. శ్రీ స్వామియంత అందరిని పిలిపించి, ఇక కంతిరీగల బాధయుండదు. సుఖోపవిష్టులై భుజింపుడన, వారట్లే గావించిరి. శ్రీ స్వామి మహిమను వేనోళ్ల స్తుతించిరి. ఆహా! మహనీయులయాజ్ఞ యెంత యనుల్లంఘనీయ మోగదా!

౧౯౧౭ లో బాపట్లయందొక బ్రాహ్మణబాలుడు శ్రీ స్వామివారి బోధ విని, తలిదండ్రులకు చెప్పకయే పారిపో

యెను. తలిదండ్రులా బాలుని పడకిి వేసరి, దుఃఖించుచుండిరి. శ్రీ స్వామివా రదిగాంచి, "మీ రేల పరితపించెదరు! మీ బాలు డిక నాలుగురోజులకు గృహముచేరు"ననిరి. అట్లే యా బ్రాహ్మ ణ బాలుడు నాలుగురోజులనాటికి యిల్లుచేరెను. తల్లితండ్రులు శ్రీ వారి మహిమను వేనోళ్ల కొనియాడిరి.

శ్రీ దత్త జయంతి జరుగుసమయమున వంటశాలకు నిప్పం టుకొనగా శ్రీస్వామి వారాసంగతి నెఱింగి సమాధినిష్ఠులైరి. అగ్ని హోత్రుడు నెమ్మదిగా చల్లారెను. జనులిది గాంచి యోగమ హిమయని స్తుతించిరి.

శ్రీ దత్తాత్రేయజన్మజయంతి మహోత్సవసందర్భమున శ్రీ దత్తాత్రేయ హరికథాకాలక్షేపమొనర్పమని వాకాటిగ్రామ నివాసియగు హరిదాసు వేమూరు వెంకటనరసయ్య యనుభ క్తుని శ్రీ స్వామివారాజ్ఞాపించిరి. అందులకు వెంకటనర్సయ్య "స్వామీ! నేను రుక్మిణీకల్యాణము సీతాకల్యాణము మొదలగు హరికథలుచెప్పుట కభ్యాసముగలవాడనుకాని శ్రీ దత్తాత్రేయ చరిత్రాంశములనెఱుంగను. దత్త హరికథాకాలక్షేపము నెట్లొ నర్ప గల"ననెను. శ్రీస్వాములవారంత వెంకటనర్సయ్యను ఏకాం తమునకుగొనిపోయి "నీకు దత్త హరికథ జెప్పుటకు సమగ్రతా శక్తి నిచ్చెదమని" నుడివిరి. శ్రీస్వామివారి దివ్య మహిమాన్విత మైన అఖండశక్తివలన ఛందస్సన నెట్టిదో యెఱుగనివాడైన

యాహరిదా సానాటి రాత్రి యతీశ్వరులు పండితులు భక్తవరులు ధనాఢ్యులు మొదలగు వేలకొలది ప్రజలు గలిగి క్రిక్కిరిసి యున్న యాసభ యెదుట తానే స్వయముగా బాహ్యస్మృతి లేశ మేనియు లేని తన్మయస్థితియం దుండి కీర్తనలను పద్యములను తోహరాలను ఆశుధారగా యప్పటి కప్పుడే యల్లుచు విను వారల కత్యాశ్చర్యము గలుగునట్లు శ్రీదత్త హరికథా కాలక్షేపము గావించెను. అందువలన వెంకటనరసయ్య శ్రీస్వాముల వారియం దత్యంత భక్తి శ్రద్ధలు గలవారై శ్రీవారిమాహాత్మ్యమున కబ్బురపడుచు తనజీవితాంతమువఱకు శ్రీస్వాములవారిని అనేకవిధముల పద్యగద్యగీతాభావములతో స్తోత్ర మొనర్చుచుండెను.

౧౯౧౭ లో శ్రీస్వామి నెల్లూరుమండలమునకు బాపట్ల శిష్యులతో పర్యటనము చేయ నిశ్చయించినప్పుడు బాపట్లగ్రామ వాసియు ప్లీడరును తమశిష్యుడునునైన కోనా వెంకటరావు గారిని కూడా తమతో ప్రయాణము కమ్మని శ్రీస్వాములవారు కోరిరి. కాని కార్యాంతరవశమున వారు రాజాలక పోయిరి. అంత శ్రీస్వామి తమశిష్యులతో బయలుదేరి నెల్లూరు, గూడూరు, వాకాడు, కోట మున్నగు గ్రామముల సంచరించి నాయుడుపేట సమీపముననున్న మీంజూరు జేరి, యటనుండి వేనాడుగ్రామమునకు పయనించుచుండ, బాపట్లనుండి యొక బ్రాహ్మణుడు

పరుగెత్తుకొని వచ్చి, గడచినరాత్రి కోనా వెంకటాద్రిగారిని విరోధులు రివాల్వారుతో కాల్చినారనియు ముఖమున గాయము లుతగిలి నెత్తురు వరదలై నందున యాసుపత్రియం దున్నారనియు చెప్పెను; యీదుఃఖవార్తను వినగానే శ్రీ స్వామి త్రికాలజ్ఞులు గాన సమాధినిష్ఠాగరిష్ఠులై కూర్చుండి, కొంతసేపటికి కనులువిప్పి శిష్యులతో "ప్రాణాపాయముండదని" వాకృచ్చిరి. శ్రీస్వామి బాపట్లలోనున్నంతవరకు విరోధులు వెంకటాద్రిగారి కేమియు హానిమొనర్పలేకయుండి శ్రీవారు బాపట్లను వదలగనే యీ ఘోరకృత్యము నాచరించిరి. శ్రీ స్వామివారి యాజ్ఞప్రకారము వెంకటాద్రి ప్రయాణమై వచ్చియుండిన యీ యాపద వచ్చియుండదుగదా! మహాత్ముల యాదేశముల శిరసావహింపక తృణీకరించినందువలన గలుగు ఫలము త్వరలో ననుభవమునకు వచ్చుననుటకు పై యంశమే యుదాహరణమైయున్నదని పాఠకులు గ్రహించెదరు గాక!

తదుపరి శ్రీ స్వామి నెల్లూరు మండల పర్యటన సల్పి బాపట్లకు వచ్చినతక్షణమే వైద్యశాలలోనున్న వెంకటాద్రి గారికి ధైర్యముగల్గు వేదాంతబోధ జేసి ప్రక్కనుకూర్చుండి శ్రీదత్తమంత్ర ముపదేశించిరి. శ్రీ స్వామివారి దివ్యయుపదేశ మహిమవల్లను దివ్యహస్తస్పర్శవల్లను వెంకటాద్రిగారి గాయములన్నియు మాని, తిరిగి ప్లీడరుపనిచేయ గలిగెను. ఈ విషయము వెంకటాద్రి నెఱిగిన బాపట్లపురవాసులందరికి తెలిసియే

యున్నది. చూచితిరా! మహాపురుషుల యుపదేశములు దివ్యమైన హస్తస్పర్శ యెంత మహచ్ఛక్తితో గూడినవో!

ఈ పైనుదహరించిన శ్రీ స్వామి జీవితమున జరిగినవన్నియు మహిమలో కావో పాఠకులే యోచించెదరుగాక! శ్రీ స్వామివారిజీవితమున సిద్ధుల కేయే లక్షణములుండునో అవి యన్నియు యొప్పియుండుట ఎల్లరును గాంచుచునే యున్నారు. శ్రీస్వామి అణిమలఘి మాద్యష్టైశ్వర్యసిద్ధులు గలవారని ఈ చరిత్రను జదువు వారికెల్లరికి స్పష్టమగును. ఇక విస్తరించి వ్రాయనేల?

# ఇరువదియొకటవ ప్రకరణము.

## —: మ హా స మా ధి :—

'బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి'

ఈ జన్మలోనే పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మానందము ననుభవింపవలయునని దృఢనిశ్చయముతో తీవ్రతమమైన సాధనల సలుపు ముముక్షువులకు మార్గదర్శకుడైన వాడవతారపురుషుడు. అట్టి యవతారపురుషులలో బ్రహ్మానందతీర్థస్వాములవారగ్రగణ్యులు. ఏ యనంతశక్తి తనయవతారోద్దేశ్యము నిర్వహించుటకీదేహమును ధరించెనో, యాధర్మసంస్థాపనమైన వెంటనే యీయశాశ్వతమైన పైతొడుగును వదలి, తన శాశ్వతధామమును పొందును.

శ్రీబ్రహ్మానందతీర్థస్వామివారు శ్రీదత్తమందిరమును ప్రతిష్ఠించినది మొదలు శంకరవిద్యాలయ విద్యాప్రచారము దత్తమందిరములోనే జరుపబడుచు వచ్చెను కాని, శ్రీస్వామి భాష్యప్రవచనమును మామూలు ప్రకారము శ్రీశివాలయములోనే జరుపుచుండిరి. ఐతరేయోపనిషత్తు ముగించినపిమ్మట శేషించిన యుపనిషద్భాష్యములను శ్రీవారు ప్రవచనము చేయుటకు ప్రారంభించిరి. ఈభాష్యములు చదువుశిష్యులు

ముప్పదిమంది వరకు వృద్ధియైరి. శ్రీస్వామిప్రవచనముచేయు టలో పంక్తిమీాద అర్థముచెప్పుటయేగాక, వారి వచనములు విజ్ఞానసహితముగా వెలువడుచున్నందున శిష్యులకు సులభముగా హృద్గోచరము లగుచుండెడివి.

శిష్యులలో పండితులుగా నుండు వారు శ్రీస్వామిచెప్పు భాష్యార్థములను క్రిందివ్యాఖ్యానముల ననుసరించియున్నవో లేవోయని ప్రతీకలనుబట్టి చూచుచుండెడివారు. శ్రీస్వామి వీరి యనుమానమును దేవులాటను కనిపెట్టి, భాష్యార్థమును వివ రించి, తర్వాత వ్యాఖ్యానము లోని పంక్తులను చదివి వినిపించి, వారి యనుమానము పోగొట్టి సమాధానపరచి, పాఠ మునుముందుకు నడిపెడివారు.

శ్రీవారు భాష్యార్థమును శిష్యుల కర్థమగునట్లు విపు లముగా మరలమరల వివరించుచు పాఠమును నెమ్మదిగ బోధిం చుచుండిరి. దీనిని బట్టి పండితులగు శిష్యులు శ్రీవారికి శబ్ద ఝరీతోగూడిన వాగ్ధార లేదనిపొరబడిరి. సర్వజ్ఞులగు శ్రీస్వామి దీనిని కనిపెట్టి, శిష్యులు గమనించలేనంతటి వేగముతో బోధ చేయసాగిరి. పండితశిష్యులు శ్రీవారిచిత్తవేదిత్వమున కచ్చెరు వంది, శ్రీస్వామినిగూర్చి తమ కేర్పడిన యభిప్రాయమునకు క్షమాపణ వేడుకొనిరి.

శ్రీస్వామి వ్యాఖ్యానములను విమర్శించి, అనుభవ

యుక్తముగా బోధచేయువారు. శిష్యులు చదివిన పాఠములను చింతనజేయుటలో వ్యాఖ్యానములతో భాష్యపంక్తులను ఘట్టములచోట అర్థముచేసుకొనలేక, తుదకు శ్రీస్వామివారు జెప్పిన సంగతులను స్మరణకుదెచ్చుకొని అర్థమును గ్రహించి గురువులేని వ్యాఖ్యానములవల్ల భాష్య మగోచరమని తెలిసికొనిరి. శ్రీస్వామి భాష్యప్రవచనము చేయునపుడు, దూరదేశములనుండి చూడవచ్చిన పండితులు శ్రీవారి భాష్యప్రవచనసామర్థ్యమును సందర్భానుసారముగ వారు సెలవిచ్చునట్టి యను వదవిషయకసంగతులను జూచి ఆశ్చర్యమును బొందెడివారు. వచ్చినపండితులతో అద్వైతసిద్ధిమొదలగు సద్గ్రంథములలోని విషయములను చర్చచేయునపుడు, పండితశిష్యులు తమ అల్పత్వమును, శ్రీవారిగొప్పతనమును దెలిసికొని, శ్రీవారు సమయానుసారముగా ప్రతిభను జూపువారుగాని, ప్రగల్భముల కొరకు ప్రదర్శించువారు గారని గ్రహించి, వినయముతో శ్రీస్వామిబోధయం దెక్కువ సమాధానబుద్ధి, విశ్వాసముగలిగి, పాఠమును బహుశ్రద్ధతో వినుచుండిరి.

పూర్వమువలెనే హరికథలు గానసభలు, జయంతులు, ఉత్సవములు జరుగుచున్నను భాష్యప్రవచనము యథావిధిగా శ్రీస్వామి జరుపుచుండిరి. ఈ కార్యభారమువలన శ్రీ స్వామివారికి అలసట గలిగినప్పుడు భాష్యప్రవచనము ఆపవలసినదిగా శిష్యులు శ్రీస్వామిని ప్రార్థించిరి. మరుదినము శిష్యులు తమపుస్త

కముల గృహములయందుంచి దర్శనార్థము వచ్చి శ్రీస్వామి వారికి వందనము మాత్రము చేసి వెళ్లవలెనని వచ్చినప్పుడు, శ్రీస్వామియెట్టి యస్వస్థతయు లేక నిర్మలముగా, కడిగినముత్యము వలె సుఖాసీనులై ప్రవచనముజేయుటకు సిద్ధముగా నుండిరి. అదిగాంచి శిష్యు లచ్చెరువొంది, సిగ్గుచే తలలువంచుకొని, యిండ్లకుపోయి తమపుస్తకముల దెచ్చుకొని యథాప్రకారముగా పాఠముల ప్రారంభించిరి. ఆహా! శ్రీస్వామివారి యోగ మహిమ, సమాధినిష్ఠలు యెంత అఖండమైనవో గదా!

మహాపుణ్య తీర్థ ముప్పొంగి వెల్లువలై గృహాంగణములలోనికి వచ్చినప్పు డందు తీర్థమాడి యఘములను పోగొట్టుకొనుటకు జీవులెట్లు త్వరపడుదురో యట్లే శ్రీబ్రహ్మానందతీర్థస్వామివారి యుపనిషద్భాష్యప్రవచనము ముముక్షువుల సందరిని తరింపజేయుచున్న దను కీర్తియను తీర్థము దిగంతముల వ్యాపించగా అందు స్నానమాడి పునీతులగుటకు వృద్ధులు పండితులునలుదిక్కులనుండి పింగళనామసంవత్సర ఆశ్వయుజ శుద్ధ విజయదశమికి బాపట్ల జేరిరి.

పింగళసంవత్సర మార్గశిర శుద్ధ ఏకాదశి మొదలు మార్గశిర బహుళ పాడ్యమివరకు శ్రీస్వామివారు శ్రీదత్తమందిరమందు శ్రీదత్తాత్రేయజయంతి జరుపుటకు నిశ్చయించి ప్రారంభించిరి. పూర్వమువలెనే శివాలయావరణమంతయు విశాలమైన

పందిళ్లు వేయబడినవి. చతుర్వేదాధ్యయనములు పురాణశాస్త్ర పారాయణలు అనుష్ఠానములు హరికథలు సభలు సమారాధనలు కడచినజయంతి కంటె జయప్రదముగా జరిగినవి. చివర రోజున సాయంత్రము ౬ గంటలకు శ్రీదత్తమందిరము యెదుట పుష్పతోరణములతో అలంకరింపబడిన పెద్దపందిరిక్రింద నేర్పాటుగావింపబడిన పౌరసభలో శ్రీస్వామివారధ్యక్షతవహించిరి. శివరామయ్యగారు లేచి శ్రీస్వామివారియొక్కయు శ్రీశంకరవిద్యాలయముయొక్కయు చరిత్రను సంగ్రహముగా దెల్పు శ్రీశంకరవిద్యాలయ ప్రథమవార్షిక నివేదికమును జదివిరి. శంకరవిద్యాలయ హితచింతకులు పదుగురు సంస్కృతవిద్యాపూర్వోన్నతి గూర్చియు ఇప్పుడు పునరుద్ధరింపబూని, శ్రీవారిచేస్థాపించబడిన శ్రీశంకరవిద్యాలయమునకు సహాయపడవలసిన యావశ్యకతనుగురించియు ఉపన్యసించిరి. అధ్యక్షులైన శ్రీస్వామివారు "శంకరవిద్యాలయ మూలమున సంస్కృతవిద్యను వ్యాపింపజేయుట ప్రతిభారతీయుని కర్తవ్యమై యున్నదని గంభీరోపన్యాసము నిచ్చిరి. ఆయుద్రేకపూరితమైన యుపన్యాసమును వారందరు పులకాంకితులై శ్రీశంకరవిద్యాలయమునకు విరివిగా ధర్మములుజేసి కనకవర్షము కురిపించిరి.

శంకరవిద్యాలయమునకు శ్రీదత్తాత్రేయమందిరము-పుస్తకభాండాగారము నను రెండుసౌధములును షుమారు ౨౦ యెకరముల భూమి, కొన్నివేలరూపాయలయాస్తి యేర్పడినవిమ్మట

శ్రీశంకరవిద్యాలయమునకు పరిపాలనాసంఘ ముండవలసిన యావశ్యకతను శ్రీస్వామివారు కనిపెట్టి ౧౫ మందిసభ్యులతో నొక సంఘమును శ్రీశంకరవిద్యాలయ సంఘమను పేరుతో నేర్పరచి పరిపాలనా విధానముతో నొక చట్టగ్రంథమునుజేసి, శ్రీ శంకరవిద్యాలయమును రిజిష్టరుచేయించిరి. ఈసంఘము నకు కంభంపాటి సీతారామశాస్త్రిగారిని యధ్యక్షులునుగాను, పాత్రితూరి వేంకటశివరామయ్యగారిని కార్యదర్శిగాను నియమించిరి. ఇంతగొప్ప కర్మకాండసూత్రమును శ్రీస్వామివారు త్రిప్పుచున్నను నిర్లిప్తులుగా కర్మయందకర్మబుద్ధిని ప్రదర్శించుచు జ్ఞాననిష్ఠులై ప్రవర్తించిరి. శ్రీస్వామివారితో నొకరు మీకు బాపట్ల స్వామియని పేరువచ్చినదని చెప్పగా నన్ను బాపట్లపట్టుకొనగలదా ?" యని చిరునవ్వునవ్విరి.

ఈసమయమున శ్రీశంకరవిద్యాలయమును గూర్చి శ్రీస్వామికి కొన్ని యున్నతాశయములుగలవు. శ్రీశంకరవిద్యాలయమును సనాతనవిశ్వవిద్యాలయముగా జేయవలయుననియు నెల్లూరిలో శ్రీనిత్యానందస్వామివారి పాఠశాలను శాఖాపాఠశాలగా జేయవలయుననియు, నెల్లూరు గుంటూరు మండలములలోను, యితరజల్లాలలోను శాఖాపాఠశాలల స్థాపించవలయుననియు, బాపట్ల పరీక్షాకేంద్రస్థానముగా జేయవలయుననియు, తద్వారా సనాతన ధర్మప్రచారమునకై నొకపత్రికను ప్రకటింపవలయుననియు శ్రీస్వామివారి యాశయములైయున్నవి.

శ్రీస్వామి తెనాలితాలూకాలో ప్రచారముచేయునప్పుడు తమభావము నిట్లుపన్యసించిరి. "లోకమాన్య బాలగంగాధర తిలకు గోఖలే మొదలగు మహాపురుషు లల్పవేతనమును స్వీకరించి, ఫర్గూసన్ కాలేజీని స్థాపించి పోషించినటుల గీర్వాణ భాషోద్ధరణకొఱకు నేకవేదశాస్త్రపాఠశాలను స్థాపించి పోషించుటకు సమర్థులైన పండితులు వలయుననియు, ఆధునిక కాలమున సనాతనులైనపండితులు లేనికారణమున సనాతన మతము గీర్వాణభాష జీర్ణించిపోవుచున్న" వనియు ఉద్రేకము పుట్టునట్లు శ్రీస్వామివా రుపన్యసింపగా, నచ్చటనున్న పండితు లావేశపూరితులైరి. అట్టివారిలో కురుగంటిపిచ్చయ్యశాస్త్రిగా రెట్టిస్వార్థపరాయణత్వములేక శ్రీశంకరవిద్యాలయములో విద్యాసేవజేయుటకు సంసిద్ధముగానున్నానని శ్రీస్వామివారితో మనవిచేయవలసినదిగా మల్లాది హనుమచ్ఛాస్త్రిగారికి ఉత్తరమును వ్రాసిరి. తెనాలిసంస్కృతకాలేజీ నుపాధ్యాయులుగా నుండు అవ్వారిసుబ్రహ్మణ్యశాస్త్రిగారు అక్కడి యుపాధ్యాయ పదవిని వదలి, శ్రీశంకరవిద్యాలయములో శ్రీస్వామివారి యనుజ్ఞనుపొంది యుపాధ్యాయులుగా జేరిరి.

శ్రీస్వామి శ్రీశంకరవిద్యాలయమునకు అమూల్యములైన గ్రంథములను తెప్పించిరి. శ్రీశంకరవిద్యాలయచరిత్ర హిందీ భాషయందు సమగ్రముగా వ్రాయించి ఉత్తరహిందూస్థానమందు దర్భాంగ మొదలగురాజులతో సంప్రతించియు

మహారాష్ట్ర దేశములో కార్యదర్శిని వెంటనుంచుకొని ప్రచారము జేసియు, ధనము సమకూర్చి శ్రీశంకరవిద్యాలయమును విశ్వవిద్యాలయముగా జేయదలచిరి.

పింగళ సం॥ మాఘమాసములో శివరాత్రికి కృష్ణానదీ తీరమునను న్న సత్తెనపల్లి తాలూకాలో ననాదిక్షేత్రమగు అమరావతికి శ్రీస్వామివారు శిష్యులతో యాత్రజేసి, యచ్చటి యమరేశ్వరస్వామి కభిషేకమొనరించిరి. అచ్చట శ్రీస్వామివారి శిష్యులగు పిశిపాటి వెంకటసుబ్బయ్యపంతులు గారు మేజస్ట్రేటుగానుండి శ్రీస్వామివారికి శిష్యులకు వసతులను జూపి గౌరవించిరి.

పిమ్మట శ్రీస్వామిశిష్యులతో తెనాలి తాలూకా యనంతవరము కొల్లూరుగ్రామముల సంచరించి, కృష్ణాసాగర సంగమమున నుండు హంసలదీవియను లంకకు ౧౦ మైళ్లుకృష్ణలో పడవమీద ప్రయాణముజేసి, హంసలదివి జేరిరి. అచ్చట నొక గోపాలకృష్ణదేవాలయము జీర్ణస్థితిలోనుండెను. అక్కడి ప్రదేశము నక్కసిపాదలతో గూడి దుఃస్థితిలో నుండెను. శ్రీస్వామివారు "ఇది మహాపుణ్యక్షేత్రమని" జెప్పినతోడనే యనంతవరము కొల్లూరుమున్నగు తెనాలి తాలూకాలోని శిష్యులందరు సప్తాహముజేయదలచి శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి యాజ్ఞ ప్రకారము పందిళ్లు పాకలను వేయించి, జయప్రదముగా

సప్తాహములు జరిపిరి. శ్రీస్వామివారచట నొకసత్రము నిర్మించ వలసినదనియు, దేవాలయమును మంచిస్థితిలోనికి తీసుకొని రావలసినదనియు శిష్యుల కాజ్ఞాపించి, తిరిగి బాపట్లకు వచ్చిరి. శ్రీస్వామియాజ్ఞానుసారము హంసలదీవిలో సత్రమును శిష్యు లేర్పటిచిరి. ఇప్పటివరకు ప్రతిసంవత్సర మక్కడ సప్తాహములు జరుగుచున్నవి. శ్రీగోపాలకృష్ణదేవాలయము నిత్యధూప దీప నైవేద్యాదులతో వర్ధిల్లుచున్నది.

ఇట్లుండ అల్లూరుఆదిలక్ష్మమ్మ శ్రీస్వామివారిని వాకాడున కాహ్వానించగా, శ్రీస్వామివారు వేమూరినృసింహశాస్త్రితో వాకాడుగ్రామమునకువెళ్లి తిరిగిబాపట్లకువచ్చిరి. వాకాడునం దుండగనే శ్రీస్వామివారిపాదములు నీరుజూపినవి. శ్రీస్వామి వారు రెండుసంవత్సరములు దివారాత్రములు శిష్యబోధలతో దేశ పర్యటనములతో క్షీరశాకాహారములతో వేపచిగుళ్ల భక్షణముతో కాలముగడిపినందున శ్రీవారిదేహముజీర్ణస్థితిని బొందుట కారంభించెను. ఎంతదివ్యశరీరమైనను పాంచభౌతికము గుటచే మించినబరువు మోయలేక కడు శుష్కించెను. శ్రీస్వామివారిదేహము యథాప్రకారముండినటుల పైకి కన్పించినను వంజులక్షణములు గనపడినవి. ఔషధము సేవించుట శ్రీస్వామి కిష్టములేదు.

అంతట శ్రీస్వామి చాతుర్మాసదీక్ష జరుపుటకు కాశీ

క్షేత్రమునకు కంభంపాటి సీతారామశాస్త్రిగారితో, ప్రయాణ మైరి. శిష్యబృందము రైల్వేష్టేషనువరకు వెంబడించిరి. శ్రీస్వామివారు మధ్యాహ్నము రైలులో బయలుదేరి వెళ్లిరి. శిష్యులందఱు శ్రీస్వామికి వందనములుజేసి, వారియనుజ్ఞ గొని చూపు కదృశ్యులగునంతవరకు స్టేషనువద్దనుండి, తిరిగివచ్చిరి.

శ్రీస్వామివారు కాశినుండి పుస్తకభాండాగారమునకు అమూల్యమైన సంస్కృతగ్రంథముల బంపిరి. శ్రీశంకరవిద్యాలయ కార్యకర్తగారిపేర కాశియుక్తి సం॥ ఆషాఢకృష్ణఅష్టమికి వ్రాసినఉత్తరము చివర శ్రీస్వామివారిట్లు వ్రాసిరి:- "మీకందరికి యీశరీరం అర్పించియున్నాము. ఈప్రకారముగానే లోకోపకారము బాగుగ జరుపవలయును. వర్ణాశ్రమధర్మము సనాతనాచార ప్రకారము జరుపుటయె పరమేశ్వర సేవ. మరికొందఱు అన్యప్రకారము దేశసేవచేస్తూయున్నారు. వారితో మనకు విరోధము లేదు; తదాపి ఇదియే దేశసేవయని అనడానికి వీలులేదు. అందరివలన త్యజింపబడని సేవఇదియే. దీనియొక్క మహాత్మ్యము ఇప్పుడు తెలియదు. ఇహపరసుఖదాయకమని మీకు తెలుస్తూనేయున్నది. విశేషములు మీజవాబుజూచి వ్రాస్తాము."

కాశియందు మణికర్ణికాఘట్టమున బోన్స్లేమందిరమున స్వామి బసజేసిరి. ఇదిపెద్ద రెండుఅంతస్థులమేడ. ఇచ్చటమహారాష్ట్రియతులు భక్తులు నుండెదరు. శ్రీస్వామివారిబసయందు

యతీశ్వరులకు మాండూక్యోపనిషత్తుబోధించుచుండిరి. అచ్చట మార్కండేయ బ్రహ్మచారిగారు లక్ష్మీనారాయణాలయ పూజాదికము లొనర్చుచుండిరి. వ్యాధిబలవత్తరమై శ్రీస్వామి శరీరము దినదినమునకు శుష్కింప సాగెను. మార్కండేయ బ్రహ్మచారిగారు వారితల్లియు శ్రీస్వామివారికి ఉపచారములు చేయుచుండిరి. శ్రీతీర్థస్వామికి అంత్యదశలో నుపచారములు జేయుభాగ్యము లభించిన మార్కండేయ బ్రహ్మచారిగారు సంస్కృతభాషయందు ప్రజ్ఞగలవారు. వీరు ౧౯౩౬ లో ఇనముడుగు శ్రీసత్యానందాశ్రమమునకు వచ్చియున్నారు.

శ్రీస్వామి యెంతదారుణమైన శరీరబాధ యనుభవించుచున్నను, వైద్యులు యొకచోటి నుండి కదలరాదని యెంత జెప్పినను, లక్ష్యపెట్టక తారకమఠమున భాష్యముల బోధింప నేగుచుండిరి. వ్యాధివేదనల లెక్కసేయక శాంతముగ నోర్చుకొనుచుండిరి. గ్రుక్కెడు గంజియైన త్రాగలేకుండిరి. శ్రీస్వామివారి శిష్యులు "స్వామీ! మీశరీరము క్రమముగా కృశించుచున్నది. ఔషధమును సేవింపుడని" యెంత ప్రార్థించినను, "ఈ కట్టెకు మందుకూడనా!" యని శ్రీస్వామి నిరాకరించిరి. చూచితిరా! శ్రీస్వామివారికి స్వశరీరముపై నెంత యుదాసీన భావమో! ఎట్టిశరీర విస్మృతి!

వ్యాధి కుదురుననుయాశ కొంచెమైన లేనందున, శిష్యులు

శ్రీస్వామివారిస్థితినిగాంచి తమ గురువర్యుడు తమ్ము విడిచి పోవునేమోయని చింతించిరి. శ్రీబ్రహ్మానంద తీర్థులకు సన్న్యాస మిచ్చిన ఆనందానందతీర్థస్వామి యప్పుడు కాశియం దుండిరి. వారితో శ్రీస్వామిశిష్యులు "తమశిష్యుడైన తీర్థస్వామిని వ్యాధి నివారణకొరకై ఔషధమును సేవింపనాజ్ఞయిమ్మని" ప్రార్థించిరి. వీరి ప్రార్థనల నంగీకరించి ఆనందానందస్వామి తమశిష్యుడైన తీర్థస్వామితో మందునుగొన నాజ్ఞయిచ్చిరి. అంతతీర్థస్వామి గుర్వాజ్ఞశిరసావహించి ఔషధమును సేవింపప్రారంభించిరి.

కంభంపాటి సీతారామశాస్త్రిగారు శంకరవిద్యాలయ కార్యదర్శి పేర నిట్లువ్రాసిరి. :—

—కాశ్యాం శ్రావణశుద్ధ తదియ, శుక్రవారం.

శ్రీరస్తు. చి॥ పాతూరి శివరామయ్యగారికి, కంభంపాటి సీతారామశాస్త్రి ఆశీర్వదించి యుభయ కుశలోపరి, వ్రాయున దేమనగా:—

శ్రీ. శ్రీ. ప. ప. శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారికి బాపట్లలోనుండగానే కొంచెము జబ్బుగానున్నదిగదా; అదియే కాశీచేరినపిమ్మట వృద్ధియై ప్లీహాయకృత్తీనంజురోగముగ మారి, కొంచెము ఆయాసముతో సహా కనుపడినది. ఇప్పుడు త్ర్యంబక శాస్త్రియను కాశీలోనున్న భిషగ్వర్యునిచే చికిత్సింపబడు చున్నది. శరీరము పరస్వాధీనమైనప్పటికిన్ని బోర్డ్లేమందిర

మందున్న మార్కండేయబ్రహ్మచారిగారు వారి తల్లిగార్లచే చక్కగ నుపచారముజేయ బడుచున్నది. నేను అప్పుడప్పుడు వెళ్లిచూచుచున్నాను. ఏమియు లోపములేదు; మీరెవరును శ్రమపడి బయలుదేరి రావద్దు. వచ్చినను మీరు కష్టపడ వలసినదియేగాని, వ్యవస్థ కుదరదు. ఈసంస్థఅనాది సనాతన ధర్మాచారము ననుసరించియుండే యేర్పాటును ఆలోచించండి. శ్రీదత్తాత్రేయాను గ్రహమువల్ల అన్నియు చక్కగ జరుగునుగాక!"

యని శ్రీస్వాములవారు అక్షరశః చెప్పినమాటలే వ్రాసినాను.

—కంభంపాటి సీతారామశాస్త్రివ్రాలు (అని)

ఈయుత్తరములో దిగువన నాగరలిపియందు శ్రీస్వామి వారు స్వహస్తాక్షరముల నీక్లువ్రాసిరి.

"ఇదం సర్వం శ్రీగురుదత్తాత్రేయ స్వేచ్ఛయైవభవిష్య తీత్యలః. ఖేదో మాస్తు. యది భాద్రపద కృష్ణపక్షపర్యన్తం గుణశ్చేత్ శీఘ్రమేవ ఆగమనం భవేత్. వస్తుతః పరమా నందస్వరూపేణ సర్వత్ర విద్యమాన తావర్తతఏవ. ఇతిశమ్.

—నారాయణ. ప. బ్రహ్మానందతీర్థస్వామి (అని).

౧౯౧౮ ఆగిష్టు ౧౫వ తేదీన కాళయుక్తి సం॥ శ్రావణశుద్ధ అష్టమి ప్రాతఃకాలమున శ్రీస్వామివారు చాలసేపుధ్యాన సమాధి నిష్ఠాగరిష్ఠులైయుండి, యోగశక్తిచే బ్రహ్మరంధ్రముగుండా

ప్రాణమును ఛేదించి, సర్వయోగగమ్యమగు బ్రహ్మైక్యస్థితిని ౯-౩౦ గంటలకు బొందిరి. శ్రీస్వామివారి కళేబరమును విధ్యుక్తప్రకారము పరిశుద్ధపరచి, దివ్యసుగంధ కుసుమ చందన విలేపాదుల పూజించిరి. పూలమాలలతో నలంకరించిరి. సమంత్రకముగా మంగళహారతుల నొసంగిరి. అంత శ్రీవారిశరీరము పవిత్రగంగానదియందు జలసమాధి చేయబడెను.

౧౯౧౮ ఆగష్టు ౧౬ వ తేదీన మరియొకయుత్తరమును కాశినుండి బాపట్లకు కంభంపాటి సీతారామశాస్త్రిగా రిట్లు వ్రాసిరి:—

శ్రీరస్తు చిరంజీవులయిన ప్రత్తూరి శివరామయ్యగారిని ఆశీర్వదించి వ్రాయునది యేమనగా:— "మీరు స్వామివారి యుపయోగనిమిత్తము పంపిన ౫౦-౦-౦ లు మనియార్డరు స్వాములవారు సిద్ధిపొందిన మరురోజున అందినది. పుచ్చుకున్నాను. ......నిన్నటిరోజున పగలు గం ౯-౩౦ నిమిషములకు స్వాములవారు సిద్ధినొందిరి". రామాబాయమ్మగారును బ్రహ్మచారి జానకిరామయ్యయునాసిక క్షేత్రము గుండా శ్రీస్వామివారి నిర్యాణానంతరము వారము రోజులకుకాశికి చేరి, ఈదుఃఖవార్తను విని విచారపడి నారాయణ బలిమొదలగు క్రతువులను జరిపిరి.

ముప్పదితొమ్మిదివత్సరము లస్ఖలితబ్రహ్మచర్యవ్రతమును వహించి, త్యాగశ్రేష్ఠుడై యొప్పిన శ్రీబ్రహ్మానందతీర్థస్వామి మహాసమాధిజెందిరనువార్త కార్చిచ్చువలె నలుదిశల వ్యాపిం

చెను. ఈదుఃఖవార్తనువిని బాపట్లశిష్యులును వాకాడుశిష్యులును తక్కినపరిజనులందఱును దుఃఖసముద్రమునందు మునిగి, రక్తనాళములు తెగునట్లు విలపించిరి. ముప్పదితొమ్మిది వత్సరముల పిన్నవయస్సుననె అకాలమరణమునకు గురియైరని శిష్యులు తలచితలచి, పరితాపానల తప్తులైరి.

శంకరవిద్యాలయమందును, తదితర ప్రదేశములందును స్వామివారి జయంత్యుత్సవములు శ్రద్ధాభక్తులతో జరుపబడు చున్నవి. శ్రీస్వామివారిని గురించి శ్రీశారదయను మాస పత్రికయందిట్లు వ్రాయబడినది:—"సౌమ్య శౌశీల్య వైరాగ్య పాండిత్య సౌందర్య తపోబల బ్రహ్మనిష్ఠాగరిష్ఠులై, సంతత బ్రహ్మానందానుభవ సూచక ముఖవిలాసములచే జెన్నారి, ప్రజాకర్షణశక్తిగలిగి, తనుజేరిన వారినెల్ల తన దివ్యశక్తిచే బరిశుద్ధులజేయుచుండుటచే శ్రీస్వామివారి సందర్శన కుతూహలులై వేనకువేలు జనులు వచ్చుచు పోవుచుండుటవలన బాపట్లయొక యాత్రాస్థలమయ్యెను."

శ్రీస్వామివారి నిర్యాణమునుగూర్చి శ్రీశంకరవిద్యాలయ పండితుడగు అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు (శతావధాని) యిట్లీపద్యములతో విలపించిరి:

క. శ్రీదత్తాత్రేయ కృపా-ప్రాదుర్భూతాత్మబోధ పరిపాకకలా
మేదుర! గురువర! యతివర! సాదరశిష్యోద్ధరణ చణాత్మవిచారా!

మ॥ భవవారాశి నిమగ్నులై బహుళపా
పశ్రేణిలో జిక్కి సం
స్తవనీయంబగు కేశవార్చన రసా
స్వాదంబునన్ హీనులై
యనవింజేడ్పడు పామరాళికి సహా
యంబంచు లేకుండ నీ
వవతారంబు సమాప్తిఁజేసితివె,
బ్రహ్మానందతీర్థప్రభూ. ౧.

మ॥ కవివర్యుల్ కవియంచు, గాయనజనుల్
గానప్రియుండంచుఁ, గే
శవభక్తుల్ బహుభక్తియుక్తుడనుచున్,
శాస్త్రజ్ఞులున్ సర్వశా
స్త్రవిశేషజ్ఞుడటంచుఁ బూజ సలుపన్
సర్వాత్మతన్ జూపి, నీ
వవతారంబు సమాప్తిఁజేసితివే
బ్రహ్మానందతీర్థప్రభూ. ౨.

మ॥ అమలోదారమనీషతో జనుల కా
హ్లాదంబు గల్పించి, త
త్త్వముబోధించుచు సర్వకాల విలసద్వా
త్సల్య వైరాగ్యసం

యమ ముఖ్యాధిక సత్వసంపదకుఁ దావై
యొప్పి తీవట్టి నీ
యమితోత్సాహము సంస్మరించెదము
బ్రహ్మానందతీర్థప్రభూ. ౩.

మ॥ కమనీయంబయి శాశ్వతంబగుచు భ
క్తస్వచ్ఛహృద్రత్న వే
శ్మములం బెక్కువిధంబుల న్నిలచి,
పూజల్ గొంచుఁ గాలాంతర
క్షమమై రాజిలుకీర్తిదేహ మవనిఁ
సాపించి, యాస్థూల దే
హముఁ జాలించితిరో క్కా హేయమని
బ్రహ్మానందతీర్థప్రభూ. ౪.

మ. అమరుల్ తేజముగాంచి భక్తిమెయి
నర్ఘ్యంబిచ్చి పూదండకం
ఠమునం వైచి నిజాలయంబులకు
వేడ్కన్ గొంచు బోవం, గవా
టములన్ దీసి ప్రతీక్ష సేయ నొకకంటఁ
గాంచుచుఁ బ్రహ్మలో
కము కై సేయగ బోయియుందురో
బ్రహ్మానందతీర్థప్రభూ. ౫.

మ. "సమయంబియ్యది యెంతయున్ గలి మహా
సామ్రాజ్యనిర్వాహ యో
గ్యముగా నుండదలంచినాడ వ్యతి
రేకప్రక్రియన్ నీవు ధ
ర్మము సంస్థాపన సేయజూచెదవు
రమ్మా నీక దేల?ంచు స
ఖ్యముగా నిన్గని పోయె విశ్వపతి
బ్రహ్మానందతీర్థప్రభూ. ౬.

మ. తిరమౌ దివ్యసమాధితో గలసి
భక్తిజ్ఞానవైరాగ్యముల్
వరలన్ బ్రేమరసంబు భక్తతతిపై
వర్షించు శాంతాస్య మా
దరపూర్ణంబయి యాత్మబోధమయమౌ
తత్త్వంబుబోధింప నం
బరమందుండు మిమున్ స్మరించెదము
బ్రహ్మానందతీర్థప్రభూ. ౭.

శా. ఆ బాల్యంబు విరక్తితో బెఱిగి, దత్తా
త్రేయ దీవ్యత్కృపా
ప్రాబల్యంబున జేసి భక్తిరససం
పత్పూర్ణమై శుద్ధ దీ

ష్టా బాంధవ్యముగాంచి, యార్ద్రహృద
యాబ్జాతంబు శోభిల్ల ది
వ్యాబోధాకృతివై చెలంగితివి
బ్రహ్మానందతీర్థప్రభూ. ౮.

మ. తమ కారుణ్యముగాంచి, జ్ఞానకలనన్
ధన్యాత్ములై మించు భా
వముతో నువ్విళులూరువారి మదిలో
వాంఛల్ విలోపింప, దే
శమునన్ సాధుజనప్రచారమను
ఐశ్వర్యంబులేకుండ దే
హముజాలించితివేల కాశిపురి
బ్రహ్మానందతీర్థప్రభూ. ౯.

మ. గురుపాదాంబుజభక్తి దేవతలపైఁ
గుంఠేతరాసక్తి శాం
కరభాష్యార్థవిచారమన్న గడు
వేడ్కన్ జీవికాజీవిగా
బరమాహ్లాదము గాంచుశక్తి, బుధసేవా
రక్తియున్ మీమనో
హరచారిత్రపవిత్రభావములు
బ్రహ్మానంద తీర్థప్రభూ. ౧౦.

మ. నియమంబొప్పగ జన్మమాదిగ దపో
నిష్ఠన్ విరాజిల్లి, ని
శ్చయభావంబున సేకరించిన మహా
స్సారంబొ, శ్రీవాసుదే
వయతీంద్రాంఘ్రి సరోజ చింతన
పరీపాకంబొ, మీయుజ్జ్వలా
వ్యయ తేజంబు ప్రశాంతిఁ జిమ్మెడిని
బ్రహ్మానందతీర్థప్రభూ. ౧౧

శా. శ్రీవారిచ్చట మాయదృష్టమున వేం
చేయంగ మీభక్తులం
దావిశ్వాస మదేమొ భావపురి
దత్తాత్త్రేయతీర్థంబుగా
భావం బేర్పడి రాకపోక లెసగన్
బాంధవ్యముఁ జూపిర
ట్లావాకాడుపురీనివాసు లొంగి
బ్రహ్మానందతీర్థప్రభూ. ౧౨.

శా. వరివస్యారసికుండు శాంతుడధిక
ప్రజ్ఞాఢ్యుడంచున్ జగ
ద్గురుపీఠస్థనృసింహభారతులు
గోర్కుల్ దీర బ్రేమించి త

త్త్వ రహస్యానుభవం బొసంగి పనుపడ

బ్రహ్మాత్మతానుభూతిస్ఫూర్తి యొదా

హారణంబేర్పడ బొల్చితీవపని

బ్రహ్మానందతీర్థప్రభూ. ౧౩.

శ్రీస్వామివారి మహాసమాధింగూర్చి విచారమును వెలిబుచ్చుచు శ్రీశంకరవిద్యాలయ విద్యార్థియగు పిసుపాటి నారాయణ గారి క్రిందిపద్యముల రచించిరి:—

సీ. విజ్ఞులు తనుగాంచి వెఱగుపాటు వహింప

విషయైకవాంఛలు వీడినాఁడు,

వేదాంతములలోని వివిధరహస్యముల్

హస్తామలకముగా నరసినాఁడు,

తొంటిమౌనులపోల్కి దుర్గాటవులయందు

కాలంబు తపముతోఁగడిపినాఁడు,

తన్నుగొల్చెడివారిఁ దత్త్వోపదేశంబుఁ

జేసి కృతార్థులఁజేసినాఁడు,

తే. అనశనవ్రతపరుఁడయి యనుదినంబు

కందమూలాదులను తిని కడపినాఁడు,

జ్ఞానహీనులఁ గడ తేర్పఁ జాలినాఁడు,

దివిజ నుతుఁడు బ్రహ్మానందతీర్థగురుఁడు. ౧.

సీ. సంధ్యయేనియు వార్వఁజాలని వారలు

నిత్యాగ్నిహోత్రముల్ నిలిపినారు,

కబళమైనను మాధుకరము వెట్టని వారు
నిరతాన్నదాతలై నెగడినార,
లన్యమతాసక్తులై క్రుమ్మరిలు వారు
స్వకులోక్తధర్మముల్ సలిపినారు,
విషయానురాగులై విఱ్ఱవీగెడు వారు
భాష్యార్థముల కెగఁబ్రాకినార,

తే. తొర! నీమేటిశక్తి నేమనుచుఁ బొగడ
వచ్చుఁ? బరమేశు జోడవచ్చు మిమ్ము
మంగళాకార శిష్యకల్మషవిదూర
సార్థచర్య! బ్రహ్మానంద తీర్థవర్య. ౨.

శా. మీయాకారము మీసుభాషితములున్
మీపాదసంసేవయున్ ।
మీయౌదార్యము మీపవిత్రచరితల్
మీసద్దయాపాంగముల్
బోయెన్ గన్నులకుం గనంబడక
మత్పూర్వార్జితాఘంబునన్
మాయయ్యా! మొఱ్ఱసైచు వారమిక
బ్రహ్మానందతీర్థప్రభూ. 3.

# ఇరువదిరెండవప్రకరణము.

## నిర్యాణానంతరము-శ్రీశంకరవిద్యాలయము.

శ్రీస్వామి సజీవులై యున్నప్పుడు. హంసలదీవిలో శ్రీస్వామివారి యాజ్ఞానుసారము, శిష్యులు సప్తాహమును జయప్రదముగా జరిపిరని మనము 'మహాసమాధి'యను ప్రకరణమున జదివియుంటిమిగదా! శ్రీస్వామివారి నిర్యాణానంతరముగూడ, అట్టి సప్తాహములెన్నియో జరిగినవి. అందుప్రథమసప్తాహమునకు శ్రీస్వామివారిచే స్వయముగా నుపదేశింపబడిన శిష్యులనందఱి నాహ్వానించి, శ్రీస్వామియుపదేశించిన మంత్రములను కొన్ని లక్షలు జపించునట్లు నిర్ణయించిరి. శిష్యులందఱు సంప్రీతించి, అన్యోన్య సంభాషణమువలన శ్రీస్వామివారొకరికి యుపదేశించిన మంత్ర మింకొకరికి యుపదేశింపలేదని విశదమయ్యెను. కొందరికి ఏకాక్షరి, కొందరికి ద్వ్యక్షరి, మరికొందరికి త్ర్యక్షరి, యీవిధముగ పంచదశాక్షరివరకు శ్రీదత్తమహామంత్రముల నుపదేశించియుండిరి. అదిగనుగొని, శ్రీస్వామివారి శిష్యులందరు, శ్రీవారిన్ని మంత్రములలో సిద్ధివడసిన సర్వజ్ఞులని యెఱింగి ఆనందభాష్పముల విడచిరి.

శ్రీస్వామి, భక్తులలో మహాభక్తుడు, జ్ఞానులలో జ్ఞానశ్రేష్ఠుడు, కర్మయోగులలో కర్మవీరుడు, యోగులలో

రాజయోగి, గురువులలో జగద్గురువు, తార్కికులలో గాఢ తార్కికవాది, శాక్తేయులలో శక్తిపూజా దురంధరుడు, తత్త్వజ్ఞులలో చిత్తవేదిత్వముగల వేత్తయనుట కీజీవితములో నెన్నియేని నిదర్శనముల మనము గాంచియున్నాము. కాన, శ్రీస్వామివారి యోగమునకు, ఈమతమునకు సంబంధించిన వారని జెప్పలేము. సర్వయోగముల సర్వమతముల సమన్వయమే శ్రీస్వామివారి సందేశమని జెప్పగలము.

కొన్నిసంస్థలు, తత్సంస్థాపకులు జీవించినంతకాల మభివృద్ధికివచ్చుచుండి, వారిజీవితానంతరము జీర్ణమైపోవుట మనము గాంచుచున్నాము. కాని, శ్రీబ్రహ్మానందతీర్థస్వామివారు తమ దృఢసంకల్పముచేతను తపోశక్తిచేతను శ్రీశంకర విద్యాలయమును స్థాపించిరి గాన అది దినదిన క్రమాభివృద్ధిగాంచుట మన మీప్రకరణమున గాంచెదము.

శ్రీస్వామి జీవించియున్నప్పుడే శ్రీస్వామివారి సంకల్ప ప్రకారము శ్రీదత్తమందిరమును ప్రతిష్ఠింప శిష్యులు ప్రయత్నించిరి. దత్తమందిరము వెనుక పడమటివైపుననున్న స్థలము పరస్వాధీనమం దుండెను. దానిని శ్రీ శంకరవిద్యాలయ సంఘమువారు విక్రయించుకొని, యచ్చట శ్రీదత్తాత్రేయ దేవాలయమును, విద్యార్థిభోజన వసతికిగా అన్నపూర్ణసత్రమును నిర్మాణముజేయ శ్రీస్వామివారి దృఢసంకల్పమైయున్నది. కాని యాస్థలమును అమ్ముటకు, యాస్థలభూస్వాములు సమ్మ

తించకపోయినప్పటికిన్ని, శ్రీస్వామివారు సదేహులుగా నుండి నప్పుడు "నిర్మించవలసిన దేవాలయము నల్లరాతితో కట్టబడి విమానసహితముగా నాకన్నులయెదుట కనబడుచున్న" దని నిరాఘాటముగా సెలవిచ్చి, యాస్థలమునమంత్రాక్షతలను జల్లి, యిచ్చట దేవాలయమును నిర్మింపబడునని నిర్ధారణ జేసి జూపిరి. రక్కెసపొదలతోను, జిల్లేడుపొదలతోను నిండియున్న యాగుంటప్రదేశము శ్రీదత్తాత్రేయ దేవాలయమును వహించునని సామాన్యుల దృష్టికి గోచరమగునా? కాని మహాత్ములసంకల్పములు బీజరూపములై, స్థిరీభూతములై భక్తుల హృదయములందు నాటుకొని సకాలములో కార్యరూపములుగా నెరవేరును గదా? శ్రీస్వామివారి యనంతరము కాలవశమున శ్రీస్వామివారి సంకల్పము లేవిధమున ఫలించినది తెల్పుట కీ ప్రకరణము ప్రారంభించితిమి.

శ్రీస్వామి మంత్రాక్షతలు జల్లినచోటునసనే, శ్రీ స్వామివారి నిర్యాణానంతరము శ్రీ శంకరవిద్యాలయ కార్యదక్షులైన పాత్రూరి వేంకటశివరామయ్యగారు శ్రీస్వామివారి భక్తులసాహాయ్యముతోను, శ్రీ స్వామియందు ప్రజల కుండు యభిమానముతోను దాదాపు రా వేలరూప్యముల చందాలు వసూలుజేసి శ్రీస్వామివారి దివ్యదృష్టిలో కనుబడినట్లు విభవ సం॥ మాఘమాసమునందు (౫-౩-౧౯౨౯ తేదీన) శ్రీదత్తాత్రేయ దేవాలయమును నిర్మించిరి. ఆదేవాలయములోనే గాయత్రి, శ్రీశంక

రాచార్య చలువరాతివిగ్రహముల ప్రతిష్ఠించిరి. శ్రీస్వామివారి శిష్యుడగు పిసుపాటి వెంకటసుబ్బయ్యగారు శ్రీదత్తపాదుకలను ప్రతిష్ఠించిరి.

దీనికి పడమరవైపున విద్యార్థుల భోజనవసతికి గాను అన్నపూర్ణసత్రమును నిర్మింప శ్రీస్వామివారిసంకల్పమని యిదివరకే వ్రాసియుంటిమిగదా! శ్రీస్వామివారి శిష్యులును, త్యాగశీలురును పూండ్లకాపురస్థులునునగు వీరపల్లి అయ్యవార్లుగారు, శ్రీస్వామివారు స్థాపించినశంకరవిద్యాలయ విద్యార్థుల నిమిత్తము అన్నపూర్ణసత్రమును యేడువేల రూప్యములు ఖర్చుపెట్టి శుక్లనామ స॥ మార్గశిరమాసమునకు పూర్తిగావించిరి. మరియు దత్తమందిరమునకు తూర్పున నొక పంచపాళినికూడ వేయించిరి.

శ్రీస్వామి, వారి యంతర్యోత్తరములో వ్రాసినట్లు అంతరియందును ఆనందస్వరూపులుగ ప్రకాశించుచు, తమ సంకల్పముల నొకటివెనుక నొకటి నెఱవేర్చుకొనుచున్నారు.

ఇందువలన శ్రీస్వామివారి శిష్యులందఱు, వారు సదేహులుగానుండినపుడు వారియెడల శ్రద్ధాభక్తులుజూపుట యేగాక, శ్రీవారుసిద్ధినొందినపిదపగూడ వారుజేసిన మహోపకారములనంతములైనందున, శ్రీస్వామివారిని సదా సేవించుటకు కారణమైనది. శ్రీస్వామివారిశిష్యులలో నన్నిశాఖలవారు, నన్నితెగలవారు, అన్నికులములవారుండిరి. ఇది శ్రీస్వామివారి

ప్రేమస్వరూపమును ప్రకటించుచున్నది. ప్రతివారును శ్రీస్వామివారు తమయెడల నత్యంత ప్రేమజూపువారనియు, తమకు గోప్యమగుసంగతులు జెప్పువారనియు సంతసించెడివారే. ప్రతివారియింటను శ్రీస్వామివారి చిత్రమునుగాని, పాదుకలనుగాని పూజించువారే. వారియుపదేశముల ప్రకారము ఉత్సవముల జరుపువారే.

శ్రీస్వామిజీవించియున్నప్పుడే, స్థాపించిన శంకరవిద్యాలయాభివృద్ధిని గూర్చి కొంతవ్రాయనగును. శ్రీస్వామివారు రాక్షసనామసంవత్సర ఫాల్గుణదశమికి శ్రీశంకరవిద్యాలయమును స్థాపించినటు లెంచుకొనవలయును. నల సం॥ పుష్యశుద్ధవిదియ నాటికి వేదశాస్త్రవిద్యాలయమును స్థాపించవలసినదిగా శ్రీస్వామి తీర్మానించిరి. పింగళ సం॥ జ్యేష్ఠబహుళ తదియ గురువారము (౮-౬-౧౯౧౭ తేదీన) శ్రీశంకరవిద్యాలయ పుస్తకభాండాగార సౌధమును- పింగళనామ సం॥ శ్రావణ బహుళ నవమి శనివారము (తే ౧౧-౮-౧౯౧౭ దీన) శ్రీదత్తాత్రేయ మందిరమును ప్రతిష్ఠించిరి.

శ్రీ శంకర విద్యాలయమందు వేదాధ్యయనము, స్మార్త పఠనము, శాస్త్రసాహిత్య పాఠములును జరుపబడుచున్నవి. శ్రీ శంకరవిద్యాలయముయొక్క ఆశయములు ద్వితీయ వార్షిక నివేదికమునందిట్లు ప్రకటింపబడినవి: పరమపురుషార్థసాధనములగు వేదవేదాంగ శాస్త్రములందు సాంప్రదా

యకములగు సుశిక్షణమే శ్రీ శంకరవిద్యాలయముయొక్క ముఖ్యాశయము. అభ్యుదయ ఫలముగోరు ప్రవృత్తిమార్గ ప్రవర్తకులకు ధర్మసూక్ష్మములను కర్మరహస్యములను, నిశ్శ్రేయసఫలముగోరు నివృత్తిమార్గావలంబులకు వైరాగ్యరహస్యములను వైదికశిక్షణపూర్వకముగా నుపదేశించుటయే శ్రీ శంకర విద్యాలయ ముఖ్యప్రయోజనము. అహంకార ప్రయుక్తమగు స్వాభావిక ప్రవృత్తిచే సధర్మమార్గమందు చరించి, డస్సి వేసారి, సుఖమునపేక్షించు ముముక్షువులకు శాంతిగలుగజేయుటయే శ్రీ శంకర విద్యాలయముయొక్క ముఖ్యఫలము."

ఇట్లు శ్రీ స్వామివారిచే బ్రతిష్ఠింపబడిన శ్రీ శంకరవిద్యాలయము, సాంప్రదాయసిద్ధముగా సనాతనధర్మములను బోధించుచు, వేదవేదాంగముల నభ్యసింపజేయుచు కీర్తిగాంచినది. ఇప్పుడు ముప్పదిమంది విద్యార్థులకు రెండుపూటల్లభోజనము పెట్టి పోషించుచు, ముగ్గురుపాధ్యాయులను భరించుచున్నారు.

శ్రీ శంకరవిద్యాలయములో వేదాధ్యయనము చేసి విద్యార్థులు గుంటూరుమండల వేదప్రవర్ధనీసభా పరీక్షలందు తీర్ణులై యిప్పటికి బహుమంది క్రమాంత స్వాధ్యాయ సంపన్నులు వెలువడిరి. స్మార్తమునందు త్తీర్ణులైన విద్యార్థులనేకుల పురోహితులై వైదికకర్మల జేయించుచున్నారు. శాస్త్రసాహిత్యములు జదువుకొని యుత్తీర్ణులైనవారు హైస్కూళ్లలోను యితర పాఠశాలలలోను పండితులుగాను, శతావధాని యష్టా